


'మహిళల ముఖాలు కళకళలాడుతూ ఉంటేనే
కుటుంబమూ, సమాజమూ బాగుంటాయి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 15
సంచిక: 321

శనివారం 11-2-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



5జీ స్మార్ట్‌ఫోన్లదే హవా

74 శాతం పెరిగిన విక్రయాలు...
ఈ ఏడాదీ అమ్మకాల జోరు. -IIలో



పేటీఎమ్‌లో అలీబాబా వాటా విక్రయం

విలువ రూ. 1,360 కోట్లు. -IIలో

సాక్షి బిజినెస్
శనివారం
11-2-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
124	37
60,683	17,856

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	11,664	▽	126
డోజోన్స్	33,761	△	61
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,882	▽	29
డాక్స్	15,308	▽	215
షాంఘై	3,260	▽	10
నికాయ్	27,671	△	87

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై

బంగారం (24 క్యారెట్)		
57,038	▽	559
బంగారం (22 క్యారెట్)		
56,810	▽	556
వెండి (కిలో)		
66,740	△	473

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	80.67	84.35
£	బ్రిటన్ పౌండ్	86.60	90.50
€	యూరో	97.57	102.35
¥	జపాన్ ఎన్ (100)	50.00	76.00
AUS	ఆస్ట్రేలియా డాలర్	54.74	59.55
S$	సింగపూర్ డాలర్	59.83	64.37
SAR	సౌదీ రియాల్	21.00	22.68
UAE D	యూఏఈ దిర్హామ్	21.56	23.36
¥	చైనా యువాన్	10.99	13.07

బిజినెస్ రీల్

పీఎన్‌బీ, బీఓబీ రుణాలు భారం

న్యూఢిల్లీ: పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ), బ్యాంక్ ఆఫ్ బరోడా (బీఓబీ)లు తమ రుణ రేట్లను పావుశాతం వరకూ పెంచాయి. ఆర్‌బీఐ బ్యాంకులకు తానిచ్చే రుణాలపై వసూలు చేసే వడ్డీరేటు- రెపో (6.5 శాతానికి) పావుశాతం పెంచడం దీనికి నేపథ్యం.

పీఎన్‌బీ పావుశాతం పెంపు

పీఎన్‌బీ రెగ్యులేటరీ ఫైలింగ్ వివరాల ప్రకారం రెపో అనుసంధాన రుణ రేటు (ఆర్‌ఎల్‌ఎల్ఆర్) పావుశాతం పెరిగి 8.75 శాతం నుంచి 8 శాతానికి చేరింది. గురువారం నుంచీ ఇది అమల్లోకి వచ్చింది.

బీఓబీ... 5 బేసిస్ పాయింట్లు

ఎంసీఎల్ఆర్‌ను అన్ని కాలపరిమితులపై 5 బేసిస్ పాయింట్లు పెంచింది. ఫిబ్రవరి 12 నుంచి ఈ రేటు అమల్లోకి వస్తుందని బీఓబీ పేర్కొంది. దీనితో ఓవర్‌నైట్ ఎంసీఎల్ఆర్ 7.85% నుంచి 7.90 శాతానికి చేరింది. నెలకు సంబంధించి ఈ రేటు 8.15 శాతం నుంచి 8.20 శాతానికి ఎగసింది. 3 నెలల రేటు 8.25 శాతం నుంచి 8.30 శాతానికి చేరగా, ఏడాది రేటు 8.5% నుంచి 8.55 శాతానికి ఎగసింది.

కెనరా బ్యాంక్ వడ్డీ రేటు కట్

ఆర్‌బీఐ రెపో రేటును పెంచినప్పటికీ కెనరా బ్యాంక్ రుణాలపై వడ్డీ రేటును 15 బేసిస్ పాయింట్లు తగ్గించింది. ఆర్‌ఎల్‌ఎల్ఆర్‌ను ఈ నెల 12 నుంచి అమల్లోకి వచ్చేవిధంగా సవరించింది. వెరసి తాజాగా ఆర్‌ఎల్‌ఎల్ఆర్ రేటు 9.4% నుంచి 9.25 శాతానికి తగ్గింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

11-2-2023	
విశాఖ	440-00
చిత్తూరు	448-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	415-00
విజయవాడ	415-00
రిటైల్ ధర (డజను)	66.00
10-2-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	390-00
వరంగల్	392-00
రిటైల్ ధర	4.50

తగ్గిన పారిశ్రామిక వృద్ధి స్పీడ్

2022 డిసెంబర్‌లో ఐఐపీ పెరుగుదల 4.3 శాతం ● నవంబర్‌లో పురోగతి 7.3 శాతం ● తయారీ పేలవ పనితీరు



న్యూఢిల్లీ: పారిశ్రామిక ఉత్పత్తి వృద్ధి 2022 డిసెంబర్‌లో మందగించింది. సమీక్షా నెల్లో ఇందుకు సంబంధించిన సూచీ (ఐఐపీ) వృద్ధి రేటు 4.3 శాతంగా నమోదయ్యింది. నవంబర్‌లో ఈ రేటు 7.3 శాతం. మొత్తం సూచీలో మెజారిటీ వాటా కలిగిన తయారీ రంగం, భారీ యంత్ర పరికరాల ఉత్పత్తులు, డిమాండ్‌కు ప్రాతిపదిక అయిన క్యాపిటల్ గూడ్స్ రంగాల పేలవ పనితీరు డిసెంబర్ గణాంకాలపై పడినట్లు జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్‌ఎస్ఓ) వెలువరించిన లెక్కలు పేర్కొంటున్నాయి. ఎయిర్ కండీషనర్లు, రిఫ్రిజిరేటర్ల రంగం ఉత్పత్తులకు సంబంధించిన కన్జూమర్ డ్యూరబుల్స్ విభాగం కూడా వృద్ధి (5.1 శాతం) నుంచి క్షీణతకు (-10.4 శాతం) మారింది. సబ్బులు, షాంపూల వంటి ఎఫ్ఎంసీజీ ఉత్పత్తులకు సంబంధించిన కన్జూమర్ నాన్ డ్యూరబుల్స్ రంగంలో వృద్ధి రేటు తగ్గింది. వార్షికంగా పరిశీలిస్తే మాత్రం 2021 డిసెంబర్‌కన్నా 2022 డిసెంబర్‌లో పనితీరు మెరుగ్గా ఉండడం ఊరటనిస్తున్న అంశం. అప్పట్లో ఐఐపీ వృద్ధి రేటు కేవలం 1 శాతం మాత్రమే.

రంగాల వారీగా ఉత్పత్తి వృద్ధి (శాతాల్లో)

విభాగం	2022 డిసెంబర్	2022 నవంబర్	2021 డిసెంబర్
తయారీ	2.6	6.4	0.6
మైనింగ్	9.8	9.7	2.6
విద్యుత్	10.4	12.7	2.8
క్యాపిటల్ గూడ్స్	7.6	20.7	-3
కన్జూమర్ డ్యూరబుల్స్	-10.4	5.1	-1.9
కన్జూమర్ నాన్ డ్యూరబుల్స్	7.2	8.9	0.3
ఇన్‌ఫ్రా/నిర్మాణం	8.2	12.8	2
ప్రైమరీ గూడ్స్	8.3	4.7	2.8
ఇంటర్మీడియట్ గూడ్స్	-0.3	3	-1

9 నెలల్లో ఇలా...

మార్చితో ముగిసే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి తొమ్మిది నెలల్లో (ఏప్రిల్-డిసెంబర్) ఐఐపీ 5.4 శాతం పురోగమించగా, 2021 ఇదే కాలంలో ఈ వృద్ధి రేటు 15.3 శాతంగా ఉంది. 2022 ఏప్రిల్ నుంచి నవంబర్ నాటికి ఈ వృద్ధి రేటు 5.5 శాతం



5జీ స్మార్ట్‌ఫోన్లదే హవా

- 74 శాతం పెరిగిన విక్రయాలు
- ఈ ఏడాదీ అమ్మకాల జోరు
- సైబర్ మీడియా రీసెర్చ్ నివేదిక



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: దేశంలో 5జీ స్మార్ట్‌ఫోన్ల విక్రయాలు జోరందుకున్నాయి. 2021తో పోలిస్తే గతేడాది 5జీ మోడళ్ల అమ్మకాలు 74 శాతం అధికం అయ్యాయి. కస్టమర్ల చేతుల్లోకి వెళ్లిన ఈ 5జీ స్మార్ట్‌ఫోన్ల విలువ సుమారు రూ.1.65 లక్షల కోట్లు ఉంటుందని సైబర్ మీడియా రీసెర్చ్ (సీఎంఆర్) తన నివేదికలో వెల్లడించింది. కఠినమైన మార్కెట్ పరిస్థితుల నేపథ్యంలో 2022లో మొత్తం మొబైల్స్ సేల్స్ 17 శాతం, స్మార్ట్‌ఫోన్ల విక్రయాలు 8 శాతం తగ్గడం గమనార్హం. అంత క్రితం ఏడాదితో పోలిస్తే 2022 అక్టోబర్-డిసెంబర్ త్రైమాసికంలో స్మార్ట్‌ఫోన్ పరిశ్రమ 28 శాతం క్షీణించింది. 2023లో స్మార్ట్‌ఫోన్ల పరిశ్రమ చక్కటి వృద్ధి తీరుతో 16-16.5 కోట్ల యూనిట్లు ఉండే వీలుంది.

ప్రీమియం వైపునకు మార్కెట్..

మరోవైపు రూ.1 లక్ష ఆపైన ఖరీదు చేసే అల్ట్రా ప్రీమియం విభాగం ఏకంగా 95 శాతం దూసుకెళ్లిందని సీఎంఆర్ వెల్లడించింది. రూ.7 వేల లోపు ధర ఉండే మొబైల్స్ సేల్స్ గతేడాది 55 శాతం తగ్గాయి. సరఫరా సమస్యలు, ఆర్థిక సవాళ్లు ఇందుకు కారణం. రూ.7-25 వేల ధరల శ్రేణిలో విక్రయాలు 8 శాతం క్షీణించాయి. రూ.25,000 నుంచి రూ.50,000 మధ్య ఉండే ప్రీమియం మోడళ్ల అమ్మకాలు 12 శాతం, రూ.50,000 నుంచి రూ.1 వరకు ఉండే సూపర్ ప్రీమియం 41 శాతం దూసుకెళ్లాయి. స్మార్ట్‌ఫోన్ల మార్కెట్లో యాపిల్ వాటా 4 శాతం. గతేడాది ఈ సంస్థ 17 శాతం వృద్ధి నమోదు చేసింది. యాపిల్ విక్రయాల్లో రూ.50,000-1,00,000 ధరల శ్రేణి మోడళ్ల వాటా 79 శాతం ఉంది.

మెటల్, ఇంధన షేర్లు డీలా

- ప్రపంచ మార్కెట్ల ప్రతికూలతలు
- 17,900 దిగువకు నిఫ్టీ
- సెన్సెక్స్ నష్టం 124 పాయింట్లు

ముంబై: మెటల్, ఇంధన, ఐటీ షేర్లలో అమ్మకాలు తలెత్తడంతో స్టాక్ సూచీలు శుక్రవారం స్వల్ప నష్టాలతో ముగిశాయి. క్రూడాయిల్ రికవరీ, విదేశీ ఇన్వెస్టర్ల వరుస విక్రయాలు సెంటిమెంట్‌పై ఒత్తిడి పెంచాయి. అదానీ గ్రూప్‌లోని నాలుగు కంపెనీలపై మోర్గాన్ స్టాన్లీ క్యాపిటల్ ఇంటర్నేషనల్(ఎంఎస్‌సీఐ) వెయిటేజీ తగ్గింపు, ఫిన్‌టెక్ సంస్థ పేటీఎంలో ఈ-కామర్స్ దిగ్గజం అలీబాబా పూర్తిగా వాటా విక్రయం అంశాలూ ప్రతికూల ప్రభావాన్ని చూపాయి. ఉదయం స్వల్ప నష్టాలతో ప్రారంభమైన సూచీలు రోజంతా తీవ్ర ఊగిసలాటకు లోనయ్యాయి.



ట్రేడింగ్‌లో 272 పాయింట్ల పరిధిలో కదలాడిన సెన్సెక్స్ చివరికి 124 పాయింట్లు పతనమై 60,683 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 37 పాయింట్లు నష్టపోయి 17,856 వద్ద నిలిచింది. ఇంట్రాడేలో 17,781 వద్ద కనిష్టాన్ని, 17,877 వద్ద గరిష్టాన్ని నమోదు చేసింది. రియల్టీ, వినిమయ, మౌలిక రంగ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. విదేశీ ఇన్వెస్టర్లు రూ.1,458 కోట్ల షేర్లను కొన్నారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.291 కోట్లను విక్రయించారు. ఎంఎస్‌సీఐ వెయిటేజ్ తగ్గింపుతో అదానీ గ్రూప్ కంపెనీలపై ప్రతికూల ప్రభావం చూపింది. డాలర్ మారకంలో రూపాయి విలువ మూడు పైసలు బలపడి 82.51 స్థాయి వద్ద స్థిరపడింది.

పేటీఎమ్‌లో అలీబాబా వాటా విక్రయం

విలువ రూ. 1,360 కోట్లు

న్యూఢిల్లీ: డిజిటల్ ఫైనాన్షియల్ సర్వీసుల దిగ్గజం వన్97 కమ్యూనికేషన్స్‌లో మిగిలిన ప్రత్యక్ష వాటాను సైతం చైనీస్ కంపెనీ అలీబాబా తాజాగా విక్రయించింది. పేటీఎమ్ బ్రాండుతో సర్వీసులందించే వన్97లో బ్లాక్‌డీల్ ద్వారా 3.16 శాతం వాటాను అమ్మివేసినట్లు తెలుస్తోంది. డీల్ విలువ రూ. 1,360 కోట్లుగా సంబంధిత వర్గాలు వెల్లడించాయి. దీంతో అలీబాబాకు పేటీఎమ్‌లో ప్రత్యక్షంగా ఎలాంటి వాటా మిగల్లేదని తెలియజేశాయి. 2022 డిసెంబర్‌కల్లా 6.26 శాతం ప్రత్యక్ష వాటాను కలిగి ఉన్న అలీబాబా తొలుత ఈ జనవరిలో 3.1 శాతం వాటాను విక్రయించింది. కాగా.. గ్రూప్ సంస్థ యాంట్(ఏఎన్‌టీ) ఫైనాన్షియల్ ద్వారా పేటీఎమ్‌లో 25 శాతం వాటాను అలీబాబా కలిగి ఉన్న సంగతి తెలిసిందే. బ్లాక్‌డీల్ ద్వారా శుక్రవారం(10న) మొత్తం 2.8 కోట్ల పేటీఎమ్ షేర్లు విక్రయమైనట్లు తెలుస్తోంది. అలీబాబాతోపాటు ఇతరులు సైతం లాభాల స్వీకరణకు అమ్మకాలు చేపట్టి ఉండవచ్చని విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. రూ. 645-655 ధరలో లావాదేవీలు జరిగినట్లు తెలుస్తోంది.



బ్లాక్‌డీల్ నేపథ్యంలో పేటీఎమ్ షేరు ఎన్ఎస్ఈలో దాదాపు 8% పతనమై రూ. 651 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో రూ. 640 వరకూ క్షీణించింది.

ఎంఅండ్ఎం లాభం రూ. 1,528 కోట్లు

క్యూ3లో 14 శాతం అప్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో మహీంద్రా అండ్ మహీంద్రా (ఎంఅండ్ఎం) రూ. 1,528 కోట్ల నికర లాభం ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం క్యూ3లో నమోదైన రూ. 1,335 కోట్లతో పోలిస్తే ఇది సుమారు 14 శాతం అధికం. ఇక క్యూ3లో ఆదాయం రూ. 15,349 కోట్ల నుంచి సుమారు 41 శాతం వృద్ధి చెంది రూ. 21,654 కోట్లకు చేరింది. ఆటో విభాగం, ఫార్మ్ విభాగాలు మెరుగైన పనితీరు కొనసాగిస్తున్నాయని శుక్రవారమిక్కడ ఆర్థిక ఫలితాల వెల్లడి సందర్భంగా ఎంఅండ్ఎం ఎండీ అనీష్ షా చెప్పారు. నిర్వహణ సామర్థ్యాలు మెరుగుపర్చుకునేందుకు చేస్తున్న ప్రయత్నాలు సత్ఫలితాలు ఇస్తున్నాయని కంపెనీ ఈడీ రాజేశ్ జెజూరికర్ తెలిపారు. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన మహీంద్రా గ్రూప్ నికర లాభం 34 శాతం పెరిగి రూ. 2,677 కోట్లకు చేరింది. ఆదాయం రూ. 23,594 కోట్ల నుంచి రూ. 30,620 కోట్లకు ఎగిసింది. కాగా, జహీరాబాద్ ప్లాంటులో ఎలక్ట్రిక్ వాహనాల తయారీ కేంద్రానికి సంబంధించిన పనులు వచ్చే రెండు, మూడు నెలల్లో ప్రారంభమవుతాయని జెజూరికర్ తెలిపారు. సుమారు రెండేళ్లలో యూనిట్ పూర్తిగా అందుబాటులోకి రాగలదన్నారు.



సినిమా





● ప్రత్యేక పూజలు చేస్తున్న తమన్నా

ఆ భయాలు తగ్గాయి!

వీలు కుదిరినప్పుడల్లా కొన్ని రోజులు ఆధ్యాత్మిక యాత్రలకు వెళుతున్నారు తమన్నా. గత ఏడాది వైష్ణవీ దేవి ఆలయాన్ని దర్శించుకుని పూజలు చేశారు. ఇటీవల ఆమె హిమాలయాలకు వెళ్లి అక్కడి వైష్ణవి దేవి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా తమన్నా కాషాయ వస్త్రాలు ధరించారు. ఈ హిమాలయా యాత్రకు సంబంధించిన ఓ వీడియోను తమన్నా సోషల్ మీడియాలో షేర్ చేశారు. ''ఓ ఆహ్వానం మేరకు హిమాలయాలకు వచ్చాను. ఇక్కడి లింగభైరవి దేవి ఆలయాన్ని సందర్శించి, పూజలు చేశాను. నాకు ప్రశాంతతతో కూడిన మానసిక ఉల్లాసం కలిగింది. జీవితం, అపజయాలు, మరణం పట్ల నెలకొని ఉండే భయాలు తగ్గాయనిపిస్తోంది. లింగభైరవి దేవి విగ్రహం నా ఇంట్లో కూడా ఉంటే బాగుంటుందని అనిపించింది'' అని పేర్కొన్నారు తమన్నా. ఇక సినిమాల విషయానికొస్తే.. రజనీకాంత్ 'జైలర్', చిరంజీవి 'భోళా శంకర్', దిలీప్ 'బాంద్రా' సినిమాల్లో హీరోయిన్‌గా నటిస్తున్నారామె.

వేసవిలో శాకుంతలం



● 'శాకుంతలం' పోస్టర్

కాళిదాసు రచించిన ప్రేమకావ్యం 'అభిజ్ఞాన శాకుంతలం' ఆధారంగా రూపొందిన చిత్రం 'శాకుంతలం'. గుణశేఖర్ దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమాలో దుష్యంత మహారాజుగా మలయాళ నటుడు దేవ్ మోహన్, శకుంతలగా సమంత నటించారు. మోహన్‌బాబు, ప్రకాశ్‌రాజ్, గౌతమి, మధుబాల కీలక పాత్రలు పోషించారు. ఇప్పటికే రిలీజ్ కావాల్సిన 'శాకుంతలం' సినిమా రెండుసార్లు వాయిదా పడింది. కాగా ఏప్రిల్ 14న 'శాకుంతలం'ని విడుదల చేయనున్నట్లు శుక్రవారం కొత్త రిలీజ్ డేట్‌ను ప్రకటించి, చిత్రంలోని కీలక పాత్రధారులతో పోస్టర్‌ను విడుదల చేశారు. తెలుగు, తమిళ్, మలయాళం, హిందీ భాషల్లో ఈ చిత్రం విడుదల కానుంది. ''మణిశర్మ సంగీతం అందించిన ఈ చిత్రాన్ని విజువల్‌గానే కాకుండా మ్యూజికల్‌గానూ ఆడియన్స్‌కు అద్భుతమైన అనుభూతిని ఇచ్చేందుకు హంగేరిలోని సింఫనీ టెక్నీషియన్స్ రీ రికార్డింగ్ చేస్తున్నారు. అల్లు అర్జున్‌గారి కుమార్తె అల్లు అర్హ చేసిన యువరాజు భరతుడి పాత్ర ఈ సినిమాకి ఓ హైలైట్‌గా నిలుస్తుంది'' అని చిత్ర యూనిట్ పేర్కొంది.



● శ్రుతీహాసన్

ఆద్య ఆన్ సెట్

'వాల్తేరు వీరయ్య', 'వీరసింహారెడ్డి' సినిమాల సక్సెస్ జోష్‌తో రెట్టింపు ఉత్సాహంతో వర్క్ చేస్తున్నారు హీరోయిన్ శ్రుతీహాసన్. ఇటీవలే ఇంగ్లిష్ ఫిల్మ్ 'ది ఐ' షూటింగ్‌ను దాదాపు పూర్తి చేసిన ఈ బ్యూటీ తాజాగా 'సలార్' సినిమా షూటింగ్‌లో పాల్గొన్నారు. ''నాకు ఎంతో ఇష్టమైన 'సలార్' సెట్స్‌లో ఉన్నాను. మంచి యూనిట్‌తో, మంచి మనుషులతో వర్క్ చేయడాన్ని అదృష్టంగా భావిస్తున్నాను'' అని శ్రుతీహాసన్ పేర్కొన్నారు. ప్రభాస్ హీరోగా 'కేజీఎఫ్' ఫేమ్ ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో 'సలార్' రూపొందుతోంది. ఈ చిత్రంలో శ్రుతీహాసన్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఆద్య పాత్రలో కనిపిస్తారు శ్రుతి. ప్రస్తుతం ప్రభాస్, శ్రుతీలపై కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారట. ఈ చిత్రం సెప్టెంబరు 28న విడుదల కానుంది. కాగా 'సలార్' రెండు భాగాలుగా రిలీజ్ కానుందనే టాక్ వినిపిస్తోంది.

అది కృష్ణారెడ్డిగారికే చెల్లింది
- గోపీచంద్ మలినేని



● అచ్చిరెడ్డి, గోపీచంద్ మలినేని, ఎస్వీ కృష్ణారెడ్డి, సి. కల్యాణ్, కల్పన

''దర్శకత్వం అంటేనే చాలా ఒత్తిడితో కూడిన క్రియేటివ్ వర్క్. అంత టెన్షన్‌లోనూ తన ప్రతి సినిమాకి స్వయంగా సంగీతం అందించడం కృష్ణారెడ్డిగారికే చెల్లింది. దర్శకుల పేరు చూసి సినిమాకు వెళ్లే ట్రెండ్‌ను సృష్టించిన అతికొద్ది మందిలో కృష్ణారెడ్డిగారు ఒకరు'' అన్నారు డైరెక్టర్ గోపీచంద్ మలినేని. డా. రాజేంద్ర ప్రసాద్, మీనా ప్రధాన పాత్రల్లో, సోహైల్, మృణాళిని జంటగా ఎస్వీ కృష్ణారెడ్డి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఆర్గానిక్ మామ హైబ్రీడ్ అల్లుడు'. కె. అచ్చిరెడ్డి సమర్పణలో కోనేరు కల్పన నిర్మించారు. ఈ చిత్రంలోని 'నమ్మకోరా.. నమ్మకోరా..' అంటూ సాగే పాటని గోపీచంద్ మలినేని విడుదల చేశారు. రామజోగయ్య శాస్త్రి రాసిన ఈ పాటని రేవంత్ ఆలపించారు. ''ఈ మూవీ సూపర్ హిట్టవుతుందని ఆశిస్తున్నాను'' అన్నారు సి. కల్యాణ్. ''మంచి ఫ్యామిలీ డ్రామాతో పాటు ఈ చిత్రంలో ఒక సందేశం ఉంటుంది. మార్చిలో రానున్న ఈ సినిమా హిట్ అవుతుంది'' అన్నారు కె. అచ్చిరెడ్డి. ''హిలేరియస్ కామెడీ, ఫ్యామిలీ, యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ చిత్రమిది. ఈ సినిమా చూసి ప్రేక్షకులు కొట్టే చప్పట్ల కోసం ఎదురు చూస్తున్నాను. ఈ సినిమాకు తొలిసారి డైలాగ్స్ రాశాను'' అని ఎస్వీ కృష్ణారెడ్డి అన్నారు.

సంజయ్.. అనుపమ.. బెస్ట్ ఫ్రెండ్స్ అహో...



● మాళవిక, నాగశౌర్య, అవసరాల శ్రీనివాస్

'ఇందుమూలంగా యావత్ ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా.. సంజయ్ పీసుపాటి (నాగశౌర్య) మరియు అనుపమ కస్తూరి (మాళవిక) బెస్ట్ ఫ్రెండ్స్ అహో' అనే డైలాగ్‌తో 'ఫలానా అబ్బాయి ఫలానా అమ్మాయి' టీజర్ విడుదలైంది. నాగశౌర్య, మాళవికా నాయర్ జంటగా శ్రీనివాస్ అవసరాల దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఫలానా అబ్బాయి ఫలానా అమ్మాయి'. టీజీ విశ్వప్రసాద్, పద్మజ దాసరి నిర్మించిన ఈ చిత్రం మార్చి 17న రిలీజ్ కానున్న సందర్భంగా టీజర్‌ను విడుదల చేశారు. నాగశౌర్య మాట్లాడుతూ- ''శ్రీనివాస్, నా కాంబినేషన్‌లో వచ్చిన 'ఊహలు గుసగుసలాడే', 'జ్యో అచ్యుతానంద' సినిమాల్లా 'ఫలానా అబ్బాయి ఫలానా అమ్మాయి' కూడా ప్రేక్షకులకు గుర్తుండిపోతుంది'' అన్నారు. ''మన చుట్టూ ఉండే మనుషుల మధ్య జరిగే కథే ఈ చిత్రం'' అన్నారు శ్రీనివాస్ అవసరాల. కెమెరామేన్ సునీల్ కుమార్ నామ, సంగీత దర్శకుడు కళ్యాణి మాలిక్, పాటల రచయితలు భాస్కరభట్ల, లక్ష్మీభూపాల, ఎడిటర్ కిరణ్ గంటి తదితరులు పాల్గొన్నారు.

ఒక్క బ్లాక్ బస్టర్ ఇవ్వండి - కార్తికేయ

''నేను నటించిన గత సినిమాల్లో జరిగిన తప్పులు 'బెదురులంక 2012'లో జరగకుండా చూసుకున్నా. ఈ సినిమాను సపోర్ట్ చేసి, నాకు ఒక్క బ్లాక్ బస్టర్ ఇవ్వండి.. థ్యాంక్యూ'' అని హీరో కార్తికేయ అన్నారు. క్లాక్స్ దర్శకత్వంలో కార్తికేయ, నేహా శెట్టి జంటగా నటించిన చిత్రం 'బెదురులంక 2012'. సి. యువరాజ్ సమర్పణలో రవీంద్ర బెనర్జీ (బెన్నీ) ముప్పానేని నిర్మించారు. ఈ చిత్రం టీజర్‌ని హీరో విజయ్ దేవరకొండ సోషల్ మీడియాలో విడుదల చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో కార్తికేయ మాట్లాడుతూ-''ప్రేక్షకులను థియేటర్లకు రప్పించే సినిమా అవుతుందనే నమ్మకంతో ఈ మూవీ చేశా.. బ్లాక్ బస్టర్ అవుతుంది'' అన్నారు. ''త్వరలో విడుదల తేదీ ప్రకటిస్తాం'' అన్నారు బెన్నీ ముప్పానేని. ''నాకు తొలి చాన్స్ ఇచ్చిన నిర్మాతలకు థ్యాంక్స్'' అన్నారు క్లాక్స్.



● క్లాక్స్, కార్తికేయ, నేహా శెట్టి, రవీంద్ర బెనర్జీ

సనాతన్ లక్ష్యం



● ఆది సాయికుమార్

ఆది సాయికుమార్ టైటిల్ రోల్‌లో రూపొందిన చిత్రం 'సీఎస్ఐ సనాతన్'. మిషా నారంగ్ హీరోయిన్. శివశంకర్ దేవ్ దర్శకత్వంలో అజయ్ శ్రీనివాస్ నిర్మించిన ఈ చిత్రం మార్చి 10న విడుదల కానుంది. ట్రైలర్‌ని శుక్రవారం విడుదల చేశారు. కార్పొరేట్ లీడర్ విక్రమ్ చక్రవర్తి హత్యను చేధించడమే లక్ష్యంగా సీఎస్ఐ (క్రైమ్ సీన్ ఇన్వెస్టిగేటర్) సనాతన్ ఐదుగురు నిందితులను విచారించడం ఈ ట్రైలర్‌లో కనబడుతుంది. ఐదుగురూ ఐదు రకాలుగా చెబుతారు. 'నిజాన్ని అస్సలు ఊహించలేము' అని సనాతన్ చెప్పే డైలాగ్‌తో ట్రైలర్ సాగుతుంది. ''మర్డర్ మిస్టరీగా రూపొందించిన ఈ చిత్రం ఉత్కంఠభరితంగా ఉంటుంది'' అని నిర్మాత అజయ్ శ్రీనివాస్ అన్నారు.

ఫుల్ కామెడీ



● సన్నీ

'బిగ్ బాస్' తెలుగు 5 సీజన్ విజేత వీజే సన్నీ హీరోగా కొత్త సినిమా ఆరంభమైంది. రచయిత సంజయ్ దర్శకత్వంలో ఫుల్ మూన్ మీడియా ప్రొడక్షన్స్‌పై ఈ చిత్రం రూపొందుతోంది. ''చక్కని వినోదం నేపథ్యంలో ఈ చిత్రం ఉంటుంది. శుక్రవారమే రెగ్యులర్ షూటింగ్ ఆరంభించాం.. సింగిల్ షెడ్యూల్‌లో పూర్తి చేయనున్నాం'' అని చిత్రవర్గాలు పేర్కొన్నాయి. శివన్నారాయణ, శైలజ ప్రియ, సప్తగిరి, రేఖ ముఖ్య పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: శ్రీనివాస్ రెడ్డి, సంగీతం: మదీన్, దర్శకత్వ పర్యవేక్షణ: వి. జయశంకర్.

పులి వస్తోంది



● పూనమ్ బజ్వా

సిజు విల్సన్ లీడ్ రోల్‌లో కాయాదు లోహర్ హీరోయిన్‌గా తెరకెక్కిన మలయాళ చిత్రం 'పాథోన్‌పథం నూట్టాండు'. వినయన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం గత సెప్టెంబరులో విడుదలైంది. ఈ చిత్రాన్ని 'పులి.. ది పంతొమ్మిదవ సెంచరీ' పేరుతో సీహెచ్ సుధాకర్ బాబు తెలుగులో ఈ నెల 24న విడుదల చేస్తున్నారు. ''యాక్షన్ పీరియాడికల్ డ్రామాగా రూపొందిన చిత్రమిది. తెలుగు టీజర్‌కు మంచి స్పందన వచ్చింది. తెలుగులోనూ హిట్ అవుతుందనే నమ్మకం ఉంది'' అన్నారు సీహెచ్ సుధాకర్ బాబు. అనూప్ మీనన్, పూనమ్ బజ్వా ఇతర పాత్రలు చేసిన ఈ చిత్రానికి సహనిర్మాత: ఎస్.కె. రామచంద్ర నాయక్.


కృష్ణగాడి లవ్‌స్టోరీ



● విస్మయ, రిషి

రిష్వి తిమ్మరాజు, విస్మయ శ్రీ హీరో హీరోయిన్లుగా నటిస్తున్న చిత్రం 'కృష్ణగాడు అంటే ఒక రేంజ్'. రాజేష్ దొండపాటి దర్శకత్వంలో ఈ సినిమాను పెట్లా కృష్ణమూర్తి, పెట్లా వెంకట సుబ్బమ్మ, పీఎన్‌కే శ్రీలత నిర్మిస్తున్నారు. ఈ సినిమా ఫస్ట్ లుక్ మోషన్ పోస్టర్‌ను దర్శకుడు వీవీ వినాయక్ రిలీజ్ చేసి, ఆసక్తికరంగా ఉందన్నారు. ''ఫీల్‌గుడ్ లవ్‌స్టోరీగా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నాం. సాబు వర్గీస్ సంగీతం, ఎస్‌కే రఫీ కెమెరా వర్క్ హైలైట్‌గా నిలుస్తాయి'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ నిర్మాతలు: చుంచు భాను ప్రకాష్, హరిహర ప్రసాద్ పెట్లా.


సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16 వెల: ₹ 5.50
సంపుటి: 15
సంచిక: 321
శనివారం 11-2-2023


'జల ప్రాజెక్టులపై జనం ఎన్నెన్నో ఆశలు పెట్టుకున్నారు. వాళ్ల నమ్మకం వమ్ము కాకుండా పనిచేయాలి'


మనదే ఆధిపత్యం
రోహిత్ శర్మ సెంచరీ. 144 పరుగుల ఆధిక్యంలో భారత్ -10లో


ఆర్టీసీకి ఎలక్ట్రిక్ బస్సులు
అద్దె ప్రాతిపదికన తీసుకోనున్న సంస్థ. జీసీసీ పద్ధతిలో నిర్వహణ -12లో

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


59 లక్షల టన్నుల లిథియం
బ్యాటరీలు, విద్యుత్ పరికరాల తయారీలో ఉపయోగించే లిథియం నిక్షేపాలను తొలిసారిగా జమ్మూకశ్మీర్‌లో గుర్తించారు.
వివరాలు 6లో ▸

ఆ పిటిషన్ కొట్టివేసిన సుప్రీం
దేశంలో బీబీసీపై పూర్తిస్థాయిలో నిషేధం విధించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు శుక్రవారం కొట్టివేసింది.
వివరాలు 6లో ▸


రాజస్థాన్ అసెంబ్లీలో కలకలం..
ఆర్థికశాఖను కూడా నిర్వహిస్తున్న రాజస్థాన్ సీఎం అశోక్ గెహ్లాట్ అసెంబ్లీలో పొరపాటున గత ఏడాది బడ్జెట్ వివరాలను చదివారు.
వివరాలు 6లో ▸



నేడు హైదరాబాద్‌లో ఫార్ములా-ఇ రేస్
10లో

హుస్సేన్ సాగర్ తీరంలో ప్రతిష్టాత్మక ఫార్ములా-ఇ రేసింగ్‌కు సర్వం సిద్ధమైంది. ఇ-రేసింగ్‌కు భారత్ ఆతిథ్యం ఇవ్వడం ఇదే మొదటిసారి. మొత్తం 11 జట్లకు చెందిన 22 మంది డ్రైవర్లు రేసింగ్‌లో పాల్గొనబోతున్నారు. శనివారం ఉదయం క్వాలిఫయింగ్ తర్వాత మధ్యాహ్నం 3 గంటలనుంచి ప్రధాన ఈవెంట్ జరుగుతుంది. గంటకు సుమారు 320 కిలోమీటర్ల వేగంతో దూసుకెళ్లే జనరేషన్-3 కార్లు ప్రత్యేకంగా సిద్ధం చేసిన 'స్ట్రీట్ సర్క్యూట్'పై రయ్ రయ్‌మంటూ దూసుకుపోనున్నాయి. ఎఫ్-ఇ 9వ సీజన్‌లో ఇది నాలుగో రేస్. 2.83 కిలోమీటర్ల హైదరాబాద్ ట్రాక్‌పై 18 మలుపులు ఉన్నాయి. సచిన్ టెండూల్కర్ సహా పలువురు ప్రముఖులు ఈ రేసింగ్‌ను ప్రత్యక్షంగా వీక్షించనున్నారు.

న్యూస్‌రీల్

సింగరేణి ప్రైవేటీకరణ ఆలోచన కేంద్రానికి లేదు



సింగరేణి బొగ్గు గనులను ప్రైవేటీకరించే ఆలోచనేదీ కేంద్రానికి లేదని ఈటల రాజేందర్ స్పష్టంచేశారు. సింగరేణికి పది గనులు కావాలని రాష్ట్ర ప్రభుత్వం దరఖాస్తు చేసుకున్నా.. కేంద్రం ఇవ్వకపోతే తాను అసెంబ్లీలో ఉండబోనని పేర్కొన్నారు.
- వివరాలు 2లో▶

ప్రభుత్వ వైద్య రంగంలో గుణాత్మక మార్పు



సీఎం కేసీఆర్ దార్శనికత కారణంగా ప్రభుత్వ వైద్య రంగంలో గుణాత్మక మార్పు వచ్చిందని వైద్యారోగ్య శాఖ మంత్రి టి. హరీశ్‌రావు తెలిపారు. తెలంగాణలో వైద్య రంగాన్ని నాటి కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని, 60 ఏళ్లలో చేయని పనిని సీఎం కేసీఆర్ ఆరేళ్లలో చేసి చూపించారన్నారు.
- వివరాలు 2లో▶

కేంద్ర బడ్జెట్ గేమ్ చేంజర్



విద్య, వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి వంటి రంగాలకు కేంద్ర బడ్జెట్ 2023-24 మేలు మలుపు (గేమ్ చేంజర్)లాంటిదని గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ అభివర్ణించారు. విద్య, నైపుణ్యాభివృద్ధికి అత్యధిక కేటాయింపులతో రాబోయే రోజుల్లో విప్లవాత్మక మార్పులు రాబోతున్నాయని తెలిపారు.
- వివరాలు 12లో▶

'పోడు'కు పట్టం..

నెలాఖరుకల్లా పోడు భూములు పంపిణీ చేస్తాం: ముఖ్యమంత్రి కేసీఆర్

ఇప్పటికే సాగులో ఉన్న 11.5 లక్షల ఎకరాలను గుర్తించాం..

భవిష్యత్తులో పోడు భూముల పంపిణీ ఉండదు

అడవుల్లో ఒక్క చెట్టు కొట్టినా ఊరుకునేది లేదు


దీనిపై హామీ ఇస్తేనే పోడు పంపిణీ.. హామీ తప్పితే భూములు వెనక్కి

పంపిణీ చేసిన భూములకు పట్టాలతోపాటు విద్యుత్ కనెక్షన్, రైతుబంధు కూడా..

అప్పటికీ భూముల్లేని గిరిజనులు ఉంటే 'గిరిజన బంధు'కింద లబ్ధి.. పోడు భూములు హక్కు కాదు.. దురాక్రమణ అని వ్యాఖ్య

గిరిజనుల హక్కులతో పాటు అటవీ సంపదను కాపాడాల్సిందేనని వెల్లడి

అడవులకు సాయుధ దళాలతో పహారా ఏర్పాటు చేస్తామన్న సీఎం


శుక్రవారం అసెంబ్లీలో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్

లిఖిత పూర్వక హామీ ఇస్తేనే..
పోడు భూముల పంపిణీ తర్వాత అడవిలో ఒక్క చెట్టు కూడా నరకబోం.. మళ్లీ పోడు భూములనే మాటెత్తం. అడవులను రక్షిస్తామని సర్పంచి నుంచి ఎంపీటీసీ, అఖిలపక్ష గిరిజన ప్రతినిధుల దాకా సంతకాలు పెడితేనే పోడు భూములను పంపిణీ చేస్తాం. అందుకు సిద్ధంగా లేని వారికి భూములు ఇవ్వం. ఇక నుంచి పోడు భూములను రక్షిస్తామని.. పట్టాలు ఇచ్చాక గజం భూమిని కూడా ఆక్రమించబోమని ప్రభుత్వానికి లిఖిత పూర్వక హామీ ఇవ్వాలి. ఎవరైనా దాన్ని అతిక్రమిస్తే పోడు పట్టాలు రద్దు చేస్తాం. భూములు పొందిన తర్వాత వారే అటవీ సంపదను కాపాడే హక్కుదారులు కావాలి
- అసెంబ్లీలో సీఎం కేసీఆర్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఇప్పటికే సాగులో ఉన్న 11.5 లక్షల ఎకరాల పోడు భూముల పంపిణీ ప్రక్రియను ఈ (ఫిబ్రవరి) నెలాఖరుకల్లా ప్రారంభిస్తామని ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ప్రకటించారు. ఆయా జిల్లాల్లో పంపిణీ చేయాల్సిన భూములకు సంబంధించిన సర్వే ఇప్పటికే పూర్తయిందని, నివేదికలు కూడా సిద్ధమయ్యాయని వెల్లడించారు. పంపిణీ చేసే పోడు భూములకు పట్టా ఇవ్వడంతోపాటు విద్యుత్ కనెక్షన్, రైతుబంధు, నీటి సౌకర్యం కల్పిస్తామని చెప్పారు. పోడు భూముల పంపిణీ తర్వాత క్షేత్రస్థాయిలో గిరిజన గణన జరిపి భూమిలేని వారికి 'దళితబంధు'తరహాలో 'గిరిజన బంధు'అమలు చేస్తామని ప్రకటించారు. అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా శుక్రవారం ప్రశ్నోత్తరాల సమయంలో పోడు భూముల సమస్యపై కాంగ్రెస్ సభ్యులు పొదెం వీరయ్య, ధనసరి అనసూయ (సీతక్క), బీఆర్ఎస్ సభ్యుడు పెద్ది సుదర్శన్‌రెడ్డి అడిగిన ప్రశ్నలకు సీఎం కేసీఆర్ సమాధానం ఇచ్చారు. సీఎం చెప్పిన అంశాలు ఆయన మాటల్లోనే..

''పోడు భూముల విషయంలో మాకు స్పష్టమైన విధానం ఉంది. సాగు చేసుకునే వారికి పట్టాలు ఇవ్వాలని ఇటీవలే ఓ సమావేశంలో నిర్ణయం తీసుకున్నాం. ఆ భూములు పంపిణీ చేశాక రైతుబంధు, విద్యుత్, తాగునీటి సౌకర్యం కల్పిస్తాం. భూమిలేని గిరిజన బిడ్డలకు
మిగతా 2వ పేజీలో ▶

వాల్మీకి బోయలను ఎస్టీల్లో చేర్చాలి


సీఎంను కలిసిన వాల్మీకి బోయ సంఘం ప్రతినిధులు

కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ శాసన సభలో ఏకగ్రీవ తీర్మానం
- జాబితాలో మరికొన్ని సామాజిక వర్గాలు కూడా..
- దీనిపై 2016లోనే కేంద్రానికి సిఫార్సు చేశామన్న సీఎం కేసీఆర్
- ఎలాంటి స్పందన రాకపోవడంతో అసెంబ్లీలో తీర్మానం చేశామని వెల్లడి

- వివరాలు 2లో▶

సచివాలయం గుమ్మటాలను కూల్చేస్తాం

స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లో బండి సంజయ్ మండిపాటు
- సచివాలయాన్ని తాజ్‌మహల్ లాంటి సమాధిగా మార్చారు
- మేం అధికారంలోకి వస్తే భారతీయ, తెలంగాణ సంస్కృతి ప్రతిబింబించేలా చేస్తాం
- బీఆర్ఎస్, ఎంఐఎం రెండు పార్టీలూ ఒక్కటే అని ఎద్దేవా



'పోడు' పట్టాలివ్వకుంటే ఫామ్‌హౌస్‌ను దున్నేస్తారు
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ హెచ్చరిక
- పోడు భూములపై కేసీఆర్ కొత్త నాటకాలు

- వివరాలు 3లో▶

మళ్లీ 'బషీర్‌బాగ్' ఉద్యమం

ఖమ్మం జిల్లాలో హాథ్ సే హాథ్ జోడో యాత్రలో టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి
- రాష్ట్రంలో 2003కు ముందు మాదిరి విద్యుత్ కోతలు
- అప్పటి ఉద్యమంతో ప్రభుత్వం కుప్పకూలింది
- ఇప్పుడు కూడా ఆ తరహా ఉద్యమం అవసరం

సాక్షి ప్రతినిధి, ఖమ్మం: ప్రస్తుతం రాష్ట్రంలో 2003కు ముందు మాదిరి విద్యుత్ కోతలు ఉన్నాయని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చెప్పారు. అప్పటి విద్యుత్ సంక్షోభం కారణంగా జరిగిన బషీర్‌బాగ్ ఉద్యమం నేపథ్యంలో ఆనాటి ప్రభుత్వం కుప్పకూలిందని, ఇప్పుడు మరోసారి బషీర్‌బాగ్ తరహా ఉద్యమం చేపట్టాల్సిన అవసరం ఉందని అన్నారు. రేవంత్ హాథ్ సే హాథ్ జోడో యాత్ర శుక్రవారం ఉదయం ఖమ్మం జిల్లా కామేపల్లి మండలం లచ్చతండా నుంచి ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంతో పాటు రాత్రి కొత్త లింగాల క్రాస్ వద్ద జరిగిన సభలో ఆయన మాట్లాడారు. సాధ్యం కాదన్న ఉచిత విద్యుత్‌ను కాంగ్రెస్ పార్టీ అమలు చేసి చూపిందని, కానీ రైతులకు 24 గంటల విద్యుత్‌పై ఆడంబరపు ప్రకటనలు చేసిన సీఎం కేసీఆర్ అందులో విఫలమయ్యారని విమర్శించారు. ఆయనకు ప్రజలు ఇచ్చిన అవకాశం ముగిసిందని చెప్పారు.

విద్యుత్ కొనుగోళ్లలో వేలకోట్ల కుంభకోణం
విద్యుత్ కొనుగోళ్లలో రూ.వేలకోట్ల కుంభకోణం జరిగిందని రేవంత్ ఆరోపించారు. ట్రాన్స్‌కో, జెన్‌కో, డిస్కంలు రూ.60 వేల కోట్ల అప్పుల్లో ఉండగా, ఛత్తీస్‌గఢ్ విద్యుత్ ఒప్పందం లోపభూయిష్టంగా మారిందని చెప్పారు. పదిహేనేళ్ల క్రితం రిటైర్ అయిన ప్రభాకర్‌రావు, రఘుమారెడ్డి, గోపాలరావులను ముఖ్యమంత్రి కేసీఆర్ సీఎండీలుగా అందలం ఎక్కించారని విమర్శించారు. కేసీఆర్ చెప్పిన దగ్గరల్లా సంతకాలు పెట్టి.. వేల కోట్ల దోపిడీకి సహకరించినందుకే వారికి పదవులు
మిగతా 5వ పేజీలో ▶


ఖమ్మం జిల్లా కామేపల్లి మండలంలో గోవింద్రాలలో ఓ ఇంటికి హాథ్ సే హాథ్ జోడో యాత్ర స్టిక్కర్ అంటిస్తున్న రేవంత్‌రెడ్డి

కాసుల యావ.. కోతల హవా
- ఎడాపెడా సిజేరియన్లు చేసేస్తున్న ప్రైవేటు ఆస్పత్రులు.. సాధారణ ప్రసవానికి అవకాశం ఉన్నా కడుపు కోతకే మొగ్గు
- తల్లీబిడ్డల ఆరోగ్యం పట్టించుకోని వైనం
- ప్రభుత్వ ఆస్పత్రుల్లోనూ భారీ సంఖ్యలోనే సిజేరియన్లు

- వివరాలు 12లో▶

ఆత్మవిశ్వాసంలో అతివలే మేటి
- మహిళా ఐపీఎస్‌లు పెరుగుతుండటం శుభపరిణామం
- పురుషులకు ఏమాత్రం తీసిపోకుండా ముందంజ వేస్తున్నారు
- ఔట్‌డోర్ శిక్షణలోనూ అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తున్నారు
- నాయకత్వ లక్షణాలు పెంచేలా అకాడమీలో శిక్షణ
- వివిధ వర్గాల అభిప్రాయాల మేరకు శిక్షణాంశాల్లో మార్పులు
- 'సాక్షి' ఇంటర్వ్యూలో ఎన్‌పీఏ డైరెక్టర్ ఏఎస్ రాజన్



- వివరాలు 12లో▶

నేడు 'దీక్షాంత్'కు అమిత్ షా



సాక్షి, హైదరాబాద్: సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ నేషనల్ పోలీస్ అకాడమీలో శనివారం నిర్వహించనున్న 74వ బ్యాచ్ ఐపీఎస్ అధికారుల దీక్షాంత్ (పాసింగ్ అవుట్) పరేడ్‌కు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు. 195 మంది ప్రొబేషనరీ ఐపీఎస్ అధికారులతో విధి నిర్వహణకు సంబంధించిన ప్రతిజ్ఞ చేయించడంతో పాటు వారి నుంచి గౌరవ వందనం స్వీకరించనున్నారు. శిక్షణలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన వారికి ట్రోఫీలను అందజేయనున్నారు. అమిత్‌షా శుక్రవారం రాత్రికే హైదరాబాద్ చేరుకున్నారు.



ఇప్పటి వరకు ఎన్ని పరిశ్రమలు వచ్చాయి?
- పరిశ్రమల ఏర్పాటుపై శ్వేతపత్రం విడుదల చేయాలి
- మూతబడ్డ ఎంఎస్ఎంఈల ప్రారంభంపై ప్రభుత్వ విధానం ఏమిటో చెప్పాలి.. శాసనసభలో పద్దులపై చర్చలో కాంగ్రెస్ ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

- వివరాలు 2లో▶

ఇదండీ సంగతి



హామీల పేరుతో 'చుక్కలు' చూపిస్తున్నారుగా అని అంటున్నాడ్సార్!


ఆస్పత్రిలో కోలుకుంటున్న అయా


శిథిలాల్లో పుట్టిన పసికందును బయటకు తీసుకువస్తున్న సహాయక సిబ్బంది (ఫైల్)

ఎటు చూసినా హృదయ విదారకం
- తుర్కియే, సిరియాలో కొనసాగుతున్న సహాయక చర్యలు.. ముమ్మరంగా శిథిలాల తొలగింపు
- 100 గంటలకు పైగా మృత్యువుతో పోరాటం
- రెండు దేశాల్లో 22,000 దాటిన మరణాలు

6లో

శిథిలాల్లో ప్రాణం పోసుకున్న
అయాకు ఆప్తులెందరో!

ఈ బుల్లి పాపాయి గుర్తుందా?
సోమవారం వాయవ్య సిరియాలో జిందర్రిస్ పట్టణంలో భూకంపం తాకిడికి నేలమట్టమైన భవనం తాలూకు శిథిలాల్లోనే ప్రాణం పోసుకున్న పసికందు.

తల్లిదండ్రులతో పాటు నలుగురు తోబుట్టువులూ భూకంపానికి బలవగా ఆ దుమ్మూధూళి మధ్య నుంచి ఈ పాపాయిని మాత్రం సహాయక బృందాలు సజీవంగా బయటికి తీసుకొచ్చిన దృశ్యం వైరల్‌గా మారి అందరినీ అబ్బురపరిచింది. అందుకు గుర్తుగా తనకు అయా (అద్భుతమని అరబిక్‌లో అర్థం) పేరు పెట్టారు. ఆస్పత్రికి తీసుకెళ్లేటప్పటికి ఒళ్లంతా చల్లబడి, శ్వాస కూడా ఆడని స్థితిలో ఉంది. కానీ ఇప్పుడు బాగా కోలుకుంటోంది. ఈ మిరాకిల్ బేబీని దత్తత తీసుకుంటామంటూ వేలాది మంది ముందుకొస్తున్నారు. వీరిలో టీవీ యాంకర్ల నుంచి ఉద్యోగుల దాకా అన్నిరకాల వాళ్లూ ఉన్నారు. వీరందరి ఫోన్లతో ఆస్పత్రి మేనేజర్ ఖలీద్ అతియా ఉక్కిరిబిక్కిరవుతున్నారు! చిన్నారి తాలూకు బంధువులతో మాట్లాడేదాకా తనను ఎవరికీ ఇచ్చేది లేదని చెప్పారాయన. ప్రస్తుతం అతియా భార్యే తన సొంత కూతురితో పాటు అయాకు కూడా పాలిస్తోంది!

సుప్రీంకోర్టులో మరో ఇద్దరు జడ్జీల నియామకం

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టులో మరో ఇద్దరు జడ్జీలు నియమితులయ్యారు. దీంతో, ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్‌తో కలిపి మొత్తం 34 మంది న్యాయమూర్తులతో ఇక పూర్తిస్థాయి సామర్థ్యంతో సర్వోన్నత న్యాయస్థానం పనిచేయనుంది. అలహాబాద్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాజేశ్ బిందాల్, గుజరాత్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అరవింద్ కుమార్‌లను రాష్ట్రపతి నియమించారని శుక్రవారం న్యాయశాఖ మంత్రి కిరెణ్ రిజిజు ట్వీట్ చేశారు. ఈ నెల 13న వీరిద్దరూ ప్రమాణ స్వీకారం చేసే అవకాశం ఉందని సుప్రీంకోర్టు వర్గాలు తెలిపాయి. వీరి పేర్లను జనవరి 31వ తేదీన సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసు చేసింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ఆరుగురు సభ్యులుండే కొలీజియంలో జస్టిస్ బిందాల్ పేరుపై ఏకాభిప్రాయం వ్యక్తమైంది. అయితే, జస్టిస్ కుమార్ పేరుపై కొలీజియంలోని జస్టిస్ కేఎం జోసెఫ్ విభేదించినట్లు సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో పొందుపరిచిన వివరాలను బట్టి తెలుస్తోంది. తాజాగా జస్టిస్ బిందాల్, జస్టిస్ కుమార్‌ల నియామకంపై డిపార్ట్‌మెంట్ ఆఫ్ జస్టిస్, కేంద్ర న్యాయశాఖ వేర్వేరుగా నోటిఫికేషన్లు జారీ చేశాయి. గత వారం సుప్రీంకోర్టుకు ఐదుగురు జడ్జీలు నియమితులైన విషయం తెలిసిందే. అయితే, వచ్చే మే-జూలై నెలల మధ్యలో సుప్రీంకోర్టులోని ఆరుగురు న్యాయమూర్తులు పదవీ విరమణ చేయనున్నారు.


జస్టిస్ రాజేశ్ బిందాల్


జస్టిస్ అరవింద్ కుమార్

క్లుప్తంగా...

'మధిరకు నిధులివ్వండి'



సాక్షి, హైదరాబాద్: తన నియోజకవర్గంలోని మధిర మున్సిపాలిటీలో అభివృద్ధి పనుల నిమిత్తం నిధులు మంజూరు చేయాలని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క కోరారు. ఈ మేరకు శుక్రవారం అసెంబ్లీ లాబీల్లోని పురపాలక మంత్రి కేటీఆర్‌కు ఆయన చాంబర్‌లో వినతిపత్రం అందజేశారు. మధిర పట్టణంలో సీసీ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కేటీఆర్‌ను భట్టి కోరారని, ఇందులో ఎలాంటి రాజకీయ ప్రాధాన్యం లేదని భట్టి కార్యాలయ వర్గాలు స్పష్టం చేశాయి.

ఉచిత విద్యుత్ ఘనత వైఎస్‌దే

రైతులకు ఉచిత విద్యుత్‌ను ప్రవేశపెట్టింది దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి అని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఎవరైనా దీన్ని ఒప్పుకొని తీరాలన్నారు. శాసనసభలో విద్యుత్‌రంగ పద్దులపై శుక్రవారం చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పథకాన్ని కొనసాగించే క్రమంలో ప్రస్తుత బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు.

'ఎక్కడా లేనట్లుగా ఆసరా'



సాక్షి, హైదరాబాద్: దేశంలో ఏ రాష్ట్రంలో ఇవ్వని విధంగా 44.12 లక్షల మందికి ఆసరా పెన్షన్లు ఇస్తున్నట్లు పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు చెప్పారు. శుక్రవారం అసెంబ్లీ ప్రశ్నోత్తరాల సమయంలో పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. ఈ ఆర్థిక సంవత్సరంలో కొత్తగా 9,08,498 మందికి పెన్షన్లు ఇచ్చినట్లు తెలిపారు. వృద్ధాప్య పెన్షన్లకు వయోపరిమితిని 65 ఏళ్ల నుంచి 57 ఏళ్లకు తగ్గించాక 5,37,048 మందికి పెన్షన్లు మంజూరు చేసినట్టు తెలిపారు.

కేంద్రం వల్లే విద్యుత్ సమస్యలు: జగదీశ్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: నాణ్యమైన విద్యుత్ అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుంటే కేంద్రం అడ్డంకులు సృష్టిస్తోందని విద్యుత్ శాఖమంత్రి జగదీశ్‌రెడ్డి శాసనసభలో శుక్రవారం విద్యుత్ పద్దుపై జరిగిన చర్చకు సమాధానమిస్తూ ఆరోపించారు. తెలంగాణ ఏర్పడ్డాక విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 7 నుంచి 16 వేల మెగావాట్లకు పెరిగిందన్నారు. ఎన్టీపీసీ ఇవ్వాల్సిన విద్యుత్ ఇవ్వకపోవడం వల్లే రెండు రోజులుగా విద్యుత్ అంతరాయాలు ఏర్పడ్డాయని, డిమాండ్‌కు తగ్గట్టుగా ఎంత ఖర్చయినా కొని విద్యుత్ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలిపారు. కేంద్రం మీటర్లు పెడితేనే అప్పులు తెచ్చుకునేందుకు అనుమతిస్తామని ఒత్తిడి చేస్తోందని, విద్యుత్ రంగాన్ని దెబ్బ కొట్టేందుకు కుట్ర చేస్తోందని ఆరోపించారు.

నవ్వులు పూయించిన మల్లారెడ్డి



సాక్షి, హైదరాబాద్: కార్మిక శాఖ మంత్రి సిహెచ్.మల్లారెడ్డి శుక్రవారం శాసనసభలో హాస్య చతురత ప్రదర్శించి సభ్యుల్ని నవ్వించారు. రాసుకొచ్చిన కవితలతో కేసీఆర్, కేటీఆర్‌ను కీర్తిస్తూ సాగించిన ఆయన ప్రసంగంలో కేంద్రంపై వ్యంగ్యోక్తులు కూడా విసిరారు. 'ఇంత చేస్తుంటే నా మీద ఐటీ దాడులు చేస్తున్నారు'.. అంటూ ఆయన వాపోయారు. 'కార్మిక శాఖకు డబ్బులు లేవన్నట్టు మాట్లాడుతున్నారు... మా శాఖలో రూ. 1,800 కోట్ల నిధులు ఎఫ్‌డీలే' అని ఆయన స్పష్టం చేసినప్పుడు.. 'మీ శాఖకు, మీకు డబ్బుకు కొదవ లేదు' అని అధికార పక్ష సభ్యులు వ్యాఖ్యానించడం వినిపించింది. కరోనా సమయంలో రాష్ట్రానికి 40 వేల మంది బతుకుతెరువు కోసం వచ్చారని ఆయన పెద్ద స్వరంతో చెబుతున్నప్పుడు.. స్పీకర్ పోచారం జోక్యం చేసుకుని 'మీ మాటలు విని వాళ్లంతా వెళ్లిపోతారేమో... అక్కడి దాకా మీ మాట వినిపించేలా ఉంది'.. అనడంతో సభలో నవ్వులు విరిశాయి.

సింగరేణి ప్రైవేటీకరణ ఆలోచన కేంద్రానికి లేదు

బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్



సాక్షి, హైదరాబాద్: సింగరేణి బొగ్గు గనులను ప్రైవేటీకరించే ఆలోచనేదీ కేంద్ర ప్రభుత్వానికి లేదని బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ స్పష్టం చేశారు. సింగరేణికి పది గనులు కావాలని రాష్ట్ర ప్రభుత్వం దరఖాస్తు చేసుకున్నా.. కేంద్రం ఇవ్వకపోతే తాను అసెంబ్లీలో ఉండబోనని పేర్కొన్నారు. నైనీ బొగ్గుబ్లాక్‌ను ఇస్తామన్నా వద్దని, శ్రావణపల్లి గిట్టుబాటు కాదని వదులుకుని కేంద్రం మైన్స్ ఇవ్వడం లేదని రాష్ట్రప్రభుత్వం బద్నాం చేస్తోందని తెలిపారు. సుప్రీంకోర్టు ఆదేశాలతో ప్రభుత్వ సంస్థలకు బొగ్గుబ్లాక్‌లను ఇస్తుందని, వాటిని ప్రైవేట్ కాంట్రాక్టర్లకు అప్పగించకుండా రాష్ట్ర ప్రభుత్వమే మైన్స్‌ను నిర్వహించాలని ఈటల సూచించారు. బొగ్గుకి డబ్బులు ఇవ్వకపోవడం, కరెంటుకి బిల్లులు చెల్లించకపోవడం వల్ల సింగరేణికి బకాయి పడిన రూ.25 వేల కోట్లు వెంటనే రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాలని డిమాండ్ చేశారు.

పచ్చని తెలంగాణను పిచ్చోళ్ల చేతుల్లో పెట్టొద్దు

అరాచక మాటలు తప్ప నిర్మాణాత్మక వైఖరి లేని పార్టీలను తిరస్కరించండి


- రాష్ట్ర ప్రజలకు అసెంబ్లీ సాక్షిగా మంత్రి కేటీఆర్ పిలుపు
- ప్రగతిభవన్‌ను పేలుస్తాం, సచివాలయాన్ని కూలుస్తామన్న విపక్ష నేతల వ్యాఖ్యలపై ధ్వజం... మోదీ గుజరాత్‌కే ప్రధానిలా వ్యవహరిస్తున్నారని మండిపాటు
- తెలంగాణపై కేంద్రం వివక్ష చూపిస్తుందని విమర్శ



సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి అధికారిక నివాసమైన ప్రగతిభవన్‌ను పేల్చేయాలంటూ టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి, తాజ్‌మహల్‌ను పోలిన సచివాలయ గుమ్మటాలను కూలుస్తామంటూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలపై మంత్రి కేటీఆర్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. పచ్చని తెలంగాణను పిచ్చోళ్ల చేతుల్లో పెట్టొద్దని అసెంబ్లీ వేదికగా రాష్ట్ర ప్రజలకు పిలుపునిచ్చారు. శుక్రవారం పద్దులపై చర్చ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ ''నిన్న ఒకాయన ప్రగతిభవన్‌ను కూలగొడతానన్నాడు.. ఇవాళ ఇంకొకాయన సెక్రటేరియట్‌ను కూలగొడతానంటున్నాడు. మేమేమో నిర్మాణాలు చేద్దాం.. పునాదులు తవ్వుదాం అంటుంటే ఒకాయనేమో సమాధులు తవ్వుతానంటాడు. ఇంకొకాయన బాంబులు పెట్టి పేలుస్తానంటాడు. ఈ అరాచక శక్తుల చేతుల్లో రాష్ట్రం పడితే ఏమవుతుందో ఆలోచించాలని మిత్రులందరినీ అడుగుతున్నా. పచ్చగా ఉన్న తెలంగాణ, పచ్చని మాగాణంగా మారిన తెలంగాణను పిచ్చోళ్ల చేతుల్లో పెట్టొద్దని రాష్ట్ర ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నా. పేలుస్తాం.. కూలుస్తామనే అరాచక మాటలు తప్ప నిర్మాణాత్మకమైన వైఖరి లేని పార్టీలను తిరస్కరించాలని కూడా ప్రజలను కోరుతున్నా'' అని పేర్కొన్నారు.

తెలంగాణపై కేంద్రం వివక్ష...

తెలంగాణపై కేంద్రం వివక్ష చూపిస్తోందని మంత్రి కేటీఆర్ ఆరోపించారు. కేంద్ర బడ్జెట్లో 157 మెడికల్ కాలేజీలు, 157 నర్సింగ్ కాలేజీలు ప్రకటించిన కేంద్రం... రాష్ట్రానికి ఒక్కటి కూడా ఇవ్వలేదన్నారు. 2020లో హైదరాబాద్‌లో వరదలు వస్తే కేంద్రం ఒక్క పైసా ఇవ్వలేదని... కానీ గుజరాత్‌లో వరదలు సంభవిస్తే ప్రధాని విమానంలో వెళ్లి రూ. వెయ్యి కోట్లు అందించారన్నారు. మోదీ గుజరాత్‌కే ప్రధానా? తెలంగాణ భారతదేశంలో భాగం కాదా? అని కేటీఆర్ నిలదీశారు. మరోవైపు తాము స్టార్టప్ అంటుంటే కేంద్రం మాత్రం కంపెనీలకు ప్యాకప్ చెబుతోందని ఎద్దేవా చేశారు. బీజేపీ ఎంపీలకు వెన్నెముక లేదని... పసుపు బోర్డు తెస్తానని చెప్పిన వాళ్లు దాని ఊసెత్తడంలేదన్నారు. హుజూరాబాద్‌కు మెడికల్ తెప్పించాలంటూ బీజేపీ సభ్యుడు ఈటలకు సవాల్ విసిరారు. 'రాజేందర్ అన్నా.. మీరు ఉద్యమ బిడ్డ, రోషమున్న తెలంగాణ బిడ్డ. కేంద్రంలో మీ పార్టీతో కొట్లాడి రాష్ట్రానికి ఏమన్నా పట్టుకొస్తే చప్పట్లతో స్వాగతం పలుకుతాం''అని కేటీఆర్ వ్యాఖ్యానించారు.



మోదీకి నోబెల్ ఇవ్వాలి..

ఔషధాల తయారీ హబ్‌గా ఉన్న హైదరాబాద్‌కు కేంద్రం బల్క్‌డ్రగ్ పార్క్ ఇవ్వకుండా.. ఒక్క ఫార్మా కంపెనీ కూడా లేని యూపీకి బల్క్ డ్రగ్స్ పార్క్ ఇచ్చిందని మంత్రి కేటీఆర్ మండిపడ్డారు. కరోనా వ్యాక్సిన్‌ను ప్రధాని మోదీ కనిపెట్టారని వాళ్ల మంత్రి అంటున్నారని... అందువల్ల మోదీకి నోబెల్ బహుమతి ఇవ్వాలని సిఫార్సు చేద్దామని మంత్రి కేటీఆర్ ఎద్దేవా చేశారు.

అసెంబ్లీలో స్పీకర్ పోచారం జన్మదిన వేడుకలు

సాక్షి, హైదరాబాద్: శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి 74వ జన్మదినం సందర్భంగా శుక్రవారం శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. స్పీకర్ చాంబర్‌లో ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు శాసనసభాపతి పోచారం శ్రీనివాస్‌రెడ్డికి పుష్ప గుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రులు కేటీ రామారావు, హరీశ్‌రావు, వేముల ప్రశాంత్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి, మల్లారెడ్డి తదితరులు స్పీకర్ చాంబర్‌లో కలిసి శుభాకాంక్షలు తెలపడంతో పాటు కేక్‌ను కట్ చేశారు. ప్రశ్నోత్తరాల సమయంలో సభలోకి వచ్చిన ముఖ్యమంత్రి కేసీఆర్ శాసనసభ్యుల తరఫున జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మంత్రులు, ఎమ్మెల్యేలు స్పీకర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ తమ ప్రసంగాలను ప్రారంభించారు.



స్పీకర్ పోచారానికి శుభాకాంక్షలు తెలుపుతున్న సీఎం కేసీఆర్. చిత్రంలో వేముల ప్రశాంత్‌రెడ్డి

వైద్య రంగంలో గుణాత్మక మార్పు

- కేసీఆర్ దార్శనికత కారణంగానే..: మంత్రి హరీశ్‌రావు
- జిల్లాకో మెడికల్ కాలేజీ, నర్సింగ్ కాలేజీ ఏర్పాటు చేస్తున్నాం
- 850 ఎంబీబీఎస్ సీట్లను 2,790కి పెంచుకున్నాం



సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి కేసీఆర్ దార్శనికత కారణంగా ప్రభుత్వ వైద్య రంగంలో గుణాత్మక మార్పు వచ్చిందని వైద్యారోగ్య శాఖ మంత్రి టి. హరీశ్‌రావు తెలిపారు. తెలంగాణలో వైద్య రంగాన్ని నాటి కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని, 60 ఏళ్లలో చేయని పనిని సీఎం కేసీఆర్ ఆరేళ్లలో చేసి చూపించారన్నారు. శుక్రవారం శాసనసభలో రాష్ట్రంలో వైద్య కళాశాలలకు సంబంధించి శాసనసభ్యులు మెతుకు ఆనంద్, ఎం. సంజయ్‌కుమార్, పద్మా దేవేందర్‌రెడ్డి, కౌసర్ మొహియుద్దీన్, దానం నాగేందర్ అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. రాష్ట్రంలో వైద్య రంగాన్ని బలోపేతం చేసేందుకు ముఖ్యమంత్రి అకుంఠిత దీక్షతో పనిచేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రం ఏర్పడే నాటికి తెలంగాణలో 3 ప్రభుత్వ మెడికల్ కాలేజీలు మాత్రమే ఉండగా, ఈ ఒక్క ఏడాదిలోనే 8 వైద్య కళాశాలలు ప్రారంభించినట్లు తెలిపారు. జిల్లాకో మెడికల్ కాలేజీ, నర్సింగ్ కాలేజీతో పాటు పారామెడికల్ కాలేజీని ఏర్పాటు చేయాలని సీఎం సంకల్పించినట్లు వివరించారు. తెలంగాణ ఏర్పాటయ్యే నాటికి రాష్ట్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలల్లో 850 ఎంబీబీఎస్ సీట్లు ఉండగా తెలంగాణ వచ్చాక వాటి సంఖ్యను 2,790కి పెంచుకున్నట్లు వెల్లడించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు 4 మెడికల్ కాలేజీలు వచ్చాయని, వరంగల్ జిల్లాలో 5 మెడికల్ కాలేజీలు. ఉమ్మడి పాలమూరులోని మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తిలలో కూడా మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. త్వరలో నారాయణపేట, గద్వాలలోనూ మెడికల్ కాలేజీలు రాబోతున్నాయని అన్నారు. ప్రతిపక్ష సభ్యులన్న సంగారెడ్డి, ములుగులోనూ మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అన్ని ప్రభుత్వ దవాఖానాల్లో సీసీ కెమెరాలు, బయోమెట్రిక్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. నెల రోజుల్లోగా 1457 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను భర్తీచేసి, మెడికల్ కాలేజీల్లో ఒక్క ఖాళీ లేకుండా చూస్తామన్నారు. ఈ ఏడాదిలోనే మెదక్‌కు మెడికల్ కాలేజీ మంజూరు చేయనున్నామని వెల్లడించారు.

దోస్తుల కోసమే మోదీ తహతహ

- ప్రధానిపై మంత్రి కేటీఆర్ విమర్శలు
- చేనేతను దెబ్బతీసేలా అనాలోచిత నిర్ణయాలు తీసుకున్నారని ధ్వజం
- డిస్కంలు విదేశీ బొగ్గు కొనాలన్న కేంద్రం ఆదేశాలు ఎవరి కోసం?

సాక్షి, హైదరాబాద్: ఎవరో ఒకరి కోసమో లేదా దోస్తుల కోసమో పనిచేసే రాష్ట్రం తెలంగాణ కాదని మున్సిపల్, ఐటీ శాఖల మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. తెలంగాణ పరిశ్రమలకు అనుకూల రాష్ట్రమే తప్ప ఎవరో ఒక పారిశ్రామికవేత్తకు అనుకూల రాష్ట్రం కాదని తేల్చిచెప్పారు. శుక్రవారం పద్దులపై చర్చ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ 'డిస్కంలు దేశీయ బొగ్గు కొనుద్దు.. విదేశాల నుంచి బొగ్గును కొనాలని కేంద్రం ఇటీవల ఆదేశించింది. ఎవరి ప్రయోజనాల కోసం కేంద్రం ఈ ఆదేశాలిచ్చిందో బీజేపీ నేతలు చెప్పాలి. ప్రధాని మోదీ ఆస్ట్రేలియా, ఇండోనేసియా వెళ్లొచ్చిన రెండు నెలల్లోనే ఆయన దోస్తులకు అక్కడి ప్రాంతంలోని బొగ్గుగని లీజు వస్తుంది. ఆయన దోస్తుల కోసం తహతహలాడుతారు. ఇద్దరు అమ్మేస్తుంటే... మరో ఇద్దరు కొంటుంటారు''అని ఆరోపించారు.

సింగరేణికి కేంద్రం గనులివ్వదేం?

''సింగరేణి విద్యుత్ ప్లాంట్ 91.6 శాతం పీఎల్ఎఫ్‌తో కోల్ ఇండియాకన్నా ఉత్తమ ఫలితాలు సాధిస్తోంది. ఈ అంశంలో సింగరేణి వరుసగా ఆరుసార్లు కేంద్ర అవార్డులు సాధించింది. సింగరేణి కాలరీస్‌ను ప్రైవేటుపరం చేసే ఆలోచన కేంద్రానికి లేదని బీజేపీ సభ్యుడు ఈటల రాజేందర్ చెబుతున్నారు. విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ఇవాళ తుక్కు కింద అమ్మాలని చూస్తోంది ఎవరు? అదే వ్యూహాన్ని సింగరేణి విషయంలోనూ అనుసరించేందుకు ప్రయత్నించింది. గుజరాత్ ఖనిజాభివృద్ధి కార్పొరేషన్‌కు గనులు కేటాయించిన కేంద్రం.. సింగరేణికి గనులు ఎందుకు కేటాయించదు? దీనిపై ఈటల కేంద్రాన్ని నిలదీయాలి''అని మంత్రి కేటీఆర్ చురకలంటించారు.

చేనేతపై మోదీ కత్తిగట్టారు...

కేంద్రం చేనేత కార్మికుల పథకాలను రద్దు చేస్తుంటే తాము మాత్రం పోరుగడ్డపై పేగుబంధమున్న చేతన్నలందరినీ బతికించుకొనేందుకు ప్రయత్నిస్తున్నామని మంత్రి కేటీఆర్ తెలిపారు. కానీ ఈ రంగంపై ప్రధాని మోదీ, బీజేపీ కత్తికట్టినట్లు వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. 'గత ఎనిమిదేళ్లలో ప్రధాని చేనేత విషయంలో ఎన్నో అనాలోచిత నిర్ణయాలు తీసుకున్నారని దుయ్యబట్టారు. చేనేత ఉత్పత్తులపై కేంద్రం 5 శాతం పన్ను విధింపు, జాతీయ చేనేత బోర్డు, జాతీయ పవర్‌లూం బోర్డుల రద్దు, హైదరాబాద్‌లోని జాతీయ జౌళి బోర్డు కార్యాలయం తొలగింపు, చేనేత సహకార సంఘం సభ్యుల థ్రిఫ్ట్ ఫండ్ పథకంలో కేంద్రం వాటా 4 శాతం రద్దు వంటి చర్యలతో నేతన్నలకు వాతలు పెట్టింది'' అని కేటీఆర్ విమర్శించారు.

ఇప్పటివరకు ఎన్ని పరిశ్రమలు వచ్చాయి?

- రాష్ట్ర ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలి
- మూతబడ్డ ఎంఎస్ఎంఈల ప్రారంభంపై వైఖరి చెప్పాలి
- శాసనసభలో పద్దులపై చర్చలో కాంగ్రెస్ ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ఏర్పాటు తర్వాత తెలంగాణలో కొత్తగా ఏర్పాటు చేసిన పరిశ్రమల వివరాలను పూర్తిస్థాయిలో పేర్కొంటూ శ్వేతపత్రం విడుదల చేయాలని కాంగ్రెస్ పార్టీ శాసనసభ్యుడు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 'కొత్తగా వచ్చిన పరిశ్రమలెన్ని? వాటి ద్వారా రాష్ట్రంలో పెట్టిన పెట్టుబడి ఎంత? ఈ పరిశ్రమల ఏర్పాటుతో కొత్తగా వచ్చిన ఉద్యోగాలు ఎన్ని? తదితర పూర్తిస్థాయి సమాచారంతో కూడిన పత్రాన్ని విడుదల చేయాలని కోరారు. అదేవిధంగా ఇప్పటివరకు ఎన్ని పరిశ్రమలకు అనుమతులిచ్చారు? వాటిలో ఇప్పటివరకు ఎన్ని ప్రారంభించారు తదితర పక్కా సమాచారాన్ని ఇవ్వాలన్నారు. తెలంగాణ ఏర్పాటు తర్వాత ఎన్నో పరిశ్రమలు రాష్ట్రంలో ఏర్పాటైనట్లు చెప్పడం తప్ప ప్రభుత్వం ఎన్నడూ గణాంకాలు ఇవ్వలేదన్నారు. బడ్జెట్ సమావేశాల్లో భాగంగా శుక్రవారం పద్దులపై జరిగిన చర్చలో భాగంగా శ్రీధర్‌బాబు మాట్లాడారు.

యజమానులే ఇప్పుడు రోడ్డెక్కాల్సి వచ్చింది

కోవిడ్ తర్వాత పరిస్థితులతో రాష్ట్రంలో ఎన్నో ఎంఎస్ఎంఈలు మూతబడ్డాయని, వీటిని తెరిచేందుకు ప్రభుత్వం చర్యలేవీ తీసుకోలేదని ఆరోపించారు. ఫలితంగా పరిశ్రమలు పెట్టి కొలువులు ఇచ్చిన యజమానులే ఇప్పుడు ఉద్యోగాల కోసం రోడ్డెక్కాల్సి వచ్చిందన్నారు. ప్రతి పరిశ్రమను ఆదుకునేలా ప్రభుత్వం రాయితీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఐటీఐఆర్ ప్రాజెక్టు పూర్తికి రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తేవాలని, ఇందుకు తాము మద్దతిస్తామన్నారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేసిన పలు మున్సిపాలిటీల్లో చిన్నపాటి ఇళ్లలో ఉంటున్న పేదల నుంచి రూ.వేలల్లో ఆస్తిపన్ను వసూలు చేస్తున్నారని, దీన్ని సవరించాలని ఆయన కోరారు. మిషన్ భగీరథ నీళ్లు కలుషితమవుతున్నాయని, చాలాచోట్ల నీరు చాలక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని శ్రీధర్‌బాబు పేర్కొన్నారు.

వాల్మీకి బోయలను ఎస్టీల్లో చేర్చాలి

- కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ శాసన సభలో ఏకగ్రీవ తీర్మానం
- జాబితాలో మరికొన్ని సామాజిక వర్గాలు కూడా..
- దీనిపై 2016లోనే కేంద్రానికి సిఫార్సు చేశామన్న సీఎం కేసీఆర్
- ఎలాంటి స్పందన రాకపోవడంతో అసెంబ్లీలో తీర్మానం చేశామని వెల్లడి

సాక్షి, హైదరాబాద్: వాల్మీకి బోయలతోపాటు మరికొన్ని సామాజిక వర్గాలను ఎస్టీ జాబితాలో చేర్చాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ రాష్ట్ర శాసనసభ ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ఈ తీర్మానాన్ని ప్రతిపాదించారు. వాల్మీకి బోయలతోపాటు బేదర్, కిరాత, నిషాది, పెద్ద బోయ, తలయారి, చుండువాళ్లు, కాయతి లంబాడ, బాట్ మథురాలు, చమర్ మధురాలను కూడా ఎస్టీ జాబితాలో 2016లోనే షెడ్యూల్ తెగల విచారణ సంఘం చేసిన సిఫార్సును తెలంగాణ ప్రభుత్వం ఆమోదించి కేంద్రానికి పంపిందని కేసీఆర్ గుర్తుచేశారు. కానీ కేంద్రం నుంచి ఎలాంటి స్పందన రాలేదన్నారు. దీంతో ఈ సామాజిక వర్గాలను షెడ్యూల్డ్ తెగల జాబితాలో చేర్చాల్సిందిగా కోరుతూ ప్రవేశపెట్టిన తీర్మానాన్ని శాసన సభ ఆమోదించిందని తెలిపారు. ఆదిలాబాద్, కొమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల్లో నివసిస్తున్న 'మాలి'సామాజిక వర్గాన్ని కూడా ఎస్టీ జాబితాలో చేర్చాలని కేసీఆర్ కోరారు. ఆయా వర్గాల ఆర్థిక, సామాజిక స్థితిగతులను పరిగణనలోకి తీసుకుని వీరిని ఎస్టీ జాబితాలో చేర్చాలన్న తీర్మానాన్ని కూడా సభ ఆమోదించినట్టు వివరించారు. కాగా సీఎం చేసిన తీర్మానంపై మథుర ఖాయితీ లంబాడాలు ధన్యవాదాలు తెలిపారు. కేసీఆర్‌కు జీవితకాలం రుణపడి ఉంటామని అఖిల భారతీయ లబనా నాయక్‌దా సమాజ్ అధ్యక్షుడు థాన్‌సింగ్ నాయక్ బన్సీ అన్నారు.

రాష్ట్రంలో 1.30 లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు

వ్యవసాయ మంత్రి నిరంజన్‌రెడ్డి వెల్లడి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటివరకు 1.30 లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగవుతున్నట్లు వ్యవసాయ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి తెలిపారు. ఈ ఒక్క ఏడాదిలోనే 62,023 ఎకరాల్లో ఆయిల్‌పామ్ మొక్కలు నాటినట్లు తెలిపారు. శుక్రవారం ఆయిల్ పామ్ సాగుపై సభ్యులు గంద్ర వెంకటరమణా రెడ్డి, బాల్క సుమన్, గువ్వల బాలరాజులు అడిగిన ప్రశ్నలకు నిరంజన్ రెడ్డి సమాధానమిచ్చారు. దేశంలో ఆయిల్ పామ్ సాగులో ప్రగతి సాధించిన ఏకైక రాష్ట్రం తెలంగాణ అని, 19.32% నూనె ఉత్పత్తితో దేశంలో తెలంగాణ తొలిస్థానంలో నిలిచిందన్నారు. 1,564 ఎకరాల్లో పాలమూరు జిల్లాలో ఆయిల్ పామ్ సాగవుతుందని వివరించారు.

'పోడు'కు పట్టం..



సీఎం కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలుపుతున్న ఇంద్రకరణ్‌రెడ్డి, జోగురామన్న, కోనేరు కోనప్ప, దుర్గం చిన్నయ్య, రేఖానాయక్ తదితరులు

▶ మొదటి పేజీ తరువాయి

గిరిజనబంధు ఇచ్చి సాయం చేస్తాం. ఏయే జిల్లాల్లో ఎంత భూమిని పంపిణీ చేయాలో సర్వే చేసి, నివేదికలు కూడా సిద్ధం చేశారు. కానీ.. అఖిలపక్షంతో పాటు స్థానిక సర్పంచి, ఎంపీటీసీ, స్థానిక గిరిజన ప్రతినిధులు సంతకాలు పెడితేనే పోడు భూములకు పట్టాలిస్తాం.

పోడు భూములు హక్కుకాదు.. దురాక్రమణ

కొన్నిచోట్ల గొత్తికోయలను తీసుకొచ్చి అడవులను నరికేస్తున్నారు. మన రాష్ట్రానికి చెందిన శ్రీనివాసరావు అనే ఫారెస్టు అధికారిని ఛత్తీస్‌గఢ్ నుంచి వచ్చిన గొత్తికోయలు హత్య చేశారు. ఇదేం పద్ధతి. పోడు భూముల గురించి అందరూ మాట్లాడుతున్నారు. పోడు భూములు గిరిజనుల హక్కు కాదు.. దురాక్రమణ. దయతలచి ఇస్తే తీసుకోవాలి. గతంలో ఉన్న ప్రభుత్వాలు సరైన పద్ధతుల్లో నిర్ణయాలు తీసుకోకపోవడం వల్ల ఈ సమస్య ఏర్పడింది. పోడు భూములు, అటవీ భూములు కొన్ని పార్టీలకు ఆట వస్తువులుగా మారాయి. గతంలో ఎన్నికలకు ముందు పోడు భూములకు పట్టాలు అని ఇష్టమొచ్చినట్టు చేశారు. పోడు భూముల పేరుతో ఆందోళన చేస్తే హీరోలు అనుకుంటున్నారు. విచక్షణా రహితంగా అడవులను నరికేయడం సరికాదు. పర్యావరణ పరిరక్షణపై ప్రపంచవ్యాప్తంగా చర్చలు జరుగుతున్నాయి. అడవులను రక్షించాల్సిన బాధ్యత మనమీద ఉంది. గిరిజనుల హక్కులను కాపాడాల్సిందే.. మరి రాష్ట్రంలో అటవీ సంపద ఉండాలా వద్దా? ఆలోచించాలి. అంతటా అడవులు కనుమరుగవుతున్నాయి. ఒకప్పుడు నర్సాపూర్ అడవుల్లో సినిమా షూటింగులు జరిగేవారు. ఇప్పుడు ఎడారి అయింది. అడవులను పునరుద్ధరించుకునేందుకు వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నాం. ఇప్పటికి రాష్ట్రంలో 7.8 శాతం గ్రీనరీ పెరిగిందని ప్రశంసలు వస్తున్నాయి. బ్రెజిల్, చైనా తర్వాత తెలంగాణలోనే గ్రామాల్లో ప్రజా ప్రతినిధులకు టార్గెట్లు పెట్టి నిర్బంధంగా మొక్కలు నాటించి గ్రీనరీని పెంచే ప్రయత్నం చేస్తున్నాం.

భూముల కోసం పెళ్లిళ్లు..

ఇకపై పోడు, అటవీ దురాక్రమణ ఉండొద్దు. అడవులు అంతరించిపోవడం సమాజానికి ప్రమాదకరం. అడవుల సంరక్షణ జరగాలి. పోడు భూముల విషయంలో గిరిజనుల పేరిట అగ్రవర్ణాల వాళ్లు అటవీ భూములు పొందుతున్నారు. గిరిజన ఆడపిల్లలను పెళ్లి చేసుకొని ఎకరాల కొద్దీ భూములను ఆక్రమించుకుంటున్నారు. అటవీ సంపదను దోపిడీ చేస్తున్నారు. ఖమ్మం జిల్లాలో పలువురు ఉన్నత కులాలవారు అటవీ భూములను కబ్జాచేశారు. 10, 20 ఎకరాల పోడు భూములు ఎవరికైనా ఉంటాయా? గిరిజనుల హక్కులను కాపాడాల్సిందే. అలాగే అటవీ హక్కులను కూడా కాపాడాలి. గతంలో మా ఎమ్మెల్యే కోనేరు కోనప్ప సోదరుడు పోడు భూముల విషయంలో జోక్యం చేసుకుంటే కేసులు పెట్టారు. ఎవరినీ ఉపేక్షించేది లేదు. పోడు భూములకు సంబంధించి ఆర్‌ఓఎఫ్ఆర్ కింద ఇచ్చినవి ఎన్నో లెక్కచూసుకొని ఇస్తాం. గతంలో ఆర్‌ఓఎఫ్ఆర్ పట్టాలు ఇచ్చిన వారికి రైతుబంధు కూడా ఇస్తున్నాం. కొన్ని అటవీ గ్రామాల్లో గిరిజనుల విజ్ఞప్తి మేరకు రూ. 400 కోట్లు వెచ్చించి మూడో ఫేజ్ విద్యుత్ సౌకర్యం కల్పించాం. అయితే అటవీ అధికారుల వ్యవహార్శైలి కూడా మారాల్సిన అవసరం ఉంది. శవ దహనానికి కట్టెలు తీసుకొచ్చినా కొందరు అతి చేస్తున్నారు. దీనిపై అటవీశాఖ మంత్రి, అధికారులతో మీటింగ్ ఏర్పాటు చేసి క్లారిటీ ఇస్తాం.

సాయుధ దళాలతో పహారా

గిరిజనులపై పోలీసులు, అటవీ అధికారులు దాడి చేయవద్దు. అధికారులపైనా గిరిజనుల దాడులను సహించబోం. మన రాష్ట్రం కాని గొత్తికోయల దౌర్జన్యం మంచిది కాదు. అడవిని నరికేసి భూములు ఇవ్వామని అడగడం ఏంటి? అడవుల నరికివేతకు ఎక్కడో చోట ఫుల్‌స్టాప్ పడాలి. అడవులకు సరిహద్దులు పెట్టి సాయుధ దళాలతో పహారా ఏర్పాటుచేస్తాం''అని కేసీఆర్ స్పష్టం చేశారు.

గిరిజనులపై అక్రమ కేసులు ఎత్తివేయాలి: పొదెం వీరయ్య

ప్రశ్నోత్తరాల సమయంలో పోడుభూముల సమస్యపై కాంగ్రెస్ సభ్యుడు పొదెం వీరయ్య మాట్లాడారు. మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం కోయపోచగూడలో 12 మంది గిరిజనులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని కోరారు. పోడు భూముల మీద ఆధారపడి ఈ తండాలో 39 కుటుంబాలు జీవనం సాగిస్తుంటే.. అటవీ చట్టాల కింద కేసులు పెట్టి 12 మందిని ఆదిలాబాద్ జైలుకు పంపారని వివరించారు. అనంతరం ములుగు ఎమ్మెల్యే సీతక్క మాట్లాడుతూ.. కోయపోచగూడలో అటవీ అధికారులు దుశ్శాసన పర్వం చూపించారని ఆందోళన వ్యక్తం చేశారు. చేపలుపట్టుకోవడానికి, పొయ్యిలకు కట్టెలు తెచ్చుకోవడానికి అడవిలోకి వెళ్లినా.. కొట్టి హింసించి, అటవీ చట్టాల కింద గిరిజనులపై కేసులు పెడుతున్నారని ఆరోపించారు. పోడుసాగులో ఉన్నవారిని కూడా దున్నుకోనివ్వడం లేదన్నారు. దీనిపై మంత్రి సత్యవతి సమాధానమిస్తూ.. కోయపోచగూడలో 12 మందిపై పెట్టిన కేసులను ఎత్తివేసేలా చర్యలు చేపడతామన్నారు.

12 పద్దులకు సభ ఆమోదం

సాక్షి, హైదరాబాద్: శాసనసభ శుక్రవారం 12 పద్దులకు ఆమోదం తెలిపింది. సంబంధిత పద్దులపై సభ్యులు వివిధ అంశాలను లేవనెత్తారు. విపక్షాల నుంచి పలు సూచనలు, సలహాలు వచ్చాయి. వాటికి మంత్రులు కె.తారక రామారావు, మల్లారెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, జగదీశ్‌రెడ్డి సమాధానం చెప్పారు. పద్దులపై లేవనెత్తిన సందేహాలు నివృత్తి చేసినందున కట్ మోషన్ కింద ఇచ్చిన నోటీసులను ఉపసంహరించుకోవాలని మంత్రులు విపక్షాలను కోరారు. మంత్రుల సమాధానం అనంతరం పద్దులను ఆమోదించినట్లు స్పీకర్ పోచారం ప్రకటించారు. ఆసిఫాబాద్ మున్సిపాలిటీ ఏర్పాటుకు అనుగుణంగా రూపొందించిన పురపాలక చట్ట సవరణ బిల్లును సభలో మంత్రి కేటీఆర్ ప్రవేశపెట్టారు. అనంతరం సభ శనివారానికి వాయిదా వేస్తున్నట్లు పోచారం ప్రకటించారు.

కళాశాలల్లో ఖాళీలు భర్తీ చేస్తాం: సబిత



సాక్షి, హైదరాబాద్: కాలేజీల్లో టీచింగ్, నాన్‌టీచింగ్ పోస్టుల ఖాళీల భర్తీకి ప్రభుత్వం కట్టుబడి ఉందని విద్యాశాఖ మంత్రి సబిత ఇంద్రారెడ్డి శుక్రవారం అసెంబ్లీకి తెలిపారు. విద్యారంగం పద్దుపై చర్చలో సభ్యుల ప్రశ్నలకు ఆమె బదులిచ్చారు. మార్కెట్లో డిమాండ్ ఉన్న ఆరు కొత్త కోర్సులను ప్రవేశపెట్టామని చెప్పారు. సిలబస్ మార్పులకు పలు సంస్థలతో ఎంవోయులు చేసుకున్నామని వివరించారు. ఆంగ్ల మాధ్యమంలో బోధనకు అనువుగా 80 వేల మంది టీచర్లకు ప్రత్యేక శిక్షణ ఇచ్చామని తెలిపారు.

పాతబస్తీలో బీఆర్‌టీఎస్ తీసుకురండి

- కొత్త, పాత నగరాల మధ్య ఎలాంటి తేడా లేకుండా అభివృద్ధి చేపట్టండి
- ఎంఐఎం శాసనసభాపక్షనేత అక్బరుద్దీన్ ఒవైసీ



సాక్షి, హైదరాబాద్: పాతబస్తీలో బస్ ర్యాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్(బీఆర్‌టీఎస్)ను అందుబాటులోకి తేవాలని ప్రభుత్వానికి ఎంఐఎం శాసనసభాపక్షనేత అక్బరుద్దీన్ ఒవైసీ విజ్ఞప్తి చేశారు. కొత్త, పాత నగరాల మధ్య సౌకర్యాలపరంగా అంతరాలు, తేడా లేకుండా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం పెద్దనోట్ల రద్దు, జీఎస్టీ వంటి నిర్ణయాలు, అధికధరలతో ప్రజల జీవితం దుర్భరంగా మారినందున అడిషనల్ కన్జ్యూమర్ చార్జీల (ఏసీడీ)పై ఆలోచించి ఈ భారం వేయకుండా చూడాలన్నారు. శుక్రవారం అసెంబ్లీలో మున్సిపల్, విద్యుత్, విద్యా, అటవీ పద్దులపై అక్బరుద్దీన్ మాట్లాడుతూ రాష్ట్రంలో విశ్వవిద్యాలయాలు మొదలు స్కూళ్ల దాకా ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్‌టీచింగ్ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాజ్‌భవన్‌లో పెండింగ్‌లో ఉన్న రాష్ట్ర విశ్వవిద్యాలయ ఉమ్మడి నియామక బోర్డు బిల్లుకు ఆమోదం తెలపాలని, ఈ అసెంబ్లీ ద్వారా గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌కు విజ్ఞప్తి చేస్తున్నామని అన్నారు. పాతబస్తీలో పేదల నోటరైజ్డ్ డాక్యుమెంట్లను రిజిష్టర్డ్ డాక్యుమెంట్లుగా మార్చే సౌలభ్యాన్ని కల్పించాలని అక్బరుద్దీన్ కోరారు. మొజంజాహి మార్కెట్ మాదిరిగానే చౌకీ మార్కెట్, మిరాలం మండీలను కూడా తీర్చిదిద్దాలని సూచించారు. జంగమ్మెట్‌లోని పూర్తయిన డబుల్ బెడ్రూం ఇళ్లను లబ్ధిదారులకు అందజేయాలని, ఫలక్‌నుమా, బండ్లగూడాల్లోనూ త్వరితంగా పూర్తిచేయాలని ఆయన కోరారు.

పాతబస్తీలో విద్యుత్ చోరీ అంటూ దుష్ప్రచారం

పాతబస్తీలో కరెంట్ బిల్లులు కట్టడం లేదంటూ, విద్యుత్ చోరీ జరుగుతోందంటూ బద్‌నామ్ చేస్తున్నారని అక్బరుద్దీన్ మండిపడ్డారు. అలా జరిగినట్టు నిరూపిస్తే చార్జీలు కట్టించేందుకు తాను సిద్ధమని సవాల్ విసిరారు.

క్లుప్తంగా...

నాకొద్దీ డొక్కు వాహనం

- ప్రగతి భవన్ ఎదుట ఎమ్మెల్యే రాజాసింగ్ హల్‌చల్



పంజగుట్ట (హైదరాబాద్): తనకు డొక్కు బుల్లెట్‌ ప్రూఫ్‌ వాహనాన్ని కేటాయించారంటూ గోషామహల్‌ బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్‌ శుక్రవారం ప్రగతిభవన్‌ ముందు హల్‌చల్‌ చేశారు. ప్రభుత్వం ఇచ్చిన బుల్లెట్‌ప్రూఫ్‌ కారును తిరిగి ముఖ్యమంత్రి కేసీఆర్‌కు అప్పగిస్తానని ప్రగతిభవన్‌ గేటు వద్దకు వచ్చి వాహనాన్ని ఆపారు. వెంటనే స్పందించిన పోలీసులు రాజాసింగ్‌ లోపలకు వెళ్లేందుకు అనుమతి లేదంటూ నిరాకరించారు. దీంతో పోలీసులు, రాజాసింగ్‌ మధ్య వాగ్వాదం జరిగింది. లోపలికి వెళ్లేందుకు అనుమతివ్వకపోతే తనకు కేటాయించిన వాహనాన్ని ఇక్కడే వదిలి వెళ్లిపోతానని రాజాసింగ్‌ పట్టుబట్టారు. దీంతో పంజగుట్ట ఇన్‌స్పెక్టర్‌ హరిశ్చంద్రా రెడ్డి ఆయనను సముదాయించి కారు ఎక్కించి అసెంబ్లీ వద్ద దింపారు. ఈ సందర్భంగా రాజాసింగ్‌ మాట్లాడుతూ.. తనకు డొక్కు బుల్లెట్‌ప్రూఫ్‌ వాహనం ఇవ్వడంతో ఇప్పటికే ఎన్నోసార్లు నడిరోడ్డుపై ఆగిపోయిందని చెప్పారు. తాజాగా వాహనం నడుస్తుండగానే ఒక టైర్‌ ఊడిపోయిందని, ఆ సమయంలో వాహనం మెల్లగా వెళ్తుండటంతో ప్రమాదం తప్పిందని.. లేనట్టయితే తన పరిస్థితేమిటని ప్రశ్నించారు.

జాతీయ పార్టీల రాష్ట్ర అధ్యక్షులు దిగజారి మాట్లాడుతున్నారు



సాక్షి, హైదరాబాద్ : టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌ రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌ కుమార్‌ దిగజారిపోయి మాట్లాడుతున్నారని, దీనిపై ఆ పార్టీల అధిష్టానం సమాధానం చెప్పాలని వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి డిమాండ్‌ చేశారు. అసెంబ్లీ మీడియా పాయింట్‌లో శుక్రవారం ఎమ్మెల్యేలు గువ్వల బాలరాజు, నన్నపనేని నరేందర్‌, పద్మా దేవేందర్‌రెడ్డి, జే.సురేందర్‌లతో కలిసి నిరంజన్‌రెడ్డి మాట్లాడారు. జాతీయ పార్టీలకు నాయకత్వం వహిస్తున్న నేతలిద్దరూ అనాగరికంగా మాట్లాడుతున్నారని, వారికి గతం, వర్తమానం, భవిష్యత్తు మీద అవగాహన లేదని ధ్వజమెత్తారు.

ఒకరు కూల్చమంటే.. మరొకరు పేల్చమంటారా?

సాక్షి, హైదరాబాద్‌: ప్రగతిభవన్‌ను డైనమైట్లతో పేల్చివేయాలని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, నూతన సచివాలయ గుమటాలను కూల్చాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌లు చేసిన వ్యాఖ్యలపై పీయూసీ చైర్మన్‌, ఆర్మూర్‌ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. పేల్చివేతలు, కూల్చివేతలేనా? మీ సిద్ధాంతమని నిలదీశారు. అసెంబ్లీ మీడియా పాయింట్‌ వద్ద శుక్రవారం ఆయన మాట్లాడుతూ రేవంత్‌, సంజయ్‌లది ఉగ్రవాద ఉన్మాద భాష అని, ఇద్దరూ అభివృద్ధి నిరోధకులే అని ధ్వజమెత్తారు.

తీవ్రవాద విధానాలకు కాంగ్రెస్‌ వ్యతిరేకం

నా జీవితం ముత్యాలముగ్గు హీరోయిన్‌ పాత్ర లాంటిదే: జగ్గారెడ్డి



సాక్షి, హైదరాబాద్‌: తీవ్రవాద విధానాలకు కాంగ్రెస్‌ పార్టీ వ్యతిరేకమని ఆపార్టీ సంగారెడ్డి ఎమ్మెల్యే టి. జగ్గారెడ్డి వ్యాఖ్యానించారు. దేశ ప్రజల భద్రత కోణంలో తీవ్రవాదానికి వ్యతిరేకంగా కాంగ్రెస్‌ పార్టీ తీసుకున్న నిర్ణయాల కారణంగానే ఇందిరా, రాజీవ్‌గాంధీలు బలయ్యారని అన్నారు. శుక్రవారం ఆయన సీఎల్పీ కార్యాలయంలో మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ రాజకీయ నాయకులు, నక్సలైట్లు ప్రజల మంచి కోసమే పోరాడుతున్నారని, రాజకీయ నాయకులు చట్ట పరిధిలో పని చేస్తుండగా, నక్సలైట్లు చట్ట పరిధి దాటి పని చేసిన కారణంగా సమాజానికి దూరంగా ఉంటున్నారని పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డి పాదయాత్రలపై స్పందిస్తూ పాదయాత్ర ఎవరైనా చేయవచ్చని, అసెంబ్లీ సమావేశాలు ముగిసిన తర్వాత కాంగ్రెస్‌ ఎమ్మెల్యేలు కూడా ఎవరి నియోజకవర్గాల్లో వారు పాదయాత్రలు చేస్తారని చెప్పారు. ఇతర నియోజకవర్గాలకు చెందిన నేతలను తనను ఆహ్వానిస్తే ఆయా నియోజకవర్గాల్లో పాదయాత్ర చేసేందుకు సిద్ధమని చెప్పారు. రేవంత్‌రెడ్డి పిలిస్తే పాదయాత్రకు వెళ్తారా అని ప్రశ్నించగా.. నో కామెంట్‌ అని చెప్పిన జగ్గారెడ్డి తన జీవితం ముత్యాలముగ్గు సినిమాలోని హీరోయిన్‌ పాత్ర లాంటిదేనని పునరుద్ఘాటించారు.

85వ కాంగ్రెస్‌ ప్లీనరీ సబ్జెక్ట్స్‌ కమిటీ ఏర్పాటు

సాక్షి, న్యూఢిల్లీ: ఏఐసీసీ 85వ ప్లీనరీ సబ్జెక్ట్స్‌ కమిటీలో తెలంగాణ నుంచి నలుగురికి కాంగ్రెస్‌ అధిష్టానం అవకాశం ఇచ్చింది. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌ రెడ్డి, సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క, ఎమ్మెల్సీ జీవన్‌ రెడ్డి, ఐఎన్టీయూసీ అధ్యక్షుడు జి.సంజీవ రెడ్డిలకు సబ్జెక్ట్స్‌ కమిటీలో చోటు కల్పిస్తూ ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కమిటీలో కాంగ్రెస్‌ అధ్యక్షుడు ఖర్గే సహా 122 మంది సభ్యులున్నారు.



అనాథ శవాల ఆత్మఘోష!

పుర్రె, ఎముకల విక్రయం!

అంత్యక్రియలకు ముందు అప్పుడప్పుడూ అనాథ మృతదేహాల నుంచి పుర్రెతోపాటు కొన్ని శరీర భాగాలకు చెందిన ఎముకలను వేరు చేసి తాంత్రిక, భూత వైద్యులుగా చెలామణి అయ్యే వారికి అమ్ముకుంటున్నారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. పుర్రెను రూ. 10 వేల నుంచి రూ. 20 వేలకు, చేతి, తొడ ఎముకలు, వెన్నెముక, జాయింట్‌గా ఉన్న ఐదు చేతివేళ్ల ఎముకలను రూ. 2 వేల నుంచి రూ.20 వేల వరకు విక్రయిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

గాంధీ, ఉస్మానియా మార్చురీల్లో అంతులేని వ్యథ

- కుళ్లిపోయి, దుర్వాసనతో రోజుల తరబడి పఫ్‌రూమ్‌ల్లోనే..
- 20 చొప్పున మృతదేహాలు ఒకేసారి శ్మశానవాటికకు తరలింపు
- దహన కార్యక్రమాల్లో కాంట్రాక్టు సంస్థ చేతివాటం
- నిబంధనలు పాటించని జీహెచ్‌ఎంసీ
- రెండు ఆస్పత్రులనూ వేధిస్తున్న సిబ్బంది కొరత, సౌకర్యాల లేమి

అవి రాష్ట్రంలోనే పేరొందిన రెండు ప్రభుత్వ పెద్దాస్పత్రులు... పేద రోగులకు కార్పొరేట్‌ స్థాయి వైద్య సేవలను ఉచితంగా అందిస్తూ వారికి అండగా నిలుస్తున్న గాంధీ, ఉస్మానియా ఆస్పత్రులు. కానీ ఇదంతా నాణేనికి ఒకవైపు మాత్రమే. మరోవైపు ఈ రెండు ఆస్పత్రుల్లోని మార్చురీలు (శవాగారాలు), వాటి దయనీయ పరిస్థితిని చూస్తే ఎవరికైనా కళ్లు చెమరుస్తాయి.. గుండెలు బరువెక్కుతాయి. ఎంతో మంది అనాథలు, అభాగ్యుల మృతదేహాలు ఆనవాళ్లు లేక మార్చురీల్లో కుళ్లిపోయి దుర్వాసనలు వెదజల్లుతూ శవాల దిబ్బగా మారుతున్నాయి. సరైన సమయంలో దహన సంస్కారాలకు నోచుకోక వాటి ఆత్మలు ఘోషిస్తున్నాయి.. ఈ హృదయ విదారక దుస్థితిపై 'సాక్షి'ప్రత్యేక కథనం.

తరలింపులో కొన్నిసార్లు జాప్యం



అనాథ శవాల తరలింపులో కొన్నిసార్లు జాప్యం జరుగుతున్న మాట వాస్తవమే. మేం ప్రతిరోజూ జీహెచ్‌ఎంసీకి అనాథ శవాల వివరాలను లిఖితపూర్వకంగా అందిస్తున్నాం. గాంధీలో 60 మృతదేహాలను భద్రపరిచేందుకు అవసరమైన ఫ్రీజరు బాక్సులు, పఫ్‌రూంతోపాటు అన్ని వసతులు ఉన్నాయి.

– ప్రొఫెసర్‌ రాజారావు, గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్‌

సాక్షి, సిటీ డెస్క్‌: భాగ్యనగరంలోని గాంధీ, ఉస్మానియా మార్చురీల్లో నిత్యం సుమారు 50 మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహిస్తుంటారు. వాటిలో దాదాపు 10–15 వరకు అనాథ శవాలే. తాజా మృతదేహాలను మార్చురీలోని ఫ్రీజరు బాక్స్‌ల్లో భద్రపరుస్తున్న సిబ్బంది... గుర్తుతెలియని, అనాథ మృతదేహాలను పఫ్‌రూం (మూకుమ్మడిగా మృతదేహాలను భద్రపరిచే గది)కు తరలిస్తున్నారు. అయితే జీహెచ్‌ఎంసీ నిర్లక్ష్యం, పోలీసులు, ఫోరెన్సిక్‌ వైద్యుల మధ్య సమన్వయ లోపం కారణంగా మృతదేహాలను అక్కడ రోజుల తరబడి ఉంచాల్సి వస్తుండటంతో అవి కుళ్లిపోయి దుర్వాసన వెదజల్లుతున్నాయి. సిబ్బంది సైతం లోపలకు వెళ్లలేని దుస్థితి నెలకొంటోంది.


గాంధీ మార్చురీ

నిబంధనలకు పాతర!

పోస్టుమార్టం జరిగిన 72 గంటల తర్వాత అనాథ శవాలను జీహెచ్‌ఎంసీ విభాగం శ్మశానవాటికకు తరలించాలనే నిబంధనలు ఉన్నా అవి అమలుకు నోచుకోవడం లేదు. జీహెచ్‌ఎంసీ ఓ కాంట్రాక్టు సంస్థను ఎంపిక చేసి ఒక్కో మృతదేహం తరలింపు, అంత్యక్రియల నిర్వహణకు కొంత మొత్తం చెల్లిస్తుండగా ఆ సంస్థ మాత్రం వివిధ సాకులు చెబుతూ మృతదేహాల తరలింపులో తీవ్ర జాప్యం చేస్తోంది. రవాణా ఖర్చులు మిగుల్చుకొనేందుకు దాదాపు 10 రోజులకోసారి దాదాపు 20 చొప్పున మృతదేహాల తరలింపు ప్రక్రియ చేపడుతోంది. ప్రస్తుతం ఒక్కో మృతదేహం తరలింపు, అంత్యక్రియలకు కాంట్రాక్టు సంస్థకు జీహెచ్‌ఎంసీ రూ. 2,000–2,500 మధ్య ఇస్తున్నట్లు సమాచారం. గతంలో గాంధీ, ఉస్మానియాలకు చెందిన అనాథ శవాల అంత్యక్రియలు నిర్వహించిన ఓ స్వచ్ఛంద సంస్థపై ఆరోపణలు రావడంతో దానిని తప్పించి జీహెచ్‌ఎంసీయే రంగంలోకి దిగినా అదే తీరు నెలకొనడం గమనార్హం.

కాలేజీలకు కొన్ని అనాథ శవాలు?

మార్చురీ నుంచి కొన్ని అనాథ శవాలను కొందరు ప్రైవేటు మెడికల్‌ కాలేజీలకు అమ్ముకుంటున్నట్లు ఆరోపణలు సైతం వెల్లువెత్తుతున్నాయి. ఇండియన్‌ మెడికల్‌ అసోసియేషన్‌ (ఐఎంసీ) నిబంధనల ప్రకారం మెడికల్‌ కాలేజీల్లో వైద్య విద్యార్థులకు మానవ అనాటమీ, డిసెక్షన్‌పై అవగాహన కల్పించాలి. ఇందుకోసం మృతదేహాలు కావాలి. అయితే రోడ్డు ప్రమాదాల్లో తీవ్ర గాయాలపాలై మృతిచెందే వ్యక్తుల మృతదేహాలు డిసెక్షన్‌కు పనికిరానందున రోడ్లు, ఫుట్‌పాత్‌లపై నివసిస్తూ సాధారణ రుగ్మతలతో మరణించే అనాథల మృతదేహాలను పోస్టుమార్టం అనంతరం కొందరు ప్రైవేటు మెడికల్‌ కాలేజీలకు అమ్ముకొని సొమ్ముచేసుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

వెంటాడుతున్న సిబ్బంది కొరత..

గాంధీ, ఉస్మానియా ఆస్పత్రులను సిబ్బంది కొరత వెంటాడుతోంది. గాంధీ మార్చురీలో ప్రస్తుతం ఏడుగురు వైద్యులు, ఆరుగురు సిబ్బంది ఉన్నారు. మరో ముగ్గురు వైద్యులు, ఆరుగురు సిబ్బందితో ఇంకో యూనిట్‌ ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన కొన్నేళ్లుగా కార్యరూపం దాల్చడంలేదు. మరోవైపు ఉస్మానియాలో వైద్యుల కొరత అంతగా లేకున్నా ఏడుగురు కిందిస్థాయి సిబ్బందితో నెట్టుకొస్తున్నారు.

సమన్వయంతో అంత్యక్రియలు



గుర్తుతెలియని వ్యక్తుల మృతదేహాలను పఫ్‌ రూంలోకి తరలించాక 5–6 మృతదేహాలను ఒకసారి చొప్పున జీహెచ్‌ఎంసీ సిబ్బంది తీసుకెళ్తున్నారు. వారితో సమన్వయం చేసుకుంటూ అంత్యక్రియలు నిర్వహిస్తున్నాం.

– డాక్టర్‌ బి. నాగేందర్‌, ఉస్మానియా ఆస్పత్రి సూపరింటెండెంట్‌

చనిపోయిన వ్యక్తి అనాథ కాకూడదు



గుర్తుతెలియని వ్యక్తిని అనాథ శవంలా కాకుండా వారి కుటుంబ సభ్యులకు చేరవేయాలనే మా ఉద్దేశానికి వ్యతిరేకంగా ఈ తంతు నడుస్తోంది. ప్రభుత్వంతో 8 ప్రామాణికాలకు అనుగుణంగా చేసుకున్న ఒప్పందం ప్రకారమే మేం నడుచుకున్నా మమ్మల్ని కాదని జీహెచ్‌ఎంసీకి అప్పగించింది.

– డా. రాజేశ్వర్‌రావు, సత్యహరిశ్చంద్ర ఫౌండేషన్‌, ప్రధాన కార్యదర్శి

జాప్యం లేదు..

అనాథ శవాల తరలింపులో జాప్యం జరగట్లేదు. సమాచారం అందిన వెంటనే మార్చురీ నుంచి ప్రత్యేక వాహనంలో మృతదేహాలను శ్మశానవాటికకు తరలించి అంతిమ సంస్కారాలు నిర్వహిస్తున్నాం.

– ముకుందరెడ్డి, జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్‌, బేగంపేట సర్కిల్‌



గత ఐదేళ్లలో ఉస్మానియాలో జరిగిన పోస్టుమార్టం వివరాలు: పోస్టుమార్టం జరిగినవి	గుర్తుతెలియని శవాల సంఖ్య	సంవత్సరం	గత ఐదేళ్లలో గాంధీలో జరిగిన పోస్టుమార్టం వివరాలు: పోస్టుమార్టం జరిగినవి	గుర్తుతెలియని శవాల సంఖ్య
3,762	520	2018	5,659	872
4,369	616	2019	6,300	905
4,477	736	2020	4,499	639
4,634	810	2021	4,673	985
4,807	786	2022	5,558	1,092

సచివాలయం గుమ్మటాలను కూల్చేస్తాం

స్ట్రీట్‌ కార్నర్‌ మీటింగ్‌లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌ మండిపాటు

ఓల్డ్‌ బోయిన్‌పల్లి (హైదరాబాద్‌): ఒవైసీ కళ్లలో ఆనందం కోసమే సచివాలయాన్ని తాజ్‌మహల్‌ లాంటి సమాధిలా మార్చారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌ మండిపడ్డారు. బీజేపీ అధికారంలోకి వస్తే నూతన సచివాలయ గుమ్మటాలను కూల్చివేసి తెలంగాణలో నిజాం వారసత్వ సంస్కృతిని ధ్వంసం చేస్తామని దుయ్యబట్టారు. 'ప్రజాగోస–బీజేపీ భరోసా' కార్యక్రమంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న స్ట్రీట్‌ కార్నర్‌ సమావేశంలో బండి సంజయ్‌ పాల్గొన్నారు. ఓల్డ్‌బోయిన్‌పల్లి చౌరస్తాలోని 77, 78, 79 బూత్‌ పరిధిలో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతూ.. కేసీఆర్‌ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టారు. తాము అధికారంలోకి వస్తే భారతీయ, తెలంగాణ సంస్కృతి ఉట్టిపడేలా సచివాలయంలో మార్పులు చేస్తామని తెలిపారు. రోడ్డుకు అడ్డంగా ఉన్న మసీదులను, మందిరాలను కూల్చుతామన్నా కేటీఆర్‌కు దమ్ముంటే పాతబస్తీలోని రోడ్లకు అడ్డంగా ఉన్న మసీదులను కూల్చి మాట్లాడాలని సవాల్‌ విసిరారు. బీఆర్‌ఎస్‌, ఎంఐఎం ఒక్కటేనని, జీహెచ్‌ఎంసీలో అధికారం పంచుకుంటున్న ఈ పార్టీలు అసెంబ్లీలో నాటకాలాడుతున్నాయని ఎద్దేవాచేశారు. సచివాలయాన్ని రూ.400 కోట్లతో నిర్మిస్తామని చెప్పి, రూ.1,500కోట్లతో తాజ్‌మహల్‌లా కట్టడం దేనికి సంకేతమని ప్రశ్నించారు.

ఉచితంగా విద్య, వైద్యం

రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే పేదలందరికీ ఉచితంగా విద్య, వైద్యం అందిస్తామని బండి సంజయ్‌ హామీ ఇచ్చారు. 'నిలువ నీడలేని వారికి ఇళ్లను కట్టిస్తాం. నష్టపోయిన రైతులకు న్యాయం జరిగేలా ఫసల్‌ బీమా యోజన అమలు చేస్తాం. కేసీఆర్‌ పాలనలో ఆయన కుటుంబం ఒక్కటే బాగుపడి సంపన్నమైంది. పేదవాళ్లు మరింత పేదవాళ్లుగా మారారు' అని చెప్పారు. మన బతుకులు బికారిగా ఉండాలా లేదా గల్లా ఎగురవేసి తెలంగాణవాదిగా సగర్వంగా తలెత్తుకునేలా ఉండాలా అనేది ప్రజలు ఆలోచించాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 119 నియోజకవర్గాల్లో ఈ నెల 25 వరకు శక్తి కేంద్రాల ద్వారా స్ట్రీట్‌ కార్నర్‌ మీటింగ్‌లను ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. కేసీఆర్‌ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలను జాగృతపరిచేందుకు 11 వేల స్ట్రీట్‌ కార్నర్‌ మీటింగ్‌లను నిర్వహిస్తామని బండి వివరించారు. ఈ కార్యక్రమంలో అర్బన్‌ మేడ్చల్‌ జిల్లా బీజేపీ అధ్యక్షుడు హరీశ్‌రెడ్డి, కూకట్‌పల్లి నియోజకవర్గం ఇన్‌చార్జి మాధవరం కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

'పోడు' పట్టాలివ్వకుంటే ఫామ్‌హౌస్‌ను దున్నేస్తారు



- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌ హెచ్చరిక
- పోడు భూములపై కేసీఆర్‌ కొత్త నాటకాలు
- ఆత్మహత్యలు జరుగుతున్నా స్పందించరు
- పాతబస్తీలో ఏటా రూ.వెయ్యి కోట్ల విద్యుత్‌ చౌర్యమంటూ ధ్వజం

సాక్షి, హైదరాబాద్‌: సీఎం కేసీఆర్‌ మానవమృగంలా వ్యవహరిస్తున్నారని బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్‌ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఇంటర్‌ విద్యార్థులు మొదలుకుని రైతులు, నిరుద్యోగులు, ఉద్యోగులు ఆత్మహత్యలు చేసుకుంటున్నా కనీసం స్పందించని నరరూప రాక్షసుడు అని మండిపడ్డారు. కేసీఆర్‌ పాలన మానవత్వానికి చిరునామా అంటూ అసెంబ్లీలో మంత్రి కేటీఆర్‌ చేసిన వ్యాఖ్యలపై ఘాటుగా స్పందించారు. ఎనిమిదేళ్లుగా పోడు భూములకు పట్టాలివ్వకుండా సాగతీత ధోరణి అనుసరించి ఇప్పుడు మళ్లీ అఖిలపక్షం పేరుతో కొత్త డ్రామాలకు తెరదీశారని మండిపడ్డారు. ఈసారి పోడు భూములకు పట్టాలివ్వకుంటే పేదలంతా ఫామ్‌హౌస్‌ను ఆక్రమించుకుని దున్నడం ఖాయమని హెచ్చరించారు. 'అఖిలపక్ష సమావేశం నిర్వహించి భవిష్యత్తులో పోడు సాగు చేయబోమని హామీ ఇస్తేనే పట్టాలిస్తానని కేసీఆర్‌ అసెంబ్లీలో చెప్పడం సిగ్గు చేటు. ఉప ఎన్నికల సమయంలో ఈ మాట ఎందుకు చెప్పలేదు? మళ్లీ అఖిలపక్షం పేరుతో కొత్త డ్రామా చేస్తున్నదెవరు?' అని అన్నారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో సిరిసిల్ల సెస్‌ మాజీ వైస్‌ చైర్మన్‌, శ్రీనివాస చారిటబుల్‌ ట్రస్ట్‌ అధినేత లగిశెట్టి శ్రీనివాస్‌ సహా పలువురు సంజయ్‌ సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు.

కూల్చే సంస్కృతి ఎవరిది?

తాము కడుతుంటే కొందరికి కూల్చే సంస్కృతీ అంటూ కేటీఆర్‌ చేసిన వ్యాఖ్యలను ఒక విలేకరి ప్రస్తావించగా సంజయ్‌ తీవ్రంగా స్పందించారు. 'అసలు సచివాలయాన్ని కూల్చిందెవరు? కూల్చే సంస్కృతి ఎవరిది? మీ తండ్రి సచివాలయానికే పోనప్పుడు కూల్చాల్సిన అవసరం ఏముంది? సచివాలయంలో పోచమ్మ తల్లి ఆలయాన్ని కూల్చిందెవరు? ప్రజలను కలవని ప్రగతి భవన్‌ను ఎందుకు కట్టుకున్నవ్‌? పేదలకు ఉపయోగపడే ఉస్మానియా ఆసుపత్రి శిథిలావస్థలో ఉంది. దానిని కూల్చి కొత్త భవనం ఎందుకు కట్టడం లేదు' అని బదులిచ్చారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలివ్వాలి

పాతబస్తీలో విద్యుత్‌ బకాయిల్లేవంటూ ఎంఐఎం నేతలు, బీ ఆర్‌ఎస్‌ నాయకులు మాట్లాడటం విడ్డూరంగా ఉందని సంజయ్‌ వ్యాఖ్యానించారు. పాతబస్తీలో ఏటా రూ.వెయ్యి కోట్ల విద్యుత్‌చౌర్యం జరుగుతోందని, తనతో వస్తే నిరూపించేందుకు సిద్ధమని సంజయ్‌ సవాల్‌ విసిరారు. జర్నలిస్టుల సంక్షేమంలో తమ ప్రభుత్వం నంబర్‌ వన్‌ అంటూ కేటీఆర్‌ చేసిన వ్యాఖ్యలను ఎద్దేవా చేశారు. రాష్ట్రంలోని 1,100 మంది జర్నలిస్టులకు నిజాంపేట, పేట్‌ బషీరాబాద్‌లో తక్షణమే ఇళ్ల స్థలాలు కేటాయించాలని సుప్రీంకోర్టు తీర్పునిచ్చి 6 నెలలైనా అమలు చేయని దుర్మార్గుడు కేసీఆర్‌ అని మండిపడ్డారు. 'జర్నలిస్టులకు ఇళ్లు ఇచ్చేందుకు బీజేపీ సిద్ధంగా ఉంది. మీకు చేతగాకుంటే మాకు అప్పగించండి. కేసీఆర్‌కు చిత్తశుద్ధి ఉంటే జర్నలిస్టులకు ఇళ్లు ఇవ్వాలని ప్రతిపాదన పంపితే కేంద్రంతో మాట్లాడి వారం రోజుల్లో మంజూరు చేయిస్తా' అని చెప్పారు.

దళితుల అభివృద్ధి బాధ్యత కేంద్రానిదే

సీపీఎం నేత బి.వి.రాఘవులు



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: దళితుల సామాజిక, ఆర్థిక అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని దళిత్‌ సోషన్‌ ముక్తి మంచ్‌ (డీఎస్‌ఎంఎం) జాతీయ నాయకుడు, సీపీఎం నేత బి.వి.రాఘవులు అన్నారు. కుల వ్యవస్థ ఆధారంగా సనాతన ధర్మం ముసుగులో మనుస్మృతి ద్వారా దళితులను అన్ని రంగాల్లో అణచివేతకు గురి చేస్తున్నారని విమర్శించారు. శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కేవీపీఎస్‌ ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బడ్జెట్‌, దళితుల సాధికారిత అనే అంశంపై రౌండ్‌ టేబుల్‌ సమావేశం జరిగింది. రాఘవులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో దళితులకు జనాభా దామాషా ప్రకారం నిధులు కేటాయించకుండా వివక్షకు గురి చేసిందన్నారు. ప్రముఖ సామాజిక విశ్లేషకుడు మల్లెపల్లి లక్ష్మయ్య మాట్లాడుతూ బడ్జెట్‌ ఫలాలు అర్హులకు లభిస్తున్నాయా? అని ప్రశ్నించారు. కేవీపీఎస్‌ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.స్కైలాబ్‌బాబు, డీబీఎఫ్‌ జాతీయ కార్యదర్శి పి.శంకర్‌, పీపుల్స్‌ మానిటరింగ్‌ కమిటీ కన్వీనర్‌ ఎస్‌.శివలింగం, వ్యవసాయ కార్మిక సంఘం ఉపాధ్యక్షుడు బి.ప్రసాద్‌ పాల్గొన్నారు.

రైతులను బర్బాద్‌ చేస్తున్న సర్కారిది

- వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు షర్మిల


రఘునాథపల్లి సబ్‌స్టేషన్‌ ముందు హైవేపై బైఠాయించిన వైఎస్‌ షర్మిల

రఘునాథపల్లి: 'అబ్‌కీ బార్‌ కిసాన్‌ సర్కార్‌ కాదు.. తెలంగాణలో రైతులను బర్బాద్‌ చేస్తున్న సర్కారు మీది'.. అని వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు వైఎస్‌ షర్మిల బీఆర్‌ఎస్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. షర్మిల ప్రజాప్రస్థానం పాదయాత్ర శుక్రవారం జనగామ జిల్లా రఘునాథపల్లికి చేరుకుంది. ఈ సందర్భంగా విద్యుత్‌ సరఫరా లేక పంటలు ఎండిపోతున్నాయని పలువురు రైతులు ఆమె దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఆమె రఘునాథపల్లి సబ్‌స్టేషన్‌ ఎదుట వరంగల్‌– హైదరాబాద్‌ జాతీయ రహదారిపై రాస్తారోకోకు దిగారు. ఈ కార్యక్రమంలో షర్మిల మాట్లాడుతూ వ్యవసాయానికి 24 గంటల విద్యుత్‌ ఇస్తున్నామని కేసీఆర్‌ గోబెల్స్‌ ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. కరెంట్‌ కోతలు లేని పాలన అని అసెంబ్లీ సాక్షిగా అబద్ధాలు చెబుతున్నారని ధ్వజమెత్తారు.

మోదీ పర్యటన మళ్లీ వాయిదా!

- రాష్ట్రానికి గత నెల 19న, ఈ నెల 13న ప్రధాని వస్తారంటూ బీజేపీ నేతల ప్రచారం
- పీఎంవో నుంచి అధికారికంగా ఖరారు కాకముందే
- పోటాపోటీగా రాష్ట్ర పార్టీ నేతల అత్యుత్సాహం



సాక్షి, హైదరాబాద్‌: ప్రధాని నరేంద్ర మోదీ రాష్ట్ర పర్యటన మరోసారి వాయిదా పడింది. ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంవో) నుంచి అధికారికంగా ఖరారు కాకముందే బీజేపీ నేతలు అత్యుత్సాహంతో పోటాపోటీగా ప్రకటించడం.. ఆనక వాయిదా పడటం రివాజుగా మారిందన్న చర్చ పార్టీలో సాగుతోంది. గత నెల 19న సికింద్రాబాద్‌లో వందేభారత్‌ ఎక్స్‌ప్రెస్‌ ప్రారంభోత్సవానికి ప్రధాని వస్తున్నారని, పరేడ్‌గ్రౌండ్స్‌ బహిరంగసభలో రైలు, రోడ్డు ప్రాజెక్టులు, ఇతర అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, జాతికి అంకితం వంటివి చేస్తారని బీజేపీ నేతలు నానా హడావుడి చేశారు. ఈ విషయమై దక్షిణ మధ్య రైల్వే ఉన్నతాధికారులకు పీఎంవో నుంచి సమాచారం లేకపోయినా సికింద్రాబాద్‌ జీఎం కార్యాలయానికి వెళ్లి వారితో పార్టీ నేతలు సమీక్ష నిర్వహించారు. పరేడ్‌ గ్రౌండ్స్‌ సందర్శించి బహిరంగ సభ ఏర్పాట్లను కూడా పర్యవేక్షించేశారు. తీరా ఈ కార్యక్రమం వాయిదా పడడంతో సంక్రాంతి పండుగ సందర్భంగా జనవరి 15న ఢిల్లీ నుంచి వర్చువల్‌గా మోదీ వందేభారత్‌ ఎక్స్‌ప్రెస్‌ను లాంఛనంగా ప్రారంభించారు.

- మళ్లీ ఈనెల ఫిబ్రవరి 13న మోదీ రాష్ట్ర పర్యటనకు వస్తున్నారంటూ అధికారిక కార్యక్రమం ఖరారు కాకుండానే బీజేపీ నేతలు మరోసారి హడావుడి చేశారు. ఈ తేదీ సమీపిస్తున్న నేపథ్యంలో రైల్వే అధికారులు ఇందుకు సంబంధించిన సమాచారమేది ఇంకా అధికారికంగా రాలేదని స్పష్టం చేశారు. చివరకు ఈ కార్యక్రమం కూడా వాయిదా పడినట్టు ఇప్పుడు పార్టీనాయకులు చెబుతున్నారు. ప్రస్తుతం రాష్ట్ర పార్టీ ఆధ్వర్యంలో 10వ తేదీన శుక్రవారం మొదలైన 'ప్రజాగోస–బీజేపీ భరోసా'కార్యక్రమం ఈనెల 25వరకు జరగనుంది. ఆ కార్యక్రమం పేరిట 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 11వేల వీధిచివర సమావేశాలు (స్ట్రీట్‌ కార్నర్‌ మీటింగ్స్‌) నిర్వహిస్తోంది. క్షేత్రస్థాయిలో పార్టీ పటిష్టత, సంస్థాగతంగా ఏ మేరకు బలోపేతమైందన్న దానిని ప్రయోగాత్మకంగా పరిశీలించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లోని 11 వేల శక్తి కేంద్రాల్లో (3,4 పోలింగ్‌బూత్‌లు కలిపి ఓ కేంద్రం) ప్రజాగోస స్ట్రీట్‌కార్నర్‌ సమావేశాలు నిర్వహించాలని రాష్ట్ర పార్టీని ఈ కార్యక్రమ రూపకర్త, బీజేపీ జాతీయ ప్రధానకార్యదర్శి , రాష్ట్రపార్టీ సంస్థాగత ఇన్‌చార్జి సునీల్‌ బన్సల్‌ ఆదేశించారు. ఈ కార్యక్రమానికి ఉన్న ప్రాధాన్యత దృష్ట్యా ప్రధాని మోదీ సహా ఇతర ముఖ్యనేతల అధికారిక పర్యటనలు వాయిదా పడ్డాయని పార్టీ నేతలు చెబుతున్నారు. దీంతో ఈ నెలాఖరులో లేదా వచ్చేనెల మొదట్లో ప్రధాని రాష్ట్ర పర్యటనకు సంబంధించి అధికారికంగా కన్ఫర్మ్‌ అయ్యే అవకాశాలున్నాయని అంటున్నారు.

నియత కర్మలను సన్యసించడం తామసిక త్యాగం.
శరీరానికి కష్టం కలుగుతుందనే భయంతో కర్మని వదిలేస్తే
అది రాజసిక త్యాగం. కర్తవ్య బుద్ధితో చేసేది సాత్విక త్యాగం.
– హైందవ ధర్మం

సాక్షి
శనివారం, ఫిబ్రవరి, 11

'సంపూర్ణ యుద్ధం' వికటిస్తుందా?

ప్రభుత్వాలు ఎంత ప్రయత్నిస్తున్నా బడి ఈడు పిల్లలను పెళ్లి పీటలెక్కించే సామాజిక దురాచారం దేశంలో పెద్దగా తగ్గలేదని తరచు వెలుగులోకొస్తున్న ఉదంతాలు చెబుతున్నాయి. బాల్యవివాహాలపై అస్సాంలోని బీజేపీ ప్రభుత్వం సరిగ్గా వారం క్రితం ప్రకటించిన 'సంపూర్ణ యుద్ధం' ఈ సమస్యను మరోసారి ఎజెండాలోకి తెచ్చింది. అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ దీనిపై ప్రకటన చేసిందే తడవుగా ఆ రాష్ట్రంలో పోలీసులు విరుచుకుపడటం మొదలెట్టారు. ఇంతవరకూ దాదాపు మూడువేలమందిని అరెస్టు చేశారంటున్నారు. వీరిలో పెళ్లిళ్లు జరిపించిన పురోహితులు, కాజీలు కూడా ఉన్నారు. అరెస్టయినవారిలో అత్యధికులపై భారతీయ శిక్షాస్మృతి(ఐపీసీ) కింద వేర్వేరు సెక్షన్లు నమోదు చేయటంతోపాటు పిల్లలపై లైంగిక నేరాలను అరికట్టేందుకు ఉద్దేశించిన పోక్సో చట్టాన్ని కూడా ప్రయోగించారు. వాస్తవానికి దాదాపు పదివేలమందిపై ఎఫ్ఐఆర్‌లు నమోదైనా వారిలో చాలామంది పరారయ్యారు. ఈ పోలీసు చర్యకు ప్రభుత్వం చెబుతున్న కారణాలు గమనించదగ్గవి. 2019–20 మధ్య జరిపిన జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే ప్రకారం అస్సాంలో 20–24 ఏళ్ల మధ్య ఉన్న వివాహితల్లో 31.8 శాతంమంది చట్టవిరుద్ధంగా 18 ఏళ్ల వయసులోపు పెళ్లిళ్లు చేసుకున్నవారే. జాతీయ స్థాయి సగటు 23.3 శాతంతో పోలిస్తే ఇది ఎక్కువే. హిమంత బిశ్వ శర్మ చేసిన ట్వీట్‌లో అస్సాంలోని ఏయే జిల్లాల్లో ఈ బాల్యవివాహాల దురాచారం ఎక్కువుందో, దానివల్ల ఆ ప్రాంతాల్లో చిన్న వయసులోనే గర్భిణులవుతున్నవారి శాతం ఎంతో వివరించారు. టీనేజ్ తల్లుల, గర్భిణుల జాతీయ స్థాయి సగటు 6.8 శాతం ఉంటే, అస్సాంలో అది 11.7 శాతం. ఇది కూడా ఆందోళనకరమైనదే.

ఎడాపెడా సాగుతున్న ఈ అరెస్టుల వల్ల తాత్కాలికంగా అలాంటి పెళ్లిళ్లకు బ్రేక్ పడొచ్చు. కానీ వీటికి దారితీస్తున్న మూలకారణాలను పరిష్కరించనంతవరకూ అవి పూర్తిగా సమసిపోవటం సాధ్యం కాదని పాలకులు గుర్తించటం అవసరం. విద్యాగంధం అంటని మారుమూల పల్లెలు అస్సాంలో కోకొల్లలు. నామమాత్రంగానైనా పాఠశాలలున్నచోట చదువుకునే బాలికల శాతం తక్కువ. ఆడపిల్లలకు చిన్నవయసులో పెళ్లి చేస్తే అది వారికి రక్షణగా ఉంటుందని భావించే కుటుంబాలకు కొదవలేదు. దశాబ్దాల నిర్లక్ష్యం పుణ్యమా అని మన దేశంలో గ్రామీణ మహిళల్లో చదువుకున్నవారి సంఖ్య స్వల్పం. గ్రామీణ అస్సాంలో 74 శాతంమంది మహిళలు పట్టుమని పదేళ్లు కూడా బడి చదువులకు పోలేదంటే ఏమనుకోవాలి? ఆడపిల్లకు చదువు చెప్పిస్తే ఆమెకు ఉజ్వల భవిష్యత్తుంటుందన్న అవగాహన కలుగుతుందా? నిరక్షరాస్యతతోపాటు పేదరికం, ఆర్థిక ఇబ్బందులు, బాలికల రక్షణ, భద్రతలపై ఉండే దిగులు, ఇతర సామాజిక దురాచారాలు బాల్యవివాహాలకు కారణమవుతున్నాయి. ఈ సమస్యల్లో ఏ ఒక్కదాన్నీ పరిష్కరించే ప్రయత్నం చేయకుండా కేవలం పోలీసుల సాయంతో బాల్య వివాహాలను అరికట్టాలనుకోవటం మరిన్ని సమస్యలకు దారితీస్తుంది. ముఖ్యంగా బాలికల విద్యకు ప్రోత్సాహాలనందిస్తే బడికొచ్చే ఆడపిల్లల సంఖ్య పెరుగుతుంది. అలాగే పాఠశాలల్లో మరుగుదొడ్లు మొదలుకొని ఉపాధ్యాయుల నియామకం వరకూ శ్రద్ధ తీసుకుంటే నాణ్యమైన విద్య అందటంతోపాటు ఆడపిల్లలు సురక్షితంగా చదువుకోవటం వీలవుతుందన్న భరోసా కుటుంబాలకు కలుగు తుంది. కానీ నీతి ఆయోగ్ 'హేతుబద్ధీకరణ' సూచనతో నిరుడు సెప్టెంబర్‌లో అస్సాంలో 1,700 స్కూళ్లు మూసివేయటమో, సమీప పాఠశాలలతో విలీనం చేయటమో చేశారు. ఈ స్థితిలో ఆడపిల్లలను ఎక్కడో దూరంలో ఉన్న బడికి పంపటానికి తల్లిదండ్రులు సిద్ధపడతారా? ఇక ఉన్నత పాఠశాలల విషయానికొస్తే అస్సాంలో మారుమూల ప్రాంతాల్లో అవి చాలా తక్కువ. ఎన్నో కిలోమీటర్లు నడిచి వెళ్తే తప్ప చదువుకోవటం సాధ్యంకాదు. ఈ పరిస్థితుల్లో ఆడపిల్లకు ప్రమాదం ఎదురుకావొచ్చన్న భయంతో సహజంగానే కుటుంబాలు ఇక వారి చదువుకు స్వస్తిచెబుతాయి. ఇలా బడి మానేసిన పిల్లలకు ఇక పెళ్లే ప్రత్యామ్నాయంగా మారుతోంది. చిన్న వయసులో పెళ్లిళ్లయి గర్భందాల్చిన కారణంగా ఆడపిల్లలు అనేక వ్యాధుల బారిన పడుతున్నారు. గర్భస్రావాలు తప్పడం లేదు. గర్భం నిలబడినా తక్కువ బరువుతో జన్మించటం, మృత శిశు జననాలు, పుట్టిన శిశువులు కొన్ని వారాలలోపే మరణించటం వంటివి అధికంగా ఉంటున్నాయి. ఇరవైయ్యేళ్ల వయసు తర్వాత పెళ్లయ్యే బాలికలకు జన్మించే శిశువులకంటే, అంతకన్నా తక్కువ వయసు వారికి పుట్టిన శిశువుల్లో మరణాలు 50 శాతం ఎక్కువని యునిసెఫ్ నివేదిక చెబుతోంది.

బాల్యవివాహాలను తక్షణం అరికట్టవలసిన సామాజిక సమస్యగా గుర్తించటం బాగున్నా, అందుకోసం అస్సాం ప్రభుత్వం ఎంచుకున్న మార్గం ఏమాత్రం సమర్థనీయం కాదు. ఇందువల్ల ఆ సమస్య మరింత జటిలమవుతుందే తప్ప తగ్గదు. ఇప్పుడు వేలాదిమంది అరెస్టయిన పర్యవసానంగా మగదిక్కులేక, రోజు గడవటం ఎలాగో, తిండితిప్పలకు ఏంచేయాలో తెలియక మహిళలు అవస్థలు పడుతున్నారు. బాల్యవివాహాలను అరికట్టడానికి ఆల్ అస్సాం మైనారిటీ స్టూడెంట్స్ యూనియన్ వంటివి చాన్నాళ్లుగా కృషి చేస్తున్నాయి. ఈ క్రమంలో దాడులు జరుగుతున్నా వెనక్కి తగ్గటంలేదు. అలాంటి సంస్థలకు చేయూతనందించటం... పేదరిక నిర్మూలనకూ, విద్యారంగం పటిష్టతకూ అవసరమైన పథకాలు అమలు చేయటం ముఖ్యమని అస్సాం ప్రభుత్వం గుర్తించాలి. ఒక సామాజిక సమస్యను నేరపూరితం చేయటం వల్ల జైళ్లు నిండుతాయి తప్ప ఫలితం శూన్యం.

ఐటీ దెబ్బ ఎందుకు తగల్లేదు?

విశ్లేషణ


సుజీర్ రాయ్

అగ్రరాజ్యం అమెరికా సహా పలు దేశాల్లో లేఆఫ్‌ల పర్వం కొనసాగుతోంది. పెద్ద ఐటీ, టెక్ కంపెనీల్లో వేలాదిమందికి అకస్మాత్తుగా ఉద్వాసన పలికారు. అదే భారతీయ కంపెనీల్లో పరిస్థితి భిన్నంగా ఉంది. ఇతరులతో పోలిస్తే మన కంపెనీలు కొంచెం మెరుగ్గా ఉండటం కారణం కావచ్చు. కానీ ఒక్క విషయమైతే స్పష్టం. అమెరికా కంపెనీల మాదిరిగా సోషల్ మీడియా సృష్టించిందనుకున్న కొత్త ప్రపంచాన్ని అందుకునే ప్రయత్నాల్లో పడకుండా... భారతీయ కంపెనీలు చేస్తున్న పనుల్లోనే కొత్త మార్గాలను అన్వేషించాయి. ఒకరు సృజనాత్మక సృష్టి చేసేవారైతే, ఇంకొకరు వాటిని అమలు చేసేవారు. వ్యాపార పరిస్థితుల్లో వేగంగా వచ్చిన మార్పుల ప్రభావం అమలు చేసేవారిపై పెద్దగా పడలేదు.

ఆల్ఫాబెట్ (గూగుల్), అమెజాన్, మెటా (ఫేస్‌బుక్), మైక్రోసాఫ్ట్, ట్విట్టర్, ఆపిల్ వంటి దిగ్గజ కంపెనీలు గడచిన కొన్ని నెలల్లో ఒక్కొక్కటీ పదివేల కంటే ఎక్కువ మంది ఉద్యోగులను తొలగించాయి. ప్రపంచం మొత్తమ్మీద ఈ లేఆఫ్‌లు పెద్ద ప్రకంపనలే సృష్టించాయి. మరోవైపు భారతీయ ఐటీ దిగ్గజాలు మాత్రం కొత్త ఉద్యోగులను తీసుకునే వేగాన్ని తగ్గించడం ద్వారా పరిస్థితిని అదుపు చేసే ప్రయత్నం చేశాయి. ఇదే సమయంలో అమెరికన్ టెక్ కంపెనీల లేఆఫ్‌ల కారణంగా భారతీయ కంపెనీల్లో 'అట్రిషన్' (ఉద్యోగులు బయటికి వెళ్లిపోవడం) కూడా తగ్గింది. కరోనా మొదలైన సమయంలో ఈ అట్రిషన్ ప్రమాదకర స్థాయికి చేరుకున్న విషయం తెలిసిందే.



టీసీఎస్, ఇన్ఫోసిస్, విప్రో, టెక్ మహీంద్రా వంటి భారీ భారతీయ కంపెనీలు ఐటీ సర్వీసుల రంగంలోనే ఎక్కువగా ఉన్నాయి. ఉత్పత్తుల ఆధారిత కంపెనీలూ కొన్ని ఉన్నా వీటిల్లో అత్యధికం ఈమధ్య కాలంలో మొదలైనవనే చెప్పాలి. ఒక రకంగా స్టార్టప్‌ల లాంటివన్నమాట. కరోనా ఉధృతి దిగివస్తున్న క్రమంలో అటు స్టార్టప్‌లు, ఇటు పెద్ద టెక్ కంపెనీలు తీవ్ర సమస్యలు ఎదుర్కొన్నాయి. ఆర్థిక మాంద్యం వచ్చే అవకాశం ఉందన్న వార్తలు పరిస్థితిని మరింత దిగజార్చాయి. ద్రవ్యోల్బణాన్ని అదుపు చేసేందుకు అమెరికా ఫెడరల్ రిజర్వ్ బ్యాంకు వడ్డీ రేట్లు పెంచడం ఈ రెండు వర్గాల వారికి గోరుచుట్టుపై రోకటి పోటు చందమైంది. దీంతో ఖర్చులు తగ్గించుకునేందుకు ఉద్యోగులకు లేఆఫ్‌లు ఇవ్వడం మొదలైంది. వ్యాపారం తగ్గిపోవడం, పెట్టుబడులు వచ్చే అవకాశాలు సన్నగిల్లడంతో లాభాలను కాపాడుకునేందుకు ఈ చర్యలు అనివార్యమయ్యాయి.

మారిన అంచనాలు...

పరిస్థితులు బాగున్న కాలంలో టెక్ కంపెనీల్లో వృద్ధి బాగా నమోదైంది. ఫలితంగా ఆయా కంపెనీలు క్లౌడ్ సర్వీసులు, కృత్రిమ మేధ వంటి రంగాల్లో వేల కోట్ల రూపాయలు పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధమయ్యాయి. ఇప్పుడు అంచనాలు మారిపోవడంతో మళ్లీ గతంలో మాదిరిగా పనులు చేసే ప్రయత్నం జరుగుతోంది. సరుకుల రవాణాకు డ్రోన్ల వాడకం మొదలుకొని, గాలి బుడగల ద్వారా మూల మూలకూ ఇంటర్నెట్ అందించడం వంటి పలు ప్రాజెక్టులు అప్పట్లో గొప్ప ఆవిష్కరణలుగా అనిపించాయి. కానీ ఇప్పుడు అవి పెద్దగా పట్టించుకోని స్థితికి చేరాయి. సిలికాన్ వ్యాలీ కేంద్రబిందువు అని చెప్పుకునే శాన్‌ఫ్రాన్సిస్కో ప్రాంతంలోనే గత ఏడాది 80 వేల ఉద్యోగాలకు కోత పడిందంటే పరిస్థితి ఏమిటన్నది ఇట్టే అర్థమవుతుంది.

పెద్ద కంపెనీల్లో ఆపిల్, అమెజాన్ ఇప్పటికీ వృద్ధిని నమోదు చేస్తున్నాయి. కాకపోతే గతం కంటే తక్కువగా. ఈ కంపెనీలిప్పుడు ఖర్చులు తగ్గించుకునే ప్రయత్నాల్లో ఉన్నాయి. గూగుల్ మాతృసంస్థ ఆల్ఫాబెట్ కూడా ఇదే పనిలో ఉంది. ఫేస్‌బుక్ మాతృసంస్థ మెటా 2023 ఏడాది తన సామర్థ్యం పెంచుకునే సంవత్సరమని ప్రకటించింది. నిర్ణయాలు వేగంగా తీసుకునేందుకు గానూ కంపెనీ నిర్మాణంలోని మధ్య పొరలను తగ్గించే ప్రయత్నం చేస్తోంది.

భారత్‌లో పరిస్థితి ఏమిటి?

భారత్‌లో సిలికాన్ వ్యాలీ కేంద్రంగా బెంగళూరును చెప్పుకోవచ్చు. గత మూడు నెలల్లో అతిపెద్ద ఐటీ కంపెనీలు ఏడింటిలో సుమారు ఐదు వేల మందికి ఉద్వాసన పలికారు. ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్, ఎల్ అండ్ టీ టెక్నాలజీ సర్వీసెస్‌లో 2022 చివరినాటికి మునుపటి కంటే ఎక్కువ మంది ఉద్యోగులు (నియామకాల నుంచి లేఆఫ్‌లు తీసేయగా) ఉండగా... టీసీఎస్, విప్రో, టెక్ మహీంద్రా, ఎల్‌టీఐ మైండ్‌ట్రీల్లో మాత్రం ఉద్యోగుల సంఖ్య తగ్గింది. ఈ ఏడు కంపెనీలు కూడా కొత్త కొత్త ప్రాజెక్టులు సంపాదించుకుంటున్నాయి. కానీ నైపుణ్యానికి చెల్లిస్తున్న మొత్తాలను నియంత్రించుకుంటూ, లాభాలను గరిష్ఠ స్థాయిలో ఉంచే ప్రయత్నం జరుగుతోంది. కరోనా వచ్చిన తొలినాళ్లతో పోలిస్తే ఈ వైఖరి పూర్తిగా భిన్నం. అట్రిషన్ నియంత్రణకు, వ్యాపారాన్ని కాపాడుకునేందుకు అప్పట్లో కొత్త ఉద్యోగుల నియామకాలు ఎడాపెడా జరిగాయి. పోటీ కంపెనీలు ఉద్యోగులను ఎగరేసుకుపోతే కొండంత ఆర్డర్లను సకాలంలో పూర్తి చేయలేమన్న ఆలోచనతో అప్పట్లో అలా జరిగింది.

నైపుణ్యమున్న ఉద్యోగులకు, ఇండస్ట్రీ అవసరాలకు మధ్య అంతరం భవిష్యత్తులోనూ కొనసాగుతుంది. ఈ తేడా ఈ ఏడాది పది శాతం వరకూ ఉంటుందని అంచనా. ఈ ఏడాది రెండో సగంలో ఉద్యోగుల నియామకాలూ పూర్వస్థితికి చేరుకుంటాయని కంపెనీలు ఆశాభావంతో ఉన్నాయి.

తేడాకు కారణాలివీ...

ఉద్యోగుల నియామకాలు, ఉద్వాసనల విషయంలో అమెరికా, భారతీయ కంపెనీల మధ్య కనిపిస్తున్న స్పష్టమైన తేడాకు కారణాలేమిటో చూద్దాం. కరోనా ప్రపంచాన్ని చుట్టేసిన సందర్భంలో కంపెనీలన్నీ డిజిటల్ మార్గం పట్టే ప్రయత్నం మొదలుపెట్టాయి. క్లౌడ్ సర్వీసులకు ప్రాధాన్యమేర్పడింది. అందివచ్చిన కొత్త అవకాశాన్ని పూర్తిగా వినియోగించుకోవాలని ప్రతి కంపెనీ ఆశించింది. కోవిడ్ కారణంగా ఇంటికే పరిమితమైపోయి... అట్టడుగు వర్గాల నుంచి కూడా టెక్నాలజీ కోసం డిమాండ్ ఏర్పడటంతో కంపెనీలు కూడా తమ ప్రణాళికలను మార్చుకోవాల్సి వచ్చింది. టెక్నాలజీ సర్వీసులకు విపరీతమైన డిమాండ్ రావడంతో నియామకాలు జోరందుకున్నాయి. దీని ఫలితంగా అట్రిషన్ సమస్య పుట్టుకురావడం, ఆ క్రమంలోనే ఉద్యోగుల వేతన ఖర్చులు పెరగడం జరిగిపోయింది.

రెండేళ్ల తరువాత కోవిడ్ తగ్గుముఖం పట్టడం మొదలైంది. అభివృద్ధి చెందిన దేశాల్లో ద్రవ్యోల్బణం అదుపు తప్పింది. ఆయా దేశాల కేంద్ర బ్యాంకులు వడ్డీ రేట్లు పెంచేశాయి. దీంతో మాంద్యం వచ్చేస్తుందన్న ఆందోళన మొదలైంది. చేతిలో ఉన్న నగదును కాపాడుకునే ప్రయత్నాల్లో భాగంగా కంపెనీలు టెక్నాలజీ రంగానికి కేటాయించిన నిధులకు కోత పెట్టాయి. ఇదే సమయంలో డిజిటల్ టెక్నాలజీలకు డిమాండ్ కూడా తగ్గిపోవడంతో వీటిని అభివృద్ధి చేసే కంపెనీలు ఉద్యోగులకు ఉద్వాసన పలకాల్సి వచ్చింది.

ఈ మొత్తం పరిస్థితుల్లో ఒక్క విషయమైతే స్పష్టం. భారతీయ సాఫ్ట్‌వేర్ దిగ్గజాలు పాశ్చాత్య కంపెనీల మాదిరిగా పూర్తిగా సృజనాత్మక ఆలోచనలకు బదులు ముందుగానే నిర్ణయించిన పనులు చేయడంలోనే నిమగ్నమయ్యాయి. అమెరికా కంపెనీల మాదిరిగా సోషల్ మీడియా సృష్టించిందనుకున్న కొత్త ప్రపంచాన్ని అందుకునే ప్రయత్నాల్లో పడకుండా, భారతీయ కంపెనీలు చేసే పనుల్లోనే కొత్త కొత్త మార్గాలను అన్వేషించాయి.

ఒక్కమాటలో చెప్పాలంటే– ఒకరు సృజనాత్మక సృష్టి చేసేవారైతే, ఇంకొకరు వాటిని అమలు చేసేవారన్నమాట. వ్యాపార పరిస్థితుల్లో వేగంగా వచ్చిన మార్పుల ప్రభావం అమలు చేసేవారిపై పెద్దగా పడలేదు. ఈ తేడా కారణంగానే భారతీయ కంపెనీల్లో పెద్ద స్థాయిలో లేఆఫ్‌లు లేకుండా పోయాయి. మంచి హోదా, వేతనం కోసం యువత ఇప్పుడు పెద్ద టెక్ కంపెనీ స్టార్టప్‌ల వైపు చూడాలి. ఓ మోస్తరు వేతనంతో స్థిరంగా ఉండాలని అనుకుంటే మాత్రం అమలు చేసేవారి వద్ద పనిచేయడం మేలు. అదన్న మాట అమెరికా, భారత కంపెనీల మధ్య తేడా!

వ్యాసకర్త సీనియర్ ఆర్థిక విశ్లేషకులు
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

లిథియం జమ్ము



జియోగ్రాఫికల్ సర్వే ఆఫ్ ఇండియా ప్రకారం, జమ్ము కశ్మీర్‌లోని రియాసి జిల్లాలో లిథియం వనరులు 5.9 మిలియన్ టన్నులు ఉన్నట్టు అంచనా. ఎలక్ట్రానిక్ వాహనాల బ్యాటరీల తయారీలో లిథియం కీలకం. ఇప్పటివరకూ చైనాలో 5.1 మిలియన్ టన్నులు, అమెరికాలో 7.9 మిలియన్ టన్నుల లిథియం వనరులు ఉన్నాయి. కాబట్టి ఈ అంచనా నిజమైతే ఇది ఈ ప్రాంతానికే కాదు, దేశానికే గేమ్ ఛేంజర్ అవుతుంది.
– అహ్మద్ అలీ ఫయాజ్, ఇండిపెండెంట్ జర్నలిస్ట్

అదే సమస్య



జంతువులను కౌగిలించుకోవడం స్వస్థత ఇస్తుంది. అవి కుక్కలు, పిల్లులు, పందులు, మేకలు, ఆవులు ఏవైనా. ఒక హిందువు చేయమన్నాడు కాబట్టే వాళ్లు ఆవును కౌగిలించుకోవడాన్ని ఎగతాళి చేస్తున్నారు. వాళ్ల సమస్య ఆవు కాదు, హిందువు. (ఈ ప్రకటనను ఉపసంహరించుకున్నారు.)
– అభిజిత్ అయ్యర్ మిత్రా, వ్యాఖ్యాత

రిస్కు తీసుకోవద్దు



ఆవులు 'పశువుల్లా' ప్రవర్తించవచ్చు, ప్రత్యేకించి వాటిని కౌగిలించుకున్నప్పుడు. కాబట్టి వాలెంటైన్స్ డే రోజున ఫస్ట్ ఎయిడ్ కిట్లను అందుబాటులో ఉంచుకోండి.
– రాధికా రమేశన్, జర్నలిస్ట్

అందుకే ఉన్నాయి



ఇదొక ఇన్‌స్టాగ్రామ్ రీల్‌లో విన్నాను. 'ఈజిప్టులోని పిరమిడ్స్ ఇంకా అక్కడే ఎందుకున్నాయి? బ్రిటిష్ మ్యూజియానికి మోసుకెళ్లలేనంత బరువుగా ఉంటాయి కాబట్టి'. నవ్వొచ్చింది. కానీ ఎంత నిజం కదా!
– రిక్కీ కేజ్, సంగీత దర్శకుడు

న్యూనతకు అద్దం



ఆఫ్రికన్లు మాత్రమే మూడు రకాలుగా పెళ్లి చేసుకుంటారు. పాశ్చాత్య పద్ధతి వైట్ వెడ్డింగ్, సంప్రదాయ పెళ్లి, కోర్టు పెళ్లి. నేను ఎక్కడా ఇంత అస్తిత్వ సంక్షోభాన్నీ, సాంస్కృతిక గందరగోళాన్నీ చూడలేదు.
– అడేమోలా, ఆఫ్రికా వ్యాఖ్యాత

బదిలీలు, ప్రమోషన్ల మతలబ్ ఇదే!

ఉన్నత పాఠశాలల్లో 10వ తరగతి పరీక్షలు సమీపిస్తున్న సందడి కనిపిస్తోంది. ప్రాథమిక పాఠశాలల్లో చాలా నిర్బంధంగా ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమంలో ఉపాధ్యాయులు త్రికరణశుద్ధిగా పనిచేస్తున్నారు. మహబూబ్‌నగర్, హైదరాబాద్, రంగారెడ్డి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కాలపరిమితి ముగిసి ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యింది. దీంతో పార్టీల, ఉపాధ్యాయ సంఘాల నుండి పోటీచేస్తున్న అభ్యర్థులు ప్రచారంలో భాగంగా పాఠశాలలు సందర్శిస్తున్నప్పుడు ఉపాధ్యాయుల నుండి శరపరంపరగా వస్తున్న ప్రశ్నలకు నీళ్ళు నమలడం తప్ప ఏ అభ్యర్థి దగ్గరా సరైన సమాధానం లేదు. రాత్రికి రాత్రే ఉపాధ్యాయులను చెట్టుకొకరూ పుట్టకొకరినీ చేసి... కుటుంబాలను చిన్నాభిన్నంగా మార్చిన జీఓ 317 అమలవుతున్నప్పుడు ఇదే ఎమ్మెల్సీలు పత్తా లేకుండా పోయారు. ఉద్యోగ, ఉపాధ్యాయులను ఒకే గాట కట్టి జీఓ 317ను అమలు చేయడం సాధ్యం కాదని గొంతెత్తి మాట్లాడాల్సిన పెద్ద సంఘాలు మాట్లాడలేదు. 1975 పద్ధతిలో జిల్లాలకు కేటాయింపులు చేయకపోవడం వల్ల 40 శాతం పైబడి ఉపాధ్యాయులకు తీవ్ర నష్టం జరగడంతోపాటు కొత్త సమస్యలు తలెత్తి కోర్టులో నలుగుతున్నాయి. ఆ గాయాల నుండి ఉపాధ్యాయులు ఇప్పుడిప్పుడే కోలుకుంటూ, మా గతి ఇంతే అనుకొని పనిలో నిమగ్నమై ఉన్న సమయంలో... పుండు మీద కారం జల్లినట్లు జీఓ 5 ద్వారా బదిలీలు, ప్రమోషన్ల ప్రక్రియను ప్రారంభించారు.

30 ఏళ్ళుగా కోర్టుల్లో నలుగుతున్న సర్వీస్ రూల్స్ సమస్య ఎందుకు తెగదో అర్థం కాదు! తెలంగాణ రాష్ట్రంగా ఏర్పడితే సర్వీస్ రూల్స్ ఏపాటి సమస్య అని నమ్మబలికితే నమ్మాం! కొత్త జిల్లాలు, జోన్లు, మల్టీజోన్లను ఆహ్వానించి కేరింతలు కొడితే ఉపాధ్యాయుల కొంపమునిగింది. ఉమ్మడి సర్వీస్ రూల్స్‌కై రాష్ట్రపతి గెజిట్ నోటిఫికేషన్ ఇస్తే కోర్టులు స్టే ఇచ్చాయి. ఇప్పుడు రాష్ట్రపతి కొత్త ఉత్తర్వుల ప్రకారంగా పోస్టులన్నీ 2015 సెప్టెంబర్ 30న కోర్టు చెప్పినట్లు లోకల్ క్యాడరైజేషన్ అయినప్పటికీ, ఈ విషయాలన్నీ కోర్టుకు నివేదించి ప్రభుత్వ, పంచాయితీ రాజ్ సర్వీస్‌లను ఏకీకృతం చేయడానికి అవకాశం ఉన్నా, రాజ్యాంగంలోని 309 ఆర్టికల్ అందుకు అనుమతిస్తున్నా... విద్యాశాఖాధికారుల అలసత్వం వల్ల ఎక్కడవేసిన గొంగళి అక్కడే ఉంది. ఆ సమస్య ఏమైందో, ఏ స్థితిలో ఉందో చెప్పకుండానే ఎవరి ప్రమోషన్లు వారికే అంటూ షెడ్యూల్ ఇచ్చారు.

ఉపాధ్యాయ, గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికలు తెరమీదికి వచ్చినప్పుడల్లా 'పండితు'ల అప్‌గ్రెడేషన్ సమస్య సంఘాలకు, అధికార గణానికి గుర్తుకొస్తుంది. మళ్లీ ఇప్పుడు అదే కథ! ఎస్‌జీటీలు, పండితుల మధ్య పచ్చిగడ్డి వేస్తే భగ్గుమనే పంచాయితీతో భాషాపండిట్లను బజారున వేసింది ప్రభుత్వం.

గతంలో జిల్లా స్థాయి పోస్టుగా ఉన్న గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులను మల్టీజోన్ స్థాయిగా మార్చి లోకల్ క్యాడరైజేషన్ చేయడం వల్ల ఉమ్మడి జిల్లాలో ప్రమోషన్ వస్తుంది అనుకున్న చాలామందికి ఇప్పుడు ప్రమోషన్ రాదు. ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కీలెరిగి వాత పెట్టడమే ప్రభుత్వానికి ఉపాధ్యాయులు ఇవ్వగల సరైన సమాధానం!!

– డాక్టర్ ఏరుకొండ నరసింహుడు
రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, తెలంగాణ టీచర్స్ యూనియన్
మొబైల్ : 97010 07666

సాక్ష్యాల నమోదులో స్ఫూర్తినిచ్చే తీర్పు!

విశ్లేషణ


డాక్టర్ మంగారి రాజేందర్

ప్రాంతీయ భాషల్లో న్యాయపాలన జరగడానికి ఉన్న అవకాశాలు మెరుగుపడుతున్నట్టు అనిపిస్తోంది. ఇటీవలి కాలంలోని పరిణామాలు ఈ విషయాన్నే చెబుతున్నాయి. తీర్పులను ప్రాంతీయ భాషల్లో వెలు వరించడానికి సుప్రీంకోర్టు కంకణం కట్టుకుంది. ఇందు కోసం కృత్రిమ మేధస్సును వాడటమే కాకుండా... ప్రాంతీయ భాషల్లో పరిజ్ఞానం ఉన్న రిటైర్డ్ న్యాయమూర్తుల సహాయాన్నీ తీసుకుంటామని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ ఇటీవల అన్నారు. ఈ చర్యలను ప్రధాని అభినందించారు.

ఇది ఇలా ఉంటే రిపబ్లిక్ డే సందర్భంగా మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్ కుమార్ మరో ముందడుగు వేశారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తీర్పులను తెలుగులో తీసుకొచ్చే విధంగా ప్రయత్నం చేస్తామని అన్నారు. తెలుగులో తీర్పులు కాదు, జిల్లా కోర్టుల్లో తెలుగులోనే న్యాయపాలన జరగాలని నేను అంటున్నాను. ఈ దిశగా కూడా తెలంగాణ హైకోర్టు ఒక అడుగు ముందుకు వేసినట్టుగా ఆ రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్వల్ భుయాన్ మాటల వల్ల అర్థమవుతుంది.

పెద్దపల్లి ధర్మారం మండలం నంది మేడారంలో ఏర్పాటు చేసిన జూనియర్ సివిల్ జడ్జి కోర్టును గత ఆదివారం ఆయన జస్టిస్ నవీన్ రావు, ఇతర న్యాయమూర్తులతో కలిసి ప్రారంభించి మాట్లాడారు. ఆంగ్లంలో మాట్లాడితేనే న్యాయ పరిజ్ఞానం ఉన్నట్టు కాదనీ, తాను గౌహతిలో జూనియర్ సివిల్ జడ్జీల సెలక్షన్ కమిటీలో ఉన్నప్పుడు న్యాయ పరిజ్ఞానం ఉండి ఆంగ్ల పరిజ్ఞానం లేని అభ్యర్థులను ఎంపిక చేసినట్టు తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అన్నారు. స్థానిక ప్రజలు మాట్లాడే భాషలోనే కోర్టులు తీర్పులు వెలువరిస్తే ప్రజలకు న్యాయవ్యవస్థ మరింత చేరువ అవుతుందని అన్నారు. తెలుగు భాష అమలు కోసం ప్రణాళికా బద్ధంగా చర్యలు తీసుకుంటున్నట్టుగా కూడా ప్రధాన న్యాయమూర్తి అన్నారు.

ఇది ఇలా ఉంటే సుప్రీంకోర్టు 2023 జనవరి 30న ఓ కేసులో భాష గురించిన ప్రస్తావనను తీసుకొచ్చింది. అది ఓ రేప్ కేసు. 'నైమ్ అహ్మద్ వర్సెస్ స్టేట్ (ఎన్.సి.టి. ఆఫ్ ఢిల్లీ) కేసులో జస్టిస్ అజయ్ రస్తోగీ, జస్టిస్ బెలా మాధుర్య త్రివేదీలు తీర్పు చెప్పారు. సెషన్స్ కోర్టులో వాదనలు వినిపించే దశలో బాధితురాలు తన ప్రాంతీయ భాషలో సాక్ష్యం చెప్పినప్పటికీ ఆమె సాక్ష్యాన్ని ఆ భాషలో నమోదు చేయకుండా ఇంగ్లిష్‌లో నమోదు చేసిన విషయాన్ని న్యాయవాదులు సుప్రీం కోర్టు దృష్టికి తీసుకొని వెళ్లారు. ఈ విషయం గురించి కోర్టు తన అభిప్రాయాన్ని చెప్పే ముందు క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌లోని 276, 277 నిబంధనలను ఒకసారి పరిశీలించింది.



సెషన్స్ కోర్టులో సాక్ష్యాల్ని రికార్డు చేసే విషయాన్ని క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌లోని సెక్షన్ 276 చెబుతుంది. ఆ నిబంధనలోని ఉప నిబంధన ప్రకారం – సెషన్స్ కోర్టులో సాక్ష్యాన్ని బహిరంగ కోర్టులో నమోదు చేయాలి. న్యాయమూర్తి స్వయంగా నమోదు చేయవచ్చు. ఆ పని డిక్టేషన్ ద్వారా కానీ, ఈ విషయం గురించి ప్రత్యేకంగా నియమించబడిన అధికారి న్యాయమూర్తి సూచనల మేరకు కానీ సాక్ష్యం నమోదు చేయవచ్చును. సాక్ష్యాలను కథనాత్మకంగా గానీ ప్రశ్నలు జవాబుల రూపంలో కానీ నమోదు చేయవచ్చు.

కోర్టు భాషలో సాక్షి సాక్ష్యం చెప్పినప్పుడు అదే భాషలో సాక్ష్యాన్ని నమోదు చేయాలి– సెక్షన్ 277(ఎ). అదే విధంగా వేరే ఇతర భాషలో సాక్షి సాక్ష్యం చెప్పినప్పుడు, అవకాశం ఉన్నప్పుడు అదే భాషలో నమోదు చేయాలి. ఆ విధంగా లేనప్పుడు, సాక్షి చెప్పిన సాక్ష్యాన్ని కోర్టు భాషలోకి తర్జుమా చేసి నమోదు చేయాల్సి ఉంటుంది – సెక్షన్ 277(బి).

'మాకు వచ్చిన సమాచారం మేరకు జిల్లా కోర్టులు దాదాపుగా అన్నీ సాక్షులు చెప్పిన భాషలోనే సాక్ష్యాలను నమోదు చేయడం లేదు. ఇంగ్లిష్‌లో నమోదు చేస్తున్నాయి. న్యాయమూర్తి ఆ సాక్ష్యాన్ని ఇంగ్లిష్‌లోకి అనువాదం చేస్తున్నారు. నిబంధన 277 ప్రకారం సాక్షి చెప్పిన భాషలోనే కోర్టులు సాక్ష్యాలను నమోదు చేయాల'ని సుప్రీం కోర్టు అభిప్రాయపడింది. కోర్టులు అనుమతించని భాషలో సాక్షి సాక్ష్యం చెప్పినప్పుడు కూడా కోర్టులు ఆ భాషలోనే నమోదు చేయాలి. ఆ విధంగా వీలు కాని పరిస్థితుల్లో అంటే ఆ భాషలో రాయలేని పరిస్థితి ఉన్నప్పుడు ఇంగ్లిష్‌లోకి అనువాదం చేయాల్సి ఉంటుంది. సాక్షి ఇంగ్లిష్‌లో సాక్ష్యం చెప్పినప్పుడు మాత్రమే కోర్టు ఇంగ్లిష్‌లో సాక్ష్యాలను నమోదు చేయాల్సి ఉంటుంది. అప్పుడు మాత్రమే కోర్టు భాషలోకి అనువాదం అవసరం లేదని సుప్రీంకోర్టు ఈ తీర్పులో స్పష్టం చేసింది. ఒకవేళ కోర్టు భాషలో కాకుండా మరో భాషలో సాక్షి సాక్ష్యం చెప్పినప్పుడు దాన్ని యథాతథంగా కోర్టు భాషలోకి అనువాదం చేయాలని కోర్టు తన తీర్పులో అభి ప్రాయపడింది.

కోర్టు భాష అంటే ప్రభుత్వం, హైకోర్టులు కలిసి కోర్టులో ఏ భాషను వినియోగించాలో నిర్దేశించిన భాష. తెలుగు రాష్ట్రాలలో తెలుగు, ఇంగ్లిష్‌లలో సాక్ష్యాలను నమోదు చేయాల్సి ఉంటుంది.

ఇతర రాష్ట్రాలను ఆనుకొని ఉన్న జిల్లాల్లో అక్కడి భాషలో కూడా సాక్ష్యాలను నమోదు చేయవచ్చు. తిరుపతి లాంటి ప్రదేశాల్లో తమిళంలో, అదే విధంగా నిజామాబాద్ లాంటి ప్రదేశాల్లో మరాఠీలో కూడా సాక్ష్యాలను నమోదు చేసే అధికారం ప్రభుత్వం కల్పించింది. కోర్టుల్లో చెప్పిన సాక్ష్యాలను కోర్టు భాషలో కానీ లేక సాక్షి చెప్పిన భాషలో కానీ నమోదు చేసి దాని అనువాదాన్ని కూడా కోర్టు రికార్డులో ఉంచాలి. సాక్షి కోర్టు అనుమతించని భాషలో చెప్పినప్పుడు ఇది తప్పనిసరిగా చేయాల్సి ఉంటుంది. సాక్షి చెప్పిన భాషలో నమోదు చేసినప్పుడే వారి సాక్ష్యంలోని స్వరం బోధపడుతుంది. అదే విధంగా ఆ సాక్షి నడవడికను కూడా కోర్టు అర్థం చేసుకోవడానికి వీలవుతుందని సుప్రీంకోర్టు తన తీర్పులో అభిప్రాయపడింది. ఆ సాక్ష్యాన్ని కోర్టు బాగా ప్రశంసించే అవకాశం ఏర్పడుతుంది. సాక్షి వాస్తవంగా ఏమి చెప్పింది అనే విషయం తెలుసుకోవాలంటే వాళ్ళు చెప్పిన భాషలోనే పరిశీలించాల్సి ఉంటుంది.

ఈ తీర్పు తెలుగులో న్యాయపాలన జరగాలని కోరుకుంటున్న వ్యక్తులకు ఒక ఉపకరణ మాదిరిగా ఉపయోగపడుతుంది. తన భాషలో చెప్పినది చూసినప్పుడు, చదివినప్పుడు సాక్షి ఉద్దేశ్యాల్ని సరిగ్గా అర్థం చేసుకోవచ్చు. ఎంత మంచి అనువాదమైనా అనువాదం అనువాదమే. ఈ తీర్పును ఆధారం చేసుకొని తెలుగులో సాక్ష్యాలను నమోదు చేయాలనీ, అదే సాక్షి చెప్పిన భాషలో నమోదు చేయాలని సాక్షిగానీ, న్యాయవాదులు గానీ జిల్లా స్థాయి కోర్టులను కోరడానికి అవకాశం ఉంది. మరో విధంగా చెప్పాలంటే డిమాండ్ చేయవచ్చు కూడా.

ఈ తీర్పు ద్వారా తెలుగులో న్యాయపాలన జరగడానికి మార్గం సుగమం అవుతుంది. రెండు రాష్ట్రాల హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులు ఆ విధంగా జరపడానికి సుముఖంగా ఉన్నట్టు అనిపిస్తుంది. భారత ప్రధాన న్యాయమూర్తి స్ఫూర్తి సరేసరి.

వ్యాసకర్త మాజీ జిల్లా జడ్జి, టీఎస్‌పీఎస్సీ మాజీ సభ్యులు । 94404 83001

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘ మాసం, తిథి: బ.షష్ఠి తె.5.47 వరకు (తెల్లవారితే ఆదివారం), తదుపరి సప్తమి, నక్షత్రం: చిత్త రా.10.25 వరకు, తదుపరి స్వాతి, వర్జ్యం: తె.4.05 నుండి 5.42 వరకు (తెల్లవారితే ఆదివారం), దుర్ముహూర్తం: ఉ.6.33 నుండి 8.05 వరకు, అమృతఘడియలు: ప.3.46 నుండి 5.23 వరకు; రాహుకాలం: ఉ.9.00 నుండి 10.30 వరకు, యమగండం: ప.1.30 నుండి 3.00 వరకు, సూర్యోదయం: 6.34, సూర్యాస్తమయం: 5.55.

విద్యుత్ కోతలపై రైతుల నిరసన


సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

నల్లగొండ: విద్యుత్ కోతలను నిరసిస్తూ ఉమ్మడి నల్లగొండ జిల్లా రైతులు శుక్రవారం రోడ్డెక్కారు. తిప్పర్తిలో అద్దంకి – నార్కట్‌పల్లి హైవేపై ధర్నా చేశారు. నకిరేకల్, పెద్దవూర, రామన్నపేట మండలాల్లో సబ్ స్టేషన్ల ఎదుట ఆందోళన చేపట్టారు. 24 గంటల పాటు విద్యుత్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. విద్యుత్ శాఖాధికారులకు వినతిపత్రాలు అందజేశారు.

వందేభారత్ రైలుపై రాళ్లదాడి



మహబూబాబాద్ రూరల్/కాశిబుగ్గ: సికింద్రాబాద్ నుంచి విశాఖపట్నం వెళ్తున్న వందేభారత్ రైలుపై మహబూబాబాద్ సమీపంలో గుర్తు తెలియని యువకులు శుక్రవారం సాయంత్రం రాళ్లతో దాడి చేశారు. దీంతో 2 కోచ్‌ల అద్దాలు పగిలిపోయాయి. వందేభారత్ (నంబర్ 20834) రైలు సాయంత్రం 5.40 గంటలకు మహబూబాబాద్ దాటి గుండ్రాతిమడుగు రైల్వేస్టేషన్ వైపు వెళ్తున్న క్రమంలో.. సూర్య థియేటర్ ప్రాంతంలో మూసివేసిన రైల్వే గేటు సమీపం నుంచి గుర్తు తెలియని యువకులు రాళ్లు విసిరారు. రాళ్లు సీ–4, సీ–8 కోచ్‌లపై పడ్డాయి దీంతో సీ–4 కోచ్‌లోని 34, 35 సీట్లు, సీ–8 కోచ్‌లోని 40, 41, 42 సీట్ల సమీపంలో అద్దాలు పగిలాయి. ప్రయాణికులకు ఎలాంటి గాయాలు కాలేదు. రైలు మాత్రం ఆగకుండా యథావిధిగా ఖమ్మం వైపు వెళ్లిపోయింది. విషయం తెలుసుకున్న కాజీపేట అసిస్టెంట్ సెక్యూరిటీ కమిషనర్ జి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో వరంగల్ ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ టీఎస్ఆర్ కృష్ణలు ఘటనా స్థలానికి చేరుకుని ఆకతాయిల వివరాలు సేకరించారు. రైల్వే ఆస్తులు ధ్వంసం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సమీప గ్రామాల ప్రజలకు కౌన్సెలింగ్ నిర్వహించారు.





వైభవంగా ఎల్లమ్మ ఉత్సవాలు

బొంరాస్‌పేట: వికారాబాద్ జిల్లా దుద్యాల మండల పరిధిలోని పోలెపల్లి ఎల్లమ్మ ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం సాయంత్రం అమ్మవారిని ఊరేగించారు. వేలాదిగా తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. స్థానిక ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

మెదక్ జిల్లా శివ్వంపేటలో నిర్వహించిన బగలాముఖి దేవత విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం శుక్రవారం ముగిసింది. వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. – శివ్వంపేట(నర్సాపూర్)

వంట చేయడానికి వెళ్తూ.. రోడ్డుకు బలై..

రంగారెడ్డి జిల్లా తుమ్మలూరు వద్ద కారును ఢీకొట్టిన డీసీఎం వ్యాన్

- కారులోని నలుగురు మృతి.. వ్యాన్ డ్రైవర్, క్లీనర్‌కు గాయాలు
- హైదరాబాద్‌లో ఓ పెళ్లికి వంట చేసి.. మరో పెళ్లికి వెళ్తుండగా ఘటన
- మృతులంతా నాగర్‌కర్నూల్ జిల్లా వాసులే.. పేద కుటుంబాల వారే..


చెన్న కేశవులు


యాదయ్య


రామస్వామి


శ్రీను

మహేశ్వరం/వెల్దండ: శుభకార్యాలకు వంట చేస్తూ మెప్పు పొందిన నలుగురు యువకులు.. ఓ పెళ్లిలో వంట చేసి పెట్టారు. మరో శుభకార్యానికి వంట చేసేందుకు కారులో బయలుదేరారు. కానీ రోడ్డు ప్రమాదానికి బలైపోయారు. అతి వేగంగా దూసుకొచ్చిన డీసీఎం వీరి కారును ఢీకొట్టడంతో నలుగురూ దుర్మరణం పాలయ్యారు. వ్యాన్ డ్రైవర్, క్లీనర్‌లకు గాయాలయ్యాయి. శుక్రవారం తెల్లవారుజామున శ్రీశైలం జాతీయ రహదారిపై రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం తుమ్మలూరు గేటు వద్ద ఈ దుర్ఘటన చోటు చేసుకుంది. దీనితో నాలుగు కుటుంబాలు శోక సంద్రంలో మునిగిపోయాయి.

వంట పని చేసేందుకు వెళ్తూ..: నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలం పోతేపల్లికి చెందిన బైకని యాదయ్య(34), ఎరుకలి చెన్న కేశవులు(35), ముంత శ్రీనివాసులు (30), లింగారెడ్డిపల్లికి చెందిన ఇమ్మరాశి రామస్వామి (32) నలుగురూ శుభకార్యాల్లో వంట పనులు చేస్తుంటారు. నలుగురు కలిసి గురువారం సాయంత్రం హైదరాబాద్‌లోని బాలాపూర్‌లో ఓ పెళ్లికి వంట చేశారు. రాత్రి నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలం తుమ్మలపల్లిలో మరో పెళ్లిలో వంట చేయడానికి స్విఫ్ట్ కారులో బయలుదేరారు. వారు అర్ధరాత్రి 2 గంటల సమయంలో శ్రీశైలం జాతీయ రహదారిపై తుమ్మలూరు గేటు సమీపంలో ప్రయాణిస్తుండగా.. కందుకూరు నుంచి హైదరాబాద్ వైపు వస్తున్న డీసీఎం వాహనం బలంగా స్విఫ్ట్ కారును ఢీకొట్టింది. కారు ముందుభాగం నుజ్జునుజ్జు అయిపోగా.. డీసీఎం అదుపుతప్పి చెట్ల పొదల్లోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో కారులోని రామస్వామి, యాదయ్య, శ్రీనివాసులు అక్కడికక్కడే మృతి చెందగా.. తీవ్రంగా గాయపడిన చెన్నకేశవులును 108లో ఆస్పత్రికి తరలిస్తుండగా మధ్యలో ప్రాణాలు వదిలాడు. డీసీఎం డ్రైవర్ షేక్ జానీ, క్లీనర్‌లకు గాయాలు కాగా చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. డీసీఎం డ్రైవర్ అతి వేగం వల్లే ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు చెప్తున్నారు. మృతదేహాలను ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. నలుగురి మృతితో రెండు గ్రామాలు విషాదంలో మునిగిపోయాయి.

మృతుల బంధువుల ఆందోళన

ప్రమాదానికి కారణమైన డీసీఎం డ్రైవర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని, మృతుల కుటుంబాలను ఆదుకోవాలని వారి బంధువులు, పోతేపల్లి, లింగారెడ్డి పల్లి సర్పంచ్‌లు, స్థానిక ప్రజాప్రతినిధులు మహేశ్వరం పోలీస్‌స్టేషన్ ఎదుట, తర్వాత శ్రీశైలం జాతీయ రహదారి పై ధర్నాకు దిగారు. దీనితో సుమారు 3 గంటల పాటు వాహనాలు నిలిచిపోయాయి. పోలీసులు నచ్చజెప్పడంతో వారు ఆందోళన విరమించారు. కాగా మృతుల కుటుంబాలను కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ పరామర్శించారు. డబుల్ బెడ్రూం ఇళ్లు, పిల్లలకు ఉచిత విద్య తోపాటు ప్రభుత్వపరంగా అన్నిరకాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. పోతేపల్లికి చెందిన సంజీవ్‌కుమార్ యాదవ్ బాధిత కుటుంబాలకు రూ.25వేల చొప్పున రూ.లక్ష ఆర్థికసాయం అందజేశారు. ఇక బాధిత కుటుంబాలను చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి, బీజేపీ నేత ఆచారి పరామర్శించారు.

అందరూ నిరుపేదలే..

తుమ్మలూరు వద్ద రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన నలుగురివీ పేద కుటుంబాలే. వీరిలో యాదయ్య వ్యవసాయం చేస్తూ.. పెళ్లిళ్ల సీజన్‌లో వంట పనులు చేస్తుంటాడు. తనకు సహాయంగా చెన్నకేశవులు, శ్రీనివాసులు, రామస్వామిలను తీసుకెళ్తుంటాడు. యాదయ్యకు భార్య భాగ్యమ్మతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. రామస్వామికి భార్య కృష్ణమ్మతో పాటు ఒక కుమారుడు, కుమార్తె.. కేశవులుకు భార్య రజిత ఒక కుమార్తె, కుమారుడు.. శ్రీనివాసులుకు భార్య కృష్ణమ్మతోపాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఇంటికి పెద్ద దిక్కు అయినవారు మృతి చెందడంతో.. ఈ నాలుగు కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి నెలకొంది.

మళ్లీ 'బషీర్‌బాగ్' ఉద్యమం

▶ మొదటి పేజీ తరువాయి

కట్టబెట్టారని ఆరోపించారు. తమ ప్రభుత్వం వచ్చాక విద్యుత్ గోల్‌మాల్‌పై పూర్తిస్థాయిలో విచారణకు ఆదేశించి, అధికారులను ఊచలు లెక్కబెట్టేలా చేస్తామన్నారు.

భూకుంభకోణాలపై విచారణ కోరండి

తెల్లాపూర్‌కు సంబంధించిన 100 ఎకరాల భూ కుంభకోణం, మియాపూర్ భూముల కుంభకోణం, కేటీఆర్ ఫామ్‌హౌస్‌తో పాటు సంగారెడ్డి, రంగారెడ్డి, మేడ్చల్ కలెక్టరేట్ల పరిధిలో జరిగిన భూ లావాదేవీలపై సిట్టింగ్ జడ్జితో విచారణకు లేఖ రాయాలని రేవంత్ డిమాండ్ చేశారు. కేటీఆర్ ఆస్తుల మీద, తన ఆస్తుల మీద, వారి వారి శాఖలు తీసుకున్న నిర్ణయాల మీద, తాను ఎమ్మెల్యేగా, ఎంపీగా తీసుకున్న నిర్ణయాలపై హైకోర్టు జడ్జితో విచారణ కోరుతూ లేఖ రాద్దామని సవాల్ చేశారు.


ఏసీడీ చార్జీలు చెల్లించొద్దు

వినియోగదారులెవరూ ఎవరూ ఏసీడీ చార్జీలు చెల్లించవద్దని రేవంత్‌రెడ్డి సూచించారు. తమ ప్రభుత్వం వచ్చాక చార్జీలు రద్దు చేస్తామని ప్రకటించారు. ఈఆర్సీ చైర్మన్ శ్రీరంగారావు..మంత్రి హరీశ్‌రావు సోదరుడే కావడంతో 'చట్టంలో నిబంధన ఉంది, ఏసీడీ చార్జీలు వసూలు చేయొచ్చు'అని ఆయన చెబుతున్నారని విమర్శించారు. రాష్ట్రంలో జరిగే దోపిడీకి లబ్దిదారులు కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు అని రేవంత్ ఆరోపించారు. కమ్యూనిస్టులు దోపిడీదారుల పక్షాన ఉంటారా, ప్రజల పక్షాన కొట్లాడతారో నిర్ణయించుకోవాలని సూచించారు. కాంగ్రెస్‌తో కలిసి పనిచేయాలని కోరారు.

జవాన్ కుటుంబం వినతి

జనవరి 5న విధుల్లో ఉండగా మరణించిన జవాన్ భూక్యా రమేశ్ కుటుంబ సభ్యులు యాత్రలో రేవంత్ రెడ్డిని కలిశారు. జీవనాధారం లేక ఇబ్బంది పడుతున్న తమకు రాష్ట్ర ప్రభుత్వం ఏదైనా ఉపాధి, ఉద్యోగం చూపించేలా చూడాలని కోరారు. ఈ యాత్రలో మాజీ ఎంపీ పోరిక బలరాంనాయక్, నేతలు మల్లు రవి తదితరులు పాల్గొన్నారు. ఇదిలావుండగా ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ రేవంత్‌రెడ్డిపై మహబూబాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం రాత్రి కేసు నమోదైంది.

ప్రగతిభవన్‌పై నీలి జెండా ఎగురవేస్తాం: ఆర్‌ఎస్పీ



కోదాడ: వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో బహుజనుల అండతో రాజ్యాధికారం చేజిక్కించుకుంటామని, ప్రగతిభవన్‌పై నీలి జెండా ఎగురవేస్తామని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఆయన సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణంలో బీఎస్పీ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో మాట్లాడారు. అధికారం ఉందని కోదాడలో కొందరు బీఎస్పీ కార్యకర్తలపై, నాయకులపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని, వాటికి అదిరేది, బెదిరేది లేదని స్పష్టంచేశారు. వచ్చే ఎన్నికల్లో గడీల పాలన అంతమై బహుజనుల పాలన రాబోతోందన్నారు. అంతకు ముందు ప్రవీణ్‌కుమార్ మునగాల మండల మాధవరం నుంచి భారీ ర్యాలీగా కోదాడకు చేరుకున్నారు. ఈ కార్యక్రమాల్లో బీఎస్పీ రాష్ట్ర నాయకుడు పిల్లుట్ల శ్రీనివాస్‌తో పాటు నాయకులు ఉపేందర్, శ్రావణ్‌కుమార్, దశరథ, నాగమణి, రామారావు, అజహర్‌బాబా, జ్యోతి, రేష్మా, ఆశాబేగం తదితరులు పాల్గొన్నారు.

నిరూపించకుంటే రేవంత్‌రెడ్డి చెప్పు దెబ్బలు తింటాడా?

- హైదరాబాద్‌లో సెంటు భూమి కూడా లేదు: మాజీ మంత్రి రెడ్యా నాయక్



సాక్షి, హైదరాబాద్: ''హైదరాబాద్‌లో భూమి ఉన్నట్లు నిరూపిస్తే రాజకీయ సన్యాసం తీసుకుంటాను...లేకుంటే టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి 10 చెప్పు దెబ్బలు తింటాడా''అని మాజీ మంత్రి రెడ్యా నాయక్ సవాల్ విసిరారు. అసెంబ్లీ మీడియా పాయింట్‌లో శుక్రవారం ఆయన మాట్లాడుతూ...రేవంత్ రెడ్డి ఓ బ్లాక్‌మెయిలర్ అని టీపీసీసీ పదవిని డబ్బులతో కొనుగోలు చేశారని ఆరోపించారు. హైదరాబాద్‌లో తమకు సెంటు భూమి కూడా లేదని స్పష్టం చేశారు. రేవంత్‌రెడ్డి పచ్చి అబద్ధాలు మాట్లాడారని ధ్వజమెత్తారు. తాను, తన కూతురు ఎటువంటి భూముల కోసం పార్టీ మారలేదని చెప్పారు. కాంగ్రెస్‌కు భవిష్యత్ లేదనే కారణంతోనే బీఆర్ఎస్‌లో చేరామన్నారు. గతంలో కొంత భూమికొని తర్వాత అమ్మేశామన్నారు. ఇదే భూమిపై ఉత్తమ్ కుమార్ రెడ్డి విమర్శించారని గుర్తు చేశారు.

ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతు చేస్తూ | విద్యుత్ షాక్‌తో రైతు మృతి

- అధికారుల నిర్లక్ష్యమేనంటూ కుటుంబసభ్యుల ఆందోళన


ట్రాన్స్‌ఫార్మర్‌పైన మృతి చెందిన కుంట రాజు

గజ్వేల్‌రూరల్: ట్రాన్స్‌ఫార్మర్‌పై మరమ్మతులు చేస్తుండగా, ఓ యువరైతు విద్యుత్ సరఫరా జరిగి దుర్మరణం పాలయ్యాడు. ఈ ఘటన సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం సింగాటం గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కుంట రాజు(32)కు భార్య కృష్ణవేణి, ఇద్దరు కుమారులు ఉన్నారు. గ్రామ శివారులోని వ్యవసాయ పొలాల వద్ద ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పాడైంది. దానికి మరమ్మతు చేయించి బిగించేందుకు రైతులు సబ్‌స్టేషన్ నుంచి ఎల్‌సీ తీసుకున్నారు. ఈ నేపథ్యంలో ట్రాన్స్‌ఫార్మర్‌పైకి ఎక్కి రాజు మరమ్మతులు చేస్తుండగా ఒక్కసారిగా విద్యుత్ సరఫరా కావడంతో షాక్‌కు గురై మృతి చెందాడు. అధికారుల నిర్లక్ష్యం వల్లనే రాజు మృతి చెందాడని ఆరోపిస్తూ న్యాయం జరిగే వరకు మృతదేహాన్ని తరలించేదిలేదని బాధిత కుటుంబీకులు, గ్రామస్తులు ఆందోళనకు దిగారు. విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు అక్కడికి చేరుకొని ప్రమాదఘటనపై విచారణ చేపట్టి మృతుని కుటుంబానికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కాగా రాజును ట్రాన్స్‌ఫార్మర్ పైకి ఎవరు ఎక్కమన్నారు? ఎల్‌సీ తీసుకున్న తర్వాత మరమ్మతు పనులు పూర్తికాకముందే ఎలా విద్యుత్ సరఫరా చేశారనే విషయాలు తెలియాల్సి ఉంది.

ఒక్కటికానున్న 220 జంటలు

నాగర్‌కర్నూల్‌లో సామూహిక వివాహాలు

సాక్షి, నాగర్‌కర్నూల్: ఒకేసారి 220 జంటలు వివాహ వేడుకతో ఒక్కటయ్యే దృశ్యం నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రంలో ఆదివారం ఆవిష్కృతం కానుంది. ఎంజేఆర్ చారిటబుల్ ట్రస్ట్, ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి, ఆయన సతీమణి జమున ఆధ్వర్యంలో ఐదోసారి సామూహిక వివాహ మహోత్సవాన్ని ఆదివారం ఉదయం 10.05 గంటలకు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తికాగా, శుక్రవారం కాబోయే జంటలకు మెహందీ, హల్దీ ఫంక్షన్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన వస్త్రాలు ధరించి కాబోయే వధువరులు మురిసిపోయారు. సామూహిక వివాహ వేడుకల్లో మొత్తం 220 జంటలకు ఏకకాలంలో వివాహం నిర్వహించనున్నారు. ప్రధాన వేదికపై యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో లక్ష్మీనరసింహస్వామి వారికి కల్యాణం నిర్వహించనుండగా, ప్రతి జంటకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ముత్యాల పందిరిలో వివాహాలు జరిపించనున్నారు. పెళ్లయ్యే జంటల తరఫున బంధువులందరికీ విందు భోజనాలు కూడా పెడుతున్నారు. కార్యక్రమానికి అతిథులుగా ఎమ్మెల్సీ కవితతో పాటు పలువురు ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు హాజరుకానున్నారు.

కార్యకర్తల బలంతోనే...: జనార్దన్‌రెడ్డి

కార్యకర్తలు, ప్రజల తోడ్పాటుతోనే ఐదోసారి సామూహిక వివాహాలు చేయగలుగుతున్నాం. ఎంతోమంది నిరుపేదలకు వారి పిల్లల పెళ్లిళ్లు చేయడమనేది కలగానే ఉంటుంది. పెద్దసంఖ్యలో జంటలకు వివాహం జరిపించడం అదృష్టంగా భావిస్తున్నా.


మెహందీ కార్యక్రమంలో నూతన వధువులు

తరగతి గదిలో క్షుద్ర పూజలు!

- బొమ్మను చూసి విద్యార్థుల పరుగు

కురవి: మహబూబాబాద్ జిల్లా కురవి మండలం సూదనపల్లి ప్రాథమికోన్నత పాఠశాల తరగతి గదిలో క్షుద్ర పూజలు చేసిన గుర్తులుండటంతో కలకలం రేగింది. గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పాఠశాలలోని 8వ తరగతి గది తలుపులు తెరిచారు. అందులో ఒక బొమ్మను పెట్టి పసుపు, కుంకుమ చల్లి యథాప్రకారం తలుపులు వేసి వెళ్లిపోయారు. శుక్రవారం ఉదయం పాఠశాలకు వచ్చిన విద్యార్థులు గది తలుపులు తెరవగానే బొమ్మ కనిపించడంతో భయంతో పరుగులు తీశారు. ఈ విషయం గ్రామస్తులకు తెలియడంతో పాఠశాలకు విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు వచ్చి చూశారు. సమాచారం అందుకున్న సీరోలు పోలీసులు వచ్చి బొమ్మను తొలగించారు. తరగతి గదిని నీటితో శుభ్రం చేయించారు. ఇది ఆకతాయిల పనని, భయపడొద్దని పోలీసులు భరోసా ఇవ్వడంతో ఉపాధ్యాయులు తరగతులను నిర్వహించారు.

క్లుప్తంగా...

హెచ్-1బీ, ఎల్1 రెన్యువల్ ఇక అమెరికాలోనే

వాషింగ్టన్: 'డొమెస్టిక్ వీసా రీవాలిడేషన్' ప్రక్రియను పునఃప్రారంభించాలని అమెరికా ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో అమెరికాలో పనిచేస్తున్న సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లకు, ప్రధానంగా భారతీయులకు ఎక్కువ మేలు జరుగనుంది. హెచ్-1బీ, ఎల్1 వంటి నాన్-ఇమ్మిగ్రెంట్ వీసాల గడువు ముగిస్తే స్వదేశానికి తిరిగి వెళ్లి, రెన్యువల్ చేసుకోవాల్సిన పని ఉండదు. అమెరికాలోనే ఆ ప్రక్రియ పూర్తి చేసుకోవచ్చు. 2004 వరకూ నాన్-ఇమ్మిగ్రెంట్ వీసాల రెన్యువల్, ఎక్స్‌టెన్షన్ స్టాంపింగ్‌ను అమెరికాలోనే చేసేవారు. తర్వాత ఈ విధానాన్ని రద్దుచేశారు. ఇప్పుడు పునరుద్ధరించబోతున్నారు. త్వరలోనే ఇది అమల్లోకి రాబోతోంది.

బీబీసీని నిషేధించాలన్న పిటిషన్ కొట్టేసిన సుప్రీం

న్యూఢిల్లీ: దేశంలో బ్రిటిష్ బ్రాడ్‌కాస్టింగ్ కార్పొరేషన్(బీబీసీ)పై పూర్తిస్థాయిలో నిషేధం విధించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు శుక్రవారం కొట్టివేసింది. ఈ పిటిషన్‌కు విచారణార్హత లేదని తేల్చిచెప్పింది. 2002 నాటి గుజరాత్ అల్లర్లపై ఇటీవల బీబీసీ విడుదల చేసిన డాక్యుమెంటరీ తీవ్ర వివాదానికి దారితీసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో భారత్‌లో బీబీసీని పూర్తిగా నిషేధించాలంటూ హిందూసేన అధ్యక్షుడు విష్ణు గుప్తా, రైతు బీరేంద్రకుమార్ సింగ్ సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేసింది. ఇది జస్టిస్ సంజయ్ ఖన్నా, జస్టిస్ ఎంఎం సుందరేశ్‌తో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం ముందుకు వచ్చింది. పిటిషన్‌ను కొట్టివేస్తూ ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది. బీబీసీ గురించి తప్పుగా అర్థం చేసుకొని ఈ పిటిషన్ దాఖలు చేసినట్లు ఉన్నారని వెల్లడించింది.

పాత బడ్జెట్ చదివిన గెహ్లోట్
రాజస్తాన్ అసెంబ్లీలో కలకలం..

జైపూర్: రాజస్తాన్ రాష్ట్ర 2023-24 వార్షిక బడ్జెట్ సమావేశాల్లో పొరపాటు జరిగింది. ఆర్థికశాఖను కూడా నిర్వహిస్తున్న సీఎం అశోక్ గెహ్లోట్ శుక్రవారం అసెంబ్లీలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. అయితే, పొరపాటున గత ఏడాది బడ్జెట్ వివరాలను చదివారు. సభలో గందరగోళం చెలరేగడంతో తప్పును గ్రహించి ఆయన క్షమాపణ చెప్పారు. అయితే, వివరాలు ముందుగానే లీకయ్యాయని, బడ్జెట్‌ను మరో రోజు ప్రవేశపెట్టాలంటూ ప్రతిపక్ష బీజేపీ సభ్యులు చేపట్టిన ఆందోళనలతో అసెంబ్లీ రెండుసార్లు వాయిదాపడింది. బీజేపీ అనవసరంగా రాద్ధాంతం చేస్తోందని సీఎం గెహ్లోట్ అన్నారు. బడ్జెట్ లీక్ కాలేదన్నారు. బడ్జెట్ ప్రసంగం నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకు డ్రామా ఆడుతోందని వ్యాఖ్యానించారు. ఇలా జరగడం దురదృష్టకరమని స్పీకర్ సీపీ జోషి అన్నారు.

హృదయ విదారకం

తుర్కియే, సిరియాలో ముమ్మరంగా శిథిలాల తొలగింపు
- 100 గంటల తర్వాత ప్రాణాలతో బయటపడుతున్న పలువురు!
- మూత్రం తాగి ప్రాణాలు నిలుపుకున్న వైనం
- 22 వేలు దాటిన మృతులు

అంకారా/న్యూఢిల్లీ: తుర్కియే(టర్కీ), సిరియాలో భూకంప మృతుల సంఖ్య ఏకంగా 22,000 దాటింది. సహాయక చర్యలతోపాటు శిథిలాల తొలగింపు ప్రక్రియ ముమ్మరంగా సాగుతోంది. భీకర భూకంపం సంభవించి 100 గంటలు గడిచిపోయింది. శిథిలాల కింద మృతదేహాలు బయటపడుతూనే ఉన్నాయి. కొందరు సజీవంగా బయటపడడం ఊరట కలిగిస్తోంది. తుర్కియేలో శిథిలాలను తొలగిస్తుండగా శుక్రవారం ఒక్కరోజే 100 మందికిపైగా బాధితులు ప్రాణాలతో బయటకు వచ్చారు. కొన్నిచోట్ల హృదయ విదారక దృశ్యాలు కనిపిస్తున్నాయి. తీవ్రమైన చలిలో ఆకలి బాధలతో ప్రాణాలు నిలుపుకొనేందుకు వారుపడిన కష్టాలు వర్ణనాతీతం. శిథిలాల కింద ఇరుక్కుపోయి, బయటపడే మార్గం లేక కేవలం మూత్రం తాగి ఆకలిదప్పులు తీర్చుకున్నామని బాధితులు చెబుతుండడం కన్నీరు పెట్టిస్తోంది. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం కనిపిస్తోంది. తుర్కియేలో అంత్యక్రియల కోసం తీసుకొస్తున్న మృతదేహాలతో ఇప్పటికే శ్మశానాలు కిక్కిరిసిపోతున్నాయి. చాలా సమయం వేచి చూడాల్సి వస్తోందని మృతుల బంధువులు చెబుతున్నారు. ఈ భూకంపం 'ఈ శతాబ్దపు విపత్తు' అని తుర్కియే అధ్యక్షుడు తయీప్ ఎర్డోగాన్ వ్యాఖ్యానించారు. భూకంపం వల్ల తీవ్రంగా నష్టపోయిన తుర్కియేకు దాదాపు 95 దేశాలు సహాయ సహకారాలు అందిస్తున్నాయి. సిరియా అధ్యక్షుడు బషర్ అసద్, ఆయన భార్య అస్మా శుక్రవారం అలెప్పో యూనివర్సిటీ ఆసుపత్రిలో భూకంప మృతులను పరామర్శించారు. భూకంపం సంభవించినప్పటి నుంచి ఆయన బహిరంగంగా కనిపించడం ఇదే మొదటిసారి.

75,000 మంది నిరాశ్రయులు

భూకంపం వల్ల తుర్కియేలో ఇప్పటిదాకా 18,900 మంది మరణించారని, దాదాపు 75,000 మంది గాయపడ్డారని తుర్కియే డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ వెల్లడించింది. ఇళ్లు కూలిపోవడంతో 75,000 మందికిపైగా జనం నిరాశ్రయులైనట్లు అంచనా వేస్తున్నామని తెలిపింది. సిరియాలో భూకంపం కారణంగా 3,300 మందికిపైగా ప్రాణాలు కోల్పోయినట్లు ప్రభుత్వం ధ్రువీకరించింది. రెండు దేశాల్లో కలిపి ఇప్పటివరకు 22,000 మందికి పైగా బలైనట్లు తెలుస్తోంది. తుర్కియేలో 12,000 దాకా భవనాలు నేలమట్టం కావడమో లేక దెబ్బతినడమో జరిగిందని మంత్రి మురాత్ కరూమ్ చెప్పారు.

తుర్కియే ప్రజలకు అండగా ఉంటాం: మోదీ

'ఆపరేషన్ దోస్త్'లో భాగంగా తుర్కియేలో భూకంప ప్రభావిత ప్రాంతాల్లో మన దేశ సహాయక బృందాలు నిరంతరం శ్రమిస్తున్నాయని ప్రధానమంత్రి నరేంద్రమోదీ శుక్రవారం తెలిపారు. రిలీఫ్, రెస్క్యూ ఆపరేషన్లలో చురుగ్గా పాల్గొంటున్నాయని చెప్పారు. సాధ్యమైనంత ఎక్కువ మంది ప్రాణాలను, ఆస్తులను కాపాడడానికి మన బృందాలు కృషి చేస్తూనే ఉంటాయని ట్విట్టర్‌లో వెల్లడించారు. ఈ సంక్షోభ సమయంలో తుర్కియే ప్రజలకు భారత్ పూర్తిస్థాయిలో అండగా నిలుస్తుందని మోదీ హామీ ఇచ్చారు.



ఈ ఫొటోల్లో ఉన్న మృత్యుంజయులిద్దరూ భార్యాభర్తలు. పేరు రజియే కిలింక్ (పైన), ఆమె భర్త హాసీ మురత్ కిలింక్ (కింది ఫొటో). టర్కీలోని ఇస్కెందరన్‌లో భవన శిథిలాల కింద ఏకంగా 109 గంటలపాటు ప్రాణాలను నిలుపుకుని ఇలా సజీవంగా బయటపడ్డారు.





ఇతని పేరు ఎయిప్ ఎక్. 60 ఏళ్ల వృద్ధుడు. టర్కీలోని అదియమన్‌లో శిథిలాల్లో చిక్కిన ఇతను ఏకంగా 104 గంటల పాటు మృత్యువుతో పోరాడి గెలిచాడు! చివరికి శుక్రవారం జర్మనీ నుంచి వచ్చిన ఎమర్జెన్సీ రెస్క్యూ బృందాలు అయన్ను కాపాడి ఇలా అంబులెన్స్‌లో హుటాహుటిన ఆస్పత్రికి తరలించాయి.



దక్షిణ టర్కీలోని కరమన్మారస్‌లో ఈ బాలిక మొక్కవోని ధైర్యంతో ఏకంగా 100 గంటలకు పైగా శిథిలాల కింద గడిపింది. శుక్రవారం ఉదయం సురక్షితంగా బయట పడింది.



ఇతను అద్నాన్ మొహమ్మెట్ కొర్కుట్. దక్షిణ తుర్కియేలోని గాజియన్‌తెప్‌లో శిథిలాల కింద చిక్కుబడ్డాడు. దాదాపు 100 గంటల తర్వాత శుక్రవారం సహాయ బృందాలు ఇతన్ని గుర్తించి జాగ్రత్తగా బయటికి తీశాయి.



ఈవిడ పేరు హాటిస్. కరమన్మారస్‌లోనే శిథిలాల కింద చిక్కింది. అయినా కుంగిపోకుండా ఏకంగా 92 గంటల పాటు ప్రాణాల కోసం పోరాడి గెలిచింది. శుక్రవారం ఉదయం సజీవంగా బయటికొచ్చింది. అంబులెన్స్ ఎక్కుతూ కూడా అక్కడివారికేసి నవ్వుతూ చేయి ఊపింది!



ఈ చిన్నారికి ఏడేళ్లు. పేరు జనా అల్ అబ్దో. ఉత్తర సిరియాలో ఇద్లిబ్ ప్రావిన్స్‌లో భూకంపం బారిన పడి శిథిలాల కింద చిక్కుకుపోయింది. 70 గంటలకు పైగా నరకం అనుభవించినా ధైర్యం కోల్పోలేదు. చివరికిలా సజీవంగా బయట పడింది. ఆస్పత్రికి తరలించగా క్రమంగా కోలుకుంటోంది. కానీ సొంతవాళ్లంతా భూప్రకోపానికి బలవడంతో అనాథగా మారింది!



ఈ వృద్ధురాలిని కూడా కరమన్మారస్‌లోనే భవన శిథిలాల నుంచి 87 గంటల అనంతరం ప్రాణాలతో బయటికి తీశారు.



ఇతన్ని కరమన్మారస్‌లో సహాయ బృందాలు 87 గంటల అనంతరం గురువారం శిథిలాల నుంచి సజీవంగా కాపాడాయి.



ఈ బుజ్జి కుక్క పిల్ల పేరు పముక్. టర్కీలోని హతాయ్ వద్ద 72 గంటల తర్వాత శిథిలాల నుంచి ఇలా సజీవంగా బయట పడింది!

భారత సౌభాగ్యంతోనే ప్రపంచ సౌభాగ్యం

- పెట్టుబడులకు స్వర్గం యూపీ
- లక్నో అంతర్జాతీయ సదస్సులో ప్రధాని మోదీ



లక్నో: ప్రపంచ సౌభాగ్యం భారతదేశ అభివృద్ధితో ముడిపడి ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. భారతదేశ ఉజ్వల భవిష్యత్తే ప్రపంచ ఉజ్వల భవిష్యత్తుకు హామీ అని స్పష్టం చేశారు. దేశంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని దేశ విదేశీ పారిశ్రామికవేత్తలకు పిలుపునిచ్చారు. ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలో అంతర్జాతీయ పెట్టుబడిదారుల సదస్సు శుక్రవారం అట్టహాసంగా ఆరంభమైంది. విదేశీ ప్రతినిధులకు, దేశీయ పారిశ్రామికవేత్తలకు ప్రధాని మోదీ సాదరంగా ఆహ్వానం పలికారు. ప్రపంచ ఆర్థిక ప్రగతి ఇండియాతో అనుసంధానమై ఉందని చెప్పారు. డబుల్ ఇంజన్ ప్రభుత్వం అధికారంలో ఉన్న ఉత్తరప్రదేశ్ రాష్ట్రం పెట్టుబడులకు స్వర్గధామంగా మారిందని వివరించారు. ఇక్కడున్న అపార అవకాశాలను అందిపుచ్చుకోవాలని పెట్టుబడిదారులకు సూచించారు. ఇండియా ప్రగతికి ఉత్తరప్రదేశ్ కీలకమైన నాయకత్వాన్ని అందిస్తోందని హర్షం వ్యక్తం చేశారు. ఇటీవలి సంక్షోభాల నుంచి భారత్ వేగంగా బయటపడిందని, దేశ ఆర్థిక పరిస్థితి స్థిరంగా కొనసాగుతోందని చెప్పారు. భారతీయుల్లో ఆత్మవిశ్వాసం పెరగడమే ఇందుకు కారణమని అన్నారు. దేశంలో యువత ఆలోచనా ధోరణిలో, సమాజం ఆకాంక్షల్లో భారీ మార్పు కనిపిస్తోందని వివరించారు. సాధ్యమైనంత త్వరగా మరింత అభివృద్ధిని చూడాలని ప్రతి భారతీయుడూ కోరుకుంటున్నాడని వెల్లడించారు.

ఆరేళ్లలో యూపీకి సొంత గుర్తింపు

భారత్‌లో సంస్కరణల పర్వం కొనసాగుతుందని మోదీ తెలియజేశారు. ఆధునిక భౌతిక, డిజిటల్ మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని, ప్రజల కనీస అవసరాలు తీరుస్తున్నామని చెప్పారు. ఉత్తరప్రదేశ్ గతంలో 'బీమారు' రాష్ట్రాల్లో ఒకటిగా ఉండేదని, ఇప్పుడు అభివృద్ధి పథంలో పరుగులు తీస్తోందని వ్యాఖ్యానించారు. ఆరేళ్ల వ్యవధిలో సొంత గుర్తింపును సాధించిందని చెప్పారు. సుపరిపాలన, మెరుగైన శాంతి భద్రతలు, స్థిరత్వం వంటి వాటితో సంపద సృష్టికర్తలకు అవకాశాల గనిగా మారిందన్నారు. సదస్సులో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, యూపీ గవర్నర్ ఆనందిబెన్ పటేల్, ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, పారిశ్రామికవేత్తలు ముకేశ్ అంబానీ, కుమార మంగళం బిర్లా, ఎన్.చంద్రశేఖరన్ తదితరులు మాట్లాడారు. వివిధ కంపెనీలతో 18,000 ఎంఓయూ కుదుర్చుకుంటామని యోగి వివరించారు.

మధ్యతరగతి బడ్జెట్

ముంబై: కేంద్రం ఈ ఏడాది ప్రవేశపెట్టిన బడ్జెట్‌తో మధ్యతరగతిని బలోపేతం చేస్తుందని ప్రధాని మోదీ చెప్పారు. యూపీఏ పాలనలో ప్రజల ఆదాయంపై 20 శాతం దాకా పన్ను ఉండేదని, ఈ బడ్జెట్‌లో సున్నా శాతం పన్ను విధించినట్లు గుర్తుచేశారు. ముంబైలో ఛత్రపతి శివాజీ మహారాజ్ టెర్మినస్ నుంచి షోలాపూర్, షిర్డీకి వందేభారత్ రైళ్లను మోదీ శుక్రవారం పచ్చజెండా ఊపి ప్రారంభించారు. వేతన జీవులను, మధ్యతరగతి ప్రజలను బడ్జెట్ సంతోషపెట్టిందని ఈ సందర్భంగా ఉద్ఘాటించారు. తమ నియోజకవర్గాల్లోని స్టేషన్లలో రైళ్లను ఒకటి రెండు నిమిషాలపాటు ఆపాలని గతంలో లేఖలు రాసిన ఎంపీలు ఇప్పుడు వందేభారత్ రైళ్ల కోసం డిమాండ్ చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్, కేంద్ర మంత్రి నారాయణ్ రాణే, మహారాష్ట్ర సీఎం ఏక్‌నాథ్ షిండే, ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ పాల్గొన్నారు.

జమ్మూకశ్మీర్‌లో 59 లక్షల టన్నుల లిథియం

న్యూఢిల్లీ: బ్యాటరీలు, విద్యుత్ పరికరాల తయారీలో ఉపయోగించే అత్యంత కీలకమైన లిథియం నిక్షేపాలను తొలిసారిగా మన దేశంలో గుర్తించారు. జమ్మూకశ్మీర్‌లో దాదాపు 59 లక్షల టన్నుల లిథియం నిల్వలు ఉన్నట్లు కేంద్ర గనుల శాఖ వెల్లడించింది. ''జమ్మూకశ్మీర్‌లోని రియాసి జిల్లా సలాల్ హైమనా ప్రాంతంలో లిథియం నిల్వలను జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా(జీఎస్ఐ) గుర్తించింది'' అని ట్వీట్ చేసింది. గనుల శాఖ 2018-19లో నిర్వహించిన సర్వేలో దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో 51 ఖనిజ క్షేత్రాలను కనిపెట్టింది. సంబంధిత సమాచారాన్ని ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు చేరవేసింది. బంగారంతో పాటు పొటాషియం, మాలిబ్డినం, ఇంకా ఇతర ప్రాథమిక లోహాల నిక్షేపాలను 11 రాష్ట్రాల్లో గుర్తించారు. బంగారం నిల్వలను 5 క్షేత్రాలను కనుగొన్నారు. జమ్మూకశ్మీర్, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, గుజరాత్, జార్ఖండ్, కర్ణాటక, మధ్యప్రదేశ్, ఒడిశా, రాజస్తాన్, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాల్లో ఖనిజ నిక్షేపాలు ఉన్నట్లు గనుల శాఖ తెలిపింది. భారత్ ప్రస్తుతం లిథియంను విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటోంది. విద్యుత్ వాహనాల తయారీలో లిథియం చాలా కీలకం. ఇప్పుడు ఈ ఖనిజ నిల్వలు జమ్మూకశ్మీర్‌లో బయటపడడంతో రాబోయే రోజుల్లో దేశంలో విద్యుత్ వాహనాల తయారీ రంగం వేగం పుంజుకోనుంది. లిథియం దిగుమతుల భారం పెద్దగా ఉండదు కాబట్టి విద్యుత్ వాహనాల ధరలు దిగివచ్చే అవకాశాలున్నాయి. స్మార్ట్‌ఫోన్ల తయారీలోనూ లిథియం ఉపయోగిస్తారు.

మోత మోగేనా?



2018 అసెంబ్లీ ఎన్నికలు. లెఫ్ట్ కూటమి పాతికేళ్ల పాలనతో విసిగిపోయిన త్రిపుర ప్రజలను బీజేపీ అభివృద్ధి మంత్రం ఆకట్టుకుంది. దాని భాగస్వామ్య పార్టీ ఐపీఎఫ్‌టీకి గిరిజనుల్లో ఉన్న ఆదరణ తోడైంది. దాంతో 60 సీట్లకుగాను కాషాయ పార్టీ ఏకంగా 36 స్థానాల్లో నెగ్గింది. ముఖ్యంగా 20 ఎస్టీ స్థానాల్లో ఏకంగా 17 సీట్లను కొల్లగొట్టింది! ఐదేళ్ల తర్వాత పరిస్థితులు తారుమారవుతున్న సూచనలు కన్పిస్తున్నాయి. ప్రత్యేక రాష్ట్ర నినాదంతో రాజకీయ పార్టీ అవతారమెత్తిన ఉద్యమ సంస్థ టిప్రా మోతా ఈసారి అధికార పార్టీ పుట్టి ముంచేలా కన్పిస్తోంది...

ఆసక్తికరంగా త్రిపుర ఎన్నికలు
- బీజేపీని వణికిస్తున్న టిప్రా మోతా
- టిప్రాలాండ్ హామీకి జైకొడుతున్న గిరిజనులు
- 20 ఎస్టీ సీట్లలో అధికార పార్టీకి గట్టి సవాలు
- గిరిజన ప్రాబల్యమున్న 23 స్థానాల్లోనూ దెబ్బే
- హంగ్ వస్తే కింగ్‌మేకర్‌గా మారనున్న మోతా!

ఈశాన్య రాష్ట్రమైన త్రిపురలో అసెంబ్లీ ఎన్నికల వేడి తారస్థాయికి చేరుతోంది. పోలింగ్ (ఫిబ్రవరి 16) తేదీ సమీపిస్తున్న కొద్దీ పార్టీలన్నీ అమ్ములపొదుల్లోంచి అన్ని అస్త్రాలూ బయటికి తీస్తున్నాయి. రాష్ట్రంలో పాతికేళ్ల లెఫ్ట్ పాలనకు 2018 ఎన్నికల్లో బీజేపీ తెర దించింది. గిరిజనుల్లో బాగా పట్టున్న ఐపీఎఫ్‌టీ పార్టీతో జట్టు కట్టి ఘన విజయం సాధించింది. సీపీఎం 16 సీట్లకు పరిమితం కాగా కాంగ్రెస్ సోదిలోకూడా లేకుండా పోయింది. ఈసారి మాత్రం టిప్రా మోతా రూపంలో కొత్త పార్టీ తెరపైకి రావడంతో సమీకరణాలన్నీ మారిపోయాయి.

మొత్తం అసెంబ్లీ స్థానాలు	60
జనరల్	30
ఎస్టీ	20
ఎస్సీ	10

పరిస్థితి తారుమారు...

త్రిపుర మాజీ రాజ కుటుంబానికి చెందిన ప్రద్యోత్ బిక్రం మాణిక్యదేబ్ బర్మన్ సారథ్యంలో కొంతకాలంగా ప్రత్యేక గిరిజన రాష్ట్రం కోసం పోరాడుతున్న టిప్రా (త్రిపుర ఇండిజినస్ ప్రోగ్రెసివ్ రీజనల్ అలయన్స్) మోతా ఈసారి పార్టీగా రూపాంతరం చెందింది. బీజేపీతో పొత్తు ప్రయత్నాలు విఫలం కావడంతో ఒంటరిగానే రంగంలోకి దిగి పోటీని ముక్కోణంగా మార్చేసింది. అధికార బీజేపీ కూటమికి గట్టి సవాలు విసురుతోంది. మూలవాసులైన గిరిజనులకు ప్రత్యేక రాష్ట్రంగా గ్రేటర్ టిప్రాలాండ్‌ను సాధిస్తామన్న మోతా హామీ ఎస్టీలను విపరీతంగా ఆకట్టుకుంటోంది. ముఖ్యంగా గత ఎన్నికల్లో ఐపీఎఫ్‌టీతో పొత్తు ద్వారా బీజేపీ కొల్లగొట్టిన గిరిజన ఓట్లు ఈసారి చాలావరకు మోతావైపు మళ్లే సూచనలు కనిపిస్తున్నాయి. గిరిజనుల్లోని లెఫ్ట్ ఓటు బ్యాంకుకూ మోతా గండి కొట్టేలా ఉంది. త్రిపురలో గిరిజన ప్రాబల్యం ఎక్కువ. మొత్తం 60 అసెంబ్లీ స్థానాల్లో 20 వారికి రిజర్వయ్యాయి. అంతేగాక మరో 23 గిరిజనేతర స్థానాల్లోనూ 10 శాతానికి పైగా ఉన్న ఎస్టీలు అక్కడా నిర్ణయాత్మకంగానే ఉన్నారు. 2018లో బీజేపీ కూటమి 20 ఎస్టీ సీట్లలో ఏకంగా 17 స్థానాలను దక్కించుకుంది! అలా బీజేపీ కూటమికి అధికారంలోకి రావడంలో కీలకంగా మారిన గిరిజన ఓటర్లు ఈసారి టిప్రా మోతాకే ఓటేస్తామని బహిరంగంగానే చెబుతున్నారు. ఈ సీట్లలో ముఖ్యంగా గిరిజనులు 60 శాతానికి పైగా ఉన్న 12 చోట్ల మోతాకు విజయావకాశాలు అధికంగా కన్పిస్తున్నాయి. 50-60 శాతం మధ్య ఉన్న 5 స్థానాల్లో మోతా గట్టి పోటీ ఇవ్వనుండగా 50 శాతం కంటే తక్కువగా ఉన్న మిగతా మూడు చోట్ల ముక్కోణ పోరు జరిగేలా కన్పిస్తోంది. ఎలా చూసినా బీజేపీ కూటమికి ఈ 20 సీట్లలో ఈసారి రెండు మూడు సీట్లకు మించి దక్కకపోవచ్చని అంచనా. దీనికి తోడు గిరిజన ప్రాబల్యమున్న 23 గిరిజనేతర అసెంబ్లీ స్థానాల్లో కూడా మోతా ఏకంగా 22 చోట్ల పోటీకి దిగడం బీజేపీకి నిద్ర లేకుండా చేస్తోంది. బీజేపీ కూటమి 12 నుంచి 15 సీట్లు కోల్పోయి హంగ్ అసెంబ్లీ ఏర్పడవచ్చని అంచనా. 10 నుంచి 15 సీట్లు గెలిచేలా కన్పిస్తున్న మోతా కింగ్‌మేకర్ అయ్యే అవకాశం లేకపోలేదంటున్నారు.

కులాలవారీగా త్రిపుర జనాభా (శాతాల్లో)

జనరల్	16
బీసీలు	21
ఎస్సీలు	20
ఎస్టీలు	32
ముస్లింలు	9
క్రిస్టియన్లు	2

ఓట్ల చీలికపైనే లెఫ్ట్ ఆశలు

గత ఎన్నికలఓల 42 శాతానికి పైగా ఓట్లు సాధించినా సీట్ల లెక్కలో వెనకబడ్డ సీపీఎం, ఈసారి ఓట్ల చీలికపై బాగా ఆశలు పెట్టుకుంది. బీజేపీ-ఐపీఎఫ్‌టీ కూటమిని ఓడించేందుకు శత్రుత్వాన్ని పక్కన పెట్టి కాంగ్రెస్‌తో జట్టు కట్టింది. 20 గిరిజన సీట్లతో పాటు 22 గిరిజనేతర స్థానాల్లో బీజేపీ ఓటు బ్యాంకుకు మోతా గండికొట్టనుండటం సీపీఎం-కాంగ్రెస్ కూటమికి కలిసొచ్చేలా కన్పిస్తోంది. దీనికి తోడు 2.5 లక్షల ఉద్యోగాలు తదితర హామీలతో యువతను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తోంది. కాకపోతే కాంగ్రెస్ ఓటర్లలో చాలామంది పొత్తును గౌరవించి సీపీఎం అభ్యర్థులకు ఓటేసేందుకు సిద్ధంగా లేరు. ఏడు దశాబ్దాల వైరాన్ని, అధికారంలో ఉండగా తమపట్ల సీపీఎం అనుసరించిన అణచివేత ధోరణిని మర్చిపోలేమని స్పష్టంగా చెబుతున్నారు. అయితే ముస్లింల్లో అత్యధికులు లెఫ్ట్ వైపే మొగ్గుతున్నారు.

బీజేపీ.. అభివృద్ధి మంత్రం

2018లో బీజేపీ అభివృద్ధి నినాదాన్ని జనం నమ్మడంతో ఆ పార్టీ ఏకంగా 43 శాతం ఓట్లు సాధించింది! ఆశించిన అభివృద్ధి కనిపించలేదన్న అసంతృప్తి జనాల్లో ఉంది. శాంతిభద్రతలు క్షీణించాయన్నది మరో పెద్ద ఆరోపణ. అయితే మరోసారి బీజేపీకి అవకాశం ఇచ్చి చూస్తామంటున్న వారి సంఖ్యా ఎక్కువగానే ఉంది. పీఎం ఆవాస్ యోజన మొదలుకుని కిసాన్ సమ్మాన్ నిధి దాకా పలు కేంద్ర పథకాల లబ్ధిదారులు ఎక్కువగానే ఉన్నారు. వీరిలోనూ మహిళల సంఖ్య ఎక్కువ. వారు మళ్లీ బీజేపీకే ఓటేస్తామంటున్నారు. పైగా సీఎం మాణిక్ సాహాకు ప్రజల్లో మంచి పేరుంది. కానీ 9 నెలల క్రితం దాకా సీఎంగా ఉన్న బిప్లబ్ దేబ్ పట్ల జనంలో ఉన్న వ్యతిరేకత బీజేపీకి నష్టం చేసేలా కన్పిస్తోంది. పైగా 2018లో గిరిజనుల్లో మంచి ఆదరణతో 8 సీట్లు సాధించిన భాగస్వామ్య పార్టీ ఐపీఎఫ్‌టీ ఆ తర్వాత అధ్యక్షుడు ఎన్.సి.దేబ్‌బర్మ మృతితో బాగా బలహీనపడింది. దాంతో బీజేపీ ఈసారి ప్రభుత్వ పథకాలనే నమ్ముకుని వాటిపై భారీ ప్రచారంతో హోరెత్తిస్తోంది. రాష్ట్రమంతటా కాషాయ జెండాలే ఎగురుతున్నాయి! ఎక్కడికక్కడ పోలింగ్ బూత్ కార్యాలయాలు తెరిచి తమ నేతలు, కార్యకర్తలను ఓటర్లతో నిత్యం టచ్‌తో ఉంచుతూ అధికార పార్టీ పక్కా ప్రణాళిక ప్రకారం ముందుకు పోతోంది. హిందువుల్లో అత్యధికులైన బెంగాలీలు, ఎస్టీల్లో ఎగువ కులాల వారు బీజేపీ వైపే మొగ్గుతున్నారు. ఇక గిరిజన స్థానాల్లోని బెంగాలీలు బీజేపీకి, ముస్లింలు సీపీఎంకు జై కొడుతున్నారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

అదానీ అంశంపై ప్రశ్నిస్తూనే ఉంటాం: ఖర్గే



న్యూఢిల్లీ: అదానీ అంశాన్ని పార్లమెంట్ లోపలా, బయటా లేవనెత్తుతూనే ఉంటామని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చెప్పారు. ఇది చాలా పెద్ద కుంభకోణమన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. అదానీ అంశంతోపాటు తన, పార్టీ నేత రాహుల్ గాంధీ వ్యాఖ్యలను పార్లమెంట్ రికార్డుల నుంచి తొలగించడం తదితర 10 ప్రశ్నలను ఆయన ప్రభుత్వానికి సంధించారు. ప్రజల డబ్బునకు సంబంధించిన అదానీ అంశం పెద్ద కుంభకోణమని ఖర్గే పేర్కొన్నారు. 'దీనిపై సంయుక్త పార్లమెంటరీ కమిటీ(జేపీసీ) ఏర్పాటుకు ప్రభుత్వం ఎందుకు వెనుకాడుతోంది? ఆర్‌బీఐ, సెబీ, ఈడీ, సీబీఐ వంటి సంస్థలు తమ విధులను నిర్వర్తించకుండా ఎందుకు చేశారు? కుంభకోణాలెన్ని జరిగినా మౌనంగా ఉన్నారెందుకు?అని ఆయన అన్నారు. వీటిపై పార్లమెంట్ వెలుపల, లోపల ప్రభుత్వాన్ని నిలదీస్తామన్నారు. వీటిపై ప్రజాస్వామ్యబద్ధంగా పనిచేయకుండా, నియంత మాదిరిగా వ్యవహరిస్తానంటే ప్రజలు ఈ ప్రభుత్వాన్ని సాగనంపుతారని హెచ్చరించారు. రాజ్యసభలో ప్రశ్నలు మాత్రమే అడిగాను తప్ప ఎలాంటి అన్‌పార్లమెంటరీ మాటలు మాట్లాడలేదన్నారు. లోక్‌సభలో రాహుల్ గాంధీ, రాజ్యసభ రికార్డుల నుంచి తన మాటలను తొలగించడంపై ఆయన.. ప్రజాస్వామ్యం పేరుతో ఏం జరుగుతోందో మీరే ఊహించుకోండని వ్యాఖ్యానించారు. తన మిత్రుడి కుంభకోణాల మకిలిని పోగొట్టేందుకు ప్రధాని మోదీ పార్లమెంట్‌ను వాషింగ్ మెషీన్‌లాగా వాడుకుంటున్నారని ఖర్గే ట్వీట్ చేశారు.

క్షిపణులు, డ్రోన్లతో విరుచుకుపడ్డ రష్యా



కీవ్: ఉక్రెయిన్‌పై రష్యా మరోసారి దాడులు తీవ్రతరం చేసింది. కీలక పారిశ్రామిక ప్రాంతం డోన్‌బాస్‌పై గురిపెట్టింది. లుహాన్స్క్, డొనెట్స్క్ ప్రావిన్స్‌లతోపాటు రాజధాని కీవ్, లీవ్‌పైనా క్షిపణి దాడులు జరిగాయని ఉక్రెయిన్ సైనిక వర్గాలు తెలిపాయి. ''గురువారం సాయంత్రం నుంచి 71 క్రూయిజ్ క్షిపణులను, 35 ఎస్-300 క్షిపణులను, 7 షహెద్ డ్రోన్లను ప్రయోగించారు. 61 క్రూయిజ్ మిస్సైళ్లు, 5 డ్రోన్లను కూల్చేశాం'' అని చెప్పింది. విద్యుత్ వ్యవస్థలపై దాడులతో కొన్ని ప్రాంతాల్లో కరెంటు సరఫరా నిలిచిపోయింది. ఖర్కీవ్‌లో క్షిపణి దాడిలో ఏడుగురు గాయపడినట్లు అధికారులు చెప్పారు. జపొరిజియాపై గంట వ్యవధిలోనే 17సార్లు క్షిపణి దాడులు జరిగాయి. ఐదు క్షిపణులను, 5 షాహెద్ కిల్లర్ డ్రోన్లను కూల్చివేశామన్నారు. రష్యా క్షిపణులు రెండు రొమేనియా, మాల్డోవా గగనతలంలోకి వెళ్లినట్లు ఉక్రెయిన్ సైనిక జనరల్ ఒకరు చెప్పారు. నిరసనగా మాల్డోవా తమ దేశంలోని రష్యా రాయబారికి సమన్లు పంపింది. డొనెట్స్క్‌లో రష్యా అదనంగా బలగాలను రంగంలోకి దించింది. లుహాన్స్క్ ప్రావిన్స్‌పై పట్టు సాధించేందుకు రష్యా ఆర్మీ తీవ్రంగా ప్రయత్నిస్తోంది.

అనారోగ్యంతో ఆస్పత్రిలో శిబు సోరెన్

రాంచీ: జార్ఖండ్ ముక్తి మోర్చా(జేఎంఎం) చీఫ్ శిబు సోరెన్(79) అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరారు. ఆయనకు జరిపి శ్వాసకోశ ఇన్ఫెక్షన్‌ను గుర్తించినట్లు ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. సోరెన్ ఆరోగ్యం నిలకడగా ఉందని, చికిత్స కొనసాగుతోందని ఆయన కుమారుడు జార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్ ట్వీట్ చేశారు. 2005-10 మధ్య సోరెన్ జార్ఖండ్ సీఎంగా పనిచేశారు. లోక్‌సభకు 8 పర్యాయాలు ఎన్నికయ్యారు. ప్రస్తుతం రాజ్యసభ ఎంపీగా ఉన్నారు.

కాంగ్రెస్ ఎంపీ రజనీపై సస్పెన్షన్ వేటు

న్యూఢిల్లీ: నిబంధనలకు విరుద్ధంగా రాజ్యసభ కార్యకలాపాలను ఫోన్‌లో చిత్రిస్తున్న కాంగ్రెస్ ఎంపీ రజనీ అశోక్‌రావ్ పాటిల్‌ను సభాధ్యక్షుడు జగదీప్ ధన్‌ఖడ్ శుక్రవారం సస్పెండ్ చేశారు. బడ్జెట్ సమావేశాలయ్యే దాకా సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు. ఎంపీలపై ఆయన చర్యలు తీసుకోవడం ఇదే ప్రథమం. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానానికి ప్రధాని మోదీ సమాధానమిస్తుండగా విపక్ష సభ్యుల నిరసనను పాటిల్ వీడియో తీశారు. ఆమెను సస్పెండ్ చేయాలంటూ రాజ్యసభ నేత, కేంద్ర మంత్రి పీయూష్ గోయెల్ తీర్మానం ప్రవేశపెట్టారు. అనంతరం ధన్‌ఖడ్ అన్ని పార్టీల నేతల అభిప్రాయం కోరారు. ఆమెపై చర్య తీసుకునే ముందు విచారణ జరిపితే బాగుంటుందని వారన్నారు.

సాక్షి
హైదరాబాద్
శనివారం । 11 । ఫిబ్రవరి । 2023



పోటీలను తిలకించడానికి వస్తున్న యువత



మహేష్‌బాబు సతీమణి నమ్రత, కుమారుడు గౌతమ్

న్యూస్‌రీల్

ప్రెస్‌క్లబ్ డైరీ ఆవిష్కరణ



డైరీ ఆవిష్కరిస్తున్న డీజీపీ తదితరులు

లక్డీకాపూల్: శాంతిభద్రతల పరిరక్షణలో మీడియా పాత్ర కీలకమని డీజీపీ అంజనీకుమార్ అన్నారు. శుక్రవారం హైదరాబాద్ ప్రెస్ క్లబ్ రూపొందించిన 2023 నూతన డైరీని తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణలో జర్నలిస్టులు తమకు సహరించాలని సూచించారు. నూతన డైరీలో మీడియా సమాచారం పొందుపరచటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ హైదరాబాద్ అధ్యక్షుడు ఎల్.వేణుగోపాలనాయుడు, సంయుక్త కార్యదర్శులు చిలుకూరి హరిప్రసాద్, రమేష్ వైట్ల, కోశాధికారి రాజేష్‌తో పాటు ప్రెస్ క్లబ్ కమిటీ సభ్యులు బి.గోపరాజు, రాఘవేందర్ రెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

13న బీఆర్ఎస్ నియోజకవర్గ సమావేశాలు

సాక్షి, సిటీబ్యూరో: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, కేటీ రామారావు ఆదేశాల మేరకు ఈ నెల 13వ తేదీన నగరంలోని అన్ని నియోజకవర్గాల్లో పార్టీ జనరల్ బాడీ సమావేశాలు నిర్వహించనున్నట్లు మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్ తెలిపారు. ఈ మేరకు నియోజకవర్గ నేతలకు ఆదేశాలు జారీ చేశారు. 17వ తేదీన ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించడంతోపాటు తెలంగాణ సచివాలయం ప్రారంభోత్సవం, పరేడ్ గ్రౌండ్‌లో భారీ బహిరంగసభ నిర్వహించనున్న నేపథ్యంలో సభకు భారీగా జన సమీకరణ తదితర అంశాలపై సమావేశాల్లో చర్చించి కార్యాచరణ రూపొందించనున్నట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమావేశాల్లో ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ల చైర్మన్లు, మాజీ చైర్మన్లు, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, పార్టీ డివిజన్ అధ్యక్షులు, మాజీ అధ్యక్షులు,సీనియర్ నాయకులు పాల్గొంటారని తెలిపారు.

ఇంటికే ఓటరు కార్డు

- కొత్తగా నమోదు చేసుకున్న వారికి
- పోస్టులో పంపుతున్న జీహెచ్ఎంసీ



సాక్షి, సిటీబ్యూరో: ఓటరు జాబితాలో కొత్తగా పేరు నమోదు చేసుకున్న వారి ఇంటి చిరునామాకే ఓటరు కార్డుల పంపిణీ ప్రారంభమైంది. హైదరాబాద్ జిల్లా పరిధిలో దాదాపు రెండేళ్లగా ఓటరు కార్డులు లేకపోవడంతో వాటి పంపిణీ ప్రక్రియ నిలిచిపోయింది. ఓటరు కార్డులు లేకపోవడం వల్ల కొత్తగా ఓటరుగా నమోదైన వారితోపాటు, పాత కార్డులున్నప్పటికీ వాటిని పోగొట్టుకున్న వారికి కార్డుల పంపిణీ నిలిచిపోయింది. ఈ వివరాలతో 'సాక్షి'లో వెలువడిన కథనంతో స్పందించిన అధికారులు తగు చర్యలు చేపట్టారు. గత కొన్ని రోజులుగా కొత్తగా ఓటరుగా నమోదైన వారి ఇళ్లకు కొత్త ఓటరు కార్డులు తపాలాశాఖ ద్వారా పంపిస్తున్నారు. ఎన్నికల సంఘం కార్యాలయం నుంచి అందిన ఈ కార్డుల్ని జీహెచ్ఎంసీ సర్కిళ్లవారీగా కవర్లమీద కార్యాలయ స్టాంపువేసి పంపిస్తున్నారు. దరఖాస్తుదారులెవరైనా చిరునామాలో లేని పక్షంలో అవి తిరిగి జీహెచ్ఎంసీ కార్యాలయాలకు రిటర్న్ అయ్యేలా కార్యాలయ చిరునామా స్టాంపులు వేస్తున్నట్లు సంబంధిత విభాగం పేర్కొంది. దాదాపు రెండేళ్లుగా కొత్త ఓటర్లుగా మూడు లక్షల మంది వరకు పేర్లు నమోదు చేసుకున్నట్లు సమాచారం. వారందరికీ ఈ కార్డులు పంపిస్తున్నారు.

హజ్ యాత్రికులకు ఊరట

సాక్షి, సిటీబ్యూరో: హజ్ యాత్రికులకు కేంద్ర ప్రభుత్వం ఊరటనిచ్చింది. ప్రతి యాత్రికుడికి రూ.50 నుంచి 80 వేలు ఆదా అయ్యేలా సరికొత్త మార్గదర్శకాలను జారీ చేసింది. యాత్రికులు సొంత ఖర్చులపై హజ్‌కు వెళ్లేలా మరింత వెసులుబాటు కల్పించింది. ఎక్కడి నుంచైనా గమ్యస్థానానికి చేరుకునేలా యాత్రికులకు అవకాశమిచ్చింది. ఈ మేరకు కొత్త హజ్ పాలసీని కేంద్ర మైనార్టీ వ్యవహారాల శాఖ వెల్లడించింది. తాజా నిబంధనల మేరకు హజ్ కమిటీ వద్ద డిపాజిట్ చేయాల్సిన రియాల్, గొడుగు, బ్యాగులు, బెడ్‌షీట్ల వంటి ఇతరత్రా సరంజామాను సొంతంగా సమకూర్చుకోవాల్సివుంటుంది. గతంలో వీటిని హజ్ కమిటీ యాత్రికుల సొమ్ముతో పంపిణీ చేసేది. అయితే, వీటి కొనుగోళ్లలో అక్రమాలు జరిగినట్లు ఇటీవల కేంద్ర ప్రభుత్వం గుర్తించింది. ప్రాసెసింగ్ ఫీజు పేరిట వసూలు చేసే రూ.500 కూడా రద్దు చేసింది. యాత్రికులు కోరుకున్న చోటు నుంచి హజ్‌కు వెళ్లే అవకాశముండడంతో దూరభారం తగ్గేలా చర్యలు తీసుకుంది.



రేసును తిలకిస్తున్న సందర్శకులు



జూనియర్ ఎన్టీఆర్ సతీమణి లక్ష్మీ ప్రణతి



భారత జెండాతో విదేశీయులు





'ఇ' రేస్.. ఇక జోష్

ఫార్ములా-ఇ రేసింగ్‌కు నగరం సిద్ధం

- దేశంలోనే తొలిసారి జరుగుతున్న ఈవెంట్
- సర్క్యూట్ వద్ద సెలబ్రిటీల సందడి

హుస్సేన్ సాగర్ తీరం ఈ వారాంతం నగర అభిమానులకు కొత్త వినోదాన్ని అందించనుంది. ప్రతీ వారం అలా నెక్లెస్ రోడ్‌లో విహారానికి వచ్చేవారి కోసం కాకుండా క్రీడాభిమానుల కోసం ఈ రెండో శనివారం ప్రత్యేకంగా అంకితం కానుంది. దేశంలోనే తొలిసారి నిర్వహిస్తున్న ప్రతిష్టాత్మక ఫార్ములా-ఇ రేసింగ్‌లో ఎలక్ట్రిక్ కార్లు జూమ్మంటూ దూసుకుపోవడాన్ని ఆస్వాదించేందుకు పెద్ద సంఖ్యలో ఫ్యాన్స్ సిద్ధమవుతున్నారు. శుక్రవారం కార్లతో కాస్త సాధన చేసిన డ్రైవర్లు నేడు అసలు పోరులో తమ సత్తా చాటనున్నారు. ఇక రేస్‌ను ప్రత్యక్షంగా వీక్షించేందుకు వచ్చే సినిమా తారలు, ఇతర సెలబ్రిటీలతో కూడా ఐమ్యాక్స్ పరిసరాలన్నీ సందడితో నిండిపోనున్నాయి.



వీకెండ్‌లో సందడే సందడి

సాక్షి, హైదరాబాద్: భాగ్యనగర అభిమానులకు వారం రోజుల పాటు ట్రాఫిక్ సమస్యలు ఇబ్బంది కలిగించవచ్చు గాక... విపరీతమైన జామ్‌లతో వారంతా అసహనం ప్రదర్శించవచ్చు గాక... కానీ ఒక వరల్డ్ ఈవెంట్ మన నగరంలో జరుగుతోందంటే సహజంగానే ఉండే ఆసక్తి ఆ వైపు లాక్కు వెళుతుంది. ఇప్పుడు ఫార్ములా-ఇ కూడా అలాగే అందరినీ ఆకర్షిస్తోంది. గంటకు దాదాపు 320 కిలోమీటర్ల వేగంతో రయ్యిరయ్యిమంటూ దూసుకుపోతూ ఫుల్ మీల్స్ వినోదం అందించడం మాత్రం ఖాయం. ఎన్నో ఏళ్లుగా మోటార్ రేసింగ్‌లపై ఆసక్తి ఉన్నవారు టీవీల్లో ఫార్ములావన్ (ఎఫ్1) పోటీలను తిలకిస్తూనే ఉంటారు. అయితే ఎఫ్1 అంత రేంజ్‌లో కాకపోయినా ప్రపంచస్థాయి ఈవెంట్‌గా మాత్రం ఫార్ములా-ఇ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. దేశంలోనే ముంబై, ఢిల్లీలాంటి మెగా నగరాలను కాదని మన హైదరాబాద్‌లో ఇలాంటి పోటీ జరగడం, దానిని చూసే అవకాశం రావడం సగటు అభిమాని దృష్టిలో పెద్ద విశేషం.

హుస్సేన్ సాగర్ వద్దే ఎందుకు...

ప్రపంచవ్యాప్తంగా ఫార్ములా-ఇ రేసులన్నీ నగరం మధ్యలోనే జరుగుతాయి. ఆయా నగరాల్లో పాపులర్ అయిన ఒక టూరిజం కేంద్రానికి చేరువలో 'స్ట్రీట్ సర్క్యూట్' పేరుతో ట్రాక్‌ను అభివృద్ధి చేస్తారు. సరిగ్గా హైదరాబాద్‌లో కూడా అదే జరిగింది. ఫార్ములా వన్‌లలో ఉండే ప్రత్యేక ట్రాక్ కాకుండా రేస్ ముగిసిపోగానే స్ట్రీట్ సర్క్యూట్‌ను మళ్లీ మామూలుగా వాడుకోవచ్చు. ఎక్కువ మంది అభిమానులకు నగరం నడిబొడ్డున వినోదం అందించడమే ఈ రేస్‌ల లక్ష్యం.

నేటి షెడ్యూల్

ఉ.గం.8.05 - 8.55
(ఫ్రీ ప్రాక్టీస్ రేస్-2)
10.40-11.55 (క్వాలిఫయింగ్)
మ.3.03 - 4.30 (ప్రధాన రేస్)

టీవీలో క్వాలిఫయింగ్, ప్రధాన రేస్ ప్రత్యక్ష ప్రసారం: స్టార్ స్పోర్ట్స్ సెలక్ట్-2, డిస్నీ హాట్‌స్టార్ యాప్.

- ప్రపంచవ్యాప్తంగా ఫార్ములా-ఇ పోటీలకు ఆతిథ్యమిస్తున్న 30వ నగరం హైదరాబాద్
- ఇప్పటి వరకు 8 సీజన్‌లు జరిగాయి. ప్రస్తుతం జరుగుతోంది 9వ సీజన్.

ఏమిటీ ఫార్ములా-ఇ ..

పేరులోనే 'ఇ' ఉంటూ ఎలక్ట్రిక్ అంటూ స్పష్టంగా చెప్పేయడంతోనే దీని ప్రత్యేకత ఏమిటో అర్థమవుతుంది. పెట్రోల్‌తో నడిచే ఫార్ములావన్ కార్లతో పోలిస్తే కాలుష్యరహితంగా, కర్బన ఉద్గారాలు తగ్గించేందుకు తీసుకొచ్చిన కొత్త తరం కార్లు ఇవి. 2014లోనే ఫార్ములా-ఇ మొదలైనా...దాని స్థాయి పెరిగి ప్రచారంలోకి వచ్చేందుకు కొంత సమయం పట్టింది. ఈసారి మరింత కొత్తగా, హంగులతో ఆధునిక టెక్నాలజీ కార్లు రేసింగ్‌లో పాల్గొనబోతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఎలక్ట్రిక్ వాహనాల ఉపయోగంపై ప్రచారం కల్పించేందుకు కూడా ఈ ఈవెంట్ ద్వారా ప్రయత్నిస్తున్నారు.

సర్క్యూట్ ఎలా ఉంది...

మన హుస్సేన్ సాగర్ తీరాన 2.83 కిలోమీటర్ల ట్రాక్ ఉంది. ఇందులో 18 మలుపులు రేస్‌ను ఆసక్తికరంగా మారుస్తాయి. దీని వల్ల బ్రేక్‌ల వాడకం ఎక్కువగా ఉంటుంది. ఆసక్తికరమైన అంశం ఏమిటంటే బ్రేక్‌లు వాడటం వల్లే ఈ కార్లతో 40 శాతం వరకు ఎనర్జీ ఉత్పత్తి అవుతుంది. ఈ 'రీ ఎనర్జీ'తోనే కారు మరింతగా దూసుకుపోతుంది.



దెబ్బతిన్న కారును తరలిస్తున్న దృశ్యం

భారతీయులు ఉన్నారా?

ఫార్ములా-ఇ రేసింగ్ నేరుగా భారత్‌కు చెందిన డ్రైవర్లు ఎవరూ పాల్గొనడం లేదు. అయితే భారత్‌కు చెందిన 'మహీంద్రా' రేసింగ్ టీమ్ మాత్రం ఉంది. ఇందులో ఇద్దరు డ్రైవర్లు విదేశీయులే కాగా, రిజర్వ్ డ్రైవర్‌గా భారత్‌కు చెందిన జెహాన్ దారువాలా ఉన్నాడు. మరో వైపు జాగ్వార్ టీమ్‌కు భారత్ చెందిన టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ ప్రధాన స్పాన్సర్‌గా వ్యవహరిస్తోంది. కాబట్టి అభిమానులు ఏదైనా జట్టును 'సొంతం' చేసుకుంటే ఈ వినోదాన్ని మరింతగా ఆస్వాదించవచ్చు.



కారును సిద్ధం చేస్తున్న రేసర్లు

ట్రాక్‌వైపు దూసుకెళ్లిన వాహనదారులు

వెల్లడైన భద్రతా లోపం




ఖైరతాబాద్: ఫార్ములా ఇ-రేసింగ్ నేపథ్యంలో విధించిన ట్రాఫిక్ ఆంక్షలపై వాహనదారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత నాలుగు రోజులుగా ఖైరతాబాద్, ఎన్టీఆర్ మార్గ్, లక్డీకాపూల్, మింట్‌కాంపౌండ్ తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు, మరో పక్క అసెంబ్లీ సమావేశాల కారణంగా వాహనదారులు గంటల తరబడి రోడ్లపైనే ఉండాల్సి వచ్చింది. శుక్రవారం సాయంత్రం 5 గంటల ప్రాంతంలో ఖైరతాబాద్ ఫ్లై ఓవర్ నుంచి వచ్చే వాహనాలను నెక్లెస్ రోడ్డు వైపుకు మళ్లించారు. ఫ్లై ఓవర్ మీదుగా వచ్చిన వాహనదారులు ఇందిరాగాంధీ రోటరీ చౌరస్తా వద్ద నుంచి ఎన్టీఆర్ మార్గ్ వైపునకు వెళ్లేందుకు అనుమతించకపోవడంతో సహనం కోల్పోయిన వాహనదారులు అడ్డంగా ఉన్న బారికేడ్లను తొలగించి ముందుకు వెళ్లారు. ఒక్కసారిగా రేసింగ్ ట్రాక్ వైపునకు వాహనాలు దూసుకురావడంతో పోలీసులు వెంటనే ఆ వాహనాలను నిలిపివేసి వెనక్కి పంపారు. దీంతో కొద్దిసేపు అక్కడ గందరగోళ పరిస్థితి నెలకొంది. ఫార్ములా ఇ-రేసింగ్ ముఖ్యమా...ప్రజలు ముఖ్యమా అంటూ వాహనదారులు వాగ్వాదానికి దిగారు. ఈ రగడ కారణంగా ఫార్ములా ఇ-రేసింగ్ ప్రాక్టీస్ రేస్ అరగంట ఆలస్యంగా ప్రారంభమైంది. కాగా ట్రాఫిక్ ఆంక్షలు, డైవర్షన్లపై అధికారులు ముందుగానే సూచనలు చేసినా భద్రతా లోపం కొట్టొచ్చినట్లుగా కన్పించింది. ఇక శనివారం ప్రధాన రేస్ ఉండటంతో ఉన్నతాధికారులు అలర్ట్ అయ్యారు. పరిస్థితిని సమీక్షించారు.



హైలైట్స్

- నెక్లెస్ రోడ్డులోని 2.8 కిలోమీటర్‌ల స్ట్రీట్ సర్క్యూట్‌ను సిద్ధం చేయడంతో పాటు ఈ పోటీల నిర్వహణకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు.
- సుమారు 20 వేల మందికి పైగా వీక్షించేందుకు అనువైన పెద్ద గ్యాలరీలను ఏర్పాటు చేశారు. భారీ స్క్రీన్‌లను సిద్ధంచేశారు.
- శనివారం నాటి పోటీలకు సన్నాహకంగా శుక్రవారం నిర్వహించిన ప్రాక్టీస్ రన్ ఆలస్యంగా ప్రారంభమైంది. ట్రాఫిక్ ఆంక్షల కారణంగా తెలుగుతల్లి ఫ్లై ఓవర్, లక్డీకాపూల్ మార్గంలో వాహనదారులు తీవ్ర గందరగోళానికి గురయ్యారు. ఈ క్రమంలో కొన్ని వాహనాలు ట్రాక్‌పైకి దూసుకురావడంతో ట్రయల్స్ నిర్వహణకు ఆటంకం కలిగినట్లు తెలిసింది.
- మరోవైపు ట్రయల్స్ ఆరంభంతోనే రేసింగ్ డ్రైవర్‌లు హోరెత్తించారు. అపరిమితమైన వేగంతో వాహనాలను పరుగులు పెట్టించి సందర్శకులను హుషారెత్తించారు.
- శుక్రవారం సాయంత్రం ఈ పోటీలను ట్రయల్ రన్‌గా నిర్వహించినప్పటికీ వీక్షించేందుకు సందర్శకులు పెద్ద సంఖ్యలోనే తరలి వచ్చారు.
- ట్రయల్ రన్స్ తుదిదశకు చేరుకున్న తరువాత ప్రమాదం చోటుచేసుకుంది. ట్రాక్‌పై దూసుకెళ్తున్న ఓ కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీ కొట్టింది. దీంతో ట్రయల్స్‌ను నిలిపివేశారు. క్రేన్ సాయంతో కారును అక్కడి నుంచి తరలించారు.





ప్రముఖుల సందడి..

ట్రయల్ రన్స్‌ను వీక్షించేందుకు నగరానికి చెందిన మోటార్ స్పోర్ట్స్ ప్రియులు పెద్ద సంఖ్యలోనే తరలి వచ్చారు. వివిధ రంగాలకు చెందిన ప్రముఖులతో వీఐపీ గ్యాలరీలు సందడిగా కనిపించాయి. ప్రముఖ సినీనటుడు జూనియర్ ఎన్టీఆర్ భార్య లక్ష్మీ ప్రణతి, మహేష్‌బాబు భార్య నమ్రత శిరోద్కర్, బాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధు, తెలుగుదేశం నాయకుడు లోకేష్ భార్య బ్రాహ్మణితో పాటు వారి పిల్లలు ఈ ట్రయల్ రన్ సందర్భంగా సందడి చేశారు.

నగరంలో నేడు

- ఏబీబీ ఈ ఫార్ములా వరల్డ్ చాంపియన్‌షిప్(రేసింగ్) సాయంత్రం నెక్లెస్ రోడ్‌లో జరుగుతుంది.
- నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లోని మనోరంజన్ కాంప్లెక్స్‌లో ఉదయం 10 గంటలకు జాతీయ లోక్ అదాలత్ జరుగుతుంది.

ముగిసిన బ్యాడ్మింటన్ పోటీలు



సాక్షి, సిటీబ్యూరో: ఆల్ ఇండియా బీఎస్ఎన్ఎల్ 19వ బ్యాడ్మింటన్ పోటీలు శుక్రవారం ముగిశాయి. మూడు రోజుల క్రితం సికింద్రాబాద్ రైల్వే ఇండోర్ స్టేడియంలో ప్రారంభ మైన ఈ పోటీల్లో ప్రతిభను కనపర్చిన క్రీడాకారులకు అవార్డులను అందజేశారు. కార్యక్రమంలో ఐపీఓఎస్ ప్రకాష్, చాగంటి శ్రీనివాస్, మహేంద్ర భాస్కర్, కేవీకే ప్రసాదరావు, సుజాత, అనిలా కిరణ్, శేషాచలం, కళ్యాణ్, నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సందడిగా 'సాక్షి' ప్రీమియర్ లీగ్

- జూనియర్ విభాగంలో విజేతగా గౌతమ్ జూనియర్ కాలేజ్
- సీనియర్స్ విభాగంలో విజేతగా భవన్స్ వివేకానంద డిగ్రీ కాలేజ్
- 17 రీజినల్ ఫైనల్స్



భవన్స్ వివేకానంద డిగ్రీ కళాశాల జట్టు

పోచారం: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా, ప్రతాపసింగారంలోని బాబురావు సాగర్ క్రికెట్ మైదానంలో కొనసాగుతున్న 'సాక్షి' ప్రీమియర్ లీగ్–4 మ్యాచ్‌లు శుక్రవారం సెమీ ఫైనల్స్‌తో పాటు ఫైనల్స్ సందడిగా సాగాయి.

విజేతల వివరాలు..

బాబూరావు సాగర్ క్రికెట్ మైదానం – 1

- జూనియర్స్ విభాగం ఫైనల్ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన గౌతమ్ జూనియర్ కాలేజ్ ఈసీఐఎల్ జట్టు 8 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 87 పరుగులు సాధించింది. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన భవన్స్ శ్రీఅరవిందో జూనియర్ కాలేజ్ జట్టు 8 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 79 రన్స్ తీసి ఓటమి పాలైంది. దీంతో హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్ జిల్లాల స్థాయి జూనియర్ విభాగంలో గౌతమ్ జూనియర్ కాలేజ్ జట్టు విజేతగా నిలిచింది.
- సీనియర్ విభాగంలో మొదటి సెమీ ఫైనల్స్‌లో వేద డిగ్రీ కాలేజ్ జట్టు 10 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 86 రన్స్ చేసింది. తర్వాత బ్యాటింగ్ చేసిన ఎంఎల్ఆర్ ఐటీ దుండిగల్ జట్టు 10 ఓవర్లలో 7 వికెట్ల కోల్పోయి 82 రన్స్ మాత్రమే చేయడంతో వేద డిగ్రీ కాలేజ్ విజయం సాధించింది.

బాబూరావు సాగర్ క్రికెట్ మైదానం – 2

- సీనియర్స్ విభాగం రెండో సెమీ ఫైనల్స్‌లో ఎస్‌పీ కాలేజ్ జట్టు 10 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 116 పరుగులు తీసింది. ఈ జట్టుతో తలపడిన భవన్స్ వివేకానంద డిగ్రీ కళాశాల జట్టు 9.4 ఓవర్లలో 2 వికెట్ల కోల్పోయి 117 పరుగులు తీసి విజయం చేజిక్కించుకుంది. ఈ సెమీ ఫైనల్స్‌లో భవన్స్ జట్టు నుంచి జగదీష్ 27 బంతుల్లో 66 పరుగులు చేశాడు. మరో క్రీడాకారుడు క్రిస్టిక్ 26 బంతుల్లో 49 రన్స్ చేశాడు.
- సీనియర్స్ విభాగం ఫైనల్స్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన వేద డిగ్రీ కళాశాల జట్టు 10 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 72 రన్స్ చేసింది. వీరితో బ్యాటింగ్ చేసిన భవన్స్ వివేకానంద డిగ్రీ కాలేజ్ జట్టు 1 వికెట్ కోల్పోయి 73 పరుగులు చేసి విజయకేతనం ఎగురవేసింది. భవన్స్ జట్టు సభ్యుడు నితీష్ 8 బాల్స్‌లో 27 రన్స్ తీసి ప్రతిభ చాటాడు. జగదీష్ 15 బంతుల్లో 22 రన్స్ సాధించాడు. సీనియర్ విభాగంలో హైదరాబాద్ జిల్లా విజేతగా భవన్స్ వివేకానంద డిగ్రీ కళాశాల సైనిక్‌పురి నిలిచింది.
- ఈ నెల 17న ఇదే మైదానంలో రీజినల్ ఫైనల్స్ నిర్వహించనున్నారు.

SPL SAKSHI PREMIER LEAGUE

SAKSHI | SAKSHI DIGITAL MEDIA GROUP



గౌతమ్ జూనియర్ కాలేజ్ ఈసీఐఎల్ జట్టు

సంతోష్‌నగర్ సీఐ వంశీకృష్ణా రావుపై వేటు

ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్‌గా శేఖర్ రెడ్డి



వంశీకృష్ణా రావు



శేఖర్ రెడ్డి

సంతోష్‌నగర్: మహిళా ఎస్సైపై వేధింపులకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న సంతోష్‌నగర్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ టి.వంశీకృష్ణా రావును పోలీసు ఉన్నతాధికారులు పేట్లబురుజులోని సీఏఆర్ హెడ్ క్వార్టర్స్‌కు అటాచ్ చేశారు. ఈ విషయంపై పూర్తి విచారణ చేపట్టిన అనంతరం చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో భవానీనగర్ పోలీస్‌స్టేషన్‌లో అడిషనల్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న శేఖర్ రెడ్డిని సంతోష్‌నగర్ ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్‌గా బదిలీ చేశారు. శుక్రవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు.

స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లతో బీజేపీలో జోష్!

- పలు చోట్ల హాజరైన పార్టీ అగ్రనేతలు..
- సికింద్రాబాద్ సమావేశంలో కిషన్‌రెడ్డి హాజరు..
- బల్కంపేట్‌లో సునీల్ బన్సల్... ఓల్డ్ బోయిన్‌పల్లిలో బండి సంజయ్..

సాక్షి, సిటీబ్యూరో: సార్వత్రిక ఎన్నికలకు ముందుగానే కమలనాథులు సమర శంఖం పూరించారు. అధికార పార్టీ వైఫల్యాలను ఎండగడుతూ.. అధికారమే లక్ష్యంగా కమలం పార్టీ నగరంలో నిర్వహిస్తున్న స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లు ఆ పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం నింపుతున్నాయి. ప్రజా సమస్యలు తెలుసుకోవడం, తాము అధికారంలోకి వస్తే ఏం చేస్తామన్న అంశాలను వివరిస్తూ కార్నర్ మీటింగ్‌లు నిర్వహిస్తూ నగరంలో అన్ని వర్గాలకు చేరువయ్యేందుకు ఆ పార్టీ ప్రయత్నిస్తోంది. గత తొమ్మిదేళ్లుగా టీఆర్ఎస్ ప్రభుత్వం నెరవేర్చని హామీలు, కేసీఆర్ కుటుంబ అవినీతి, నియంత పాలన నుంచి రాష్ట్ర ప్రజలకు విముక్తి కల్పించాలనే లక్ష్యంతో 'ప్రజా గోస.. బీజేపీ భరోసా' పేరుతో ఈ సమావేశాలను నిర్వహిస్తున్న విషయం విదితమే. శుక్రవారం ప్రారంభమైన ఈ సమావేశాలు రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 25 వరకు కొనసాగనున్నాయి. మొత్తంగా రాష్ట్రంలోని మొత్తం 119 నియోజకవర్గాల్లో.. 11 వేల శక్తి కేంద్రాల్లో ఈ కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. గ్రేటర్ పరిధిలోని 25 నియోజకవర్గాల్లోనూ నిర్వహించే సమావేశాలను విజయవంతం చేసే అంశంపై ఆ పార్టీ అగ్రనేతలు ప్రత్యేకంగా దృష్టిసారించారు. ప్రధాని మోదీ నేతృత్వంలో జాతీయ స్థాయిలో తమ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై నగరవాసులకు అవగాహన కల్పించడం, ఇంటింటికీ కమలం గుర్తును తీసుకెళుతున్నట్లు కమలనాథులు చెబుతున్నారు. నగరంలో మార్కెట్ యార్డ్స్, ప్రధాన కూడళ్లు, జనసమూహం అధికంగా ఉండే ప్రదేశాల్లోనే ఈ సమావేశాలను నిర్వహిస్తుండడం విశేషం.



సికింద్రాబాద్‌లో కిషన్‌రెడ్డి.. ఓల్డ్ బోయిన్‌పల్లిలో బండి సంజయ్

సికింద్రాబాద్ నియోజకవర్గంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి స్ట్రీట్ కార్నర్ సమావేశంలో పాల్గొన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలోని ఓల్డ్ బోయిన్‌పల్లి ఎక్స్ రోడ్డులో స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ పాల్గొన్నారు. అధికార టీఆర్ఎస్ పార్టీ వైఫల్యాలపై ధ్వజమెత్తారు. ఇక సనత్‌నగర్ నియజకవర్గంలో శుక్రవారం సాయంత్రం ఏర్పాటు చేసిన సమావేశంలో బీజేపీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి సునీల్ బన్సల్, ఎంపీ లక్ష్మణ్ పాల్గొన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో జరిగిన సమావేశంలో మధ్యప్రదేశ్ రాష్ట్ర బీజేపీ ఇన్‌చార్జి మురళీధర్‌రావు పాల్గొన్నారు. కాగా ఈ సమావేశాల అనంతరం నియోజకవర్గాల స్థాయిలో భారీ బహిరంగ సభలకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు బీజేపీ నేతలు చెబుతున్నారు. యువత, మహిళలు, మధ్యతరగతి, వేతనజీవులు, అల్పాదాయ వర్గాలు ఇలా అన్ని వర్గాలకు చేరువయ్యేందుకు బీజేపీ ఉద్యమ స్ఫూర్తితో ఈ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ నేతలు పేర్కొంటున్నారు.

భూ కబ్జా కేసులో రియల్టర్ అరెస్ట్

- కుమారుడి పెళ్లి వేడుకల్లో అదుపులోకి తీసుకున్న పోలీసులు
- గత కొంత కాలంగా పరారీలో..



వివరాలు వెల్లడిస్తున్న మేడ్చల్ సీఐ రాజశేఖర్‌రెడ్డి



నిందితుడు కుతాడి శ్రీనివాస్

మేడ్చల్‌రూరల్: భూ కబ్జాలు, బెదిరింపులకు పాల్పడుతూ గత కొంత కాలంగా పోలీసులకు చిక్కకుండా తిరుగుతుండడంతో రియల్ ఎస్టేట్ వ్యాపారిపై పీడీ యాక్టు నమోదు చేసిన పోలీసులు సినీ ఫక్కీలో అతడి కుమారుడి పెళ్లి వేడుకలోనే నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మేడ్చల్ సీఐ రాజశేఖర్‌రెడ్డి కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. జవహర్‌నగర్ పరిధిలోని బాలాజీ నగర్‌కు చెందిన కుతాడి శ్రీనివాస్ అలియాస్ ఎరుకల శ్రీను రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుంటాడు. భూ దందాలకు పాల్పడుతున్న అతను రైతుల భూములను డెవలప్‌మెంట్ ఒప్పందం పేరిట తీసుకుని మోసాలకు పాల్పడుతున్నాడు. బాధితులు గట్టిగా నిలదీస్తే వారిపై బెదిరింపులకు పాల్పడడం, మరికొందరి వద్ద డబ్బులు తీసుకుని 12శాతం వడ్డీతో చెల్లిస్తానని లేని పక్షంలో తన పేరిట ఉన్న భూమిని రిజిస్ట్రేషన్ చేసి ఇస్తానని చెప్పి రూ.10 కోట్లకు పైగా వసూలు చేశాడు. చివరకు బెదిరింపులకు దిగడంతో పలువురు బాధితులు మేడ్చల్ పోలీసులను ఆశ్రయించడంతో అతడిపై 7 కేసులు నమోదయ్యాయి. అప్పటి నుంచి పోలీసులకు చిక్కకుండా తిరుగుతున్న అతను గత కొంత కాలంగా ఢిల్లీ, బెంగళూరు, దుబాయ్‌లలో తలదాచుకున్నాడు. ఈ నేపథ్యంలో శ్రీనుపై పీడీ యాక్టు నమోదు చేయాలని కోరుతూ మేడ్చల్ పోలీసులు ఉన్నతాధికారులకు నివేదించారు. దీంతో అతడిపై పీడీ యాక్టు నమోదు చేస్తూ సైబరాబాద్ సీపీ గురువారం ఆదేశాలు జారీ చేశారు.

కుమారుడి పెళ్లి వేడుకల్లో అరెస్ట్

నిందితుడు కుతాడి శ్రీనివాస్ అలియాస్ ఎరుకల శ్రీను తన రెండో కుమారుడి పెళ్లి వేడుకల్లో పాల్గొన్నట్లు సమాచారం అందడంతో పోలీసులు సినీఫక్కీలో అతడిని అరెస్ట్ చేశారు. మేడ్చల్ ఏసీపీ వెంకట్‌రెడ్డి, సీఐ రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో 30 మంది పోలీసులు నాగోల్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో అతడు ఉన్నట్లు గుర్తించి పథకం ప్రకారం ఫంక్షన్‌హాల్‌ను చుట్టుముట్టారు. శుక్రవారం తెల్లవారుజామున ఒక్కసారిగా అతడిని పట్టుకునేందుకు వెళ్లగా అతను తప్పించుకునేందుకు యత్నించాడు. దీంతో పోలీసులు చకచక్యంగా వ్యవహరించి శ్రీనును అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వైద్య పరీక్షలు నిర్వహించి శుక్రవారం చర్లపల్లి జైలుకు తరలించారు. నిందితుడిపై మేడ్చల్ పోలీస్ స్టేషన్‌లో 7 కేసులు ఉండగా గతంలో అల్వాల్‌లో 7, జవహర్‌నగర్ లో ఒక కేసు నమోదైనట్లు పోలీసులు వివరించారు. కుతాడి శ్రీను బాధితులు పలువురు ఉన్నారని, అతడి బెదిరింపులకు భయపడి పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు సాహసం చేయలేదని సమాచారం. అతడి అరెస్టుతో మరికొందరు బాధితులు ముందుకు వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

కల్లు గీత సొసైటీలకే వైన్‌షాప్‌ల కేటాయింపు హామీ అభినందనీయం



మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న కల్లు గీత సంఘాల సమన్వయ కమిటీ సభ్యులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: కల్లు గీత సొసైటీలకే వైన్స్ షాప్‌లను కేటాయిస్తామని ప్రభుత్వం అసెంబ్లీలో ప్రకటన చేయడం పట్ల గౌడ కల్లు గీత సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ బాలగోని బాలరాజుగౌడ్, కన్వీనర్ అయిలి వెంకన్నగౌడ్, వర్కింగ్ చైర్మన్ ఎలికట్టే విజయ్‌కుమార్‌గౌడ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం అబ్కారీ శాఖ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత శాసన సభ బడ్జెట్ సమావేశాల సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన హామీతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కల్లు గీత సొసైటీలకు ఆర్థికంగా ఎదిగే అవకాశం దక్కుతుందన్నారు. గౌడ సామాజిక వర్గం ప్రభుత్వానికి అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో కమిటీ వైస్ చైర్మన్ గడ్డమీది విజయ్‌కుమార్‌గౌడ్, బి.వెంకటేష్‌గౌడ్, పోతగాని ఐలయ్య, గౌడ సంఘం సత్తయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నందమూరి రామకృష్ణకు తృటిలో తప్పిన ప్రమాదం



ప్రమాదానికి గురైన నందమూరి రామకృష్ణ కారు

బంజారాహిల్స్: ప్రముఖ నటుడు నందమూరి బాలకృష్ణ సోదరుడు నందమూరి రామకృష్ణకు తృటిలో ప్రమాదం తప్పింది. శుక్రవారం ఉదయం ఆయన తన కారును డ్రైవ్ చేసుకుంటూ జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్10 మీదుగా వెళ్తుండగా కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. అదృష్టవశాత్తు ఆయనకు ఎలాంటి గాయాలు కాలేదు. కారును అక్కడే వదిలేసి వెళ్లిపోయాడు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

తల్లి మందలించిందని..

బాలుడి ఆత్మహత్య



ధరమ్‌వీర్ కుమార్ (ఫైల్)

రసూల్‌పురా: చెల్లితో గొడవ పడినందుకు తల్లి మందలించడంతో మనస్తాపానికిలోనైన ఓ బాలుడు(11) ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన కార్ఖాన పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. డీఎస్ఐ అవినాష్ బాబు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కార్ఖాన బస్తీలో నివాసం ఉంటున్న శివనాథ్ రామ్, సంగీత దేవి దంపతులకు కుమారుడు (11), కుమార్తె (4) ఉన్నారు. గురువారం రాత్రి ధరమ్‌వీర్ కుమార్ తన చెల్లితో గొడవ పడ్డాడు. ఈ విషయమై తల్లి మందలించింది. దీంతో మనస్తాపానికిలోనైన అతను గదిలోకి వెళ్లి ఇనుపరాడ్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యుల సమాచారంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా...

నేడు ఇంటర్ ఎన్‌జీవోస్ స్పోర్ట్స్ మీట్

పంజగుట్ట: తల్లిదండ్రుల ఆలనాపాలనాకు దూరమై స్వచ్ఛంద సంస్థల సహకారంతో జీవనం సాగిస్తున్న అనాథ చిన్నారులకు ఆహ్లాదాన్ని పంచేందుకు ఈ నెల 11 శనివారం ఇంటర్ ఎన్‌జీవోస్ మీట్‌ను నిర్వహిస్తున్నట్లు సాఫ్కిన్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకురాలు ఛాయా తెలిపారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో స్పోర్ట్స్ మీట్‌తో పాటు విరాళాల సేకరణ కోసం చేస్తున్న మ్యూజికల్ నైట్‌కు సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ములుగు ప్రాంతంలోని ఫారెస్ట్ కాలేజీ అండ్ రిసార్ట్స్ ఇనిస్టిట్యూట్‌లో నిర్వహిస్తున్న పోటీలను ముఖ్యమంత్రి ఓఎస్‌డీ ప్రియాంకవర్గీస్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభిస్తారన్నారు. ఈ పోటీల్లో 14 సంస్థల్లో ఆశ్రయం పొందుతున్న 500 మంది అనాథ పిల్లలు పోటీలో పాల్గొంటారని పేర్కొన్నారు. వారికి మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు 19వ తేదీన శిల్పకళా వేదికలో మ్యూజికల్ నైట్ ఏర్పాటు చేస్తున్నట్లు ఇందులో ప్రముఖ సినీ గేయ రచయిత సిరివెన్నెల సీతారామశాస్త్రి రచించిన పాటలను గాయకులు చిత్ర, ఎస్.పి.చరణ్ ఆలపిస్తారని తెలిపారు.

కేర్‌లో ఉచిత పీడియాట్రిక్ కార్డియాలజీ వైద్య శిబిరం

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం.1లోని కేర్ ఆస్పత్రిలో ఈ నెల 11 నుంచి 14 వరకు ఉచిత పీడియాట్రిక్ కార్డియాక్ స్క్రీనింగ్ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఆస్పత్రి వర్గాలు ఒక ప్రకటనలో తెలిపాయి. పుట్టుకతో వచ్చే గుండె లోపాలను గుర్తించడం కోసం ఈ శిబిరం ఉపయోగ పడుతుందన్నారు. పిల్లల్లో శ్వాస సరిగ్గా అందకపోవడం, వేగంగా శ్వాస తీసుకోవడం, ఎదుగుదల సరిగ్గా లేకపోవడం, బరువు పెరగకపోవడం, పెదవులు పాలిపోయినట్లు కనిపించడం తదితర లక్షణాలు ఉంటే కార్డియాలజిస్టులకు చూపించాలని కోరారు. ప్రతిరోజూ ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటుందని చిన్నారులకు టూడీ ఎకో పరీక్షలపై 50 శాతం తగ్గింపు కూడా ఉంటుందన్నారు.

ఈ నెల 13న జాతీయ రహదారి దిగ్బంధం


ఫిలింనగర్: రాబోయే పార్లమెంటు సమావేశాల్లో వర్గీకరణ బిల్లు పెట్టి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ నిర్లక్ష్యానికి నిరసన సెగ పేరుతో ఈ నెల 13న విజయవాడ జాతీయ రహదారి దిగ్బంధానికి పిలుపునివ్వడం జరిగిందని జూబ్లీహిల్స్ డివిజన్ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు బొప్పారపు వేణు మాదిగ అన్నారు. శుక్రవారం ఫిలింనగర్‌లోని విగ్రహాల చౌరస్తాలో ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఎంఎస్‌పీ నేతలు కండె రాంకుమార్, శివకుమార్, కుమార్‌మాదిగ, చాగంటి వెంకన్న, పద్మారావు తదితరులతో కలిసి ఆవిష్కరించారు.

అర్హులందరికీ పెన్షన్లు


కార్డులు అందజేస్తున్న మన్నె కవితారెడ్డి

వెంకటేశ్వరకాలనీ: అర్హులైన వారందరికీ పింఛన్లు అందజేస్తున్నామని వెంకటేశ్వరకాలనీ డివిజన్ కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి అన్నారు. బంజారాహిల్స్ రోడ్ నెం. 14లోని అంగన్‌వాడీ కేంద్రం వద్ద శుక్రవారం ఆమె పింఛన్‌దారులకు డిజిటల్ కార్డులను అందజేసి మాట్లాడారు. అర్హులు నేరుగా సంబంధిత కార్యాలయాలు, లేదా తమకు దరఖాస్తులను అందజేయాలని దళారులను నమ్మవద్దని సూచించారు.

బాధ్యతల స్వీకరణ


బంజారాహిల్స్ ఏసీపీగా నియమితులైన శ్రీధర్ శుక్రవారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఏసీపీగా పని చేసిన సుదర్శన్ నుంచి బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయనకు బంజారాహిల్స్ ఇన్‌స్పెక్టర్ నరేందర్ పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

అసెంబ్లీ ముట్టడికి ప్రయత్నించిన కార్పొరేటర్ల అరెస్ట్

ఖైరతాబాద్: జీహెచ్‌ఎంసీకి బడ్జెట్‌లో అవసరం మేరకు నిధులు కేటాయించడంలో ప్రభుత్వం విఫలమైందని నిరసిస్తూ బీజేపీ కార్పొరేటర్లు, నాయకులు అసెంబ్లీ ముట్టడికి శుక్రవారం యత్నించారు. కార్పొరేటర్లు వంగ మధుసూధన్, కొప్పుల నరసింహారెడ్డి, తోకల శ్రీనివాస్ రెడ్డి, ఆలె భాగ్యలక్ష్మి, రవిచారి, శ్రవణ్‌మమాలక్ష్మి, ఆకుల శ్రీవాణి తదితరులను పోలీసులు అరెస్ట్ చేశారు.

నాలా ఇలా.. మురుగు పోయేదెలా..?

- పేరుకుపోతున్న వ్యర్థాలు
- పట్టించుకోని అధికారులు


మహాత్మాగాంధీనగర్ నాలాలో ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు

ఫిలింనగర్: వర్షాకాలంలో వరద సాఫీగా పారేందుకు నిర్మించిన వరద నీటి కాల్వలు దుర్గంధం, వ్యర్థాలు, చెత్తా చెదారానికి నిలయాలుగా మారి స్థానికులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. జీహెచ్‌ఎంసీ ఖైరతాబాద్ జోన్ పరిధిలోని పలు నాలాలు పిచ్చిమొక్కలు, వ్యర్థాలతో నిండి వరద నీరు ముందుకు వెళ్లలేని దుస్థితి నెలకొంది. ప్రతి ఏడాది వానా కాలానికి ముందు వరద నీటి కాల్వలను రూ. కోట్లు వెచ్చించి పనులు చేపడుతుంటారు. ఇక్కడ మాత్రం తూతూ మంత్రంగా పనులు చేపడుతుండటంతో నాలాలు ఈ దుస్థితికి చేరుకున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఫిలింనగర్‌లోని మహాత్మాగాంధీనగర్ బస్తీని ఆనుకొని అర కిలోమీటర్ మేర బల్కాపూర్ నాలా పూర్తిగా వ్యర్థాలతో నిండిపోయింది. ఇందులోనే మురుగు నీటి పైప్‌లైన్లు కూడా కలిపేశారు. చెత్తా చెదారం వేయకుండా ఈ నాలాకు రెండువైపులా ఫెన్సింగ్ ఏర్పాటు చేసినా ఉపయోగం లేకుండా పోయింది. ఫెన్సింగ్ పై నుంచి చెత్తా చెదారం వేస్తున్నారు. దుర్వాసనలతో స్థానికులు ప్రత్యక్ష నరకాన్ని చవి చూస్తున్నారు. ఈ విషయమై పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. జీహెచ్‌ఎంసీ సర్కిల్-17, 18 పరిధిలోని ప్రధాన నాలాల్లో వ్యర్థాలు భారీగా పేరుకుపోవడంతో మురుగు ముందుకు పారడం లేదు. ఈ ప్రాంతంలో ఏ నాలా చూసినా ఇదే పరిస్థితి కనిపిస్తున్నదని ఆయా ప్రాంతాల వారు దుయ్యబడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి నాలాల్లో పేరుకుపోయిన వ్యర్థాలను తరలించాలని ప్రజలు కోరుతున్నారు.

దుర్వాసనతో ఇబ్బందులు..


ఫిలింనగర్‌లోని మహాత్మాగాంధీనగర్ బస్తీని ఆనుకొని ఉన్న వరద నీటి కాల్వలో పెద్ద ఎత్తున వ్యర్థాలు పేరుకుపోయాయి. పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి నాలా కనుమరుగవుతుంది. దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. సంబంధిత అధికారులు స్పందించాలి.

– మోహన్‌చారి

దోమల స్వైర విహారం


మహాత్మాగాంధీనగర్ నాలా మురుగుతో నిండిపోవడంతో దుర్వాసనతో పాటు దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. సాయంత్రం అయితే చాలు దోమలు దండయాత్ర చేస్తున్నాయి. దోమల కారణంగా ప్రతి ఇంట్లో ఒక్కరైనా అనారోగ్యానికి గురవుతున్నారు.

– భాస్కర్

స్పందించకుంటే ధర్నా చేస్తాం


డీసిల్టింగ్ పేరుతో ప్రతియేటా కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నారు. ఇవన్నీ ఎక్కడికి పోతున్నాయో అర్థమవ్వడం లేదు. కాంట్రాక్టర్లు తూతూ మంత్రంగా పని చేస్తున్నా రు. ఇంజినీర్లు చూసీచూడనట్లు వదిలేస్తున్నారు. పెద్ద ఎత్తున అవినీతి జరుగుతుంది. ఈ సారి కూడా బురద, మురుగు తొలగించకపోతే ఆందోళనకు దిగుతాం.

– హనుమంతు

ఆటోడ్రైవర్ల చలో అసెంబ్లీ భగ్నం

నమస్యలు పరిష్కరించాలంటూ నినాదాలు



ధర్నా చేస్తున్న ఆటోడ్రైవర్లు

హిమాయత్‌నగర్: ఆటో డ్రైవర్ల సమస్యలపై తలపెట్టిన చలో అసెంబ్లీ భగ్నమయ్యింది. ముందస్తు సమచారం ఇవ్వడంతో ఎక్కడికక్కడ పోలీసులు అరెస్టులు చేశారు. శుక్రవారం హిమాయత్‌నగర్‌లోని ఏఐటీయూసీ కార్యాలయం వద్ద చేపట్టిన ఆటో డ్రైవర్ల 'చలో అసెంబ్లీ'ని నారాయణగూడ పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్స్ సంఘాల జేఏసీ కన్వీనర్, ఏఐటీయూసీ ఆటో రిక్షా డ్రైవర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి. వెంకటేశం మాట్లాడుతూ.. 2014 నుంచి నేటి వరకూ ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. తాము ఇప్పటి వరకు లెక్కలేనన్ని పోరాటాలు చేసినా ప్రభుత్వానికి చీమకుట్టినట్టు కూడా లేదన్నారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలు అడ్డు అదుపు లేకుండా పెరగడం వల్ల రవాణారంగా కార్మికుల జీవనం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో పడిందన్నారు. పెరిగిన ఇంధన, నిత్యావసర ధరలకు అనుగుణంగా ఆటో మీటర్ చార్జీలను ప్రస్తుతం ఉన్నదానిపై కిలోమీటర్ కు రు.20 పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నేతలు అమానుల్లా ఖాన్ ఒమర్ ఖాన్, జంగయ్య, మల్లేష్ గౌడ్, అజయ్ బాబు, కిరణ్, సత్తి రెడ్డి, సలీం, నజీర్, మల్లేష్, బాబు, లతీఫ్, శ్రీనివాస్, యాదగిరి, ఫరూక్, అబ్బాస్, శ్యామ్ అంబదాస్‌ను పోలీసులు అరెస్టు చేశారు.


మురుగును పరిశీలిస్తున్న రోహిణ్‌రెడ్డి

ప్రభుత్వ పాఠశాల సందర్శన

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్‌లోని రౌండ్‌టేబుల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ సి. రోహిణ్‌రెడ్డి డివిజన్ అధ్యక్షుడు కాటూరి రమేష్ తో కలిసి సందర్శించారు. ఆవరణలో చెత్తా చెదారం పేరుకుపోవడంతో పాటు చాలా ఏళ్లుగా పక్కనే ఉన్న బస్తీ నుంచి మురుగు ప్రవహిస్తుందని ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. సరిపడే మరుగుదొడ్లు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఏళ్ల తరబడి సమస్యలతో విద్యార్థులు నరకయాతన అనుభవిస్తున్నారని రోహిణ్‌రెడ్డి ఆరోపించారు. ఇటీవల కేంద్ర మంత్రి స్కూల్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్నారని ఇక్కడి అసౌకర్యాలపై స్పందించాల్సిన అవసరం లేదా అని నిలదీశారు. మన బస్తీ-మన బడి పథకం కింద ఇప్పటిదాకా పైసా కూడా ఈ పాఠశాలకు ఖర్చు చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఊహించని అభివృద్ధి సంతృప్తినిచ్చింది!

సీఎన్ రెడ్డి, రహమత్‌నగర్ కార్పొరేటర్



రహమత్‌నగర్: కార్పొరేటర్‌గా ఎన్నికై రెండేళ్లలో చేసిన అభివృద్ధి ఎంతో సంతృప్తినిచ్చిందని రహమత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి పేర్కొన్నారు. కోట్లాది రూపాయలతో బస్తీల్లోని ప్రధాన సమస్యలను పరిష్కరించడం జరిగిందని ఎన్నికల సమయంలో తాను ఇచ్చిన హామీలను చాలా వరకు నెరవేర్చానని, మిగిలిన వాటిని సైతం పూర్తి చేస్తానన్నారు. దశాబ్దాలకాలంగా పరిష్కారానికి నోచుకోని సమస్యలను కేవలం రెండేళ్లలో పరిష్కరించానన్నారు. పేద ప్రజలకు సౌకర్యార్థం రూ. 4 కోట్లతో హెచ్‌ఎఫ్‌నగర్ క్వారీ స్థలంలో మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ నిర్మాణం జరుగుతుందని, కార్మికనగర్ రహదారిలో రూ. 3 కోట్లతో సుందరీకరణ పనులు, దాహార్తిని తీర్చేందుకు ఎస్‌పీఆర్‌హిల్స్‌లో కొత్తగా 4 ఎంఎల్ రిజార్వయర్ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయన్నారు. ప్రతి బస్తీలో అంతర్గత రహదారులు, సీసీ రోడ్లు నిర్మిస్తున్నామన్నారు. క్వారీ స్థలంలో దాదాపు రూ. 3 కోట్ల వ్యయంతో ప్లేగ్రౌండ్ నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. ఆరోగ్యనగర్‌లో నాట్కో సంస్థ సహకారంతో మోడల్ అంగన్‌వాడీ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ప్రత్యేక శ్రద్ధతో అభివృద్ధి పనులు మంజూరయ్యాయన్నారు. రహమత్‌నగర్ రోడ్డు విస్తరణ, అంగన్‌వాడీ కేంద్రాలు, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణ పనులను ప్రతిపాదనలు పంపడం జరిగిందని, నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభిస్తామన్నారు. భవిష్యత్‌లో మరిన్ని అభివృద్ధి పనులు చేపడుతానని హామీ ఇచ్చారు.


నిర్మాణంలో ఉన్న మల్టీపర్పస్ ఏసీ ఫంక్షన్ హాల్


రహమత్‌నగర్‌లో సీసీ రోడ్డు

హర్షనీయం

లిబర్టీ: తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పోడు భూములు సాగు చేసుకుని బతుకులు సాగిస్తున్న ఆదివాసులు, గిరిజనులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలవడం అభినందనీయమని తెలంగాణ గిరిజన సమైక్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమావత్ అంజయ్యనాయక్ పేర్కొన్నారు. పోడు భూము లు సాగు చేసుకుంటున్న ఆదివాసీ గిరి జనులకు పట్టాలు ఇస్తామని విద్యుత్ సౌకర్యం కల్పిస్తామని శాసనసభలో ముఖ్యమంత్రి కేసీఆర్ హామీ ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. శుక్రవారం తెలంగాణ గిరిజన సమైక్య కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పోడు రైతులకు పట్టాలు ఇవ్వాలని తాము అనేక ఏళ్లుగా వివిధ రూపాల్లో పోరాటం చేసి ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చిన నేపథ్యంలో ఎన్నో ఏళ్ల తర్వాత పోడు రైతులకు పట్టాలు ఇవ్వాలని నిర్ణయించడం శుభపరిణామన్నారు.

అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తి రిమాండ్


హమారా ప్రసాద్

హిమాయత్‌నగర్: డా. బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన రాష్ట్రీయ దళిత సేన ఫౌండర్ నాగులారపు వరప్రసాద్ అలియాస్ హమారా ప్రసాద్‌ను రిమాండ్‌కు తరలించారు. సోషల్ మీడియా వేదికగా అంబేడ్కర్ వ్యక్తిత్వాన్ని కించపరుస్తూ అప్‌లోడ్ చేసిన పోస్టుల నేపథ్యంలో ప్రసాద్‌పై కేసు నమోదైంది. గత కొన్ని రోజులుగా అతని ఫేస్‌బుక్ పేజీలో వివిధ అంశాలకు సంబంధించిన పోస్టులను పోస్ట్ చేస్తూ కొన్ని వర్గాల వారిని రెచ్చగొట్టేలా వ్యవహరిస్తున్నారు. దీంతో సిటీ సైబర్‌క్రైం పోలీసులు శుక్రవారం ఉదయం అల్వాల్‌లోని ఆయన నివాసంలో అదుపులోకి తీసుకుని పూర్తి వివరాలు సేకరించి రిమాండ్‌కు తరలించారు.

జేహెచ్‌పీఎస్‌లో సామాజిక అవగాహన సదస్సు

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో శుక్రవారం సామాజిక అవగాహన సదస్సు అనే పేరుతో ప్రీ ప్రైమరీ విద్యార్థులకు సామాజిక బాధ్యతలు తెలియజేసే కార్యక్రమాలను నిర్వహించారు. ఇందులో భాగంగా అనేక విభాగాల్లో పని చేస్తూ సమాజానికి తమ సేవలను అందిస్తున్న వారితో మమేకమయ్యారు. వైద్య వృత్తిలో ఉన్న డాక్టర్ జ్యోతి పాల్గొని దంత పరిరక్షణపై అవగాహన కల్పించారు. చిన్నారులు పళ్లను ఏ విధంగా శుభ్రం చేసుకోవాలి, ఎలాంటి పరికరాలు వాడాలి, ఏ రకమైన ఆహారం తింటే పళ్లు దెబ్బతింటాయి అనే విషయాలపై సూచనలు, సలహాలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు విధుమోహన్, వైస్ ప్రిన్సిపాల్ కాంచనవల్లి పాల్గొన్నారు.

చరిత్ర, సంస్కృతి విషయంలో జాగ్రత్త వహించాలి

- హెచ్‌సీయూ తెలుగుశాఖ అధ్యక్షుడు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు

రాయదుర్గం: మన చరిత్ర సంస్కృతులను భద్రపర్చుకునే విషయంలో భద్రతాపరమైన సాఫ్ట్‌వేర్లను రూపొందించుకోవాలని హెచ్‌సీయూ తెలుగుశాఖ అధ్యక్షుడు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు సూచించారు. తెలంగాణ ప్రభుత్వ ఉన్నత విద్యాశాఖ సహకారంతో కరీంనగర్‌లోని రాజరాజేశ్వరి ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఆధ్వర్యంలో 'భారతీయ సాహిత్యం, సంస్కృతిలో డిజిటల్ హ్యూమానిటీస్ అన్వేషణ, సవాళ్ళు అనే జాతీయ సదస్సులో గచ్చి బౌలిలోని హెచ్‌సీయూ తెలుగుశాఖ ద్వారా ఆన్‌లైన్‌లో ఆయన శుక్రవారం మాట్లాడారు. ఇంటర్నెట్‌లో లభ్యమవుతున్న చరిత్ర ,సంస్కృతుల పుస్తకాలు వక్రీకరణకు గురవుతున్నాయన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ .రామకృష్ణ, కొత్తిరెడ్డి మల్లారెడ్డి, పోగుల విశ్వప్రసాద్, డాక్టర్ కే శారద, సుభాష్‌చంద్రబోస్, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి


అద్దాలు పంపిణీ చేస్తున్న మేయర్ విజయలక్ష్మి

బంజారాహిల్స్: బస్తీల్లో, కాలనీల్లో నిర్వహిస్తున్న కంటి వెలుగును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. శుక్రవారం బంజారాహిల్స్ రోడ్ నెం. 12లోని ఎన్బీటీ నగర్ బస్తీ దవాఖానాలో నూతనంగా ఏర్పాటు చేసిన శిబిరాన్ని ఆమె ఎస్‌పీహెచ్‌వో అనురాధతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తుందని బస్తీవాసులు, కాలనీవాసులు మాత్రమే కాకుండా ప్రతి ఒక్కరు ఈ కార్యక్రమాన్ని వినియోగించుకునేలా పార్టీ కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. శిబిరాల వద్దకు వచ్చే వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో డీఎంసీ రజినీకాంత్‌రెడ్డి, డాక్టర్ కార్తీక, ఏఎంహెచ్‌వో ప్రవీణ పాల్గొన్నారు.

దళారులను నమ్మవద్దు..

ప్రభుత్వ పథకాలు అందేలా చేస్తామనే దళారులను నమ్మి మోసపోవద్దని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. శుక్రవారం బంజారాహిల్స్ రోడ్‌నెం. 12లోని మేయర్ క్యాంపు కార్యాలయంలో మేయర్ విజయలక్ష్మితో కలిసి ఆయన కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతాయన్నారు.

జానపద కళాకారుల అభ్యున్నతికి కృషి


జానపద కళాకారులతో అనూహ్యారెడ్డి

హిమాయత్‌నగర్: జానపద వృత్తి కళాకారుల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షురాలిగా కోవిధ సహృద ఫౌండేషన్ వ్యవస్థాపకులు, ప్రొడ్యూసర్ డాక్టర్ జి.అనూహ్యారెడ్డి నియమితులయ్యారు. శుక్రవారం యాదగిరిగుట్టలో జరిగిన జానపద వృత్తి కళాకారుల సంఘం సమావేశంలో ఏకగ్రీవంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఇందులో భాగంగా కొంత కాలంగా కళాకారులకు ఎనలేని సేవ చేస్తున్న నగర వాసి జి.అనూహ్యారెడ్డిని గౌరవ అధ్యక్షురాలిగా కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జానపద కళాకారుల అభ్యున్నతికి కృషి చేస్తానని ఈ సందర్భంగా అనూహ్యారెడ్డి తెలిపారు.

డైరీ ఆవిష్కరణ


డైరీని ఆవిష్కరిస్తున్న శ్రీధర్, కూర రఘువీర్

ఖైరతాబాద్: డైరీని ప్రతి సంవత్సరం వివిధ అంశాలతో వినూత్నంగా రూపొందించి అనేక అంశాలను తెలియజేసే ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ కామర్స్ కళాశాల 2023 డైరీని శుక్రవారం లక్డీకాపూల్‌లోని కళాశాలలో ఆవిష్కరించారు. ఈ సంవత్సరం భారతదేశంలోని నీటి పారుదల ప్రాజెక్టులు, ప్రభుత్వ, ప్రైవేటు రంగ బ్యాంకులు, జీ-20 దేశాల సదస్సు ఇతివృత్తంగా రూపొందించిన డైరీని కళాశాల ఆడిటోరియంలో తెలంగాణ గ్రంథాలయ చైర్మన్ డాక్టర్ శ్రీధర్, కళాశాల ప్రిన్సిపాల్ కూర రఘువీర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్, అధ్యాపకులు, స్టూడెంట్స్, కౌన్సిల్ సభ్యులు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు పాల్గొన్నారు.

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలన్న నిర్ణయం అభినందనీయం

లిబర్టీ: వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని రాష్ట్ర ప్రభుత్వం తీర్మానించడాన్ని వాల్మీకి సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు డి.ప్రీతంసింగ్ స్వాగతించారు. సంప్రదాయ వృత్తిని నమ్ముకుని దినదిన గండంలా బతుకు బండి లాగిస్తున్నా వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఏకగ్రీవంగా తీర్మానించి కేంద్ర ప్రభుత్వానికి నివేదించిందని పేర్కొన్నారు. శుక్రవారం వాల్మీకి సేవా సంస్థ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో లక్షల సంఖ్యలో వాల్మీకులు జీవనం సాగిస్తున్నారని ఆర్థిక సామాజిక రాజకీయ రంగంలో అనేక అణిచివేతకు వివక్షతకు గురవుతూ జీవన స్థితిలో మార్పు లేక బతుకులు వెల్లదీస్తున్నారన్నారు. ఎస్టీ జాబితాలో చేర్చడంతో విద్య, ఉద్యోగ, ఆర్థిక, సామాజిక రంగాల్లో వాల్మీకులు అభివృద్ధి చెందుతారని తెలిపారు.

ఐఎంటీ హైదరాబాద్-విప్రో లిమిటెడ్ ఒప్పందం

బంజారాహిల్స్: ఐటీలో ప్రతిపాదిత పీజీడీఎం ప్రోగ్రాంను సంయుక్తంగా రూపొందించి అందించేందుకు ప్రముఖ టెక్నాలజీ సర్వీసెస్ కన్సల్టింగ్ కంపెనీ విప్రో లిమిటెడ్‌తో ఐఎంటీ హైదరాబాద్ అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఐటీ పరిశ్రమలో పని చేయడానికి డొమైన్ అనుభవంతో పాటు క్రియాత్మక నైపుణ్యం ఉన్న భవిష్యత్ బిజినెస్ లీడర్లను సృష్టించడం, ఈ ప్రోగ్రాం ఉద్దేశమని ఐఎంటీ హైదరాబాద్ డైరెక్టర్ డాక్టర్ కె. శ్రీహర్షారెడ్డి తెలిపారు. ఐఎంటీ హైదరాబాద్ మాదిరిగానే విప్రో కూడా అదే దార్శనికతను పంచుకుంటుందని పూర్తిగా కార్పొరేట్ భాగస్వామి మద్దతుతో రాబోయే ప్రోగ్రాం పీజీడీఎం, ఐటీని ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. విప్రో లిమిటెడ్ హెడ్ రాహుల్ భట్టాచార్య మాట్లాడుతూ.. కంపెనీలో సంస్కృతిని నేర్పించే అయిదు అలవాట్ల గురించి మాట్లాడారు. గౌరవంగా ఉండటం, ప్రతిస్పందించడం, ఎల్లప్పుడూ కమ్యూనికేట్ చేయడం, స్టివార్డ్ షిప్‌ను ప్రదర్శించడం, నమ్మకాన్ని పెంపొందించడం విప్రో విలువలన్నారు.

క్రీడా పోటీల్లో సత్తా

బంజారాహిల్స్: గ్రేటర్ హైదరాబాద్ ప్రైవేట్ గుర్తింపు పొందిన పాఠశాలల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రీడా పోటీల్లో బంజారాహిల్స్ రోడ్ నెం.11లోని ఉదయ్‌నగర్ శ్రీ సరస్వతి స్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. రెండు రోజుల పాటు జరిగిన పోటీల్లో ఖోఖోలో బాలురు రెండో స్థానంలో నిలవగా, బాలికల జట్టు మొదటి స్థానంలో నిలిచిందని కరస్పాండెంట్ రామసుబ్బయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ పీఈటీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


బహుమతులు సాధించిన విద్యార్థులు

తమన్నా.. తళుక్కు



సిటీలో మిల్కీ బ్యూటీ తమన్నా సందడి చేసింది. శుక్రవారం బంజారాహిల్స్‌రోడ్ నెం.11లో ప్రముఖ డిజైనర్ దేవాంగి ఫరేఖ్ 'అజా' ఫ్యాషన్స్ పేరుతో ఏర్పాటు చేసిన నూతన డిజైనరీ స్టోర్ ప్రారంభోత్సవంలో ఆమె పాల్గొన్నారు. లేటెస్ట్ డిజైనర్ వస్త్రాలు, ఆభరణాలు, హస్త కళలు, హస్తకళా ఉత్పత్తులను ఒకే వేదికపైకి తేవడం బావుందని పేర్కొన్నారు.

– బంజారాహిల్స్



పాక్‌తో మ్యాచ్‌కు స్మృతి మంధాన సందేహం

దక్షిణాఫ్రికా వేదికగా జరుగుతున్న మహిళల టి20 ప్రపంచకప్‌లో భాగంగా ఆదివారం పాకిస్తాన్‌తో జరిగే తమ తొలి మ్యాచ్‌లో భారత జట్టు వైస్ కెప్టెన్ స్మృతి మంధాన బరిలోకి దిగడం సందేహంగా మారింది. ఆస్ట్రేలియాతో జరిగిన తొలి ప్రాక్టీస్ మ్యాచ్ సందర్భంగా స్మృతి చేతి వేలికి గాయమైంది. ఈ గాయం నుంచి ఆమె కోలుకోకపోవడంతో బంగ్లాదేశ్‌తో జరిగిన రెండో ప్రాక్టీస్ మ్యాచ్‌లో స్మృతి ఆడలేదు. మరోవైపు భుజం నొప్పితో బాధపడుతున్న కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ కూడా తొలి మ్యాచ్‌లో ఆడేది లేనిది ఆదివారం తెలుస్తుంది.

యూపీ వారియర్జ్ కోచ్‌గా జాన్ లూయిస్



మహిళల ప్రీమియర్ లీగ్‌లో క్యాప్రి గ్లోబల్ హోల్డింగ్స్ ప్రైవేట్ లిమిటెడ్ కొనుగోలు చేసిన ఉత్తరప్రదేశ్ (యూపీ) ఫ్రాంచైజీ జట్టుకు యూపీ వారియర్జ్ అని పేరు పెట్టారు. ఈ జట్టుకు ఇంగ్లండ్ మాజీ క్రికెటర్, ప్రస్తుత ఇంగ్లండ్ మహిళల జట్టు హెడ్ కోచ్‌గా పనిచేస్తున్న జాన్ లూయిస్‌ను హెడ్ కోచ్‌గా నియమించారు. భారత మాజీ క్రికెటర్ అంజూ జైన్ అసిస్టెంట్ కోచ్‌గా, యాష్లే నోఫ్కీ (ఆస్ట్రేలియా) బౌలింగ్ కోచ్‌గా, లీసా స్థాలేకర్ (ఆస్ట్రేలియా) మెంటార్‌గా వ్యవహరిస్తారు.



రోహిత్ సెంచరీ అభివాదం

మనదే ఆధిపత్యం

రోహిత్ శర్మ శతకం
జడేజా, అక్షర్ అర్ధ సెంచరీలు
భారత్ 321/7
144 పరుగుల ఆధిక్యంలో టీమిండియా

తొలి రోజు బంతి సుడులు తిరిగితే... రెండో రోజు బ్యాట్లు పరుగందుకున్నాయి. దీంతో మొదటి టెస్టులో రెండో రోజే భారత్ సంపూర్ణ ఆధిపత్యం సాధించింది. భారీస్కోరు దిశగా పయనిస్తోన్న టీమిండియా మూడో రోజు టెస్టును తమ చేతుల్లోకి తీసుకోవాలనే పట్టుదలను కనబరుస్తోంది. 'హిట్‌మ్యాన్' రోహిత్ శర్మ క్లాసిక్ సెంచరీ, ఆల్‌రౌండర్లు రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్‌ల అర్ధసెంచరీలు రెండో రోజు ఆటకు హైలైట్‌గా నిలిచాయి.

నాగ్‌పూర్: బోర్డర్–గావస్కర్ ట్రోఫీ భారత్ ఆధిపత్యంతో మొదలైంది. తొలి టెస్టులో రెండో రోజే రోహిత్ శర్మ బృందం పైచేయి సాధించింది. శుభారంభానికి సరిపడా ఆధిక్యంపై కన్నేసింది. కెప్టెన్ రోహిత్ శర్మ (212 బంతుల్లో 120; 15 ఫోర్లు, 2 సిక్స్‌) తన కెరీర్‌లో తొమ్మిదో టెస్ట్ సెంచరీతో కదంతొక్కగా, మిగతా ప్రధాన బ్యాటర్స్ విఫలమయ్యారు. అయితే స్పిన్–ఆల్‌రౌండర్లు రవీంద్ర జడేజా (170 బంతుల్లో 66 బ్యాటింగ్; 9 ఫోర్లు), అక్షర్ పటేల్ (102 బంతుల్లో 52 బ్యాటింగ్; 8 ఫోర్లు) బాధ్యతాయుతమైన బ్యాటింగ్‌తో జట్టును పటిష్టస్థితిలో నిలబెట్టారు. దీంతో రెండో రోజు ఆట ముగిసే సమయానికి భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 114 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 321 పరుగులు చేసింది. భారత గడ్డపై అరంగేట్రం చేసిన ఆసీస్ ఆఫ్‌స్పిన్నర్ టాడ్ మర్ఫీ 5 వికెట్లు తీశాడు. ప్రస్తుతం టీమిండియా 144 పరుగుల ఆధిక్యంలో ఉంది. చేతిలో మూడు వికెట్లున్నాయి.

నడిపించిన కెప్టెన్

ఓవర్‌నైట్ స్కోరు 77/1తో రెండో రోజు ఆట ఆరంభించిన భారత్‌ను కెప్టెన్ రోహిత్ శర్మ నడిపించాడు. 'నైట్ వాచ్‌మన్' బ్యాటర్ అశ్విన్ (62 బంతుల్లో 23; 2 ఫోర్లు, 1 సిక్స్‌)తో కలిసి జట్టు స్కోరును వంద పరుగులు దాటించాడు. రెండో వికెట్ భాగస్వామ్యం బలపడుతున్న తరుణంలో కొత్త స్పిన్నర్ మర్ఫీ మాయాజాలం జట్టును ఇబ్బంది పెట్టింది. అశ్విన్‌ను వికెట్ల ముందు దొరకబుచ్చుకున్న మర్ఫీ... స్వల్ప వ్యవధిలో వెటరన్ బ్యాటర్ చతేశ్వర్ పుజారా (14 బంతుల్లో 7; 1 ఫోర్)ను కూడా బోల్తా కొట్టించాడు. దీంతో రోహిత్‌కు కోహ్లి జతయ్యాడు. జట్టు స్కోరు 151/3 వద్ద లంచ్ బ్రేక్‌కు వెళ్లారు.

రోహిత్ సెంచరీ

రెండో సెషన్ మాత్రం కష్టాలతో మొదలైంది. స్పిన్‌కు కలిసొచ్చిన పిచ్‌పై మర్ఫీ తొలి బంతికే కోహ్లి (26 బంతుల్లో 12; 2 ఫోర్లు) ఆట ముగించాడు. లెగ్‌స్టంప్‌కు ఆవల వేసిన బంతిని కోహ్లి ఫ్లిక్ చేయాలనుకున్నాడు. కానీ అదికాస్తా బ్యాట్ అంచును తాకుతూ కీపర్ క్యారీ చేతికి చిక్కింది. 151 స్కోరు వద్ద నాలుగో వికెట్ పడగా... ఈ 4 వికెట్లు మర్ఫీనే పడగొట్టాడు. క్రీజులో పాతుకొనిపోయిన రోహిత్ 171 బంతుల్లో (14 ఫోర్లు, 2 సిక్స్‌లు) టెస్టుల్లో తొమ్మిదో సెంచరీ పూర్తి చేసుకున్నాడు. కానీ తొలి టెస్టు ఆడుతున్న మెరుపుల బ్యాటర్ సూర్యకుమార్ యాదవ్ (20 బంతుల్లో 8; 1 ఫోర్) నిరాశపరిచాడు. లయన్ బంతికి క్లీన్‌బౌల్డయ్యాడు. తర్వాత జడేజా అండతో భారత స్కోరును 200 పరుగులు దాటించాడు. రోహిత్, జడేజా జోడీ ముందు ఆసీస్ స్పిన్ పనిచేయలేదు. మర్ఫీ, లయన్ అలసిపోయారే తప్ప జోడీని మాత్రం విడగొట్టలేకపోయారు. 226/5 స్కోరు వద్ద రెండో సెషన్ ముగిసింది.

జడేజా, అక్షర్... ఫిఫ్టీ–ఫిఫ్టీ

స్పిన్ వల్ల కాకపోవడంతో కంగారూ సారథి కమిన్స్ రంగంలోకి దిగాడు. మూడో సెషన్ ఆరంభంలో భారత ఇన్నింగ్స్‌కు వెన్నెముకగా నిలిచిన రోహిత్‌ను బౌల్డ్ చేశాడు. దీంతో ఆరో వికెట్‌కు 61 పరుగుల భాగస్వామ్యానికి చుక్కెదురైంది. ఆంధ్రప్రదేశ్ బ్యాటర్ శ్రీకర్ భరత్ (10 బంతుల్లో 8; 1 ఫోర్)కు నిరూపించుకునేకుందేకు చక్కని అవకాశం వచ్చినా... మర్ఫీ స్పిన్ ఉచ్చులో పడి తొందరగానే నిష్క్రమించాడు. 240 పరుగుల వద్ద ఏడో వికెట్ కూలింది. ఈ దశలో జడేజాకు అక్షర్ పటేల్ జతయ్యాడు. క్రీజులో ఉన్న ఇద్దరు స్పిన్నర్లే కావడంతో అవతలి వైపు స్పిన్ ఉచ్చు తేలిపోయింది. ఆఖరి సెషన్‌లో ఇద్దరు చక్కని సమన్వయంతో పరుగులు జత చేయడంతో ఆలౌట్ కావాల్సిన జట్టు 300 పైచిలుకు పరుగుల్ని అవలీలగా చేసింది. చూడచక్కని బౌండరీలతో స్కోరును పెంచారు. ఈ క్రమంలో మొదట జడేజా 114 బంతుల్లో (7 ఫోర్లు), సెషన్ ముగిసేదశలో అక్షర్ 94 బంతుల్లో (8 ఫోర్లు) అర్ధ సెంచరీలు పూర్తి చేసుకున్నారు. అబేధ్యమైన ఎనిమిదో వికెట్‌కు ఇద్దరు కలిసి 81 పరుగులు జోడించారు. మూడో రోజు ఈ జంట కుదురుకుంటే భారత్ భారీస్కోరే కాదు... భారీ ఆధిక్యమే సంపాదిస్తుంది. అప్పుడు టర్నింగ్ వికెట్‌పై భారత స్పిన్నర్లు తిప్పేయడం సులువవుతుంది.



అక్షర్
జడేజా



మర్ఫీ

స్కోరు వివరాలు

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌: 177; **భారత్ తొలి ఇన్నింగ్స్‌:** రోహిత్ శర్మ (బి) కమిన్స్ 120; కేఎల్ రాహుల్ (సి అండ్ బి) మర్ఫీ 20; అశ్విన్ (ఎల్బీడబ్ల్యూ) (బి) మర్ఫీ 23; పుజారా (సి) బోలండ్ (బి) మర్ఫీ 7; కోహ్లి (సి) క్యారీ (బి) మర్ఫీ 12; సూర్యకుమార్ (బి) లయన్ 8; రవీంద్ర జడేజా (బ్యాటింగ్) 66; శ్రీకర్ భరత్ (ఎల్బీడబ్ల్యూ) (బి) మర్ఫీ 8; అక్షర్ పటేల్ (బ్యాటింగ్) 52; ఎక్స్‌ట్రాలు 5; **మొత్తం** (114 ఓవర్లలో 7 వికెట్లకు) 321. **వికెట్ల పతనం:** 1–76, 2–118, 3–135, 4–151, 5–168, 6–229, 7–240. **బౌలింగ్:** కమిన్స్ 18–2–74–1, బోలండ్ 17–4–34–0, లయన్ 37–10–98–1, మర్ఫీ 36–9–82–5, లబుషేన్ 5–0–24–0, రెన్‌షా 1–0–7–0.

1 భారత్ నుంచి టెస్టు, వన్డే, టి20 ఫార్మాట్‌లలో సెంచరీలు చేసిన తొలి కెప్టెన్‌గా రోహిత్ శర్మ ఘనత సాధించాడు. కెప్టెన్ హోదాలో రోహిత్ వన్డేల్లో మూడు, టి20ల్లో రెండు సెంచరీలు చేశాడు. టెస్టుల్లో సారథిగా అతనికిదే తొలి శతకం. అంతర్జాతీయ క్రికెట్‌లో తిలకరత్నే దిల్షాన్ (శ్రీలంక), డు ప్లెసిస్ (దక్షిణాఫ్రికా), బాబర్ ఆజమ్ (పాకిస్తాన్) కెప్టెన్ హోదాలో మూడు ఫార్మాట్‌లలో సెంచరీలు సాధించారు.

6 భారత గడ్డపై తమ అరంగేట్రం టెస్టు మ్యాచ్‌లో ఇన్నింగ్స్‌లో ఐదు వికెట్లు పడగొట్టిన ఆరో బౌలర్‌గా టాడ్ మర్ఫీ (5/66) గుర్తింపు పొందాడు. గతంలో బ్రూస్ టేలర్ (న్యూజిలాండ్), జాన్ లేవర్ (ఇంగ్లండ్), లాన్స్ క్లూసెనర్ (దక్షిణాఫ్రికా), జేసన్ క్రేజా (ఆస్ట్రేలియా), యాసిర్ అరాఫత్ (పాకిస్తాన్) ఈ ఘనత సాధించారు.

6 టెస్టు మ్యాచ్‌లో ఇన్నింగ్స్‌లో ఐదు వికెట్లు తీయడంతోపాటు అర్ధ సెంచరీ సాధించడం రవీంద్ర జడేజా కెరీర్‌లో ఇది ఆరోసారి. అశ్విన్ కూడా ఆరుసార్లు ఈ ఘనత సాధించాడు. ఇయాన్ బోథమ్ (ఇంగ్లండ్: 11 సార్లు), షకీబ్ అల్ హసన్ (బంగ్లాదేశ్: 10 సార్లు), రిచర్డ్ హ్యాడ్లీ (న్యూజిలాండ్: 6 సార్లు) కూడా ఈ జాబితాలో ఉన్నారు.

రేసింగ్ @ హైదరాబాద్

నేడు నగరంలో ఫార్ములా 'ఇ' ప్రధాన పోరు
ప్రతిష్టాత్మక ఈవెంట్‌కు సన్నాహాలు పూర్తి • మధ్యాహ్నం 3 గంటల నుంచి రేసు
స్టార్ స్పోర్ట్స్ సెలక్ట్–2 చానల్, హాట్ స్టార్ యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం



సాక్షి, హైదరాబాద్: కౌంట్‌డౌన్ పూర్తయింది... ఇక హైదరాబాద్ స్ట్రీట్‌పై జనరేషన్–3 కార్లు జోరుగా దూసుకుపోవడమే మిగిలింది. భాగ్యనగర రేసింగ్ అభిమానులంతా ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న ఫార్ములా 'ఇ' సమరానికి సమయం వచ్చేసింది. హుస్సేన్ సాగర్ తీరంలో ప్రత్యేకంగా సిద్ధమైన స్ట్రీట్ సర్క్యూట్‌లో కార్లు జుమ్మంటూ దూసుకుపోతుంటే ఆ వినోదాన్ని వీక్షించేందుకు పెద్ద సంఖ్యలో ఫ్యాన్స్ సిద్ధమయ్యారు. మొత్తం 11 జట్లకు చెందిన 22 మంది డ్రైవర్లు ఈ 'ఇ' ప్రి పోరులో సత్తా చాటబోతున్నారు. శుక్రవారమే తొలి ఫ్రీ ప్రాక్టీస్ పూర్తి కాగా, డ్రైవర్లు శనివారం ఉదయం రెండో ఫ్రీ ప్రాక్టీస్‌లో కూడా పాల్గొంటారు. ఆ తర్వాత క్వాలిఫయింగ్ ఈవెంట్ అనంతరం మధ్యాహ్నం 3 గంటల నుంచి ప్రధాన రేస్ జరుగుతుంది.

ఆధిక్యంలో ఆండ్రెటీ...

ఫార్ములా 'ఇ'లో ప్రస్తుతం 9వ సీజన్ నడుస్తోంది. ఇందులో ఇప్పటికే మూడు రేస్‌లు పూర్తయ్యాయి. మెక్సికో సిటీ మొదటి రేస్‌కు ఆతిథ్యం ఇవ్వగా, సౌదీ అరేబియాలోని దిరియాలో తర్వాతి రెండు రేస్‌లు జరిగాయి. హైదరాబాద్‌లో జరగబోతోంది ఈ సీజన్‌లో నాలుగో రేస్. ప్రస్తుతం మూడు రేస్‌ల తర్వాత మొత్తం 76 పాయింట్లతో ఆండ్రెటీ టీమ్ అగ్రస్థానంలో కొనసాగుతుండగా, పోర్ష్ (74) రెండో స్థానంలో ఉంది.

మహీంద్రా సాధించేనా...



ఫార్ములా 'ఇ' ప్రారంభమైన 2014 సీజన్ నుంచి భారత్‌కు చెందిన మహీంద్రా రేసింగ్ టీమ్ బరిలో ఉంది. ఓవరాల్‌గా ఇన్నేళ్లలో 5 రేస్‌లు గెలిచిన ఆ జట్టు డ్రైవర్లు 24 సార్లు పోడియం (టాప్–3)పై నిలబడటంలో సఫలమయ్యారు. 2016–17 సీజన్‌లో టీమ్ ర్యాంకింగ్స్‌లో అత్యుత్తమంగా మూడో స్థానంలో నిలిచిన టీమ్... తొలిసారి స్వదేశంలో పోటీకి సిద్ధమైంది. మహీంద్ర టీమ్‌లో బ్రిటన్‌కు చెందిన ఒలివర్ రోలండ్, బ్రెజిల్‌కు చెందిన ల్యూకాస్ గ్రాసి డ్రైవర్లుగా వ్యవహరిస్తుండగా... భారత యువ రేసర్ జెహాన్ దారువాలా రిజర్వ్ డ్రైవర్‌గా ఉన్నాడు. గత సీజన్‌లో టీమ్ ఎనిమిదో స్థానానికే పరిమితమైంది. తాజా సీజన్‌లో మెక్సికో సిటీలో జరిగిన తొలి రేస్‌లో గ్రాసీ మూడో స్థానం సాధించడంతో 18 పాయింట్లు టీమ్ ఖాతాలో చేరాయి. దాంతో పట్టికలో మహీంద్రా ప్రస్తుతం ఆరో స్థానంలో కొనసాగుతోంది. హైదరాబాద్‌లో ఆ జట్టు ఎలాంటి ప్రదర్శన ఇస్తుందనేది ఆసక్తికరం.

షాంపేన్ కాదు..రంగు కాగితాలే...

రేసింగ్ సర్క్యూట్‌లో ఫలితం వచ్చిన తర్వాత విజేతలు షాంపేన్ బాటిల్‌తో సంబరాలు చేసుకోవడం సహజం. ప్రపంచ వ్యాప్తంగా దాదాపు అన్ని వేదికల్లోనూ ఇది కనిపిస్తుంది. అయితే స్థానిక సంప్రదాయాలను గౌరవిస్తూ ఆయా దేశాల్లో షాంపేన్‌ను దూరంగా ఉంచాలని ఇటీవల నిర్వాహకులు నిర్ణయం తీసుకున్నారు. సౌదీ అరేబియాలో తొలిసారి తాజా సీజన్‌లో ఎఫ్–1 జరిగినప్పుడు, గత ఏడాది ఇండోనేసియా ఫార్ములా 'ఇ' జరిగినప్పుడు కూడా రంగు రంగుల కాగితాలు వెదజల్లడంతోనే వేడుకలు జరుపుకోవాల్సి వచ్చింది. ఇప్పుడు దీనినే హైదరాబాద్‌లోనూ అనుసరించబోతున్నారు. ఇక్కడా షాంపేన్‌తో సంబరాలు లేకుండా మెషీన్ల ద్వారా రంగురంగుల కాగితాలను వెదజల్లుతారు.

ప్రాక్టీస్‌లో ప్రమాదం...



శుక్రవారం తొలి ఫ్రీ ప్రాక్టీస్ సందర్భంగా సర్క్యూట్‌పై అనుకోని ఘటన చోటు చేసుకుంది. ప్రాక్టీస్ చేస్తున్న సమయంలో 'పోర్ష్' జట్టు డ్రైవర్ పాస్కల్ వెర్లీన్ కారు అదుపు తప్పింది. 18వ మలుపు వద్ద ఎడమవైపు గోడను ఢీకొని కారు నిలిచిపోయింది. అయితే అదృష్టవశాత్తూ పాస్కల్ ఎలాంటి ప్రమాదం లేకుండా క్షేమంగా బయటపడ్డాడు. ప్రస్తుతం పాయింట్లలో అతను అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. అయితే ట్రాక్‌పై తమకు ఎలాంటి ఫిర్యాదులు లేవని, స్ట్రీట్ సర్క్యూట్ ఇలా కాస్త ఎక్కువ దుమ్ముతో ఉండటం సహజమేనని నిర్వాహకులు వెల్లడించారు. మరోవైపు ట్రాక్‌పైకి అనూహ్యంగా పబ్లిక్ వాహనాలు దూసుకురావడంతో కొద్దిసేపు గందరగోళం నెలకొంది. ట్రాఫిక్‌ను నిలువరిస్తున్న సెక్యూరిటీ సిబ్బందిని దాటి ఒక బైకర్ ముందుకు వెళ్లడం, మిగతా వారంతా అతడిని అనుసరించినట్లుగా తెలిసింది. వెంటనే అప్రమత్తమైన నిర్వాహక బృందం పరిస్థితిని చక్కదిద్దింది. దాంతో ప్రాక్టీస్ రేస్ అర గంట ఆలస్యంగా ప్రారంభమైంది.



కారు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన భారత వికెట్ కీపర్ రిషభ్ పంత్ వేగంగా కోలుకుంటున్నాడు. రూర్కీలోని తన స్వగృహంలో పంత్ క్రచెస్ సాయంతో అడుగులు వేస్తున్న ఫొటో అతని అభిమానులకు పెద్ద ఊరటనివ్వనుంది. సోషల్ సైట్‌లో ఈ ఫొటోను పంచుకున్న పంత్ 'ఇక బలంగా... మెరుగ్గా... ఈ ముందడుగు' అని రాసుకున్నాడు.

సౌరాష్ట్ర దీటైన జవాబు

• షెల్డన్ జాక్సన్, అర్పిత్ సెంచరీలు
• కర్ణాటకతో రంజీ సెమీఫైనల్

బెంగళూరు: కెప్టెన్ అర్పిత్ వాసవద (219 బంతుల్లో 112 బ్యాటింగ్; 15 ఫోర్లు), షెల్డన్ జాక్సన్ (245 బంతుల్లో 160; 23 ఫోర్లు, 2 సిక్స్‌లు) సెంచరీలు సాధించడంతో... కర్ణాటక జట్టుతో జరుగుతున్న రంజీ ట్రోఫీ సెమీఫైనల్లో మాజీ చాంపియన్ సౌరాష్ట్ర తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం సాధించేందుకు మరో 44 పరుగుల దూరంలో నిలిచింది. ఓవర్‌నైట్ స్కోరు 76/2తో మూడో రోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన సౌరాష్ట్ర ఆట ముగిసే సమయానికి 112 ఓవర్లలో 4 వికెట్లకు 354 పరుగులు సాధించింది. షెల్డన్ జాక్సన్, అర్పిత్ నాలుగో వికెట్‌కు 232 పరుగులు జోడించి సౌరాష్ట్ర జట్టును ఆదుకున్నారు. ప్రస్తుతం అర్పిత్, చిరాగ్ జానీ (19 బ్యాటింగ్; 2 ఫోర్లు) క్రీజులో ఉన్నారు. కర్ణాటక బౌలర్లలో విద్వత్ కవేరప్ప రెండు వికెట్లు తీయగా, వాసుకి కౌశిక్, కృష్ణప్ప గౌతమ్‌లకు ఒక్కో వికెట్ దక్కింది.

బెంగాల్‌కు భారీ ఆధిక్యం

ఇండోర్‌లో డిఫెండింగ్ చాంపియన్ మధ్యప్రదేశ్‌తో జరుగుతున్న మరో సెమీఫైనల్లో బెంగాల్‌కు భారీ ఆధిక్యం లభించింది. ఓవర్‌నైట్ స్కోరు 56/2తో మూడో రోజు ఆట కొనసాగించిన మధ్యప్రదేశ్ తొలి ఇన్నింగ్స్‌లో 170 పరుగులకే కుప్పకూలింది. బెంగాల్ బౌలర్ ఆకాశ్‌దీప్ (5/42) మధ్యప్రదేశ్‌ను దెబ్బ కొట్టాడు. బెంగాల్‌కు 268 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించినా కెప్టెన్ మనోజ్ తివారి మధ్యప్రదేశ్‌కు ఫాలోఆన్ ఇవ్వకుండా రెండో ఇన్నింగ్స్ ఆడాలని నిర్ణయం తీసుకున్నాడు. బెంగాల్ రెండో ఇన్నింగ్స్‌లో ఆట ముగిసే సమయానికి రెండు వికెట్లు కోల్పోయి 59 పరుగులు సాధించింది. ప్రస్తుతం బెంగాల్ ఓవరాల్ ఆధిక్యం 327 పరుగులకు చేరుకుంది.



అర్పిత్, షెల్డన్ జాక్సన్

ముంబై మెరిసె...

బెంగళూరు: ప్రైమ్ వాలీబాల్ లీగ్‌లో ముంబై మెటియోస్ జట్టు తొలి విజయం సాధించింది. చెన్నై బ్లిట్జ్‌తో శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో ముంబై మెటియోస్ 5–0తో (15–14, 15–6, 15–11, 15–12, 15–9) జయభేరి మోగించింది. ఈ సీజన్‌లో ఓ జట్టు ప్రత్యర్థిని 5–0తో ఓడించడం ఇదే తొలిసారి. ముంబై తరఫున జేమ్స్ అనూ 14 పాయింట్లు, హర్‌దీప్ సింగ్ 12 పాయింట్లు, బ్రాండన్ గ్రీన్‌వే తొమ్మిది పాయింట్లు స్కోరు చేశారు. చెన్నై బ్లిట్జ్ తరఫున జోబిన్ వర్గీస్ 11 పాయింట్లతో రాణించాడు. నేడు జరిగే మ్యాచ్‌లో కాలికట్ హీరోస్‌తో హైదరాబాద్ బ్లాక్‌హాక్స్ తలపడుతుంది.





ఒడిశా ఎఫ్‌సీ చేతిలో హైదరాబాద్‌కు షాక్

భువనేశ్వర్: ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్‌ఎల్)లో డిఫెండింగ్ చాంపియన్ హైదరాబాద్ ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ) జట్టుకు మూడో పరాజయం ఎదురైంది. శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో ఒడిశా ఎఫ్‌సీ 3–1 గోల్స్‌తో హైదరాబాద్‌ను బోల్తా కొట్టించింది. ఒడిశా తరఫున ఇసాక్ (33వ ని.లో), డీగో మౌరిసియో (90+4వ ని.లో) ఒక్కో గోల్ చేయగా... హైదరాబాద్ ప్లేయర్ నిమ్ దోర్జీ తమాంగ్ 72వ నిమిషంలో 'సెల్ఫ్ గోల్' చేశాడు. హైదరాబాద్ నుంచి ఏకైక గోల్‌ను నిమ్ దోర్జీ (45వ ని.లో) సాధించాడు. 17 మ్యాచ్‌లు పూర్తి చేసుకున్న హైదరాబాద్ 11 విజయాలు, 3 'డ్రా'లు, 3 ఓటములతో 36 పాయింట్లు సాధించి రెండో స్థానంలో ఉంది.

షాట్‌పుట్‌లో తజీందర్ పాల్‌కు స్వర్ణం



అస్తానా (కజకిస్తాన్): ఆసియా ఇండోర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో తొలి రోజే భారత్ నాలుగు పతకాలతో అదరగొట్టింది. పురుషుల షాట్‌పుట్‌లో తజీందర్ పాల్ సింగ్ తూర్ పసిడి పతకం గెలిచాడు. తజీందర్ ఇనుప గుండును 19.49 మీటర్ల దూరం విసిరి అగ్రస్థానంలో నిలిచాడు. కరణ్‌వీర్ సింగ్ 19.37 మీటర్లతో రెండో స్థానంలో నిలిచి భారత్‌కు రజతం అందించాడు. ట్రిపుల్ జంప్‌లో ప్రవీణ్ చిత్రావెల్ 16.98 మీటర్ల దూరం గెంతి జాతీయ ఇండోర్ రికార్డు నెలకొల్పడంతోపాటు రజత పతకం సాధించాడు. మహిళల పెంటాథ్లాన్‌లో స్వప్నా బర్మాన్ 4119 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచి రజత పతకం సొంతం చేసుకుంది.

సెమీస్‌లో సాకేత్-యూకీ జోడీ



సాకేత్

డాలస్ (అమెరికా): కొత్త ఏడాదిలో కూడా నిలకడగా రాణిస్తున్న సాకేత్ మైనేని–యూకీ బాంబ్రీ (భారత్) జోడీ డాలస్ ఓపెన్ ఏటీపీ–250 టెన్నిస్ టోర్నీలో సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. శుక్రవారం జరిగిన పురుషుల డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో సాకేత్–యూకీ ద్వయం 2–6, 6–3, 10–8తో 'సూపర్ టైబ్రేక్'లో మూడో సీడ్ జూలియన్ క్యాష్–హెన్రీ ప్యాటెన్ (బ్రిటన్) జోడీపై సంచలన విజయం సాధించింది. 78 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సాకేత్–యూకీ రెండు ఏస్‌లు సంధించి, ప్రత్యర్థి సర్వీస్‌ను ఒకసారి బ్రేక్ చేశారు. సెమీఫైనల్లో నథానియల్ లామోన్స్–జాక్సన్ విత్రో (అమెరికా)లతో సాకేత్–యూకీ తలపడతారు.

ఆసియా జూనియర్ స్క్వాష్ సెమీస్‌లో భారత్



అనాహత్

చెన్నై: ఆసియా జూనియర్ టీమ్ స్క్వాష్ చాంపియన్‌షిప్‌లో భారత పురుషుల, మహిళల జట్లు సెమీఫైనల్లోకి దూసుకెళ్లాయి. ఆఖరి లీగ్‌లో రెండో సీడ్ పురుషుల జట్టు 2–1తో మలేసియాపై గెలిచింది. కృష్ణ మిశ్రా 9–11, 11–7, 5–11, 4–11తో హరిత్ డానియల్ బిన్ జెఫ్రి చేతిలో ఓడగా, శౌర్య బవా 11–8, 11–8, 11–9తో షామిల్ హ్యాజద్ బిన్‌పై, పార్థ్ అంబాని 9–11, 12–10, 11–7, 3–11, 11–4తో లో వా సెర్న్‌పై గెలుపొందారు. సెమీస్‌లో భారత పురుషుల జట్టు కొరియాతో తలపడుతుంది. మహిళల జట్టు 3–0తో సింగపూర్‌ను చిత్తు చేసింది. అనాహత్ సింగ్ 11–1, 11–1, 11–2తో లీ జి ఫాంగ్‌పై, యువన గుప్తా 9–11, 9–11, 13–11, 11–6, 11–3తో ఒంగ్ జె సిమ్‌పై, పూజ ఆర్తి 11–7, 9–11, 11–4, 11–6తో అయు యింగ్ వే లిన్‌పై గెలిచారు. నేడు జరిగే సెమీఫైనల్లో అమ్మాయిల జట్టు మలేసియాను ఢీకొంటుంది.

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
శనివారం ॥ 11-2-2023

'నీ విద్య నువు సరిగా నేర్చుకో... డబ్బు, గుర్తింపు అవే వస్తాయి' అంటోంది ఈ టైలరమ్మ.
బట్టలు కొత్తగా కుట్టడం కూడా లక్షలు తెచ్చి పెడతాయా? .. పెడతాయి.
పల్లెటూళ్లో వ్యవసాయం చేసుకుంటూ రాత్రిళ్లు కుట్టు పని చేసిన ధోలీ
యూ ట్యూబ్‌లో అందరూ టాలెంట్ ప్రదర్శించడం చూసి
తను కూడా టైలరింగ్‌ను యూ ట్యూబ్‌లో చూపెట్టింది.
రకరకాల స్త్రీల దుస్తులను కట్ చేసి కెమెరా ముందు
కుడుతుండేసరికి లక్షల మంది ఫాలోయెర్లు ఏర్పడ్డారు.
కుట్టడానికి ఆర్డర్లు వచ్చిపడుతున్నాయి.
యూ ట్యూబ్ నెల తిరిగే సరికి చెక్ పంపుతోంది.
అవార్డులు కూడా మొదలయ్యాయి.
కత్తెర, టేప్‌తో ఒక మహిళ సాధించిన విజయం ఇది.
నవ్యమైన ఐడియానే ఆమె విజయానికి కారణం.

యూ ట్యూబర్


ధోలీ

కెమెరా ముందు కుడితే లక్షలు వస్తున్నాయి

'కొందరు విధిని నమ్ముకుని కూచుంటారు. కొందరు మాత్రం తమ విధిరాతను తామే రాసుకుంటారు' అంటుంది ధోలి.

ఈమె ఇప్పుడు రాజ్ మసంద్‌లో ఉంటుంది. ఇది రాజస్థాన్‌లోని ఒక మోస్తరు సిటీ. కాని అక్కడి నుంచే దేశం మొత్తానికి తెలిసింది. ఇంకా చెప్పాలంటే ఎక్కడెక్కడైతే భారతీయులు ఉన్నారో అక్కడి వారికి కూడా తెలిసింది. దానికి కారణం బట్టలు కుట్టడంలో ధోలికి ఉండే విశేష ప్రతిభ, సృజనాత్మకత. వేగం. కొత్తదనం. స్త్రీలు ధరించే అన్ని రకాల వస్త్రాలను మరింత కొత్తగా ఎలా చేయవచ్చో, ఎలా ఆకర్షణీయంగా మలచవచ్చో ధోలి చేసే వీడియోల్లో చూడొచ్చు. కొందరు విద్యను దాచుకుంటారు. కాని ధోలి తనలాంటి స్త్రీలు టైలరింగ్ నేర్చుకుని తమ కాళ్ల మీద తాము నిలబడాలని తెలిసిందంతా చెప్పేస్తుంది. అందుకే ఆమెకు అంత ప్రచారం. మన్నన.

బాల్య వివాహం చేసుకుని

ధోలిది రాజస్థాన్‌లోని భరత్‌పూర్. తండ్రి వ్యవసాయం చేసేవాడు. వెనుకబడిన ప్రాంతం కావడంతో 10 సంవత్సరాలకే పెళ్లి చేసి ఈడేరాక అత్తారింటికి పంపాడు. 18 ఏళ్లు వచ్చేసరికి ధోలి ముగ్గురు పిల్లల తల్లి. అత్తారింటిలో పెద్ద కోడలు కావడం వల్ల బండెడు చాకిరీ ఉండేది. పగలు పొలంలో కూలి పని చేసేది. పాలు పితికి అమ్మేది. చిన్నప్పటి నుంచి టైలరింగ్ అంటే ఆసక్తి ఉండటం వల్ల నేర్చుకోవడంతో రాత్రిళ్లు కరెంటు లేని ఇంట్లో కిరోసిన్ దీపం కింద కుట్టేది. కాని బతుకు మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అన్నట్టుగానే ఉండేది.



సిటీకి మారాక

కొన్ని కారణాల వల్ల పట్నమైన రాజ్ మసంద్‌కు ధోలి కాపురం మార్చింది. అక్కడ టైలరింగ్ మొదలెట్టింది. 2016లో యూట్యూబ్ ఆమె దృష్టికి వచ్చింది. అందులో రకరకాల వ్యక్తులు తమకు తెలిసిన విద్యలు వీడియోలు చేసి పెట్టడం గమనించింది. 'నేనెందుకు నా టైలర్ విద్యను ప్రదర్శించకూడదు' అని వీడియోలు చేసి పెట్టింది. రోడ్డు మీద ఉండే తన ఇంటిలో రోడ్డు రణగొణ ధ్వనుల మధ్య ఆ వీడియోలు చేసి అప్‌లోడ్ చేసింది. కాని అంతగా గుర్తింపు రాలేదు. ధోలి ఆగలేదు. వీడియోలు బాగా గమనించి ఎలా చేయాలో తెలుసుకుని 2017లో 'ఘోరి ఫ్యాషన్ డిజైనర్' పేరుతో యూట్యూబ్ చానల్ తెరిచింది.

27 కోట్ల వ్యూస్

టైలరింగ్ పని నేర్చుకోవాలని చాలా మంది స్త్రీలకు ఉంటుంది. కొత్త కొత్త ఫ్యాషన్స్ ఫాలో కావాలని మరికొంత మంది స్త్రీలకు ఉంటుంది. వీరంతా వెంటనే ధోలి చేస్తున్న వీడియోలను ఇష్టపడి చానల్‌కు సబ్‌స్క్రయిబ్ చేశారు. ఏ బట్టను ఏ మోడల్‌తో ఎలా కుట్టాలో ధోలి చకచకా చెప్తూ కుట్టి చూపుతుంది కాబట్టి వాటిని ఫాలో కాసాగారు. కుర్తీలు, అనార్కలి డ్రస్సులు, బ్లౌజ్‌లు... ఒకటని ఏముంది చాలా కొత్తరకంగా ధోలి డిజైన్లు ఉంటాయి. యూ ట్యూబ్ నుంచి తొలి పారితోషికంగా 11 వేల రూపాయలు వచ్చాయి. ఇప్పుడు ఆమెకు 16 లక్షల మంది సబ్‌స్క్రయిబర్లు ఉన్నారు. ఇప్పటికి 700 వీడియోలు చేసి అప్‌లోడ్ చేసింది. వీటికి 27 కోట్ల వ్యూస్ వచ్చాయి. యూ ట్యూబ్ నుంచి నెలకు లక్షకు పైగా పారితోషికం అందుతోంది. అంటే ధోలి ఎంత సక్సెస్‌ఫుల్ టైలరమ్మో అర్థం చేసుకోవచ్చు. తన ప్రచారం కోసం ఫేస్‌బుక్‌లోనూ ఇన్‌స్టాలోనూ అకౌంట్లు తెరిచింది.

రోజుకు 20 రూపాయల నుంచి

ఒకప్పుడు పల్లెటూళ్లో రాత్రిళ్లు బట్టలు కుడితే అతి కష్టమ్మీద రోజుకు 20 రూపాయలు వచ్చేవి. ఇవాళ ధోలి కేవలం తన ప్రతిభ, సృజనాత్మకతతో పాటు సోషల్ మీడియా సహాయంగా పెద్ద సంపాదన చూస్తోంది. రాజ్ మసంద్‌లో మంచి ఇల్లు ఏర్పాటు చేసుకుంది. ఆమెను పిలిచి అవార్డులు ఇచ్చి గౌరవిస్తున్నారు. 'ఎదుటి వారిని ఓడించడం కంటే మనం గెలవడం ముఖ్యం అనుకోవాలి. మనలోని ప్రతికూల భావాలను తీసేస్తే తప్పకుండా విజయం సాధిస్తాం' అంటుంది ధోలి.

మహిళ తన కలలను సాకారం చేసుకోగలిగేది కుటుంబ అవసరాలన్నీ పూర్తయిన తర్వాతే. అంటే అన్ని బాధ్యతలు తీరాక అప్పటికీ పరిస్థితులు అనుకూలిస్తే అది ఆమె అదృష్టంగా మారుతుంది. ఇదే విషయాన్ని ప్రస్తావిస్తూ కోయంబత్తూర్ వాసి 84 ఏళ్ల లలితాంబాల్ భారతదేశం బయటి ప్రపంచాన్ని చూస్తూ ఆరు దశాబ్దాల తన కలను నెరవేర్చుకుంటోంది. ఈ క్రమంలో ఎదురైన సవాళ్లను ఈ రిటైర్డ్ టీచర్ అధిగమిస్తున్న విధానం చాలా ఆసక్తిదాయకంగానూ, ఎంతోమంది అనుసరించదగినదిగానూ ఉంటుంది.

60వ దశకంలో లలితాంబాల్ జాగ్రఫీ, హిస్టరీ టీచర్‌గా పనిచేసేవారు. ఆ సమయంలో ఆమె ప్రపంచాన్ని పర్యటించాలని కలలు కనేవారట. కానీ ఆమెకు పరిస్థితులు అనుకూలించలేదు. ఆరు దశాబ్దాల తర్వాత ఇప్పుడు ఒక విదేశీ గడ్డపై అడుగుపెట్టింది.

పాస్‌పోర్ట్ వచ్చిన వేళ

''చిన్నవయసులోనే పెళ్లి అవడం, ఆ తర్వాత కుటుంబ బాధ్యతలకే ప్రాధాన్యం ఇస్తూ వచ్చాను. అదే నాకు సంతోషాన్ని ఇచ్చింది. ఆర్థిక కష్టాలు, ఇతర ప్రాధాన్యాలతో కుటుంబ భవిష్యత్తు వైపే ఉండటానికి నిర్ణయించుకున్నాను. నా సమయమంతా అందుకే కేటాయించాను. అయితే, నా కలలు మాత్రం ఎప్పుడూ నన్ను వీడిపోలేదు. పుస్తకాల్లో చదివిన విషయాలు, విద్యార్థులకు బోధించే సమయంలోనూ 'ఎప్పుడైనా బయట ప్రపంచం వైపుగా ప్రయాణం చేయగలనా..' అని అనుకునేదాన్ని. కానీ, ప్రయాణం మాట అటుంచితే కనీసం పాస్‌పోర్ట్ కూడా తీసుకోలేకపోయాను. రెండేళ్ల క్రితం నా కూతురు మేఖల పాస్‌పోర్ట్‌కు అప్లై చేయమని చెప్పింది. ప్రయత్నించాను. 83 ఏళ్ల వయసులో నా చేతుల్లోకి పాస్‌పోర్ట్ వచ్చింది.

నాలుగేళ్ల క్రితం..

నెదర్లాండ్స్‌లో నా మనవరాలు స్థిరపడింది. తన పొదుపు మొత్తంతో నా కలను నిజం చేయడానికి తను బాధ్యత తీసుకుంది. నా దగ్గర కూడా కొంత పొదుపు మొత్తాలున్నాయి. అయితే, మూడేళ్ల క్రితం వచ్చిన కరోనా మహమ్మారి కారణంగా నా భర్త మరణించడంతో అన్నీ ఆగిపోయాయి.


లలితాంబాల్

• టూర్

వయసు 84.. చలో యూరప్


కుటుంబ సభ్యులతో లలితాంబాల్

యూరప్ అంతా...

ప్రస్తుతం ఉన్న వయసు, ఆరోగ్యస్థితి కారణంగా విదేశాలకు వెళ్లగలనా, కుటుంబంలో మిగతా అందరికీ ఆందోళనగా మారుతుందా అని మొదట్లో సంకోచించాను. కానీ, పిల్లలు ఇచ్చిన ధైర్యంతో ఎట్టకేలకు ఆమ్‌స్టర్‌డామ్‌లో దిగాను. మా అమ్మాయితో కలిసి మూడు నెలల పాటు యూరప్ అంతా ప్రయాణించాను. భౌగోళికం, చరిత్రలో విద్యార్థులకు బోధించిన విషయాలు కళ్లారా చూడటం నాకు చాలా ఆనందాన్నిచ్చింది. అందులో ఒక ఉదాహరణ.. రిజ్క్ మ్యూజియంలోని అతి పెద్ద వాటర్లూ యుద్ధం పెయింటింగ్ చూసి ఊపిరి పీల్చుకున్నాను. ఊహల్లోకంటే వాస్తవికంగా చూసినప్పుడు ఆ పెయింటింగ్ మరింత అద్భుతంగా అనిపించింది.

ఈతరాణిగా..

విమానాల్లో తిరగడం, నీటిపై లాంచీలో విహారం ఎన్నో దృశ్యాలు అద్భుతంగా ఉన్నాయి. ప్రకృతితో కలిసి ప్రజలు సాగిస్తున్న జీవితాలను చూశాను. ఒక ట్రిప్ నుండి మరొక ట్రిప్‌కు వెళ్లడంలో ఎన్నో భయాలు దూరమయ్యాయి. నా చిన్నతనం కేరళలో గడిచింది. మేమున్న ప్రాంతంలో 'ఈతరాణి' అనే పేరుండేది నాకు. కానీ, ఆ తర్వాత జీవనంలో అదీ మర్చిపోయాను. 50 సంవత్సరాల తర్వాత ఇప్పుడు ఇక్కడ ఈత కొడుతున్నాను. ఒకప్పుడు స్వేచ్ఛగా ఈదుతూ భవిష్యత్తు గురించి కొంచెం ఎక్కువ కలలు కనే అదే చిన్న అమ్మాయిగా ఇప్పుడు మారిపోయాను.

లొంగిపోవద్దు..

నాకు స్వతంత్రంగా ఉండే మహిళలంటే చాలా గౌరవం. వారి శక్తి ఎంతో స్ఫూర్తిదాయకంగా ఉంటుంది. అయితే, ఈ సమయంలోనే ఎన్నో పోరాటాలు, గందరగోళాన్ని ఎదుర్కోవాల్సి ఉంటుంది. పరిస్థితులు లేదా వ్యక్తులకు ఎప్పుడూ వంగి, ఆధిపత్యానికి లొంగిపోవద్దు. మీ మూలాలను అస్సలు మరచిపోవద్దు. ఆర్థిక స్వాతంత్ర్యం ఎప్పుడూ ఆత్మవిశ్వాసంతో సొంత నిర్ణయాలు తీసుకునే శక్తినిస్తుంది. ఇదే విషయం చెబుతూ నా ఇద్దరు పిల్లలను, ముగ్గురు మనవళ్లను పెంచాను. ఇప్పుడు వారి సాయంతో నా దశాబ్దాల కలను నెరవేర్చుకుంటున్నాను'' అని చెబుతుంది లలితాంబాల్. 84 ఏళ్ల వయసులో మహిళలు విస్తృతంగా ప్రయాణించడం చాలా అరుదు. కానీ, లలితాంబాల్ జీవన ప్రయాణం ఎంతోమందికి స్ఫూర్తినిస్తుంది.

లైఫ్@360

పర్యావరణంలో మీ పాత్ర?



పర్యావరణం బాగుంటే మనం బాగుంటాం. మనం బాగుండాలంటే పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలి. ఇది ప్రతి ఒక్కరి బాధ్యత. అందుకోసం మీరు ఏమి చేస్తున్నారో మీకు మీరుగా ప్రశ్నలు వేసుకోండి. ఒకవేళ మీకు సరైన సమాధానం రాకపోతే ఈ కింద చెప్పుకున్న పనులు చేసేందుకు ప్రయత్నం చేయండి.

- ఈ పర్యావరణంలో జంతువులు, పక్షులు కూడా భాగమే కాబట్టి వాటి కోసం ఆవాసాలు, చెట్ల మీద గూళ్ల ఏర్పాటు చేయడం.
- జల, మృత్తికా కాలుష్యాలను అరికట్టేందుకు ప్లాస్టిక్ సంచుల వినియోగం తగ్గించాలని ప్రచారం చేయడం.
- పాతవస్తువుల పునర్వినియోగం గురించి పిల్లలకు తెలియజేయటం.
- వీధులు, పార్కులు, ఇతర ప్రదేశాల్లో వ్యర్థాలను తీసి పారేయటం.
- వీలైతే పర్యావరణ భద్రత గురించి పాటలు, నాటికలు వంటి సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించడం, వీలైనన్ని మొక్కలను నాటటం, నాటించటం.
- భూమిని, సహజవనరులను కాపాడుకోవటం ఎంతో అవసరం కాబట్టి ప్రతిరోజూ పర్యావరణ దినోత్సవంగానే భావించడం, అలా భావించాల్సిందిగా మన చుట్టుపక్కల వారికి కూడా చెప్పడం.
- మన భూమి భవిష్యత్తు రేపటి పౌరులైన పిల్లల చేతిలో ఉంది కాబట్టి పర్యావరణాన్ని, సహజవనరులను కాపాడాల్సిన బాధ్యతను గురించి వారికి తెలియజేసేందుకు పాఠశాలలో వివిధ రకాల ప్రచార కార్యక్రమాలను నిర్వహించాలి.
- స్వచ్ఛత, కాలుష్యనివారణ, పర్యావరణం తదితర అంశాలకు సంబంధించి కృషి చేస్తున్నవారిని, వాటికోసం ఎంతగానో పాటుపడుతున్నవారిని సత్కరించడం వల్ల ఇతరులు సైతం స్ఫూర్తి పొందే అవకాశముంది.
- పర్యావరణ హితం కోసం మన చుట్టుపక్కల చేపడుతున్న, జరుగుతున్న కార్యక్రమాలను గురించి ఎప్పటికప్పుడు తెలుసుకోవడం. వీటి గురించి మీ మీ చుట్టూ ఉన్నవారు తెలుసుకునేందుకు మీరే సమాచార సారథిగా మారడం. ఇతరులకు ప్రేరణ అందించడం.

పెళ్లి అయితే బరువు పెరుగుతారా?

పెళ్లి తర్వాత బరువు పెరుగుతుంటారు చాలా మంది. ఇది కేవలం మన దేశంలో మాత్రమే కనిపించేది కాదని, మానవ సమాజాల్లో ఎక్కడైనా పెళ్లి తర్వాత బరువు పెరగడం చాలా సాధారణమని నిపుణులు చెబుతున్నారు. అయితే పెళ్లి తర్వాత బరువు పెరగడం అనేది మగవాళ్లతో పోలిస్తే ఆడవాళ్లలో కొంచెం ఎక్కువ అని అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. దాదాపు 8000 మందిపై జరిపిన పరిశోధన ప్రకారం పెళ్లైన ఐదేళ్ల తర్వాత ఆడవాళ్లు సరాసరిన 11 కిలోలు బరువు పెరగగా, పెళ్లి కాని ఆడవారు ఐదేళ్లలో సరాసరిన 7 కిలోలు మాత్రమే బరువు పెరిగారు. ఇదే సమయంలో పెళ్లైన మగవారు దాదాపు 7–8 కిలోలు మేర బరువు పెరిగినట్లు తెలిసింది. పైగా పెళ్లైన జంటలో ఒకరు బరువు పెరిగితే మరొకరు బరువు పెరిగే అవకాశాలు 37 శాతం అధికమని తేలింది. ఇందుకు కారణం జంటలో ఒకరి అలవాట్లు మరొకరికి తొందరగా సోకడమే. అంటే ఒకరికి ఎక్కువ తినే అలవాటుంటే వారి భాగస్వామిలో కూడా తినే అలవాటు బాగా పెరుగు తుందన్నమాట. అలాగే పెళ్లి తర్వాత బంధువుల ఇళ్లలో విందులు, సొంతింట్లో కొసరి కొసరి తినిపించుకోవడాలు.. ఇలా తెలియకుండానే జంట బరువు పెరుగుతారు.

పెళ్లి కానంత వరకు శరీర సౌందర్యంపై శ్రద్ధ పెట్టిన వాళ్లు జంటగా మారిన తర్వాత ఇద్దరిలోనూ పెరిగే భద్రతా భావం కారణంగా శరీరంపై కొంతమేర అశ్రద్ధ వహించడం జరుగుతుంది, దీని తోపాటు పైన చెప్పినట్లు తినడం పెరగడం వల్ల కూడా క్రమంగా లావవుతారు.

ఈ ప్రక్రియను అడ్డుకోవాలంటే కలిసి తిన్నట్లే కలిసి ఎక్సర్‌సైజులు చేయడం ద్వారా శరీర బరువును అదుపులో ఉంచుకోవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.



• ఔనా?

గర్భిణులు కాఫీ తాగడం మంచిదేనా?

ఇటీవల కాలంలో తరచు వినవస్తున్న మాట 'గర్భిణులు కాఫీ తాగకూడదు!' అని. బహుశా అది వాట్సప్ లేదా సోషల్ మీడియాలో వ్యాపించిన వ్యాపించిన సందేశాల వల్ల కావచ్చు. ఇంతకీ ఇది నిజమేనా? వైద్య నిపుణులు ఏమంటున్నారు? చూద్దాం..

కాఫీని కొకోవా, కాఫీ చెట్ల గింజల నుంచి తీసిన పొడితో తయారు చేస్తారనే విషయం తెలిసిందే. ఈ గింజల్లో కెఫీన్ అధికంగా ఉంటుంది. ఇది నాడీవ్యవస్థ చురుగ్గా వ్యవహరించడంలో తోడ్పడుతుంది. అందువల్లే కాఫీని తక్షణ శక్తిని అందించే ఉత్తేజపరిచే షధంగా భావిస్తారు. కాఫీలోని కెఫీన్ మన ఆహారనాళంలో త్వరగా జీర్ణమై కలసిపోవడం వల్లే ఇలా జరుగుతున్నట్లు వైద్య నిపుణులు కనుగొన్నారు. అయితే, గర్భిణులు కాఫీ తాగినప్పుడు వారిలో కెఫీన్ జీర్ణమవడానికి చాలా సమయం పడుతుంది. అంతకుమించి గర్భంపై కెఫీన్ వ్యతిరేక ఫలితాలు చూపడానికి ఇతమిత్థంగా ఇప్పటికీ కారణాలు తెలియదు. అలాగే దీని ప్రభావం ఒక్కొక్కరిలో ఒక్కోలా ఉండడమూ వైద్య నిపుణులు గమనించారు.

మోతాదు మించకపోతే ముప్పు లేదు

గర్భిణులు కాఫీ తాగొద్దా అంటే మాత్రం నిస్సందేహంగా తాగొచ్చంటున్నారు ది అమెరికన్ కాలేజ్ ఆఫ్ ఆబ్‌స్టెట్రీషియన్స్ అండ్ గైనకాలజిస్ట్స్(ఏసీఓజీ) వైద్యులు. కానీ ఎట్టిపరిస్థితుల్లోనూ రోజువారీ కెఫెన్ పరిమాణం 200 మిల్లీగ్రాములకు మించకూడదని చెబుతున్నారు. ఆ స్థాయిని మించితే మాత్రం గర్భంలోని శిశువుపై దుష్పరిణామాలు చూపించే ప్రమాదముందంటున్నారు. సాధారణంగా కప్పు (240 ఎం.ఎల్) కాఫీలో 96 మిల్లీగ్రాముల కెఫీన్ ఉంటుంది. దీని ప్రకారం ఎక్కువ నివేదికలు చెప్పేదేంటంటే గర్భిణులు రోజుకు రెండు కప్పులకు మించి కాఫీ తాగకూడదు.



• మీకు తెలుసా?



మెదడు తనను తాను రిపేర్ చేసుకునేందుకు దోహదపడే ప్రక్రియ నిద్ర. తగినంత నిద్ర పోవడం వల్ల మనసుకు, శరీరానికి కూడా ప్రశాంతంగా, రిలాక్స్‌డ్‌గా అనిపిస్తుంది. అయితే కొందరు నిద్రను నిర్లక్ష్యం చేస్తుంటారు. అలా నిర్లక్ష్యం చేయడం వల్ల పిల్లలు, పెద్దల్లో ఒబేసిటీ ముప్పు పెరుగుతుంది. సరైన నిద్ర లేకుంటే పిల్లల్లో 89 శాతం, పెద్దల్లో 55 శాతం మేర అధిక బరువు పెరిగే ఛాన్సులున్నాయి. ఇంతేకాదు, రకరకాల దుష్ప్రభావాలు

- ▲ నిద్రలేమితో జ్ఞాపక శక్తి క్షీణిస్తుంది.
- ▲ దాదాపు 15 పరిశోధనల సారాంశం ప్రకారం సరిగా నిద్రపోని వ్యక్తుల్లో గుండెపోటు, పక్షవాతం ముప్పు 50 శాతం మేర పెరుగుతుంది.
- ▲ నిద్రలేమి కారణంగా కార్టిసోల్ అనే స్ట్రెస్ హార్మోన్ అధిక మోతాదులో విడుదల అవుతుంది. ఇది చర్మసంరక్షణకు తోడ్పడే కొల్లాజెన్‌ను విచ్ఛిన్నం చేసి చర్మ సౌందర్యాన్ని కోల్పోయేలా చేస్తుంది.
- ▲ ఒక పరిశోధనలో 6 రాత్రుల పాటు కేవలం 4 గంటలు మాత్రమే నిద్రపోయిన వ్యక్తుల రక్తంలో ప్రీడయాబెటిస్ లక్షణాలు కనిపించినట్లు తేలింది.
- ▲ నొప్పి, దురద, అసౌకర్యం లాంటివి నిద్రలేమితో పెరుగుతాయి. ఐబీఎస్ లాంటి వ్యాధుల ముప్పు సరైన నిద్ర లేని వారిలో అధికం.
- ▲ కునుకు సరిగా లేనివారిలో క్రోన్స్ వ్యాధి వచ్చే ముప్పు రెట్టింపని తేలింది.
- ▲ కాబట్టి, టీనేజర్లైనా, పెద్దవారైనా సమయానుగుణంగా నిదురించకపోతే తర్వాత పశ్చాత్తాప పడాల్సి వస్తుంది. కాబట్టి జాగ్రత్త వహించాలని నిపుణుల సూచన.

ఈ కాఫ్ సిరప్‌ను ఇంట్లోనే తయారు చేసుకోవచ్చు

కొంతమందికి వర్షాకాలం వస్తే చాలు... జలుబు, దగ్గు, కఫం. ఇంకొందరికి చలి కాలంలో ఈ బాధలు వస్తాయి. అయితే ఈ కాలం ఆ కాలం అని కాకుండా కొందరు ఎప్పుడూ ఖంగ్ ఖంగ్... హాఛ్ హాఛ్... అని అంటూ ఉంటారు. నానా విధాలైన దగ్గు మందులు, రకరకాలైన టాబ్లెట్లు వాడినా కొద్ది రోజులకే సమస్య షరా మామూలే! అయితే, ఛాతీలో పట్టిన కఫం పోయి, దానివల్ల వచ్చే దగ్గు తగ్గ దానికి ఆయుర్వేదం మంచి చిట్కాను చెబుతోంది. దీన్ని పాటించడం వల్ల ఎలాంటి సైడ్ ఎఫెక్టులు ఉండవు. పైగా ఇందులో అన్ని సహజమైనవే వాడతాం కాబట్టి ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉంటాయి. ఇంట్లోనే ఈ ఆయుర్వేద మందును తయారు చేసుకోవచ్చు.

ఏం చేయాలంటే... ఈ మందును తయారు చేయడానికి ఇంట్లో ఉండే పదార్థాలే అంటే వెల్లుల్లి, మిరియాలు, లవంగాలు, పుదీనా, తులసి వంటివి సరిపోతాయి. ఇంతకూ కషాయం ఎలా తయారు చేయాలో చూద్దాం.

స్టవ్ మీద గిన్నె పెట్టి అందులో రెండు గ్లాసుల నీళ్లు పోయాలి. ఆ నీళ్లు వేడెక్కుతున్నప్పుడే రెండు వెల్లుల్లి రెబ్బలను దంచి వేయాలి. అలాగే పది మిరియాలు, పది లవంగాలు, చిన్న అల్లం ముక్కను కూడా బాగా దంచి అందులో కలిపి మరిగించాలి. చివర్లో ఆరు తులసి ఆకులు, గుప్పెడు పుదీనా ఆకులు, చిటికెడు పసుపు వేసి మరిగించాలి. ఇవన్నీ బాగా మరిగాక కషాయంలా తయారవుతాయి. స్టవ్ మీదినుంచి దించి గోరువెచ్చగా మారాక వడకట్టుకోవాలి. ఈ కషాయాన్ని కాఫీ తాగుతున్నట్టు సిప్ చేస్తూ తాగాలి. ఇలా చేయడం వల్ల ఛాతీలోని కఫం వదులుతుంది.



కఫంతో బాధపడుతున్నప్పుడు మూడు రోజులు పాటు ఈ కషాయాన్ని రోజూ తాగాలి.

ఈ కషాయంలో వాడిన పదార్థాలన్నీ ఉత్తమమైనవే. వాటిలో యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ వైరల్ లక్షణాలు పుష్కలంగా ఉంటాయి. కాబట్టి కఫం, దగ్గు, జలుబు, గొంతు నొప్పి వంటివి త్వరగా తగ్గిపోతాయి. ఈ కషాయం రోగనిరోధక శక్తిని పెంచి ఇలాంటి వ్యాధులు ఏవి రాకుండా కాపాడుతుంది. దీని రుచి కూడా అంత ఇబ్బందిగా ఉండదు. కాబట్టి పిల్లలకు కూడా తాగించవచ్చు. దీనివల్ల దుష్ప్రభావాలు ఉండవు.

ఈ కషాయాన్ని ఫ్రిజ్‌లో దాచుకొని మళ్ళీ వేడి చేసుకొని రెండు, మూడు రోజుల పాటు తాగకూడదు. అలా చేయడం వల్ల అది ప్రభావవంతంగా పనిచేయదు.

• హెల్త్ టిప్స్

రెండు చెంచాల ధనియాలను మెత్తగా నూరి నాలుగు చుక్కల నీళ్లు కలిపి ఆ పేస్టును కణతలకు పట్టిస్తే తలనొప్పి, మైగ్రేన్ తగ్గుతాయి. లవంగ తైలంతో నుదురును మర్దనా చేస్తే తలనొప్పి వెంటనే తగ్గుతుంది. లవంగ నూనె కొద్దిగా మంటగా ఉంటుంది కాబట్టి వైట్ పెట్రోలియం జెల్లీలో కలిపి నుదుటి మీద రాయాలి. దాల్చిన చెక్కను నూరి గంధపు పట్టీలా నుదుటికి పూసుకున్నా కూడా మంచి ఫలితం ఉంటుంది.

కప్పు నిమ్మరసాన్ని ఒక వెడల్పాటి ప్లేటులో వేసి దానిలో నాలుగు కప్పుల పంచదార వేసి ప్లేటంతా పరిచి ఎనిమిది గంటలపాటు ఫ్యాన్ కింద ఆరనివ్వాలి. పంచదార ఆరాక అందులో కొద్దిగా ఉప్పువేసి మిక్సీజార్‌లో వేసి పొడి చేసి, గాజు సీసాలో వేసి నిల్వ చేసుకోవాలి. ఇలా నిల్వ ఉంచుకున్న దానిని కావాలనుకున్నప్పుడల్లా టేబుల్ స్పూన్ పొడిని గ్లాసునీళ్లలో కలిపితే క్షణాల్లో నిమ్మషర్బత్ తయారవుతుంది. నేరుగా కాకపోయినా, సోడా, ఇతర రకాల జ్యూస్‌లలో కలిపి తాగినా రుచిగా ఉంటుంది. సి విటమిన్ సమృద్ధిగా లభిస్తుంది.



పొట్టను కరిగించే పానీయం... స్పూను వాము, స్పూను సోంపు, మరోస్పూను జీలకర్రను తీసుకుని మిక్సీలో మెత్తని పొడిలా చేసుకోవాలి. ఇప్పుడు ఒక గిన్నె తీసుకుని దానిలో రెండు గ్లాసుల నీళ్లలో రెడీ చేసి పెట్టుకున్న పొడి రెండు స్పూన్లు వేసి ఐదునిమిషాలపాటు సన్నని మంటపై మరిగించాలి. తరువాత చల్లారనిచ్చి వడగట్టాలి. రోజూ ఉదయం ఈ నీళ్లు తాగాలి. క్రమం తప్పకుండా ఈ డ్రింక్ తాగడం వల్ల పొట్టతోపాటు, కొవ్వు, అధిక బరువు తగ్గుతుంది.

క్లుప్తంగా...



వెక్కిరించిన వైకల్యాన్ని 'కాళ్ల'రాశాడు

కాళ్లతో పరీక్ష రాసిన విద్యార్థి

బెల్లంపల్లి: రెండు చేతుల్లేకపోయినా కాళ్లతో పరీక్ష రాసి ఆత్మవిశ్వాసానికి అసలు సిసలైన చిరునామాగా మారాడు ఎల్లూరి శంకర్. నెన్నెల మండలం కుశ్నపల్లి గ్రామానికి చెందిన ఎల్లూరి శంకర్ బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీకాం(కంప్యూటర్స్) మొదటి సంవత్సరం చదువుతున్నాడు. చిన్నతనంలోనే విద్యుదాఘాతంతో రెండు చేతులు కోల్పోయినా పట్టుదలతో చదువు కొనసాగిస్తున్నాడు. ప్రస్తుతం డిగ్రీ మొదటి సెమిస్టర్ పరీక్షలు జరుగుతున్నాయి. భవిత డిగ్రీ కళాశాల కేంద్రంలో శుక్రవారం జరిగిన పరీక్షకు హాజరయ్యాడు. బెంచిపై కూర్చుని ఎడమకాలితో జవాబు పత్రాన్ని.. కుడి కాలివేళ్లతో పెన్ను పట్టుకుని పరీక్ష రాశాడు. తోటి విద్యార్థులతోపాటే శంకర్ నిర్దిష్ట సమయంలో పరీక్ష పూర్తి చేయడం విశేషం.

'బీజేపీయేతర రాష్ట్రాల్లో పెట్రో ధరలెక్కువ'



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సహా బీజేపీయేతర రాష్ట్రాల్లోనే పెట్రోల్ ధరలు అధికంగా ఉన్నాయని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. ఏపీ, తెలంగాణతో పాటు పశ్చిమబెంగాల్, తమిళనాడు, కేరళ, జార్ఖండ్ రాష్ట్రాలు పెట్రో ఉత్పత్తులపై వ్యాట్ తగ్గించనందునే అక్కడ ధరలు అధికంగా ఉన్నాయని వివరించారు. ఇవి మినహా మిగతా అన్ని రాష్ట్రాలు పెట్రో ధరలను తగ్గించాయని వెల్లడించారు. బడ్జెట్‌పై నిర్మలా సీతారామన్ మాట్లాడుతున్న సమయంలో విపక్ష ఎంపీలు నిరసన తెలిపారు. దీనిపై నిర్మల ప్రతిస్పందిస్తూ..కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ పార్టీ ఆరోపణలు చేస్తోందని, వాటికి సమాధానం చెబుతుంటే సభలోంచి వెళ్లిపోవడం చేస్తుందని మండిపడ్డారు.

'సాహితీ' లక్ష్మీనారాయణకు బెయిల్

సాక్షి, హైదరాబాద్: డబుల్, ట్రిపుల్ బెడ్ రూమ్ ఫ్లాట్స్‌తో అపార్ట్‌మెంట్ల నిర్మాణానికి ముందే ప్రీ లాంచ్ ఆఫర్ల పేరుతో అనేకమందిని ఆకర్షించి వారిని మోసగించిన కేసులో అరెస్టు అయిన సాహితీ ఇన్‌ఫ్రాటెక్ వెంచర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ బి.లక్ష్మీ నారాయణకు బెయిల్ మంజూరైంది. నాంపల్లి కోర్టు శుక్రవారం షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 2,500 మంది నుంచి రూ.900 కోట్ల వరకు వసూలు చేసినట్లు ఈయనపై ఆరోపణలున్నాయి.

సీవీ ఆనంద్‌కు హైకోర్టు నోటీసులు

సాక్షి, హైదరాబాద్: కోర్టు ఆదేశాలు అమలు చేయనందుకు హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్‌కు హైకోర్టు నోటీసులు జారీచేసింది. నాలుగు వారాల్లోగా వివరణ ఇవ్వాలని ఆదేశించింది. ఆనంద్‌తో పాటు సైఫాబాద్ ఏసీపీ వేణుగోపాల్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ సత్తెయ్య, ఎస్సై సురేశ్‌రెడ్డిలకు కూడా నోటీసులు జారీచేసింది. నిరుద్యోగులతో కలసి ఫిబ్రవరి 3న ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ నర్సింగ్‌రావు.. అసెంబ్లీ ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా కోర్టు ఆదేశాలను పాటించకుండా తనను అరెస్టు చేశారని పేర్కొంటూ బల్మూరి హైకోర్టులో కోర్టు ధిక్కరణ పిటిషన్ వేశారు. దీనిపై న్యాయమూర్తి జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి శుక్రవారం విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది గిరిధర్‌రావు వాదనలు వినిపిస్తూ కోర్టు ఆదేశాల మేరకు అరెస్టు చేసిన 24 గంటల్లో ఆ వ్యక్తిని మేజిస్ట్రేట్ ముందు ప్రవేశపెట్టాలన్నారు. కానీ, పోలీసులు ఆ ఆదేశాలను పాటించలేదని చెప్పారు. దీంతో న్యాయమూర్తి పోలీస్ అధికారులకు నోటీసులు జారీ చేస్తూ విచారణను మార్చి 10కి వాయిదా వేశారు.

విద్యాశాఖ కమిషనర్ దేవసేనకు హైకోర్టు నోటీసులు


సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్‌లోని ఎయిడెడ్ స్కూల్‌లో పనిచేస్తున్న వారి వేతనాలకు సంబంధించి తాము ఇచ్చిన ఆదేశాలను అమలు చేయనందుకు రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ కమిషనర్ దేవసేనకు హైకోర్టు నోటీసులు జారీచేసింది. మార్చి 10న కోర్టుకు హాజరై వివరణ ఇవ్వాలని ఆదేశించింది. కోర్టు ఆదేశాలిచ్చినా అమలు చేయకపోవడంతో హరిబౌలీ హైస్కూల్‌లో ఉద్యోగి రాఫ్ హైకోర్టులో కోర్టు ధిక్కరణ పిటిషన్ వేశారు. దీనిపై విచారణ జరిపిన న్యాయమూర్తి జస్టిస్ అభినంద్‌కుమార్ షావిలీ పైవిధంగా ఆదేశాలు జారీ చేస్తూ, విచారణను వాయిదా వేశారు.

కాసుల యావ.. కోతల హవా

ఎడాపెడా సిజేరియన్లు చేసేస్తున్న ప్రైవేటు ఆస్పత్రులు

- సాధారణ ప్రసవానికి అవకాశం ఉన్నా కడుపు కోతకే మొగ్గు
- తల్లీబిడ్డల ఆరోగ్యం పట్టించుకోని వైనం
- ప్రభుత్వ ఆస్పత్రుల్లోనూ భారీ సంఖ్యలోనే సిజేరియన్లు
- సర్కారు ఆదేశాలు బేఖాతరు.. రంగారెడ్డి జిల్లాలో ఇష్టారాజ్యం

సాక్షి, రంగారెడ్డి జిల్లా: వైద్యుల కాసుల కక్కుర్తి తల్లీబిడ్డల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తోంది. సాధారణ ప్రసవానికి అవకాశం ఉన్నా అధిక ఫీజుపై ఆశతో ఎడాపెడా 'కోత'లు పెడుతున్నారు. దీనికితోడు మంచి ముహూర్తంలో బిడ్డకు జన్మనివ్వాలనే కొందరు భార్యాభర్తల ఆలోచన.. తమ బిడ్డ పురిటి నొప్పులు భరించ లేదనే కొందరు తల్లిదండ్రుల ఆందోళన.. సిజేరియన్లు పెరిగిపోయేందుకు దోహదపడుతోంది. సాధారణ ప్రసవాల్లో తక్కువ రక్తస్రావంతో పాటు ఆస్పత్రిలో ఉండాల్సిన అవసరం పెద్దగా ఉండదు. కేవలం వారం రోజుల్లోనే సాధారణ స్థితికి చేరుకుంటారు. అదే సిజేరియన్లతో అధిక రక్తస్రావం సమస్యతో పాటు వారం నుంచి పది రోజుల పాటు ఆస్పత్రిలోనే ఉండాల్సి వస్తుంది. ఇలాంటి వాటిపై అవగాహన కల్పించి సిజేరియన్లు నివారించేందుకు ప్రయత్నించాల్సిన వైద్యులు, ఆ పని చేయకుండా వారి బలహీనతలను క్యాష్ చేసుకుంటున్నారు. వీధి చివర్లో ఉన్న నర్సింగ్ హోమ్‌లో సాధారణ ప్రసవానికి రూ.35 వేల నుంచి 40 వేలలోపే ఖర్చు అవుతుంది. అదే సిజేరియన్ అయితే రూ.80 వేల నుంచి రూ.లక్షకు పైగా ఖర్చు అవుతోంది. ఇక కార్పొరేట్ ఆస్పత్రి అయితే ఆ స్థాయిలోనే సాధారణ, సిజేరియన్ డెలివరీ ఫీజులు ఉంటున్నాయి. ఎప్పటికప్పుడు ప్రసూతి కేంద్రాలను తనిఖీ చేసి...కడుపు కోతలకు పాల్పడుతున్న వైద్యులపై చర్యలు తీసుకోవాల్సిన వైద్య,ఆరోగ్యశాఖ అధికారులు ఆ వైపు కన్నెత్తి కూడా చూడకపోవడంతో చిన్నాచితకా నర్సింగ్‌హోమ్‌లు మొదలు కార్పొరేట్ ఆస్పత్రుల దాకా ఇష్టారాజ్యంగా మారిపోయిందనే ఆరోపణలున్నాయి. హైదరాబాద్ శివారు రంగారెడ్డి జిల్లాలోని ప్రైవేటు ఆస్పత్రుల్లో సిజేరియన్లు ఎక్కువ జరుగుతున్నట్టు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ప్రభుత్వ ఆస్పత్రుల్లోనూ సిజేరియన్లు ఒకింత ఎక్కువగానే ఉండటం గమనార్హం.



ప్రత్యేక పరిస్థితుల్లోనే సిజేరియన్ చేయాలి

కడుపులో బిడ్డ అడ్డం తిరిగినప్పుడు, తల్లి ఆరోగ్యం దెబ్బతిన్నప్పుడు, ఉమ్మనీరు తాగి బిడ్డ ప్రాణాపాయ స్థితిలో ఉన్నటువంటి ప్రత్యేక పరిస్థితుల్లో మాత్రమే సిజేరియన్ చేయాలి. కానీ చాలామంది వైద్యులు ఇవేవీ పట్టించుకోవడం లేదు. కొందరు తల్లిదండ్రులు కూడా వివిధ కారణాలతో సిజేరియన్ కోరుకుంటున్నారు. ఆరోగ్యాన్ని పాడు చేసుకుంటున్నారు. సహజ ప్రసవాల ద్వారా జన్మించిన శిశువుకు వెంటనే ముర్రుపాలు అందుతాయి. అదే సిజేరియన్ ద్వారా జన్మించిన బిడ్డ మూడు నాలుగు రోజుల పాటు పోత పాల పైనే ఆధారపడాల్సి వస్తుంది. తద్వారా రోగనిరోధకశక్తిని కోల్పోతుంది. కొన్నిసార్లు వారాల తరబడి ఇంక్యుబేటర్, ఫొటోథెరపీ యూనిట్లలో ఉంచాల్సి వస్తుంది.

– డాక్టర్ బాలాంబ, సీనియర్ గైనకాలజిస్టు

గణాంకాలే నిదర్శనం

జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రిల్లో 2022–23 ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్–నవంబర్ మధ్య మొత్తం (ఇళ్లలో, అంబులెన్సుల్లో జరిగినవి మినహాయించి) 16,321 ప్రసవాలు జరగ్గా ఇందులో సిజేరియన్లు 6,287 ఉన్నాయి. అదే ప్రైవేటు ఆస్పత్రుల విషయానికొస్తే.. మొత్తం 10,990 ప్రసవాలు జరిగితే అందులో 8 వేలకు పైగా సిజేరియన్లే కావడం గమనార్హం. అంతకుముందు 2021–22లో 19,183 ప్రసవాలు జరిగితే అందులో సిజేరియన్లు 13,895 ఉండటం ప్రైవేటు ఆస్పత్రుల తీరుకు అద్దంపడుతోంది. తల్లుల ఆరోగ్యంతో ఆటలాడుతున్న ప్రైవేటు ఆస్పత్రుల వైద్యులపై చర్యలు తీసుకోనున్నట్లు వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు పలుమార్లు హెచ్చరికలు జారీ చేశారు. సిజేరియన్లు ఎక్కువగా చేస్తున్న ఆస్పత్రులను సీజ్ చేయడంతో పాటు వైద్యుల ధ్రువీకరణ పత్రాలను కూడా రద్దు చేస్తామని ప్రకటించారు. అయినా క్షేత్రస్థాయిలో సిజేరియన్ల సంఖ్య తగ్గక పోగా పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది.

జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల వివరాలు..

సంవత్సరం	మొత్తం ప్రసవాలు	సిజేరియన్లు
2018-19	19,513	7,340
2019-20	22,023	8,261
2020-21	21,598	8,060
2021-22	23,515	9,542
2022-23 (ఏప్రిల్-నవంబర్)	16,321	6,287

జిల్లాలోని ప్రైవేటు ఆస్పత్రుల్లో ప్రసవాలు ఇలా..

సంవత్సరం	మొత్తం ప్రసవాలు	సిజేరియన్లు
2018-19	12,271	7,966
2019-20	19,524	12,704
2020-21	19,337	13,338
2021-22	19,183	13,895
2022-23 (ఏప్రిల్-నవంబర్)	10,990	8,031

ఇంకెంత ఆలస్యం..?

- బీబీనగర్ ఎయిమ్స్ నిర్మాణంలో జాప్యంపై ఎంపీ ఉత్తమ్ ఆగ్రహం
- తెలంగాణ ప్రజల ఆకాంక్షలను ఎప్పుడు నెరవేరుస్తారని కేంద్రానికి ప్రశ్న



సాక్షి, న్యూఢిల్లీ: బీబీ నగర్ ఎయిమ్స్ పూర్తిపై కేంద్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు దాటవేసే ధోరణిలోనే సమాధానాలు చెప్తోందని కాంగ్రెస్ ఎంపీ ఉత్తమ్‌కుమార్ రెడ్డి మండిపడ్డారు. ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టం–2014లో ఇచ్చిన హామీల్లో భాగంగా పదేళ్లలో బీబీ నగర్ ఎయిమ్స్‌ను పూర్తి చేసే ప్రక్రియలో కేంద్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. తెలంగాణ ప్రజల ఆకాంక్ష అయిన బీబీనగర్ ఎయిమ్స్ నిర్మాణాన్ని ఎప్పుడు పూర్తిచేస్తారో చెప్పాలని కేంద్రాన్ని ఉత్తమ్ డిమాండ్ చేశారు. బీబీనగర్ ఎయిమ్స్ నిర్మాణంపై శుక్రవారం లోక్‌సభలో తాను అడిగిన ప్రశ్నకు కేంద్ర వైద్యశాఖ సహాయ మంత్రి డా.భారతి ప్రవీణ్ పవార్ ముక్తాయింపు సమాధానం ఇచ్చారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఎప్పటికప్పుడు వాయిదాలే..

బీబీనగర్ నిర్మాణం పూర్తిపై లోక్‌సభలో 2020 సెప్టెంబర్ 18న అడిగిన ప్రశ్నకు 2022 సెప్టెంబర్ కల్లా పూర్తి చేస్తామని కేంద్రం సమాధానం ఇచ్చిందన్నారు. ఆ తర్వాత 2022 ఫిబ్రవరి 4న మరొక ప్రశ్నకు సమాధానంగా, 2023 నవంబర్ కల్లా పూర్తి చేస్తామని కేంద్రం గడువు పొడిగించిందని విమర్శించారు. కొన్ని నెలల తర్వాత 2022 జూలై 22న తాను అడిగిన ప్రశ్నకు ఇచ్చిన సమాధానంలో 2025 జనవరిలోగా బీబీనగర్ ఎయిమ్స్ పూర్తి చేయడానికి లక్ష్యంగా పెట్టుకున్నట్లు కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి ప్రకటించారని ఎంపీ ఉత్తమ్ తెలిపారు. తాజాగా శుక్రవారం లోక్‌సభలో అడిగిన మరో ప్రశ్నకు సమాధానంగా టెండర్ ఇచ్చామని, నిర్మాణం మొదలైందని మాత్రమే చెప్పారు కానీ ఎప్పటికల్లా నిర్మాణాన్ని పూర్తి చేస్తామో చెప్పకుండా కేంద్రం తప్పించుకుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా బీబీనగర్ ఎయిమ్స్‌కు మంజూరైన రూ.1,028 కోట్లలో కేవలం రూ.29.28 కోట్లు మాత్రమే కేంద్రప్రభుత్వం విడుదల చేసిందని ఎంపీ ఉత్తమ్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

గత జూలైలో ఎయిమ్స్ నిర్మాణానికి టెండర్

గత ఏడాది జూలైలో బీబీనగర్‌లో ఎయిమ్స్ నిర్మాణానికి టెండర్ పిలిచామని కేంద్ర వైద్యశాఖ సహాయమంత్రి డాక్టర్ భారతి ప్రవీణ్ పవార్ తెలిపారు. అనంతరం ఎయిమ్స్ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయని కాంగ్రెస్ ఎంపీ ఉత్తమ్ కుమార్ రెడ్డి అడిగిన ప్రశ్నకు సమాధానమిచ్చారు.




శెభాష్..ఆశా మాలవీయా..!

సైక్లిస్ట్‌ను అభినందించిన డీజీపీ అంజనీకుమార్

సాక్షి, హైదరాబాద్ : మహిళా భద్రతపై యువతలో సానుకూల దృక్పథం కల్పించడంతోపాటు డ్రగ్స్‌కు నో చెప్పండి అంటూ యువతలో సందేశాన్ని వ్యాప్తి చేసేందుకు దేశవ్యాప్తంగా సైకిల్‌యాత్ర చేస్తున్న సైక్లిస్ట్ ఆశా మాలవీయాను డీజీపీ అంజనీకుమార్ అభినందించారు. ఈ మేరకు శుక్రవారం తన చాంబర్‌లో తెలంగాణ పోలీస్ జ్ఞాపికను అందించి అభినందించారు. 'మహిళల భద్రత, డ్రగ్స్‌పై సందేశం వ్యాప్తి చేసేందుకు సైకిల్‌పై ఆశా మాల్వియా భారతదేశం మొత్తం యాత్ర చేయడం ఎంతో స్ఫూర్తిదాయకం. ఆమెకు మేమంతా సెల్యూట్ చేస్తున్నాం' అని డీజీపీ అంజనీకుమార్ అన్నారు. కార్యక్రమంలో ట్రైనింగ్ ఐజీ తరుణ్‌జోషి పాల్గొన్నారు.

ఆర్టీసీకి అశోక్ లేలాండ్ ఎలక్ట్రిక్ బస్సులు

- అద్దె ప్రాతిపదికన తీసుకోనున్న సంస్థ
- జీసీసీ పద్ధతిలో నిర్వహించనున్న లేలాండ్
- కి.మీ.కు నిర్ధారిత మొత్తం చొప్పున చెల్లింపు



సాక్షి, హైదరాబాద్: ప్రముఖ వాహనాల తయారీ సంస్థ అశోక్ లేలాండ్ తెలంగాణ ఆర్టీసీలో ఎలక్ట్రిక్ బస్సులను అద్దె ప్రాతిపదికన నిర్వహించనుంది. ఆర్టీసీ కొత్తగా సమకూర్చుకునే ఎలక్ట్రిక్ బస్సులను ఆ కంపెనీ నుంచే తీసుకోనుంది. అయితే నిధుల లేమితో కొట్టుమిట్టాడుతున్న ఆర్టీసీ, వాటిని సొంతంగా కొనకుండా గ్రాస్ కాస్ట్ కాంట్రాక్ట్ (జీసీసీ) పద్ధతిలో అద్దెకు తీసుకోనుంది. దీనికి సంబంధించిన టెండర్ల ప్రక్రియ పూర్తి కావటంతో ఇక బస్సులను సరఫరా చేయాల్సి ఉంది. త్వరలో అవి ఆర్టీసీకి అందనున్నాయి. అయితే అశోక్ లేలాండే వాటిని నిర్వహిస్తుంది కాబట్టి, అందుకు ప్రతిగా ఆ సంస్థకు ఆర్టీసీ కి.మీ.కు నిర్ధారిత మొత్తం చొప్పున అద్దెను చెల్లిస్తుంది.

మూడేళ్లలో 3 వేల ఎలక్ట్రిక్ బస్సులు

ఇంతకాలం డీజిల్ బస్సులనే నడుపుతున్న టీఎస్ ఆర్టీసీ క్రమంగా ఎలక్ట్రిక్ బస్సుల వైపు చూస్తోంది. భారీగా పెరిగిన డీజిల్ ధర ఆర్టీసీపై భారం పెంచుతోంది. దీంతో క్రమంగా ఎలక్ట్రిక్ బస్సుల వైపు మళ్లటం ద్వారా ఆ ఖర్చును తగ్గించుకోవాలని సంస్థ నిర్ణయించింది. కానీ డీజిల్ బస్సులతో పోలిస్తే ఎలక్ట్రిక్ బస్సుల ధర చాలా ఎక్కువ. ఎక్స్‌ప్రెస్ కేటగిరీలో తిరిగే డీజిల్ బస్సు రూ.35 లక్షలు పలుకుతుంటే, నాన్ ఏసీ ఎలక్ట్రిక్ బస్సు ధర రూ.కోటిన్నర వరకు పలుకుతోంది. అంత మొత్తం వెచ్చించి వాటిని కొనటం ఆర్టీసీకి తలకు మించిన భారంగా మారింది. దీంతో జీసీసీ పద్ధతిలో అద్దెకు తీసుకోవాలని నిర్ణయించింది. వచ్చే మూడేళ్లలో మూడు వేల ఎలక్ట్రిక్ బస్సులు సమకూర్చుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్న ఆర్టీసీ, ఇప్పుడు అశోక్ లేలాండ్ కంపెనీ నుంచి 500 బస్సులు సమకూర్చుకోనుంది. టెండర్ల ప్రక్రియలో ఆ సంస్థ ఎల్1గా నిలవటంతో దానికే బస్సుల నిర్వహణ బాధ్యత అప్పగించింది. కి.మీ.కు అద్దెను ఆ సంస్థ రూ.58గా కోట్ చేసింది. దాన్ని కనీసం రూ.54కు తగ్గించాలని ఆర్టీసీ కోరింది. దీనిపై ఆ సంస్థ ఇంకా తుది నిర్ణయం వెల్లడించలేదు. వచ్చే రెండు, మూడురోజుల్లో అది ఫైనల్ అయ్యే అవకాశం ఉంది.

డిపోల్లో చార్జింగ్ వ్యవస్థలు


ఎలక్ట్రిక్ బస్సులు పెరుగుతున్నందున, వాటి చార్జింగ్ కోసం డిపోల్లో ఏర్పాట్లు చేయాల్సి ఉంది. ఏయే డిపోలకు ఎలక్ట్రిక్ బస్సులను కేటాయిస్తారో, ఆయా డిపోల్లో ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు అవసరం. కాగా 33 కేవీ అవసరమా, 11 కేవీ సరిపోతుందా? అనే పరిశీలన జరుగుతోంది. ఇందుకోసం ఇటీవలే అధికారుల స్థాయిలో కొన్ని మార్పులు చేశారు. గతంలో ఆర్టీసీ ఈడీ వినోద్‌కు ఇంజనీరింగ్ విభాగం పర్యవేక్షణ బాధ్యత ఉండేది. ఇప్పుడు ఓ అధికారి ప్రత్యేకంగా ఈ పనులకే ఉండాలన్న ఉద్దేశంతో ఆయన నుంచి దాన్ని తప్పించి సీఎంఈకి కేటాయించారు.

కి.మీ.కు రూ.79

అశోక్ లేలాండ్ ఆర్టీసీకి డబుల్ డెక్కర్ బస్సులను కూడా సరఫరా చేయాల్సి ఉంది. తొలుత 10 బస్సులను ఆర్టీసీ తీసుకుంటోంది. ఇది కూడా జీసీసీ పద్ధతిలోనే అయినందున, దానికి కి.మీ.కు ఆ సంస్థ రూ.79ని అద్దెగా కోట్ చేసింది. అయితే దాన్ని కూడా కొంతమేర తగ్గించాలని ఆర్టీసీ కోరింది. త్వరలో దానిపై కూడా నిర్ణయం వెలువడనుంది.

ఆత్మవిశ్వాసంలో అతివలే మేటి

- మహిళా ఐపీఎస్‌లు పెరుగుతుండటం శుభపరిణామం
- పురుషులకు ఏమాత్రం తీసిపోకుండా ముందంజ వేస్తున్నారు
- ఔట్‌డోర్ శిక్షణలోనూ అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తున్నారు
- నాయకత్వ లక్షణాలు పెంచేలా అకాడమీలో శిక్షణ
- వివిధ వర్గాల అభిప్రాయాల మేరకు శిక్షణాంశాల్లో మార్పులు
- 'సాక్షి' ఇంటర్వ్యూలో ఎన్‌పీఏ డైరెక్టర్ ఏఎస్ రాజన్



సాక్షి, హైదరాబాద్: దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన ఇండియన్ పోలీస్ సర్వీసెస్‌లోకి వచ్చే మహిళా అధికారుల సంఖ్య ఏటా పెరుగుతుండటం శుభపరిణామం అని సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ నేషనల్ పోలీస్ అకాడమీ (ఎన్‌పీఏ) డైరెక్టర్ ఏఎస్ రాజన్ అన్నారు. ఆత్మవిశ్వాసంలో పురుషుల కంటే అతివలే మేటి అని చెప్పారు. ప్రతి బ్యాచ్‌లోనూ 20 మందికిపైగా మహిళా ఐపీఎస్‌లు శిక్షణ పొందుతున్నారని తెలిపారు. శిక్షణలోనూ పురుషులకు ఏమాత్రం తీసిపోకుండా ఔట్‌డోర్‌లో సైతం తాము మేటి అని నిరూపిస్తున్నారన్నారు. ప్రస్తుతం శిక్షణ పూర్తి చేసుకున్న 2021 బ్యాచ్‌లోనూ దీక్ష అనే మహిళా ఐపీఎస్ బెస్ట్ ఔట్‌డోర్ ప్రొబేషనరీగా ఐపీఎస్ అసోసియేషన్ గౌరవ కరవాలాన్ని పొందారని, ఎన్‌పీఏ చరిత్రలో రెండోసారి ఈ ఘనత దక్కించుకున్న అధికారిణిగా నిలిచారని ఆయన పేర్కొన్నారు. ఎన్‌పీఏలో శిక్షణ పొందిన 2021 బ్యాచ్ ప్రొబేషనరీ ఐపీఎస్ అధికారుల పాసింగ్ అవుట్ పరేడ్ శనివారం జరగనుంది. ఈ సందర్భంగా.. దేశవ్యాప్తంగా శాంతిభద్రతల నిర్వహణలో అత్యంత కీలకమైన ఐపీఎస్ అధికారులను తీర్చిదిద్దే ఎన్‌పీఏలో ఇచ్చే శిక్షణ, మారుతున్న పరిస్థితులకు తగిన విధంగా శిక్షణలో తెచ్చిన మార్పులు తదితర అంశాలపై రాజన్ 'సాక్షి'కి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ముఖ్యాంశాలు ఆయన మాటల్లోనే..

అకాడమీలోకి వచ్చాక అందరూ సమానమే..

ఐపీఎస్‌కుకు ఎంపికయ్యే వారిలో కానిస్టేబుల్ నుంచి ఐపీఎస్‌ల పిల్లల వరకు.. స్థానిక విద్యాసంస్థలు మొదలు కాన్వెంట్లలో చదివిన వారు.. అప్పుడే చదువులు పూర్తి చేసుకున్న వారి నుంచి విదేశాల్లో లక్షల జీతాల కొలువులు వదిలి వచ్చే వారి వరకు విభిన్న నేపథ్యాల వారు ఉంటారు. అది ఎన్‌పీఏలోకి రాకముందు వరకే. ఒకసారి అకాడమీలో అడుగుపెట్టిన తర్వాత వారంతా సమానమే. మొదటి రెండు వారాలు ఇదే అంశంపై దృష్టి పెడతాం. ట్రైనీలను బృందాలుగా ఏర్పాటు చేసి వారిలో నాయకత్వ లక్షణాలు పెంచేలా చూస్తాం. ఐపీఎస్ అధికారిగా తనతో పాటు వందల మందిని కలుపుకొని నిత్యం పనిచేయాల్సి ఉంటుంది. అందుకు తగ్గట్టుగా వారిని తీర్చిదిద్దుతాం.

నైతిక విలువలు పెంచేలా శిక్షణ

కొత్తగా విధుల్లోకి వచ్చే ఐపీఎస్ అధికారుల వైఖరి సరిగా ఉండడం లేదన్న విమర్శల నేపథ్యంలో 8 రాష్ట్రాల్లో 6 విధాలుగా అభిప్రాయాలు సేకరించాం. ఐపీఎస్‌ల వైఖరి, శిక్షణలో ఎలాంటి మార్పులు చేయాలన్న అంశాలపై డీఎస్పీ, సీఐ, ఎస్సై, కానిస్టేబుల్ ర్యాంకు వరకు ఒక గ్రూప్, డీఐజీ నుంచి డీజీపీ ర్యాంకు వరకు ఒక గ్రూప్, రెవెన్యూలో వివిధ స్థాయిల అధికారులు ఒక గ్రూప్, ఎన్జీఓలు.. మీడియా ఒక గ్రూప్, సమాజంలో ప్రభావిత స్థానాల్లో ఉన్న వారు ఒక గ్రూప్, ప్రజలు ఒక గ్రూప్.. ఇలా వారి అభిప్రాయాలు తీసుకుని వాటిని క్రోడీకరించి బలాలు, బలహీనతలు గుర్తించాం. బాధితులతో ఎలా వ్యవహరించాలన్న అంశంతో పాటు ఐపీఎస్ శిక్షణ నైతిక విలువలు పెంచేలా కరికులంలో చాలా మార్పులు చేశాం.

శిక్షణలోనూ స్త్రీ, పురుష తేడా లేదు

అకాడమీలో శిక్షణలో ప్రవేశించిన తర్వాత మహిళలు, పురుషులు అనే తేడా కూడా ఏ అంశంలోనూ ఉండదు. శిక్షణలోనూ మినహాయింపులు ఉండవు. వారంతా కూడా సుశిక్షితులైన పోలీస్ అధికారులుగా తయారు కావాల్సిందే. వాస్తవం చెప్పాలంటే ఆత్మవిశ్వాసంలో పురుషుల కంటే మహిళలే మేటి. ప్రతి బ్యాచ్‌లో మేం ఔట్‌డోర్ శిక్షణలో మహిళలకు ప్రత్యేకంగా ట్రోఫీ కేటాయిస్తాం. ఆ ట్రోఫీయే ఈసారి దీక్షకు దక్కింది. 2019లోనూ రంజితశర్మ బెస్ట్ ఔట్‌డోర్ ప్రొబేషనరీగా నిలిచారు. ఔట్‌డోర్ శిక్షణలో వాళ్లు పురుషులను వెనక్కి నెట్టి బెస్ట్‌గా నిలిచారు. చూస్తుంటే ఇకపై బెస్ట్ లేడీ ప్రొబేషనరీ ఔట్‌డోర్ ట్రైనింగ్ మాదిరిగా బెస్ట్ జెంటిల్‌మెన్ ప్రొబేషనరీ ఔట్‌డోర్ ట్రైనింగ్ అని పెట్టాల్సి వచ్చేట్టుంది.. (నవ్వుతూ..).

'సైబర్' సవాళ్లను ఎదుర్కొనేలా ప్రత్యేక శిక్షణ

సైబర్ నేరాలనేవి భవిష్యత్తులో మనం ఎదుర్కొనబోయే అతిపెద్ద ముప్పు. ఈ సవాళ్లను ఎదుర్కొనేందుకు యువ ఐపీఎస్ అధికారులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాం. ఇందుకోసం ఎన్‌పీఏలో ప్రత్యేకంగా నేషనల్ డిజిటల్ క్రైం రిసోర్స్ అండ్ ట్రైనింగ్ సెంటర్ (ఎన్‌డీసీఆర్‌టీసీ)ని ఏర్పాటు చేశాం. సరికొత్త సైబర్ సవాళ్లను ఎదుర్కొనేలా ఇక్కడ శిక్షణ ఇస్తాం. ఇప్పటికే దేశవ్యాప్తంగా పనిచేస్తున్న 10 వేల మంది వివిధ ర్యాంకుల పోలీస్ అధికారులకు ఎన్‌డీసీఆర్‌టీసీలో సైబర్ క్రైం దర్యాప్తు, నియంత్రణలో శిక్షణ ఇచ్చాం. ప్రొబేషనరీ ఐపీఎస్‌లతోపాటు సీనియర్ ఐపీఎస్‌లకు కూడా వివిధ దశల్లో ఇక్కడ శిక్షణలు ఇస్తుంటాం. మన పోలీసులతో పాటు నేపాల్, భూటాన్, మాల్దీవులు, మారిషస్ దేశాల పోలీస్ అధికారులకు సైతం శిక్షణ ఇస్తాం.

కేంద్ర బడ్జెట్ గేమ్ చేంజర్

నిపుణులతో చర్చాగోష్టిలో గవర్నర్ తమిళిసై



సాక్షి, హైదరాబాద్: విద్య, వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి వంటి రంగాలకు కేంద్ర బడ్జెట్ 2023–24 మేలు మలుపు (గేమ్ చేంజర్)లాంటిదని రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ అభివర్ణించారు. విద్య, నైపుణ్యాభివృద్ధికి అత్యధిక కేటాయింపులతో రాబోయే రోజుల్లో విప్లవాత్మక మార్పులు రాబోతున్నాయని తెలిపారు. కేంద్ర బడ్జెట్‌లో ఈ మూడు రంగాలకు కేటాయింపులపై శుక్రవారం ఆమె రాజ్‌భవన్‌లో ఆయా రంగాల నిపుణులతో చర్చాగోష్టి నిర్వహించారు. జాతీయ విద్యా విధానం 2020 స్ఫూర్తికి అనుగుణంగా డిజిటల్ టెక్నాలజీ, ఆవిష్కరణలకు ప్రోత్సాహకాలతో విద్యా రంగంలో మార్పులు రాబోతున్నాయన్నారు. వ్యవసాయ రంగ అంకుర పరిశ్రమలు, సాంకేతిక వినియోగం, ప్రకృతి వ్యవసాయానికి ప్రోత్సాహకాలు, ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధికి కేటాయింపుల పెంపుతో వ్యవసాయ రంగానికి పెద్దపీట వేశారని తెలిపారు. ఎన్ఐఆర్డీ, ఎన్ఏఆర్ఎం, ఇక్రిశాట్,సెస్, ఇఫ్లూ, ఉర్దూ వర్సిటీల నిపుణులు చర్చలో పాల్గొని కేంద్రబడ్జెట్‌పై తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఇంటర్నేషనల్ ఇయర్ ఆఫ్ మిల్లెట్స్–2023 వేడుకల్లో భాగంగా గవర్నర్ అతిథులకు మినుములతో చేసిన వంటకాలను అందించారు.

నిందితులను చంచల్‌గూడకు తరలించండి

వైఎస్ వివేకా హత్య కేసులో సీబీఐ కోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీమంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో నిందితులను హైదరాబాద్‌లోని చంచల్‌గూడ జైలుకు తరలించాలని పోలీసులను సీబీఐకోర్టు ఆదేశించింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు కేసు తెలంగాణకు బదిలీ అయిన విషయం తెలిసిందే. విచారణకు స్వీకరించిన సీబీఐకోర్టు రెండు వారాల క్రితం నిందితులకు నోటీసులు జారీ చేసింది. దీంతో ఎర్ర గంగిరెడ్డి, సునీల్ యాదవ్, ఉమాశంకరరెడ్డి, దస్తగిరి, శివశంకర్‌రెడ్డి శుక్రవారం కోర్టుకు హాజరయ్యారు. సీబీఐ తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ... గంగిరెడ్డి బెయిల్ రద్దు కోరుతూ హైకోర్టులో పిటిషన్ వేశామని చెప్పారు. విచారణ కోర్టు హైదరాబాద్‌లో ఉన్నందున నిందితులు కూడా ఇక్కడే ఉండేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. సునీల్ యాదవ్ బెయిల్ పిటిషన్ పెండింగ్‌లో ఉందని ఆయన తరపు న్యాయవాది నయన్‌కుమార్ వాదనలు వినిపించారు. శివశంకర్‌రెడ్డిపై మరో కేసు విచారణ విజయవాడలో సాగుతోందని, అతన్ని హైదరాబాద్‌లో ఉంచితే విచారణకు హాజరు కావడం ఇబ్బందిగా మారుతుందని చెప్పారు. దీనికి న్యాయమూర్తి స్పందిస్తూ...విచారణ ఉన్న రోజు పోలీసులు తరలిస్తారని చెప్పారు. తదుపరి విచారణను మార్చి 10కి వాయిదా వేశారు.

రెండు వారాల్లో కౌంటర్ వేయండి

పదోన్నతుల కేసులో విద్యుత్ సంస్థలకు హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: ఉద్యోగుల పదోన్నతులకు సంబంధించి గతంలో న్యాయస్థానం ఇచ్చిన తీర్పును అమలు చేయనందుకు దాఖలైన కేసులో రెండు వారాల్లోగా కౌంటర్ వేయాలని విద్యుత్ సంస్థలను హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 22కు వాయిదా వేసింది. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లకు సంబంధించిన జీవోలను తప్పుగా అన్వయించి, సుప్రీంకోర్టు తీర్పునకు వ్యతిరేకంగా పదోన్నతులు కల్పిస్తున్నందున ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు వారి రిజర్వేషన్లకు మించి పదోన్నతులు పొందుతున్నారని.. బీసీ, ఓసీ ఉద్యోగులు నష్టపోతున్నారని కొందరు హైకోర్టును ఆశ్రయించారు. వాదనలు విన్న హైకోర్టు.. పదోన్నతులను పునః సమీక్షించి నష్టపోయిన వారికి న్యాయం చేయాలని ఆదేశించింది. ఈ ఆదేశాలను అందరికీ అమలు చేసి, విద్యుత్ ఉద్యోగులకు మాత్రం అమలు చేయకపోవడంతో వారు కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. గత విచారణ సందర్భంగా న్యాయమూర్తి జస్టిస్ అభినంద్‌కుమార్ షావలీ.. కౌంటర్ దాఖలుకు విద్యుత్ సంస్థలకు 4 వారాలు గడువిచ్చారు. ఈ పిటిషన్ మళ్లీ విచారణ వచ్చింది. కౌంటర్ దాఖలుకు మరో 4 వారాలు గడువు కావాలని విద్యుత్ సంస్థల న్యాయవాది ఉమాదేవి కోరగా.. దీనికి పిటిషనర్ల న్యాయవాది అభ్యంతరం తెలిపారు.

క్లుప్తంగా...

మోదీ ప్రభుత్వాన్ని ఇంటికి పంపాలి

- ఎమ్మెల్సీ కవిత
- 2024లో బీజేపీ గెలిచే అవకాశాల్లేవు



సాక్షి, చెన్నై: ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపే సమయం ఆసన్నమైందని తెలంగాణ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. ఎన్నికలు ఉన్న రాష్ట్రాల్లో మోదీ వచ్చే ముందు సీబీఐ, ఈడీలు వస్తాయని విమర్శించారు. దేశ వ్యాప్తంగా ఉన్న భావసారూప్యత కలిగిన ప్రతిపక్ష పార్టీలను బీఆర్ఎస్ ఏకతాటి పైకి తెస్తున్నట్టు తెలిపారు. బీజేపీ పార్టీ, ప్రభుత్వం అవినీతికి, అక్రమాలకు పాల్పడకపోతే అదానీ కుంభకోణంపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ ఎందుకు వేయడం లేదని ప్రశ్నించారు. శుక్రవారం చెన్నైలో ఒక ప్రముఖ ఆంగ్ల పత్రిక '2024 ఎన్నికలలో ఎవరు విజయం సాధిస్తారు?' అనే అంశంపై నిర్వహించిన చర్చా కార్యక్రమంలో కవిత పాల్గొన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయకపోగా, భారతదేశం పేరు అంతర్జాతీయ స్థాయిలో మసకబారేందుకు కారణమైన బీజేపీ 2024లో గెలిచే అవకాశాలు ఏమాత్రం లేవని చెప్పారు. మోదీ ప్రభుత్వాన్ని ఇంటికి పంపి కొత్త వారికి అవకాశం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు.

రికార్డు స్థాయిలో పెరిగిన విద్యుత్ డిమాండ్

- శుక్రవారం 14,169 మెగావాట్ల డిమాండ్ నమోదు
- వేసవిలో 15,500 మెగావాట్లకు పెరిగే అవకాశం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో గరిష్ట విద్యుత్ డిమాండ్ కొత్త రికార్డు సృష్టించింది. శుక్రవారం ఉదయం 8.02 గంటలకు 14,169 మెగావాట్ల గరిష్ట విద్యుత్ డిమాండ్ నమోదైంది. గతేడాది మార్చి 29న నమోదైన 14,160 మెగావాట్ల గరిష్ట విద్యుత్ డిమాండ్ ఇప్పటి వరకు రాష్ట్రంలో అత్యధికం కాగా, తాజాగా విద్యుత్ పీక్ డిమాండ్ అంతకుమించి పోయింది. ఎండలు తీవ్రం అవుతుండటంతో రాష్ట్రంలో వ్యవసాయ విద్యుత్ డిమాండ్ భారీగా పెరిగిపోతోంది. పంటలను కాపాడుకోవడానికి రైతులు పెద్ద ఎత్తున బోరుబావుల ద్వారా నీళ్లను పారిస్తున్నారు. దీంతో రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ భారీగా పెరిగిందని అంచనా వేస్తున్నారు. ప్రస్తుత వేసవిలో గరిష్ట విద్యుత్ డిమాండ్ 15,500 మెగావాట్లకు పెరిగే అవకాశం ఉంటుందని అంచనా వేస్తున్నారు.

ఎస్ఎస్ఎల్ వీ–డీ2 ప్రయోగం విజయవంతం

నిర్ణీత కక్ష్యలోకి చేరిన మూడు ఉపగ్రహాలు



సూళ్లూరుపేట(తిరుపతి జిల్లా): సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్ (షార్)లోని మొదటి ప్రయోగ వేదిక నుంచి స్మాల్ శాటిలైట్ లాంచింగ్ వెహికల్(ఎస్ఎస్ఎల్వీ–డీ2) ప్రయోగాన్ని విజయవంతంగా నిర్వహించారు. శుక్రవారం ఉదయం 9.18 గంటలకు ప్రయోగించిన ఎస్ఎస్ఎల్వీ–డీ2 రాకెట్ ద్వారా 156.3 కేజీల బరువు కలిగిన ఎర్త్ అబ్జర్వేషన్ శాటిలైట్ (ఈఓఎస్ 07), దేశవ్యాప్తంగా 750 మంది విద్యార్థినులు తయారు చేసిన 8.7 కేజీల బరువు కలిగిన ఆజాదీశాట్, అంటారిస్ సంస్థ–యూఎస్ఏకు చెందిన 10.2 కిలోల బరువైన జానుస్–1 అనే మూడు ఉపగ్రహాలను నిర్దేశిత సమయంలోనే నిర్ణీత కక్ష్యలోకి విజయవంతంగా ప్రవేశపెట్టారు. గత ఏడాది ఆగస్టు 7న ఎస్ఎస్ఎల్వీ–డీ1 ప్రయోగం విఫలం కావడంతో ఈ ప్రయోగాన్ని విజయవంతం చేసేందుకు ఇస్రో శాస్త్రవేత్తలు తీవ్రంగా శ్రమించారు. శుక్రవారం తెల్లవారుజామున 2.48 గంటలకు కౌంట్‌డౌన్ ప్రారంభించారు. ఉదయం 9.18 గంటలకు ఎస్ఎస్ఎల్వీ–డీ2 నిప్పులు చిమ్ముతూ నింగి వైపునకు దూసుకెళ్లింది. ఈ విజయంతో ఇస్రోకు వాణిజ్యపరమైన అవకాశాలు పెరగనున్నాయి.

15.38 నిమిషాల్లో...

ఎస్ఎస్ఎల్వీ–డీ2 ప్రయోగం 15.38 నిమిషాల్లో పూర్తయ్యింది. ఈ రాకెట్ పొడవు 34 మీటర్లు, వెడల్పు 2 మీటర్ల వెడల్పు, బరువు 119 టన్నులు. నాలుగు దశల్లో ప్రయోగం పూర్తయ్యింది. కక్ష్యలోకి చేరిన ఉపగ్రహాలను నుంచి సిగ్నల్స్ అందడంతో శాస్త్రవేత్తలు ఊపిరి పీల్చుకున్నారు. 'ఇస్రో'ఈ కొత్త రాకెట్‌ను రూపొందించి, ప్రయోగించి చరిత్ర సృష్టించింది.

సరికొత్త రాకెట్

ఎస్ఎస్ఎల్వీ–డీ2 ప్రయోగం విజయవంతమైన అనంతరం ఇస్రో చైర్మన్ ఎస్.సోమనాథ్ మిషన్ కంట్రోల్ సెంటర్ నుంచి మాట్లాడారు. ఇప్పటిదాకా ఇస్రో అమ్ములపొదిలో ఎస్ఎల్వీ, ఏఎస్ఎల్వీ, పీఎస్ఎల్వీ, జీఎస్ఎల్వీ, జీఎస్ఎల్వీ మార్క్3 లాంటి ఐదు రకాల రాకెట్లు ఉండేవని, ఈ ప్రయోగంతో ఆరో రాకెట్‌గా ఎస్ఎస్ఎల్వీ చేరిందన్నారు. ప్రయోగం విజయవంతం కావడానికి శ్రమించిన ఇస్రో సిబ్బందికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఎర్త్ అబ్జర్వేషన్ శాటిలైట్ (ఈఓఎస్ 07) ఉపగ్రహం భూమికి తక్కువ ఎత్తులో ఉండి అత్యంత అధునాతనమైన సాంకేతిక పరికరాలతో సంక్షిప్తమైన సమాచారాన్ని అందిస్తుందని శాటిలైట్ డైరెక్టర్ రవిచంద్ర బాబు వెల్లడించారు. ఈ ఉపగ్రహం కేవలం ఒక్క సంవత్సరం మాత్రమే సేవలను అందిస్తుందని పేర్కొన్నారు.

టీడీపీదే రక్త చరిత్ర

- సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున మండిపాటు
- టీడీపీ వేసిన పుస్తకంపై చర్చకు సిద్ధం
- వంగవీటి రంగాను హత్య చేయించిందెవరు?
- చంద్రబాబు ఎంత రక్తం పారించారో అందరికీ తెలుసు
- పాదయాత్ర ఆపేయడానికి కారణం వెతుక్కుంటున్న లోకేశ్



సాక్షి, అమరావతి: మర్డర్లు, దాడులు, అఘాయిత్యాలు, అమానుషాలు, అరాచకాలు, రక్తపాతాలకు పేటెంట్ చంద్రబాబునాయుడు అని ఏపీ సాంఘిక సాంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున మండిపడ్డారు. బాబు హయాంలో రాష్ట్రంలో ఏయే జిల్లాలో ఎన్ని హత్యలు జరిగాయో, ఎంత మంది యువకులు గల్లంతయ్యారో తాను చెప్పగలనని తెలిపారు. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయం మీడియా పాయింట్ వద్ద శుక్రవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాజకీయ ప్రత్యర్థులను భౌతికంగా లేకుండా చేసే మనస్తత్వం చంద్రబాబుదని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై కారు కూతలు కూస్తే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. టీడీపీ తీసుకొచ్చిన పుస్తకంలోని అక్షరాలపై చంద్రబాబుతో తాను ఎక్కడైనా చర్చకు సిద్ధమేనని సవాల్ విసిరారు. వంగవీటి రంగాను హత్య చేయించిందెవరో ప్రజలకు తెలుసని, ఇంకా ఎవరికైనా తెలియకపోతే మాజీ మంత్రి హరిరామ జోగయ్య రాసిన పుస్తకం చదివితే అర్థం అవుతుందన్నారు. మంత్రి ఇంకా ఏమన్నారంటే..

ఆ దాడుల్లో బాబు హస్తం

- దళితులపై దాడుల్లో, నాయీ బ్రాహ్మణులను బెదిరించడంలో, ముద్రగడ పద్మనాభంపై దాడుల్లో చంద్రబాబు ఉన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎంత రక్తం పారించారో ప్రజలకు తెలియదా? నారా లోకేశ్ పాదయాత్రలో నిబంధనలు ఉల్లంఘిస్తే పోలీసులు వారిని అడ్డుకోవడంలో తప్పేముంది?.
- లోకేశ్ బలం ఏమిటన్నది తేలిపోయింది. లోకేశ్ యువ'గంగాళం'పాదయాత్రపై అచ్చంనాయుడు ఫోన్‌లో మాట్లాడిన విషయాలు ప్రజలంతా విన్నారు. అసలు సిసలు పాదయాత్రలంటే డాక్టర్ వైఎస్సార్, వైఎస్ జగన్ చేసినవి. కోట్లాది మంది ప్రజలను వారు అక్కున చేర్చుకున్నారు. జనం కూడా వారి పట్ల అపారమైన ప్రేమానురాగాలు చూపారు.
- అలాంటి పాదయాత్రను కొనసాగించలేక, ఆపేయడానికి ఏదో కారణం కోసం ఎదురు చూస్తున్నారు. పోలీసులు, ప్రభుత్వంపై నిందలు వేస్తున్నారు. జనాన్ని రప్పించాలనే ఆలోచనతో చంద్రబాబు ముందస్తు ఎన్నికల జపం అందుకున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి అలాంటి ఆలోచనే లేదు.

భేదాభిప్రాయాలు వీడి కలిసి సాగాల్సిందే..

- రాష్ట్ర బీజేపీ ముఖ్య నేతలకు అమిత్‌షా దిశా నిర్దేశం
- సంస్థాగతంగా పటిష్టం చేసేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశం
- బీఆర్ఎస్‌ను బలహీనం చేసేలా వ్యూహాలు అమలు చేయాలని సూచన



అమిత్‌షాకు స్వాగతం పలుకుతున్న సంజయ్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని బీజేపీ ముఖ్య నేతలంతా అభిప్రాయభేదాలను వీడి, కలసికట్టుగా ముందుకు సాగాల్సిందేనని బీజేపీ అగ్రనేత, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా స్పష్టం చేశారు. బీజేపీకి ఎంతో కీలకంగా మారిన అసెంబ్లీ ఎన్నికల్లో విజయఢంకా మోగించేందుకు సంస్థాగతంగా పూర్తి స్థాయిలో పటిష్టం కావాలని దిశానిర్దేశం చేశారు. ప్రతీ పోలింగ్ బూత్ స్థాయిలో పార్టీకి కార్యకర్తల అండ, ప్రజా మద్దతు కూడగట్టేలా కృషి చేయాలని సూచించారు. శుక్రవారం రాత్రి హైదరాబాద్‌కు వచ్చిన అమిత్‌షాకు శంషాబాద్ ఎయిర్‌పోర్టులో పార్టీ రాష్ట్రనేతలు స్వాగతం పలికారు. తర్వాత నోవాటెల్ హోటల్‌లో అమిత్‌షాతో రాష్ట్ర పార్టీ మినీ కోర్ కమిటీ సమావేశం జరిగింది. అర్ధరాత్రి వరకు కొనసాగిన ఈ భేటీలో ఖమ్మం, నాందేడ్‌లలో బీఆర్ఎస్ సభలు, కొత్త సచివాలయం ప్రారంభం సందర్భంగా ఈ నెల 17న పరేడ్ గ్రౌండ్స్ సభ తదితర అంశాలు చర్చకు వచ్చినట్టు తెలిసింది. వివిధ రాష్ట్రాల్లో బీజేపీ వ్యతిరేక పార్టీలను ఏకం చేసేందుకు కేసీఆర్ ప్రయత్నిస్తున్నందున.. తెలంగాణలో బీఆర్ఎస్‌ను బలహీనపర్చేలా వ్యూహాత్మకంగా అడుగులు వేయాలని అమిత్‌షా సూచించినట్టు సమాచారం. వచ్చే అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో, బయటా బీఆర్ఎస్‌ను ఎదుర్కొనేందుకు పకడ్బందీ వ్యూహాలను సిద్ధం చేసుకోవాలని చెప్పినట్టు తెలిసింది. ఈ సమావేశంలో కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి, పార్లమెంటరీ బోర్డు సభ్యుడు కె.లక్ష్మణ్, జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్, రాష్ట్ర పార్టీ సంస్థాగత ఇన్‌చార్జి సునీల్ బన్సల్, సీనియర్ నేతలు ఈటల రాజేందర్, ఏపీ జితేందర్‌రెడ్డి, విజయశాంతి, వివేక్ వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు రాజ్యాంగబద్ధ హక్కులు కల్పించాలి: ఆర్.కృష్ణయ్య

సాక్షి, న్యూఢిల్లీ: బీసీలకు రాజ్యాంగబద్ధమైన హక్కులు–వాటా కల్పించాల్సిన సమయం ఆసన్నమైందని, అందుకోసం బీసీలకు రావాల్సిన వాటాపై దేశవ్యాప్తంగా మరోసారి అధ్యయనం జరగాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ ఎంపీ ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. అన్ని కులాలకు, సామాజిక వర్గాలకు వారి జనాభా ప్రకారం వాటా ఇచ్చినప్పుడే దేశంలో సమైక్యత, సమగ్రత, శాంతి ఉంటుందని పేర్కొన్నారు. శుక్రవారం జాతీయ బీసీ సంక్షేమ సంఘం కన్వీనర్ గుజ్జ కృష్ణ, సురేశ్, భూపేశ్‌సాగర్, లాల్ కృష్ణ, రాజ్ కుమార్‌లతో కృష్ణయ్య శుక్రవారం కేంద్ర పర్యావరణ శాఖమంత్రి భూపేంద్ర యాదవ్‌ను కలిసి బీసీ సమస్యలపై చర్చించారు. పార్లమెంట్‌లో బీసీ బిల్లు ప్రవేశపెట్టి, చట్ట సభల్లో బీసీలకు 50 శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు, బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని విజ్ఞప్తిచేశారు. ఇందుకు అవసరమైన రాజ్యాంగ సవరణ చేయాలని, బీసీల జనాభా ప్రకారం కేంద్ర విద్య, ఉద్యోగ రిజర్వేషన్లను 27 శాతం నుంచి 56 శాతానికి పెంచాలని కృష్ణయ్య కోరారు.

నేడు అంగప్రదక్షిణం టోకెన్ల కోటా విడుదల

తిరుమల/తిరుపతి అలిపిరి: తిరుమలలో మార్చి నెలకు సంబంధించిన అంగప్రదక్షిణం టోకెన్ల కోటాతో పాటు ఈనెల 23 నుంచి 28వ తేదీ వరకు విడుదల చేయని కోటాను ఈ నెల 11వ తేదీ ఉదయం 11 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. భక్తులు ఈ విషయాన్ని గుర్తించి ఆన్‌లైన్‌లో టోకెన్లు బుక్ చేసుకోవాలని టీటీడీ సూచించింది. అలాగే తిరుమల శ్రీవారి దర్శనానికి సంబంధించి ఈ నెల 22 నుంచి 28వ తేదీ వరకు రూ.300 ఎస్ఈడీ టికెట్ల ఆన్‌లైన్ కోటాను ఆదివారం ఉదయం తొమ్మిది గంటలకు టీటీడీ విడుదల చేయనుంది. కాగా, హైదరాబాద్ జూబ్లిహిల్స్‌లోని టీటీడీకి చెందిన శ్రీవేంకటేశ్వర స్వామివారి ఆలయంలో ఈ నెల 20 నుంచి 28వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు జరగనున్నట్లు టీటీడీ తెలిపింది. 19న అంకురార్పణ, 20న ధ్వజారోహణం, 24న గరుడసేవ, 27న రథోత్సవం, 28న చక్రస్నానం, మార్చి 1న పుష్పయాగం నిర్వహిస్తారని పేర్కొంది.

నేటి నుంచి అరసం రాష్ట్ర మహాసభలు

తెనాలిరూరల్: అభ్యుదయ రచయితల సంఘం (అరసం) 19వ రాష్ట్ర మహాసభలు– 80వ వార్షికోత్సవాలు శనివారం నుంచి జరగనున్నాయి. గుంటూరు జిల్లా తెనాలి కొత్తపేటలోని రామకృష్ణ కవి కళాక్షేత్రంలోని బొల్లిముంత శివరామకృష్ణ సాహిత్య ప్రాంగణంలో సభలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. తొలిరోజు అరసం అఖిల భారత ప్రధాన కార్యదర్శి ప్రొఫెసర్ సుఖ్‌దేవ్‌సింగ్ సిర్సా ప్రారంభోపన్యాసం చేస్తారు. ప్రారంభ సభకు అరసం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి అధ్యక్షత వహిస్తారు. ప్రముఖ సాహితీవేత్త, అభ్యుదయ కవి డాక్టర్ కత్తి పద్మారావు కీలకోపన్యాసం చేస్తారు. రెండో రోజైన ఆదివారం 'ప్రగతిశీల సాహిత్య, సాంస్కృతిక శక్తులపై దాడులు–కర్తవ్యాలు అన్న అంశంపై వక్తలు ప్రసంగిస్తారు. మధ్యాహ్నం ప్రతినిధుల సభ నిర్వహిస్తారు.

నగర వార్తలు

విదేశాల్లో ఉన్నత విద్య విద్యార్థుల కల

- రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆర్.లింబాద్రి



రాయదుర్గం నాలెడ్జి సిటీలోని టీ హబ్‌లో గ్లోబల్ ఎడ్యు ఫెస్ట్‌ను ప్రారంభిస్తూ..

హఫీజ్‌పేట్: అబ్బాయిలకంటే అమ్మాయిలే ఎక్కువగా ఉన్నత విద్యను అభ్యసించేందుకు విదేశాలకు వెళ్తున్నారని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆర్.లింబాద్రి పేర్కొన్నారు. రాయదుర్గం నాలెడ్జ్ సిటీలోని టీ హబ్‌లో ఐఎంఎఫ్ఎస్ ఆధ్వర్యంలో టీ హబ్ సహకారంతో గ్లోబల్ ఎడ్యు ఫెస్ట్‌లో ఆయన పాల్గొన్నారు. టీ–హబ్ సీఈఓ మహంకాళి శ్రీనివాస్ రావు, వాక్సెన్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ ఆర్‌వీఆర్‌కె చలం, తెలంగాణ ప్రెస్ అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ, తెలంగాణ హైకోర్టు సీనియర్ న్యాయవాది వి.పట్టాబి, ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ ఫారెన్ స్టడీస్ ఫౌండర్, డైరెక్టర్ కె.పి.సింగ్, వి.అజయ్‌కుమార్‌లతో కలిసి ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి శుక్రవారం కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఉన్నత విద్య కోసం విదేశాలకు వెళ్లాలనుకోవడం, ఆ కళను సాకారం చేసుకోవడంలో అబ్బాయిల కంటే అమ్మాయిలే ముందంజలో ఉన్నారని ఆయన అన్నారు. గతేడాది రికార్డు స్థాయిలో దేశం నుంచి అమెరికాకు రికార్డు స్థాయిలో 82,500 ఎఫ్1 వీసాలు వస్తే.. అందులో అమ్మాయిలే అత్యధికంగా ఉన్నారని అన్నారు. ఆరేళ్లుగా విదేశీ విద్య కోసం వెళ్లే అమ్మాయిల సంఖ్య బాగా పెరిగిందన్నారు. ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల్లో ఉన్న అత్యుత్తమ విశ్వవిద్యాలయాల ప్రతినిధులతో సంప్రదింపులు జరిపేందుకు ఈ ఫెస్ట్‌ను నిర్వహించినట్లు చెప్పారు. ఈ సంవత్సరం ఇప్పటికే 6,800 మంది విద్యార్థులు రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారని అన్నారు.

బోర్డు సభ్యుడిగా సీఈఓ ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేస్తున్న సీఈఓ మధుకర్ నాయక్

కంటోన్మెంట్: సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు సీఈఓగా మధుకర్ నాయక్ శుక్రవారం బోర్డు సమావేశంలో పాల్గొన్నారు. రెండు నెలల క్రితమే ఆయన బోర్డు సీఈఓగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. అయితే తొలి బోర్డు సమావేశంలో పాల్గొనడానికి ముందు అధ్యక్షుడు బ్రిగేడియర్ సోమశంకర్, సీఈఓతో బోర్డు సభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేయించారు. వెంటనే మధుకర్ నాయక్ సభ్య కార్యదర్శిగా బోర్డు సమావేశాన్ని కొనసాగించారు. గతానికి భిన్నంగా బోర్డు సమావేశం జరుగుతున్న సమయంలో సంబంధిత అధికారులంతా హాజరు కావాలని సూచించారు. తదనుగుణంగా బోర్డు ఇంజినీర్లు, వాటర్ వర్క్స్, శానిటరీ, హెల్త్, రెవెన్యూ సూపరింటెండెంట్లు సమావేశంలో పాల్గొనడం గమనార్హం.

చాదర్‌ఘాట్ వద్ద కుంగిన రహదారి

మూడు మీటర్ల లోతుతో ఏర్పడిన గుంత



గుంత వద్ద ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తున్న పోలీసులు

చాదర్‌ఘాట్: ఇటీవల గోషామహల్ ప్రాంతంలో నాలా కుంగిన ఘటన మరువకముందే చాదర్‌ఘాట్ వద్ద రహదారి కుంగి పెద్ద గుంత ఏర్పడింది. నిత్యం వేల సంఖ్యలో వాహనాలు సంచరించే విజయవాడ జాతీయ రహదారి ఒక్కసారిగా కుంగిపోవడంతో వాహనదారులు భయభ్రాంతులకు గురయ్యారు. చాదర్‌ఘాట్ వద్ద నయాగరా హోటల్ ఎదురుగా ఉన్న రహదారి శుక్రవారం కుంగి మూడు మీటర్ల గుంత పడటం ఆందోళనకు గురిచేసింది. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. మలక్‌పేట ట్రాఫిక్ పోలీసులు వెంటనే అక్కడికి చేరుకొని గుంత చుట్టూ బారికేడ్లు ఏర్పాటు చేసి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. రెండు సంవత్సరాల క్రితం ఇక్కడ డ్రైనేజీ నిర్మాణ పనులు జరిగాయని, పనులు పూర్తయిన తర్వాత సరిగ్గా పూడ్చకపోవడంతో రహదారి కుంగి ఉంటుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. కొద్దిరోజుల ముందు భోలక్‌పూర్, ఇటీవల గోషామహల్, ఇప్పుడు చాదర్‌ఘాట్ వద్ద రహదారులు కుంగుతున్నా అధికారులు స్పందించడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

ఎన్‌టీపీసీ ఆర్‌ఈడీగా ఛటోపాధ్యాయ



సాక్షి, సిటీబ్యూరో: ఎన్‌టీపీసీ సదరన్ రీజనల్ డైరెక్టర్‌గా డీ.ఛటోపాధ్యాయ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన గతంలో ఎన్ఎస్‌పీసీఎల్ సీఈఓగా పనిచేశారు. 1986లో ఎన్‌టీపీసీలో ఎలక్ట్రికల్ ఇంజినీర్‌గా ఆయన పనిచేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు వివిధ హోదాల్లో సేవలు అందిస్తూ తాజాగా సదరన్ రీజిచన్‌కు ఆర్‌ఈడీగా నియమితులయ్యారు.

సిటీలో ఉస్తాద్ జాకీర్ హుస్సేన్ ప్రదర్శన

శిల్పకళా వేదికగా 'మెలోడీ ఆఫ్ రిథమ్'



సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని శిల్పకళా వేదికగా ఈ నెల 18వ తేదీన జరగనున్న 'మెలోడీ ఆఫ్ రిథమ్' సంగీత కచేరీలో ప్రముఖ భారతీయ సంగీత విద్వాంసులు ఉస్తాద్ జాకీర్ హుస్సేన్ తన ప్రదర్శనతో అలరించనున్నారు. నగరానికి చెందిన ఆర్ట్ హబ్ ఫౌండేషన్, పూణేకు చెందిన సావాని ఈవెంట్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ సంగీత మహోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. హైటెక్ సిటీ పూర్వ సమ్మిట్‌లోని ఐస్ప్రౌట్ బిజినెస్ సెంటర్ వేదికగా శుక్రవారం ఈ కచేరీకి సంబంధించిన పోస్టర్‌ను ఆర్ట్ హబ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్రీనివాస్, వాగ్స్ ప్రతినిధులు శివతేజ, పునీత్ గోయెల్, ఐస్ప్రౌట్ వ్యవస్థాపకురాలు సుందరి పాటిబండ్ల ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన జూమ్ కాల్‌లో ప్రముఖ సంగీత కళాకారులు పండిట్ రాకేష్ చౌరాసియా మాట్లాడుతూ.. ఉస్తాద్ జాకీర్ హుస్సేన్‌తో కలిసి వేదిక పంచుకోవడం ఏ కళాకారుడికైనా అరుదైన అనుభూతి అని, ఈ సంగీత కచేరీలో భాగంగా హుస్సేన్ తబలాతో తన వేణుగాన కళా ప్రదర్శన చేయనున్నానని తెలిపారు. ఉస్తాద్ జాకీర్ హుస్సేన్ ఐదేళ్ల విరామం తర్వాత ఈ ప్రదర్శన చేయడం ప్రత్యేకమని అన్నారు. హైదరాబాద్ నగరాన్ని భారతీయ సంగీతానికి రాజధానిగా మార్చడంతో పాటు మ్యూజికల్ హబ్‌గా నగర వైభవాన్ని తిరిగి పొందడమే లక్ష్యంగా కృషి చేస్తున్నామని ఆర్ట్ హబ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్రీనివాస్ పేర్కొన్నారు.


సాక్షి రియల్టీ

68,519 గృహాలు విక్రయం

గతేడాది హైదరాబాద్‌లో రూ.33.05 కోట్లు విలువ చేసే 68,519 గృహాలు విక్రయమయ్యాయి. 2021తో పోలిస్తే ఇళ్ల అమ్మకాలలో 18శాతం, విలువలో 10% తగ్గుదల కనిపించింది. 2021లో రూ.37.232 కోట్ల విలువ చేసే 83.959 ఇళ్లు అమ్ముడుపోయాయి.

జనవరిలో 4,872 ఫ్లాట్లు రిజిస్ట్రేషన్లు

- వీటి విలువ రూ.2,422 కోట్లు
- 2021 జనవరితో పోలిస్తే 34 శాతం క్షీణత
- నైట్‌ఫ్రాంక్ ఇండియా నివేదిక వెల్లడి



సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ నివాస విభాగం నేల చూపులు మొదలయ్యాయి. ఈ ఏడాది తొలి నెలలో గ్రేటర్‌లో రూ.2,422 కోట్ల విలువ చేసే 4,872 అపార్ట్‌మెంట్లు రిజిస్ట్రేషన్ అయ్యాయి. గతేడాది జనవరితో పోలిస్తే ఇది 34 శాతం తక్కువ. 2021 మొదటి నెలలో రూ.3,269 కోట్లు విలువ చేసే 7,343 యూనిట్లు రిజిస్ట్రేషన్ జరిగాయి.

- గత నెలలో రిజిస్ట్రేషన్ జరిగిన వాటిల్లో అత్యధికంగా 54 శాతం గృహాలు రూ.25–50 లక్షలవే. 2021 జనవరిలో ఈ ఇళ్ల వాటా 39 శాతంగా ఉంది. రూ.50 లక్షల కంటే ఎక్కువ ధర ఉన్న యూనిట్ల వాటా 25 శాతం నుంచి 28 శాతానికి పెరిగాయి. ఇక రూ.25 లక్షల లోపు ధర ఉన్న అఫర్డబుల్ ఇళ్ల వాటా 2021 జనవరిలో 36 శాతం కాగా.. గత నెలలో 18 శాతానికి పడిపోయాయి.
- ఈ జనవరిలో 1,000 నుంచి 2,000 చ.అ. విస్తీర్ణం ఉన్న గృహాలే ఎక్కువగా రిజిస్ట్రేషన్ అయ్యాయి. వీటి వాటా 71 శాతం ఉంది. అయితే గతేడాది జనవరిలో వీటి వాటా 72 శాతంగా ఉంది. 2021 జనవరిలో 500–1,000 చ.అ. ఇళ్ల వాటా 15 శాతం ఉండగా.. గత నెలలో 17 శాతానికి పెరిగింది. 2 వేల చ.అ.లకు పైగా విస్తీర్ణం ఉన్న యూనిట్ల వాటా 9 శాతంగా ఉంది.

ఎందుకు తగ్గాయంటే..

ప్రతి ఏటా మొదటి కొన్ని నెలల పాటు స్థిరాస్తి కార్యకలాపాలు మందగిస్తాయని దీంతో విక్రయాలు, రిజిస్ట్రేషన్లపై ప్రభావం ఉంటుందని నైట్‌ఫ్రాంక్ ఇండియా హైదరాబాద్ డైరెక్టర్ శామ్సన్ ఆర్థూర్ తెలిపారు. గృహ కొనుగోలుదారుల కొనుగోలు నిర్ణయంలో ఊహించని మార్పులు, ధరలలో ప్రతికూలతలుంటాయి. వేతన సవరణలు, రాయితీలు, పండుగ సీజన్ల వంటి వాటితో మార్కెట్‌లో సానుకూల ధోరణి కనిపించినప్పుడే కొనుగోళ్లకు మొగ్గుచూపుతారని పేర్కొన్నారు. నిర్మాణంలో ఉన్న ప్రాజెక్ట్‌లలో కొనుగోళ్లు ఎక్కువగా ఉంటాయి. దీంతో ఆయా ప్రాపర్టీల డెలివరీకి సమయం పడుతుంది దీంతో విక్రయాలు ఎక్కువ జరిగినా.. ఆయా నెలల్లో రిజిస్ట్రేషన్లు తక్కువగా నమోదవుతాయని వివరించారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.


పొదుపు యొక్క లొకేషన్ పిన్,
కనీసం 6% సేవింగ్స్ ప్రతి రోజూ.
more
HYPER MART
ఆదా ప్రతిరోజు
6%
More Hypermart,
Saket Road, Kapra
కనీసం 6% డిస్కౌంట్
ప్రతి రోజూ, ప్రతి కొనుగోలు డిస్కౌంట్‌లు
కనీస కొనుగోలు లేదు
బిల్లుపై డిస్కౌంట్ మొత్తం
హాట్ డీల్స్
₹309 బాదంపప్పు 500 గ్రాముల పౌచ్ MRP* 695
₹1359 కర్నూలు సోనా మసూరి 30 కిలోలు MRP* 2100
₹1140 కొత్త సోనా మసూరి ముడి బియ్యం 30 కిలోలు MRP* 2000
₹112 కందిపప్పు 1 కిలో
₹259 ఆశీర్వాద్ ఎంపి గోధుమ పిండి 5 కిలోలు MRP* 318
₹51 తగ్గింపు సన్‌ఫీస్ట్ డార్క్ ఫ్యాంటసీ చాకోఫిల్స్ 300 గ్రాముల పెద్ద ప్యాక్ MRP* 170
₹90 తగ్గింపు బూస్ట్ 750 గ్రా రీఫిల్ MRP* 449
₹60 తగ్గింపు తాజ్ మహల్ టీ రెగ్యులర్ 490 గ్రాముల బాక్స్ MRP* 425
₹67 తగ్గింపు కోల్గేట్ డెంటల్ క్రీమ్ టూత్‌పేస్టు 200గ్రా+200గ్రా+100గ్రా MRP* 266
₹40 తగ్గింపు సంతూర్ శాండల్ మరియు పసుపు/ఆరంజ్ సబ్బు 4x125 గ్రాముల మల్టీ ప్యాక్ MRP* 222
More Hypermart near me
బంజారాహిల్స్ | సరూర్‌నగర్ | నాగోల్ | కూకట్‌పల్లి | సైనిక్‌పూర్ | సాకేత్
*Conditions apply. "Minimum 6% discount is not applicable on Baby Food, Fresh Milk, Pouch Curd, loose staples, Fruits and Vegetables, apparel, footwear, liquor and cigarvettes. More Retail Pvt Ltd. reserves the right to withdraw/change the discount and/or change price of the products displayed here without prior notice". Offer valid till stocks last.
Scan to visit our More at your Door app
Download the more app